'జల ప్రాజెక్టులపై జనం ఎన్నెన్నో ఆశలు పెట్టుకున్నారు. వాళ్ల నమ్మకం వమ్ము కాకుండా పనిచేయాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 18 సంచిక: 260

గురువారం 11-12-2025

SIMULTANEOUSLY PRINTED AT GUNTUR | MANGALAGIRI | VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

జోరు కొనసాగించాలని..

నేడు దక్షిణాఫ్రికాతో భారత్ రెండో టీ20 మ్యాచ్ - 12లో

యువ భారత్‌కు కాంస్యం

జూనియర్ ప్రపంచకప్ హాకీ టోర్నీలో భారత జట్టుకు మూడో స్థానం - 12లో



మరో 220 విమానాలు రద్దు

ఇండిగో విమానాల సంక్షోభం కొనసాగుతోంది. బుధవారం 220 విమానాలు రద్దవ్వడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు.

వివరాలు 6లో ▸

చొరబాటుదారుల ఓట్ల కోసమే..

చొరబాటుదారుల ఓట్ల కోసమే ఎస్ఐఆర్‌ను ప్రతిపక్షాలు వ్యతిరేకిస్తున్నాయని కేంద్ర హోం మంత్రి అమిత్ షా విమర్శించారు.

వివరాలు 6లో ▸

కూతురు చేతికి శాంతి బహుమతి

వెనెజులా ప్రతిపక్ష నాయకురాలు మారియా కొరినా మచాడో తరఫున నోబెల్ శాంతి బహుమతిని ఆమె కుమార్తె అందుకున్నారు.

వివరాలు 6లో ▸



హెచ్1బీ ఇంటర్వ్యూలు వాయిదా

ఈ నెలలో జరగాల్సిన హెచ్1బీ వీసా ఇంటర్వ్యూలను వాయిదా వేస్తున్నట్లు అమెరికా ఇమ్మిగ్రేషన్ వర్గాలు వెల్లడించాయి.

వివరాలు 6లో ▸

'కోటి' గళాల గర్జన

ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను నిరసిస్తూ కోటి సంతకాలతో ర్యాలీలు

నియోజకవర్గాల నుంచి జిల్లా కేంద్రాలకు సంతకాల బాక్సులు తరలింపు

ఆ వాహనాలకు జెండా ఊపి.. ర్యాలీలను ప్రారంభించిన వైఎస్సార్‌సీపీ ప్రజా ప్రతినిధులు, నేతలు 2లో

ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను బాబు సర్కారు ఉపసంహరించుకోవాలని నినదించిన విద్యార్థులు, యువత, మేధావులు

ఏలూరులో జరిగిన కోటి సంతకాల ర్యాలీలో పాల్గొన్న ప్రజలు, వైఎస్సార్‌సీపీ నాయకులు

18న గవర్నర్‌తో వైఎస్ జగన్ భేటీ

కోటి సంతకాలను గవర్నర్‌కు అందజేయనున్న వైఎస్ జగన్ 2లో

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను అడ్డుకోండి

- కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు వైఎస్సార్‌సీపీ ఎంపీల విజ్ఞప్తి
- ఇదే అంశంపై కేంద్ర వైద్య శాఖ మంత్రి జేపీ నడ్డాకూ వైఎస్సార్‌సీపీ లేఖ

కొత్త సంవత్సరంలో కానుక

మళ్లీ రూ.15,651.93 కోట్ల కరెంట్ చార్జీల వడ్డన

వచ్చే ఏడాది ఏప్రిల్ 1నుంచి అమలులోకి కొత్త చార్జీలు

ఇప్పటికే ప్రజలపై రూ.17,349 కోట్ల మేర చార్జీల భారం



- కొత్త చార్జీలపై ఏపీఈఆర్‌సీ వద్ద నివేదిక
- ఏపీఎస్పీడీసీఎల్ లో రూ.7,733.85 కోట్ల వడ్డన.. ఏపీసీపీడీసీఎల్ పరిధిలో రూ.3,465.35 కోట్ల పెంపు
- ఏపీఈపీడీసీఎల్ ద్వారా రూ.4,452.73 కోట్లు భారం
- ఏపీఈఆర్సీ వద్ద డిస్కంల ప్రతిపాదనలు
- సాయంత్రానికి వెబ్‌సైట్ నుంచి మాయం
- సోలార్ ప్యానెళ్ల తయారీ పరిశ్రమలకూ కొత్త టారిఫ్
- జనవరి 20, 22, 23, 27 తేదీల్లో బహిరంగ విచారణ
- తిరుపతి, విజయవాడ, కర్నూలులో అభిప్రాయ సేకరణ
- ఆపై విద్యుత్ నియంత్రణ మండలి నిర్ణయం

5లో

ఒక్క అంశంపైనే విచారణ

అది కూడా నెల రోజుల్లోనే పూర్తి కావాలి 13లో

వివేకా కేసులో సీబీఐ దర్యాప్తుపై న్యాయస్థానం ఆదేశాలు

- మాజీ మంత్రి వైఎస్ వివేకా హత్య కేసులో తాను కోరిన విధంగా దర్యాప్తునకు ఆదేశించాలన్న నర్రెడ్డి సునీత విజ్ఞప్తిని సీబీఐ కోర్టు తోసిపుచ్చింది. ఒక్క అంశంపైనే దర్యాప్తునకు అనుమతి ఇచ్చింది. అది కూడా నెల రోజుల్లోనే పూర్తి కావాలని ఆదేశించింది.

'అమరావతి'

బిల్లు వెనక్కి

రాజధానిగా గుర్తించాలన్న రాష్ట్ర బిల్లును తిప్పిపంపిన కేంద్రం

- 2014 నుంచే రాజధానిగా గుర్తిస్తే ఉమ్మడి రాజధాని సమస్య
- 2024 నుంచి అయితే అప్పటి దాకా కేంద్రం ఇచ్చిన నిధులతో సమస్య
- సహేతుకమైన సూచనలతో మళ్లీ రావాలంటూ సూచన.. ప్రస్తుతం న్యాయ పరమైన చిక్కుల్లో అమరావతి
- నోటిఫికేషన్ ఫైల్ వెనక్కు రావడంతో సీఎం చంద్రబాబుకు షాక్
- న్యాయ పరమైన చిక్కులను తొలగించుకునే పనిలో ప్రభుత్వం
- ఈ సమస్య పరిష్కారానికి నిపుణుల సలహా కోరిన బాబు

- వివరాలు 3లో

రైతులకు సమస్యలున్నాయి



- యువత ఉద్యోగాలు కావాలని అంటున్నారు
- అవినీతి పెరిగిందంటున్నారు
- నిత్యావసరాల ధరలు, తాగునీటి సమస్యలపై ప్రజల ఫిర్యాదు
- హాస్టళ్ల పనితీరు బాగా లేదు.. ఈ సమస్యలేవీ లేకుండా కవర్ చేయాల్సి ఉంది
- గ్రామ సచివాలయాల పేరు త్వరలో మారుస్తాం
- అనర్హులు వికలాంగుల పింఛన్లు పొందుతున్నారు
- ఏడాదిన్నరైనా చాలామంది మంత్రులకు అవగాహన లేదు
- మంత్రులు, కార్యదర్శులు, హెచ్‌వోడీల సమావేశంలో సీఎం చంద్రబాబు

3లో

ఇట్లు... పుట్టా సంస్థకు రూ.4.40 కోట్లు

టీడీపీ ఎమ్మెల్యే సుధాకర్‌యాదవ్ కంపెనీకి మరో అ'ధనం'

- పోలవరం ఎడమ కాల్వ 5–ఏ ప్యాకేజీలో చేసిన పనులకు చెల్లింపునకు ఓకే
- 2016–19 మధ్య మట్టి తవ్వకం, కాంక్రీట్ లైనింగ్ అదనంగా చేశామంటూ బిల్లులు
- ఈ ఏడాది జూలై 30న ఆమోదముద్ర వేసిన ఎస్ఎల్‌టీసీ
- 2016లో రూ.142.88 కోట్ల పనులు నామినేషన్ పద్ధతిలో అప్పగింత
- హార్డ్ రాక్ బ్లాస్టింగ్‌కు రూ.1.11 కోట్లు అదనంగా చెల్లించేలా గతంలో ఉత్తర్వులు
- ఇలాగే కాంక్రీట్ నిర్మాణాల్లో మార్పులకు రూ.38 కోట్లు ఇచ్చేలా 2018లో ఆదేశాలు
- కంట్రోల్ బ్లాస్టింగ్ విధానంలో మట్టి పనిచేశారని చూపి రూ.13.25 కోట్లు చెల్లింపు
- ఇప్పటికే అదనపు బిల్లుల రూపంలో రూ.53.34 కోట్ల ప్రయోజనం

2లో

నేటి గ్రుడ్లు & చికెన్ గుంటూరు జోన్ ధరలు

12 గ్రుడ్ల ట్రేబుల్ ధర ₹90	ఫారం దగ్గర లైవ్ బర్డ్	125 కిలో	డ్రెస్సెడ్ స్కిన్‌తో	220 కిలో
	రిటైల్ లైవ్ బర్డ్	152 కిలో	స్కిన్ లెస్	251 కిలో

Conditions Apply

వినియోగదారుల శ్రేయస్సు దృష్ట్యా జారీచేయడమైనది

ఇదండీ సంగతి

ఎందుకు సార్ 'బ్యాలెట్ పేపర్' ఎన్నికలంటే అంత కంగారు పడుతున్నారు!!

కొల్లగొడుతున్నా.. మిన్న'కుందూ'రే!

గ్రావెల్ తరలింపుపై అధికారుల డ్రామా.. తప్పించుకునేందుకు తిప్పలు

ఏడాదిగా యథేచ్ఛగా కుందూనది కరకట్ట గ్రావెల్ తరలింపు

రూ.కోట్లు విలువైన గ్రావెల్ కొల్లగొట్టిన అక్రమార్కులు 10లో

రిజిస్టర్ పోస్టు ద్వారా కోవెలకుంట్ల, గోస్పాడు పోలీస్‌స్టేషన్లకు ఫిర్యాదులు

దీపావళికి విశ్వకిరీటం

దీపావళికి యునెస్కో సాంస్కృతిక వారసత్వ హోదా

భారతదేశ సాంస్కృతిక వైభవానికి అత్యంత అరుదైన గౌరవం దక్కింది. చీకటిని చీల్చే దివ్యకాంతుల దీపావళి పండుగ.. యునెస్కో సాంస్కృతిక వారసత్వ నిధిగా ప్రపంచ వేదికపై వెలుగు లీనింది. యునెస్కో ఇన్‌టాంజిబుల్ కల్చరల్ హెరిటేజ్ జాబితాలో ఈ దివ్వెల పండుగ స్థానం సంపాదించుకున్నట్టు ఢిల్లీలోని ఎర్రకోట వేదికగా జరుగుతున్న యునెస్కో కీలక సమావేశంలో ప్రకటించారు. 6లో

అహ్మదాబాద్ స్పేస్ అప్లికేషన్ సెంటర్‌లోని గగన్‌యాన్ క్రూ మాడ్యూల్ నమూనా

మనకూ సొంత స్పేస్ స్టేషన్

2035 నాటికి ఏర్పాటు దిశగా అడుగులు

'సాక్షి'తో అహ్మదాబాద్ ఎస్ఏసీ డైరెక్టర్ నీలేష్ ఎం.దేశాయ్

గుజరాత్ నుంచి సాక్షి ప్రతినిధి: 'సొంత అంతరిక్ష కేంద్రాలు కలిగిన దేశాల సరసన త్వరలో భారత్ నిలవనుంది. ఆ దిశగా కేంద్రం వేగంగా అడుగులు వేస్తోంది. 2028లో భారతీయ అంతరిక్ష కేంద్రం నిర్మాణం షురూ అవ్వనుంది' అని ఇస్రోలో భాగమైన అహ్మదాబాద్‌లోని స్పేస్ అప్లికేషన్ సెంటర్(ఎస్ఏసీ) డైరెక్టర్ నీలేశ్ ఎం.దేశాయ్ తెలిపారు. స్వదేశీ అంతరిక్ష కేంద్రం నిర్మాణానికి ఐదు రాకెట్ల ద్వారా అంతరిక్షంలోకి విడి భాగాలు పంపాల్సి ఉందన్నారు. ఇందులో భాగంగా 2028లో తొలి రాకెట్‌ను అంతరిక్షంలోకి ప్రవేశపెట్టనున్నట్లు వెల్లడించారు. 2035 నాటికి విడి భాగాలన్నింటినీ అంతరిక్షంలోకి చేర్చి ఇంటిగ్రేషన్ పూర్తి చేస్తామన్నారు. దీంతో భవిష్యత్తులో రోదసీ యాత్ర చేసే వ్యోమగాములు స్వదేశీ అంతరిక్ష కేంద్రంలో దిగి చంద్రుడి మీదకు వెళ్తారని చెప్పారు. గగన్‌యాన్ ప్రయోగంలో భాగంగా తొలుత నాలుగు మానవ రహిత ప్రయోగాలు చేయాలని ఇస్రో నిర్ణయించిందన్నారు. 2026 ఫిబ్రవరిలో తొలి ప్రయోగం చేపట్టబోతున్నామని చెప్పారు. 2027లో చివరి ప్రయోగం పూర్తి చేస్తామన్నారు. అదే ఏడాది ఆఖరులో మానవ సహిత ప్రయోగం చేస్తామని చెప్పారు. ఎంత మంది వ్యోమగాములు రోదసీ యాత్ర చేయాలనే దానిపై ఇంకా నిర్ణయం తీసుకోలేదన్నారు.

శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాలో వెంకటాచలం నుంచి కోటి సంతకాల ప్రతులను జిల్లా కేంద్రానికి ర్యాలీగా తరలిస్తున్న వేలాది మంది ప్రజలు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు

అనంతపురంలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు, ప్రజలు

మోటారు సైకిల్ ర్యాలీగా ఏలూరుకు చేరుకున్న దెందులూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు

‘కోటి’ గళాల గర్జన

ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను నిరసిస్తూ కోటి సంతకాలతో ర్యాలీలు

కాకినాడలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయానికి భారీ ర్యాలీగా వెళుతున్న యువత, నాయకులు, పార్టీ శ్రేణులు

సంతకాల పత్రాలతో విశాఖలో భారీ బైక్ ర్యాలీ చేపడుతున్న ప్రజలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు

సాక్షి, విశాఖపట్నం, నెట్‌వర్క్: చంద్రబాబు సర్కారు కక్షపూరిత విధానాలతో ప్రభుత్వం కొత్త మెడికల్ కళాశాలలను ప్రైవేట్‌పరం చేయడం.. ప్రైవేట్ వ్యక్తులకు దోచిపెట్టడాన్ని నిరసిస్తూ వైఎస్సార్ సీపీ చేపట్టిన ప్రజా ఉద్యమంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా సేకరించిన కోటి సంతకాలను బుధవారం నియోజకవర్గాల్లో భారీ ర్యాలీలు, మీడియా సమావేశాలు నిర్వహించి ప్రత్యేక బాక్సుల్లో భద్రపరిచి ఆయా జిల్లా కేంద్రాలకు తరలించారు. నియోజకవర్గ పార్టీ కార్యాలయాల వద్ద వైఎస్సార్ సీపీ సమన్వయకర్తలు జెండా ఊపి కోటి సంతకాల వాహనాలను ప్రారంభించారు. పలుచోట్ల మహిళలు ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొని కోటి సంతకాల వాహనాలకు హారతి పట్టారు. ఇకనైనా చంద్రబాబు సర్కారుకు కనువిప్పు కలగాలని, ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని దేవుడిని ప్రార్థించారు. యువత, విద్యార్థులు, మేధావులు, ప్రజలు ఈ సందర్భంగా నిర్వహించిన ర్యాలీల్లో పాల్గొని మెడికల్ కళాశాల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నినదించారు. వైఎస్సార్ సీపీ ప్రజా ప్రతినిధులు, నేతలు, కార్యకర్తలు ఇందులో పాల్గొన్నారు. ఈ ఏడాది అక్టోబర్ 10న రచ్చబండగా మొదలై మారుమూల గిరిజన గూడేల నుంచి నగరాల దాకా ఉద్ధృతంగా ఈ కార్యక్రమం సాగింది. అన్ని మండలాలు, అన్ని పంచాయతీల్లో కోటి సంతకాల సేకరణ చేపట్టారు. వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పిలుపు మేరకు రెండు నెలలుగా మహోద్యమంలా సాగిన కోటి సంతకాల సేకరణలో అన్ని వర్గాల ప్రజలు స్వచ్ఛందంగా, భారీగా పాల్గొన్నారు. నవంబరు 12న రాష్ట్రవ్యాప్తంగా నియోజకవర్గ కేంద్రాల్లో వైఎస్సార్‌సీపీ నిర్వహించిన ర్యాలీల్లో విద్యార్థులు, యువత, మేధావులు పెద్ద ఎత్తున పాల్గొని మెడికల్ కాలేజీలను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించడాన్ని నిరసిస్తూ కదం తొక్కారు. కోటి సంతకాల మహా ఉద్యమంతో చంద్రబాబు సర్కార్‌కు ఇకనైనా కనువిప్పు కలగాలని, మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే చంద్రబాబు సర్కార్‌కు బుద్ధి చెప్పేందుకు ఎలాంటి ఉద్యమాలకైనా సిద్ధమంటూ హెచ్చరించారు.

→ ప్రకాశం జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో సేకరించిన సంతకాలను బుధవారం జిల్లా కేంద్రానికి ర్యాలీగా తరలించారు. దర్శి నుంచి ఒంగోలుకు వాహనాల ర్యాలీని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ జెండా ఊపి ప్రారంభించారు. యర్రగొండపాలెం నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. గిద్దలూరులో కేపీ నాగార్జునరెడ్డి, మార్కాపురంలో అన్నా రాంబాబు, కొండపిలో ఆదిమూలపు సురేష్, సంతనూతలపాడులో మేరుగు నాగార్జున, కనిగిరిలో దద్దాల నారాయణ యాదవ్ ర్యాలీలను ప్రారంభించారు. ఒంగోలు నియోజకవర్గంలో సేకరించిన 62 వేల సంతకాలను పార్టీ జిల్లా కార్యాలయానికి చేర్చినట్లు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరి రవిబాబు తెలిపారు.

→ పశ్చిమ గోదావరి జిల్లాలో కోటి సంతకాలతో వాహనాల ర్యాలీలను భారీ ఎత్తున నిర్వహించారు. మెడికల్ కాలేజీలను ప్రభుత్వమే నడపాలని డిమాండ్ చేశారు. తణుకులో మాజీ మంత్రి కారుమూరి వెంకటనాగేశ్వరరావు, తాడేపల్లిగూడెంలో మాజీ డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ, నరసాపురంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు, ఆచంటలో మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు, పార్లమెంట్ పరిశీలకుడు ముదునూరి మురళీకృష్ణంరాజు, భీమవరంలో నియోజకవర్గ సమన్వయకర్త చినమిల్లి వెంకటరాయుడు, పాలకొల్లులో నియోజకవర్గ సమన్వయకర్త గుడాల శ్రీహరిగోపాలరావు, ఉండిలో నియోజకవర్గ సమన్వయకర్త పీవీఎల్ నరసింహరాజు ఆధ్వర్యంలో ర్యాలీలు జరిగాయి. వైద్య కళాశాలలను ప్రభుత్వమే నడిపేలా చంద్రబాబు బుద్ధి మార్చాలని దేవుడిని కోరుతూ తణుకు నియోజకవర్గం వేల్పూరు, అత్తిలిలో మహిళలు సంతకాల ప్రతులకు మంగళ హారతులిచ్చి సాగనంపారు.

→ తిరుపతి, చిత్తూరు జిల్లాలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమానికి అనూహ్య స్పందన లభించింది. నియోజకవర్గ సమన్వయకర్తల ఆధ్వర్యంలో కోటి సంతకాల ప్రతులను తిరుపతి వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో చిత్తూరు, తిరుపతి జిల్లాల పార్టీ అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డికి అందజేశారు. అన్ని నియోజకవర్గాల్లో ర్యాలీలు నిర్వహించారు. పుంగనూరులో మాజీ మంత్రి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో కోటి సంతకాల ప్రతుల ప్రత్యేక వాహనాన్ని జెండా ఊపి ప్రారంభించారు. పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. గంగాధర నెల్లూరులో మాజీ మంత్రి నారాయణ స్వామి, నగరిలో మాజీ మంత్రి ఆర్‌కే రోజా, చిత్తూరులో విజయానందరెడ్డి, శ్రీకాళహస్తిలో బియ్యపు మధుసూదన్‌రెడ్డి, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, వెంకటగిరిలో నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, గూడూరులో ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్, నాయుడుపేటలో కిలివేటి సంజీవయ్య, నాగలాపురంలో నూకతోటి రాజేష్, తవణంపల్లిలో డాక్టర్ సునీల్‌కుమార్, పలమనేరులో వెంకటేగౌడ్, కుప్పంలో ఎమ్మెల్సీ భరత్ ఆధ్వర్యంలో చేపట్టిన కోటి సంతకాల ప్రతులను ప్రత్యేక వాహనంలో తిరుపతికి తరలించారు.

→ ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ శ్రీకాకుళం జిల్లాలో చేపట్టిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. నియోజకవర్గ కేంద్రాల నుంచి వాహనాల్లో కోటి సంతకాల పత్రాల బాక్సులను తరలించారు. పోలీసులు అడ్డుకున్నా వెనకడుగు వేయకుండా ర్యాలీలు నిర్వహించారు. పలాస నియోజకవర్గంలో మాజీ మంత్రి అప్పలరాజు ఆధ్వర్యంలో పత్రాలను తరలించారు.

→ విశాఖ, అనకాపల్లి, అల్లూరి జిల్లాల్లో సుమారు 10 లక్షల సంతకాలు సేకరించారు. విశాఖ జిల్లా మద్దిలపాలెంలోని పార్టీ కార్యాలయానికి అన్ని నియోజకవర్గాల నుంచి వాహనాల్లో కోటి సంతకాల బాక్సులు చేరుకున్నాయి. జిల్లా పార్టీ అధ్యక్షుడు కేకే రాజు అన్ని నియోజకవర్గాల సమన్వయకర్తలతో కలసి మీడియా సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో సమన్వయకర్తలు మళ్ల విజయప్రసాద్, వాసుపల్లి గణేష్‌కుమార్, మజ్జి శ్రీనివాసరావు, తిప్పల దేవన్‌రెడ్డి, మొల్లి అప్పారావు, నియోజకవర్గం పరిశీలకులు, మాజీ ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. అనకాపల్లి జిల్లా పార్టీ అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ ఆధ్వర్యంలో నియోజకవర్గాల సమన్వయకర్తలతో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, సమన్వయకర్తలు కరణం ధర్మశ్రీ, పెట్ల ఉమాశంకర్ గణేష్, కంబాల జోగులు, అన్నంరెడ్డి అదీప్‌రాజ్, పార్లమెంట్ పరిశీలకులు శోభాహైమావతి, పార్లమెంట్ సమన్వయకర్త బొడ్డేడ ప్రసాద్ పాల్గొన్నారు. అల్లూరి జిల్లాలో పాడేరులోని పార్టీ కార్యాలయానికి వ్యానుల్లో సంతకాల పత్రాల బాక్సులు చేరుకున్నాయి. జిల్లా పార్టీ అధ్యక్షుడు మత్స్యరాస విశ్వేశ్వరరావు ఆధ్వర్యంలో వాటిని సేకరించారు. కార్యక్రమంలో అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం, జెడ్పీ చైర్‌పర్సన్ జె.సుభద్ర తదితరులు పాల్గొన్నారు.

చిత్తూరులో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న ప్రజలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు

ప్రకాశం జిల్లా దర్శిలో ర్యాలీగా వెళ్తున్న ప్రజలు, వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు

శ్రీకాకుళం జిల్లా పాతపట్నంలో సంతకాల ప్రతులతో నిర్వహిస్తున్న ర్యాలీని అడ్డుకుంటున్న పోలీసులు

18న గవర్నర్‌తో వైఎస్ జగన్ భేటీ

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో 10 కొత్త ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్సార్‌సీపీ రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన ప్రజా ఉద్యమం, కోటి సంతకాల సేకరణపై గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్‌కు నివేదించేందుకు మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈనెల 18న ఆయనతో భేటీ కానున్నారు. ఆ రోజు సా.4 గంటలకు పార్టీ ముఖ్యనేతలు, పలువురు ప్రజా ప్రతినిధులతో కలిసి వైఎస్ జగన్, గవర్నర్‌ని కలవనున్నారు. ఈ మేరకు గవర్నర్ స్పెషల్ సీఎస్ నుంచి వైఎస్సార్‌సీపీకి లేఖ అందింది.

ఎందుకు సార్ ‘బ్యాలెట్ పేపర్’ ఎన్నికలంటే అంత కంగారు పడుతున్నారు..!

చంద్రబాబుపై ప్రజాగ్రహానికి కోటి సంతకాలే నిదర్శనం

- ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణపై వెల్లువెత్తిన నిరసన
- ప్రజలు స్వచ్ఛందంగా కోటి సంతకాల ఉద్యమంలో పాల్గొన్నారు
- కోటి సంతకాలను గవర్నర్‌కు నివేదిస్తాం
- మండలిలో విపక్ష నేత బొత్స సత్యనారాయణ

సాక్షిప్రతినిధి, విజయనగరం: కార్పొరేట్ జపం చేస్తూ, రాష్ట్రాన్ని ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో పెడుతున్న సీఎం చంద్రబాబుపై ప్రజాగ్రహానికి కోటి సంతకాలే నిదర్శనమని వైఎస్సార్‌సీపీ నేత, శాసన మండలిలో విపక్ష నేత బొత్స సత్యనారాయణ చెప్పారు. చంద్రబాబు ఎప్పుడు సీఎం అయినా కార్పొరేట్ సంస్థలకు మేలు చేయడమే తప్ప ప్రజలకు మంచి చేసే కార్యక్రమాలు ఎప్పుడూ చేయలేదన్నారు. ఇప్పుడు కూడా ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణతో అదే పని చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఆయన బుధవారం ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ.. పేద విద్యార్థులకు వైద్య విద్యను చేరువ చేయడంతో పాటు, ప్రజలకు సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలందించే లక్ష్యంతో వైఎస్సార్‌సీపీ హయాంలో వైఎస్ జగన్ ప్రతి జిల్లాకు ఒక మెడికల్ కాలేజీ చొప్పున ఒకేసారి 17 కళాశాలల నిర్మాణం మొదలుపెట్టి, వాటిలో ఏడింటిని పూర్తి చేశారని గుర్తు చేశారు. 5 ప్రభుత్వ కాలేజీల్లో అడ్మిషన్లు కూడా మొదలయ్యాయని, వీటితో సహా మొత్తం 17 కొత్త కాలేజీలను చంద్రబాబు ప్రభుత్వం పీపీపీ పేరుతో ప్రైవేటుపరం చేస్తోందని దుయ్యబట్టారు. ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా వైఎస్సార్‌సీపీ చేపట్టిన ప్రజాఉద్యమానికి విశేష స్పందన లభించిందని, సంతకాల కార్యక్రమంలో కోటి మందికి పైగా ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని, చంద్రబాబు ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారని అన్నారు. గవర్నర్‌ను కలిసి సంతకాల ప్రతులను సమర్పించి వైద్య కళాశాలల ప్రైవేటీకరణను అడ్డుకుంటామని చెప్పారు.

ప్రైవేటు యాజమాన్యంలో అలా సేవలందుతాయా?

ఒక సామాన్యుడు విశాఖలోని కేజీహెచ్‌కు వెళ్తే.. అక్కడ ఎలాంటి వైద్య సేవలు అందుతాయో.. అదే నిరుపేద ప్రైవేటు ఆస్పత్రికి వెళ్తే అవే సేవలు ఉచితంగా అందుతాయా అని బొత్స ప్రశ్నించారు. ప్రభుత్వం, ప్రైవేటుకు మధ్య ఉన్న తేడా ఇదేనన్నారు. ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటుకు అప్పగించిన తర్వాత కనీసం 30% వైద్యం కచ్చితంగా ఉచితంగా అందిస్తారా అని నిలదీశారు. టీడీపీకి ఓటేసిన పాపానికి పేదలు, సామాన్యులు ఇబ్బందులు పడే పరిస్థితి తెస్తున్నారని మండిపడ్డారు. తాము తిరిగి అధికారంలోకి రాగానే, మెడికల్ కాలేజీల పీపీపీని రద్దు చేస్తామని స్పష్టం చేశారు.

స్టీల్ ప్లాంట్‌పై కేంద్ర నిర్ణయం అసమంజసం

విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయం కూడా పూర్తిగా అసమంజసమేనని బొత్స చెప్పారు. స్టీల్ ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించకపోవడం వల్ల ఉత్పత్తి వ్యయం పెరిగిందని, నష్టాలు సాకుగా చూపి సంస్థను అమ్మేయాలని చూస్తున్నారన్నారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణపై కేంద్రం తన నిర్ణయాన్ని మార్చుకోవాలన్నారు. ఇండిగో ఎయిర్‌లైన్స్ సంక్షోభానికి కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడే బాధ్యుడని చెప్పారు. సమస్య తీవ్రతను గుర్తించడంలో, ఆ తర్వాత పరిష్కారంలోనూ ఆయన పూర్తిగా విఫలమయ్యారని అన్నారు.

ఇట్లు... పుట్టా సంస్థకు రూ.4.40 కోట్లు

టీడీపీ ఎమ్మెల్యే సుధాకర్‌యాదవ్ కంపెనీకి మరో అ‘ధనం’

- పోలవరం ఎడమ కాల్వ 5–ఏ ప్యాకేజీలో చేసిన పనులకు చెల్లింపునకు ఓకే
- 2016–19 మధ్య మట్టి తవ్వకం, కాంక్రీట్ లైనింగ్ అదనంగా చేశామంటూ బిల్లులు
- ఈ ఏడాది జూలై 30న ఆమోదముద్ర వేసిన ఎస్‌ఎల్‌టీసీ
- 2016లో రూ.142.88 కోట్ల పనులు నామినేషన్ పద్ధతిలో అప్పగింత
- హార్డ్ రాక్ బ్లాస్టింగ్‌కు రూ.1.11 కోట్లు అదనంగా చెల్లించేలా గతంలో ఉత్తర్వులు
- ఇలాగే కాంక్రీట్ నిర్మాణాల్లో మార్పులకు రూ.38 కోట్లు ఇచ్చేలా 2018లో ఆదేశాలు
- కంట్రోల్ బ్లాస్టింగ్ విధానంలో మట్టి పనిచేశారని చూపి రూ.13.25 కోట్లు చెల్లింపు
- ఇప్పటికే అదనపు బిల్లుల రూపంలో రూ.53.34 కోట్ల ప్రయోజనం

సాక్షి, అమరావతి: టీడీపీ ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ సంస్థ పీఎస్‌కే–హెచ్‌ఈఎస్ (జేవీ)పై ప్రభుత్వం వల్లమాలిన ప్రేమ ఒలకబోస్తోంది. పోలవరం ఎడమ కాల్వ 5–ఏ ప్యాకేజీలో అడుగు (బెడ్) భాగం వెడల్పు పెరగడం వల్ల 2016–19 మధ్య అదనంగా మట్టి తవ్వకం, కాంక్రీట్ లైనింగ్ పనులు చేశారని, అందుకు రూ.4.40 కోట్లను అదనంగా చెల్లించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. జల వనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ ఈ మేరకు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో చేసిన పనులకు అదనపు బిల్లులు చెల్లించాలని పుట్టా సంస్థ పోలవరం సీఈకి ప్రతిపాదించగా... అధికారి ప్రభుత్వానికి నివేదించారు. దీనికి ఈ ఏడాది జూలై 30న స్టేట్ లెవల్ స్టాండింగ్ కమిటీ (ఎస్‌ఎల్‌టీసీ) ఆమోదం తెలిపింది. అనంతరం ఎస్‌ఎల్‌టీసీ సిఫార్సుతో పుట్టా సంస్థకు అదనంగా చెల్లించాలని సెప్టెంబరు 7న పోలవరం సీఈ పంపిన ప్రతిపాదనకు ప్రభుత్వం అంగీకారం తెలిపింది.

➡ పోలవరం ఎడమ కాల్వలో ఐదో ప్యాకేజీ (93.7–111.487 కి.మీ.) పనులను రూ.181.60 కోట్లకు సాబీర్ డ్యామ్ వాటర్ వర్క్స్ 2005 మార్చి 23న దక్కించుకుంది. అయితే, 5.754 కి.మీ. కాల్వ తవ్వకం, 11.001 కి.మీ. లైనింగ్, 33 కాంక్రీట్ పనులను ఆ సంస్థను నుంచి తప్పించి రూ.142.88 కోట్లకు పీఎస్‌కే–హెచ్‌ఈఎస్ (జేవీ)కి నామినేషన్ పద్ధతిపై 2016 నవంబర్ 30న చంద్రబాబు సర్కార్ కట్టబెట్టింది.

➡ 100.3 కి.మీ. నుంచి 102.5 కి.మీ., 110.5 కి.మీ. నుంచి 111.487 కి.మీ. వరకు కఠిన శిల (హార్డ్ రాక్)తో కూడిన భూమిని బ్లాస్టింగ్ చేయాలని, 3,77,938 క్యూబిక్ మీటర్ల మట్టి తవ్వాల్సి వస్తుందని దీనికి రూ.1.11 కోట్లు అదనంగా చెల్లించాలని 2018 మే 22న నాటి టీడీపీ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇక కాంక్రీట్ నిర్మాణాల్లో మార్పుల వల్ల అదనంగా రూ.38.986 కోట్లు చెల్లించాలని 2018 జూలై 10న మరో ఉత్తర్వులిచ్చింది. ఈ మేరకు పీఎస్‌కే–హెచ్‌ఈఎస్ సంస్థతో పోలవరం అధికారులు సప్లిమెంటరీ అగ్రిమెంట్లు చేసుకున్నారు. దాంతో ఆ సంస్థకు రూ.180 కోట్లకు పైగా విలువైన పనులను అప్పగించినట్లైంది.

➡ 2019 అక్టోబర్ 3 నాటికి పీఎస్‌కే–హెచ్‌ఈఎస్ సంస్థ రూ.117.05 కోట్ల విలువైన పనులు పూర్తి చేసింది. కాగా, పుట్టా సంస్థకు నామినేషన్‌పై అప్పగించిన పనులను రద్దు చేసి, వాటికి రివర్స్ టెండరింగ్ నిర్వహించాలన్న నిపుణుల కమిటీ చేసిన సూచనను గత ప్రభుత్వం అమలు చేసింది. కానీ, మళ్లీ చంద్రబాబు ప్రభుత్వం వచ్చాక.. పుట్టా సంస్థ ఎడమ కాల్వ 5–ఏ ప్యాకేజీలో 100.3 కి.మీ. నుంచి 102.50 కి.మీ. వరకు 2016–19 మధ్య కంట్రోల్ బ్లాస్టింగ్‌లో 16,69,476 క్యూబిక్ మీటర్ల మట్టిపని చేశారని చూపి క్యూబిక్ మీటర్‌కు అదనంగా రూ.78 చొప్పున రూ.13,25,59,128 చెల్లించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అక్టోబర్ 15న ఉత్తర్వులు జారీ చేసింది. 2017 ఆగస్టు 6న ఎల్‌ఎస్‌సీ (డిస్ట్రిక్ట్ లెవల్ శాంక్షన్ కమిటీ) ప్రతిపాదన మేరకు చెల్లించిన రూ.9,94,19,274 పోగా మిగిలిన రూ.3,31,39,854 మంజూరు చేయాలని పేర్కొంది. గతంలో డీఎల్‌ఎస్‌సీ చేసిన ప్రతిపాదనపై ఈ ఏడాది జూన్ 25న అంటే ఎనిమిదేళ్ల తర్వాత నిర్వహించిన సమావేశంలో ఎస్‌ఎల్‌టీసీ (స్టేట్ లెవల్ స్టాండింగ్ కమిటీ) ఆమోద ముద్ర వేసిందని, ఆ మేరకే అదనపు బిల్లులు చెల్లించాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొనడం గమనార్హం. ఇప్పటికే పుట్టా సంస్థకు అదనపు బిల్లుల రూపంలో రూ.53.34 కోట్ల మేర ప్రయోజనం చేకూర్చినట్లు స్పష్టమవుతోంది.

స్క్రబ్ టైఫస్‌తో ఇద్దరు మృతి

కృత్తివెన్ను/కొనకనమిట్ల/దేవరాపల్లి, మచిలీపట్నం అర్బన్: స్క్రబ్ టైఫస్ వ్యాధి లక్షణాలతో బుధవారం ఇద్దరు మృతిచెందారు. కృష్ణా జిల్లా కృత్తివెన్ను మండలం సీతనపల్లి పంచాయతీ చినగట్టుకు చెందిన జి.మణి(55) ఈ వ్యాధి లక్షణాలతో ఈ నెల 6న మచిలీపట్నం ప్రభుత్వాస్పత్రిలో చేరింది. పరిస్థితి విషమంగా మారి బుధవారం మధ్యాహ్నం ప్రాణాలు విడిచింది. ఆస్పత్రిలో చేరిన వెంటనే వైద్యులు సత్వరం స్పందించి ఉంటే తన భార్య దక్కేదని మృతురాలు మణి భర్త గోడ నాగేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశాడు. అలాగే, అనకాపల్లి జిల్లా దేవరాపల్లి శివారు అల్లిపురంలో యాభై ఏళ్ల వ్యక్తి స్క్రబ్ టైఫస్ లక్షణాలతో కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్టు దేవరాపల్లి పీహెచ్‌సీ వైద్యులు తెలిపారు. అయితే, ఇతని మృతికి ఈ వ్యాధి కారణం కాదని కేజీహెచ్ వైద్యులు తమ నివేదికలో తెలిపారని, ఈ విషయంపై మృతుడి కుటుంబ సభ్యులను ఆరా తీయగా అతడు సుదీర్ఘ కాలం నుంచి అనారోగ్యంతో బాధపడుతున్నట్టు తెలిపారని వైద్యాధికారి చెప్పారు.

వృద్ధురాలికి స్క్రబ్ టైఫస్..

ప్రకాశం జిల్లా కొనకనమిట్ల మండలంలోని వాగుమడుగు పంచాయతీ అంబాపురంలో స్క్రబ్ టైఫస్ వ్యాధి కలకలం రేపింది. గ్రామంలోని 60 ఏళ్ల వృద్ధురాలికి వ్యాధి సోకినట్లు గుర్తించటంతో మెరుగైన వైద్యం కోసం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. అక్కడ రక్తపరీక్షలు నిర్వహించగా స్క్రబ్ టైఫస్ నిర్ధారణ అయినట్లు డాక్టర్ సురేఖ తెలిపారు. అయితే, ప్రస్తుతం వృద్ధురాలి ఆరోగ్యం నిలకడగా ఉందన్నారు.

‘అమరావతి’కి అడ్డంకులు!

రాజధానిగా గుర్తించాలన్న రాష్ట్ర బిల్లును వెనక్కు పంపిన కేంద్రం

సాక్షి, న్యూఢిల్లీ: ‘అమరావతి’ని ఏపీ రాజధానిగా గుర్తించడానికి ఇబ్బందులు ఎదురయ్యాయా.. కేంద్రం ఏమైనా మెలిక పెడుతోందా.. నిధుల ప్రశ్న తలెత్తుతోందా.. వీటన్నింటికీ రాజకీయ విశ్లేషకులు ‘అవును’ అని సమాధానమిస్తున్నారు. ఇంకో మాటలో చెప్పాలంటే సీఎం చంద్రబాబుకు కేంద్రం బిగ్ షాక్ ఇచ్చిందంటున్నారు. ఇందుకు సంబంధించిన వివరాల్లోకి వెళితే.. 2014 నుంచి ఏపీ రాజధానిగా ‘అమరావతి’ని గుర్తించాలని రాష్ట్ర ప్రభుత్వం పంపిన సిఫార్సులను కేంద్రం వెనక్కు పంపినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. 2014 నుంచి అమరావతిని రాజధానిగా గుర్తిస్తే చట్టపరమైన సమస్యలు వస్తాయని కేంద్రం పేర్కొన్నట్లు తెలుస్తోంది. 2024ను పరిగణనలోకి తీసుకుంటే నిధులు ఖర్చు చేసిన విషయంపై న్యాయ పరమైన చిక్కులు తలెత్తే అవకాశం ఉందని చెప్పినట్లు తెలిసింది. ఈ క్రమంలో సహేతుకమైన సూచనలతో మరోసారి నోటిఫికేషన్‌తో రావాలని కేంద్రం ఏపీ పంపిన నోటిఫికేషన్‌ను వెనక్కు పంపిందని అధికారిక వర్గాల ద్వారా తెలుస్తోంది. నోటిఫికేషన్ ఫైల్ వెనక్కు రావడంతో న్యాయ పరమైన చిక్కులను తొలగించుకునే పనిలో ప్రభుత్వం ఉన్నట్లు ఢిల్లీ వర్గాల సమాచారం. రాష్ట్ర ప్రభుత్వం పరిస్థితి ఇప్పుడు ముందు నుయ్యి.. వెనుక గొయ్యి.. అన్నట్లు మారింది.

రాజధానిపై కేంద్రం ప్రశ్నలు

రాజధాని బిల్లుపై కేంద్రం రాష్ట్ర ప్రభుత్వానికి పలు ప్రశ్నలు సంధించినట్లు తెలుస్తోంది. ‘అమరావతి’కి చట్టబద్ధత కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి సిఫార్సులు పంపింది. రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచే

‘అమరావతి’ని రాజధానిగా గుర్తించాలని చంద్రబాబు సర్కార్ కేంద్రాన్ని కోరింది. ‘పదేళ్ల పాటు ఏపీ, తెలంగాణకు ‘హైదరాబాద్’ రాజధానిగా ఉంది కదా? ఇటువంటి సమయంలో అప్పటి నుంచి ఎలా నోటిఫై చేస్తారని బాబు ప్రభుత్వాన్ని కేంద్రం ప్రశ్నించినట్లు సమాచారం. ‘ఆంధ్రప్రదేశ్ పునర్ వ్యవస్థీకరణ చట్టం–2014’లో ఈ అంశాన్ని పొందుపరిచిన విషయాన్ని కేంద్రం గుర్తు చేసినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో ఇది సాధ్యం కాదని రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్రం తేల్చి చెప్పినట్లుగా సమాచారం. 2024 నుంచి రాజధానిగా ‘అమరావతి’కి చట్టబద్ధత కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం కోరగా, దీనిపై కూడా కేంద్రం తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు తెలిసింది. కాగా, విభజన చట్టంలోని సెక్షన్ 5లో రాజధానికి సంబంధించిన అంశాలను కేంద్రం పొందు పరిచింది. ఇందులోని సబ్ సెక్షన్ 2లో.. ‘విభజన తర్వాత పదేళ్ల వరకు హైదరాబాద్ ఉమ్మడి రాజధానిగా ఉంటుంది. ఏపీకి ‘కొత్త రాజధాని’ ఏర్పాటవుతుంది’ అని తెలిపింది. దీంతో పాటు ఏపీ కొత్త రాజధానికి కేంద్రం ఆర్థిక సహకారం కూడా ఉంటుందని సబ్ సెక్షన్ 3లో కేంద్రం పేర్కొంది.

నోటిఫికేషన్ వెనక్కు?

ఈ సందర్భంగా న్యాయ, చట్టపరమైన చిక్కులను అధిగమించే సూచనలతో రావాలని నోటిఫికేషన్‌ను కేంద్రం వెనక్కు పంపినట్లు ఢిల్లీ వర్గాల ద్వారా తెలిసింది. ఏపీ పునర్విభజన చట్టంలోని సెక్షన్5(2)లో ‘అమరావతి’ ఆంధ్రప్రదేశ్ రాజధానిగా చేర్చాలన్న సవరణకు కేంద్రం ఆమోదిస్తుందని ప్రభుత్వం ఆశపడింది. కేంద్రం ఆమోదించి, వెంటనే ప్రస్తుతం జరుగుతున్న శీతాకాల పార్లమెంట్ సమావేశాల్లో ఈ బిల్లును ప్రవేశ పెట్టనున్నట్లు ఇటీవల కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ మీడియా ముఖంగా వెల్లడించిన సంగతి తెలిసిందే. అయితే, రాష్ట్ర ప్రభుత్వం చేసిన సిఫార్సులపై కేంద్రం అసంతృప్తి వ్యక్తం చేయడం, న్యాయ పరమైన చిక్కులు లేకుండా సజావుగా ఉంటే బిల్లు ఆమోదం పొందుతుందని కేంద్రం సూచించినట్లు తెలుస్తోంది. దీంతో ఈ పార్లమెంట్ సమావేశాల్లోనే రాజధాని బిల్లుకు ఆమోదం లభిస్తుందని ఆశపడ్డ కూటమి నేతలకు చేదు అనుభవం ఎదురైందని చెప్పొచ్చు. ఈ అంశంపై ‘సాక్షి’ ఇద్దరు ఎంపీలను ఆరా తీయగా.. సమయం వచ్చినప్పుడు పార్లమెంట్ ముందుకు వస్తుందంటూ సమాధానమిచ్చారు. ఇదిలా ఉండగా, ఈ విషయమై ఎలా ముందుకు వెళితే బావుంటుందో సూచించాల్సిందిగా ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కొంత మంది న్యాయ నిపుణుల సలహా కోరినట్లు తెలిసింది.

జమలపూర్ణమ్మకు వైఎస్ జగన్ పరామర్శ

సాక్షి ప్రతినిధి, విజయవాడ: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం విజయవాడలో పర్యటించారు. ఇటీవల బైపాస్ సర్జరీ చేయించుకున్న ఎన్టీఆర్ జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్‌పర్సన్, వైఎస్సార్‌సీపీ నేత తిప్పరమల్లి జమలపూర్ణమ్మను ఆయన పరామర్శించారు. కేదారేశ్వరపేటలోని లోటస్‌లో జమలపూర్ణమ్మ నివాసానికి వెళ్లిన వైఎస్ జగన్.. ఆమె ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. చికిత్స గురించి ఆమె కుమారుడు అశోక్‌యాదవ్‌ను వాకబు చేశారు. అధైర్యపడవద్దంటూ ధైర్యం చెప్పారు. దీనిపై జమలపూర్ణమ్మ కుటుంబసభ్యులు సంతోషం వ్యక్తం చేశారు.

వైఎస్ జగన్‌కు ఘన స్వాగతం..

అంతకుముందు తమ అభిమాన నేత వస్తున్నారని తెలుసుకున్న స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి.. వైఎస్ జగన్‌కు బ్రహ్మరథం పట్టారు. రోడ్లకు ఇరువైపులా నిల్చొని పూల వర్షం కురిపించి.. ఘన స్వాగతం పలికారు. వైఎస్ జగన్ చిరునవ్వుతో అందరికీ అభివాదం చేస్తూ.. ఆప్యాయంగా పలకరిస్తూ ముందుకు సాగారు. జై జగన్ నినాదాలతో లోటస్ ప్రాంతమంతా మార్మోగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ తలశిల రఘురాం, వైఎస్సార్‌సీపీ నేతలు దేవినేని అవినాష్, మల్లాది విష్ణు, వెలంపల్లి శ్రీనివాస్, ఆసిఫ్, పోతిన మహేష్, అవుతు శ్రీనివాసుల రెడ్డి, అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు సమస్యలున్నాయి.. యువత ఉద్యోగాలు కావాలంటున్నారు

- గుడ్ గవర్నెన్స్‌లో అవినీతి పెరిగిందంటున్నారు
- నిత్యావసరాల ధరలు, తాగునీటి సమస్యలపై ప్రజల ఫిర్యాదు
- హాస్టళ్ల పనితీరు బాగా లేదు.. ఈ సమస్యలేవీ లేకుండా కవర్ చేయాల్సి ఉంది
- గ్రామ సచివాలయాల పేరు త్వరలో మారుస్తాం
- అనర్హులు వికలాంగుల పింఛన్లు పొందుతున్నారు
- ఏడాదిన్నరైనా చాలామంది మంత్రులకు అవగాహన లేదు
- మంత్రులు, కార్యదర్శులు, హెచ్‌వోడీల సమావేశంలో సీఎం చంద్రబాబు



సాక్షి, అమరావతి: ‘‘రాష్ట్రంలో రైతులకు సమస్యలున్నాయి, నిరుద్యోగులు ఉద్యోగాలు కావాలంటున్నారు. గుడ్ గవర్నెన్స్‌లోనూ అవినీతి పెరిగిందంటున్నారు. ప్రజలు నిత్యావసర ధరలు పెరిగాయంటున్నారు. తాగునీటి సమస్య ఉందంటున్నారు. ఇవేవీ లేకుండా కవర్ చేయాల్సి ఉంది’’ అని సీఎం చంద్రబాబు అన్నారు. హాస్టళ్ల పనితీరు బాగా లేదని ఒప్పుకొన్నారు. ఆలయాల దగ్గర సేవల పట్ల ప్రజలు సంతృప్తిగా లేరని చెప్పారు. ప్రజలు సంతృప్తి చెందేలా సేవలందించకపోతే బంగారం ఇచ్చినా లాభం లేదని పేర్కొన్నారు. కొన్ని శాఖలు ఫైళ్లు కిందకు పైకి పంపుతున్నారని, ఇది పెద్ద సమస్యగా మారిందని అన్నారు. రాజ్యాంగానికే సవరణలు చేశారని, బిజినెస్ రూల్స్‌కు సవరణలు చేద్దామని వ్యాఖ్యానించారు. బుధవారం సచివాలయంలో మంత్రులు, కార్యదర్శులు, విభాగాధిపతుల సమావేశంలో చంద్రబాబు మాట్లాడారు.

మూడు నెలల్లో సంతృప్తి స్థాయిని పెంచాలి..

మంత్రులు, కార్యదర్శులు క్షేత్రస్థాయి పర్యటనలతో మూడు నెలల్లో అన్ని పథకాలు, సేవల పట్ల ప్రజల సంతృప్తి స్థాయిని 80 నుంచి 90 శాతానికి తేవాలని చంద్రబాబు సూచించారు. గ్రామ సచివాలయాల పేరును త్వరలో మారుస్తామన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో జీఎస్‌డీపీ 17 శాతం వృద్ధి సాధించేలా అన్ని శాఖలు పనిచేయాలని కోరారు. ప్రభుత్వ శాఖల సమాచారంతో డేటా లేక్ వ్యవస్థ సిద్ధమైందని, ఎవరు ఏం అనుకుంటున్నారో ఇందులో వస్తుందన్నారు. ‘‘ఐదేళ్లలో విద్యుత్ యూనిట్ కొనుగోలు ధరను రూ.4కు తెచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నాం. రూ.9 వేల కోట్ల మేర చార్జీలు పెంచుకోవచ్చని ఈఆర్సీ అనుమతిచ్చినా.. ప్రజలపై భారం పడకూడదని అమలు చేయడం లేదు. టెక్నాలజీ సక్రమంగా ఉన్నా కొంతమంది వ్యవహార శైలి సరిగా లేకపోతే ఫలితం ఉండదు. ప్రజలకు ఫలితాలు రాకుండా పనిచేస్తామంటే కుదరదు’’ అని చంద్రబాబు తెలిపారు. దేవాదాయ, రెవెన్యూ శాఖలు అనుకున్న విధంగా పనిచేయడం లేదన్నారు. జనవరి 15 నాటికల్లా అన్ని సేవలు వాట్సాప్‌లోనే అందించకుంటే తీవ్రంగా పరిగణించి సంబంధిత శాఖపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనర్హులు వికలాంగ పెన్షన్లు పొందుతున్నట్లు తెలిపారు. టెక్నాలజీ వినియోగంలో న్యాయ శాఖ బలహీనంగా ఉందని అన్నారు.

డబ్బులు విపరీతంగా లేవు...

అరగంటలో ఫైళ్లు క్లియర్ కావాలని చంద్రబాబు అన్నారు. కొందరి దగ్గర 15 రోజులు ఉంటున్నాయని.. ఆర్థిక మంత్రి కేశవ్ దగ్గర 11 రోజులు ఉన్నట్లు వివరించారు. మంత్రి స్పందిస్తూ బడ్జెట్‌కు మించి నిధుల కోసం ఫైళ్లు వస్తున్నాయని, పెండింగ్‌లో పెడుతున్నామన్నారు. సీఎం స్పందిస్తూ ప్రతి శాఖ బడ్జెట్ కేటాయింపు లోబడే ఉండాలని నిర్దేశించారు. ‘‘ప్రభుత్వం దగ్గర డబ్బులు విపరీతంగా లేవు. ఫైళ్లు ఎక్కువ రోజులు ఉంటే సంబంధింత మంత్రులు బాధ్యులవుతారు. ఏడు రోజులుకన్నా ఎక్కువ రోజులు ఫైళ్లు ఉన్న వారి నుంచి వివరణ తీసుకుంటాం. సకాలంలో ఖర్చు పెట్టక కేంద్ర పథకాల నిధులు వెనక్కు వెళ్లిపోతే.. ఆ శాఖల అధికారుల వేతనాల్లో కోత విధిస్తామని హెచ్చరించారు. కేంద్రం నుంచి నిధులు తేవడంలో మంత్రులు, అధికారులు బాధ్యత తీసుకోవాలన్నారు. ఏడాదిన్నరైనా చాలామంది మంత్రులకు అవగాహన లేదని, ప్రజల నుంచి ఫిర్యాదులు ఎక్కువగా వస్తే సంబంధిత శాఖ సరిగా పనిచేయడం లేదని అర్థంగా చెప్పారు. ఆర్టీజీఎస్ ద్వారా జనాభా గణన చేయాలని చంద్రబాబు అన్నారు. ప్రతి అధికారి, శాఖ పనితీరు ఏమిటో ప్రభుత్వం వద్ద పూర్తి సమాచారం అందుబాటులో ఉందని తెలిపారు. కాగ్ ఆడిట్ పేరాలకు సకాలంలో సమాధానం చెప్పకుంటే నివేదికలో చేర్చుతారని, దీంతో ప్రభుత్వ ప్రతిష్ఠ దిగజారుతుందని అన్నారు. ఈ నెల 17, 18 తేదీల్లో కలెక్టర్ల సదస్సు నిర్వహిస్తామన్నారు. వరికి ప్రత్యామ్నాయ సాగుపై రైతులు దృష్టి పెట్టేలా అవగాహన కల్పించాలని అధికారులకు సీఎం సూచించారు. పత్తి కొనుగోళ్లలో కాటన్ కార్పొరేషన్ తీరు సరిగ్గా లేదన్నారు.

“ స్త్రీ, పురుషులిద్దరినీ సమానంగా పరిగణిస్తేనే ప్రపంచంలో పరిపూర్ణ జ్ఞానం, మేధస్సు వృద్ధి చెందుతాయి.

– సుబ్రహ్మణ్య భారతి

సాక్షి
గురువారం, 11 డిసెంబర్ 2025

దిక్కుతోచని ఉక్రెయిన్

నెలలు గడుస్తున్నా రష్యా–ఉక్రెయిన్ యుద్ధ విరమణకు చేస్తున్న ప్రయత్నాలు ఒక కొలిక్కి రాకపోవటంతో అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ అసహనం కట్టలు తెంచుకున్నట్టు కనబడుతోంది. మధ్యవర్తిగా తన ప్రతిపాదనలకు ససేమిరా అంటున్న ఉక్రెయిన్‌తోపాటు, దానికి దన్నుగా నిలబడిన యూరప్ దేశాలను కూడా ఆయన తూర్పారబడుతున్నారు. రష్యాతో యుద్ధంలో ఉక్రెయిన్ ఓడిపోతున్నదనీ, యూరప్ దేశాలు బలహీనంగా మారి క్షీణదశకు చేరుకున్నాయనీ ఆయన తాజాగా వ్యాఖ్యానించారు. వైరిపక్షాలు ఎటూ నువ్వా నేనా అన్నట్టు ఉంటాయి. మధ్యవర్తిత్వం వహించే దేశం ఓపిగ్గా వాస్తవ పరిస్థితులను అర్థం చేయించి ఏదోమేరకు తగ్గేలా చేయటం అవసరం. కానీ అలా చేయాలంటే మధ్యవర్తిత్వం వహించే దేశానికి విశ్వసనీయత, ప్రతిష్ఠ ఉండాలి. ట్రంప్ ఆగమనం తర్వాత అమెరికాకు ఆ రెండూ తగ్గాయి. ఏ విషయంలోనూ ఆయన నిలకడగా లేకపోవటం, ఇష్టానుసారం వ్యాఖ్యానిస్తూ అయోమయాన్ని సృష్టించటం కారణం.

జో బైడెన్ హయాంలో అమెరికా ప్రాపకంతోనే యూరప్ దేశాలు ఉక్రెయిన్‌ను రష్యాపైకి ఉసిగొల్పాయి. కానీ ట్రంప్ వచ్చాక అంతా తలకిందులయి యూరప్ దేశాలకు దిక్కుతోచడం లేదు. అంతేకాదు, ఇటీవల జాతీయ భద్రతా వ్యూహం పేరిట అమెరికా విడుదల చేసిన విధాన పత్రం కూడా వాటికి మింగుడుపడటం లేదు. అట్లాస్ మాదిరిగా ఒంటరిగా భూగోళాన్ని మోయటం ఇకపై ఉండబోదనీ, యూరప్ స్వీయరక్షణ బాధ్యత చూసుకోవాలనీ ఆ పత్రం స్పష్టం చేసింది. ప్రపంచాధిపత్యం కోసం పోటీపడటం పర్యవసానంగా అమెరికా బలహీనపడిందనీ, అందుకే పాత విధానానికి అవసరమైన దిద్దుబాట్లు తప్పనిసరనీ తేల్చింది. ఇప్పటికి ఎనిమిది యుద్ధాలు ఆపానని తరచు చెప్పే ట్రంప్ జాబితాలో నిజానికి ఇప్పటికైతే ఉక్రెయిన్ లేదు. కానీ ఆయన అధికార పగ్గాలు చేపట్టిననాడే ఉక్రెయిన్ యుద్ధాన్ని ఆపుతానని శపథం చేశారు. 2014కు ముందున్న సరిహద్దుల సంగతి ఉక్రెయిన్ మర్చిపోవాలని చెబుతూ వచ్చారు. కానీ ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ తమ భూభాగాన్ని వదులుకోవటానికి ససేమిరా అంటున్నారు.

నిజానికి 2022లో ఉక్రెయిన్‌కూ, ఆయనకు మద్దతునిస్తున్న యూరప్ దేశాలకూ బంగారం లాంటి అవకాశం వచ్చింది. టర్కీ మధ్యవర్తిత్వంలో రష్యా, ఉక్రెయిన్ ప్రతినిధుల మధ్య జరిగిన చర్చల్లో రష్యా తనకు తానే రాజీకి సిద్ధపడింది. ఉక్రెయిన్ తటస్థంగా ఉంటాననీ, నాటోలో చేరబోననీ హామీ ఇస్తే దురాక్రమించిన భూభాగం నుంచి వైదొలగుతామని రష్యా ప్రతినిధి బృందం ప్రతిపాదించింది. యూరప్ నుంచి కూడా దీనిపై హామీ కావాలని కోరింది. అప్పటికి రష్యా పూర్తి స్థాయి యుద్ధం మొదలుపెట్టి కొన్ని నెలలు మాత్రమే అయింది. కానీ బ్రిటన్ మాజీ ప్రధాని బోరిస్ జాన్సన్ హుటాహుటీన ఉక్రెయిన్ రాజధాని కీవ్ వచ్చి రాజీకి ఎట్టిపరిస్థితుల్లోనూ ఒప్పుకోవద్దని నచ్చజెప్పారు. నాటి అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ సలహాతోనే జాన్సన్ ఈ సైంధవపాత్ర పోషించారు. ఇప్పుడు రష్యా అధ్యక్షుడు పుతిన్ మొండికేస్తున్నారు. ఆయనకు శాంతియుత పరిష్కారం ఆలోచనే లేదు. ఆధిపత్య స్థాపనే లక్ష్యం. భారత్ వచ్చేముందు ఈ సంగతి నిర్మొహమాటంగా చెప్పారు. ‘ఉక్రెయిన్ తూర్పు ప్రాంతమైన డోన్బాస్ నుంచి ఉక్రెయిన్ దళాలు వైదొలగితే సరే... లేదా దాన్ని బలవంతంగా స్వాధీనం చేసుకుంటాం’ అని ఆయన ప్రకటించారు.

వైరిపక్షాలు చర్చలంటూ మొదలుపెడితే వాటి వైఖరులు ఏదోమేరకు చల్లారుతాయి. కానీ ఆ చర్చలు ఫలించాలంటే తొలుత కాల్పుల విరమణ పాటించాలి. రష్యా, ఉక్రెయిన్ రెండూ అందుకు సిద్ధపడటం లేదు. యుద్ధ వాతావరణంలో చర్చలు ప్రశాంతంగా సాగబోవన్న ప్రాథమిక సూత్రాన్ని విస్మరించి రష్యా ప్రతిపాదనలకు అంగీకరించమంటూ ఉక్రెయిన్‌పై అమెరికా ఒత్తిడి తెస్తోంది. ఈ విషయంలో అమెరికాతో నేరుగా మాట్లాడే ధైర్యంలేని యూరప్ దేశాలు... ట్రంప్‌ను ఖాతరు చేయొద్దని ఉక్రెయిన్‌కు నూరిపోస్తున్నాయి. అవకాశం వచ్చినప్పుడు కాలదన్నుకుంటే, అగ్రరాజ్యాల చదరంగంలో పావుగా మారితే ఏమవుతుందో ఉక్రెయిన్ ఈ దశలోనైనా గుర్తెరగాలి. దీన్నుంచి బయటపడాలంటే సొంత గొంతు వినిపించటం ప్రారంభించాలి.

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు, మార్గశిర మాసం, **తిథి:** బ.సప్తమి సా.6.45 వరకు, తదుపరి అష్టమి, **నక్షత్రం:** మఖ ఉ.8.06 వరకు, తదుపరి పుబ్బ, **వర్జ్యం:** సా.4.13 నుండి 5.53 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.10.04 నుండి 10.46 వరకు తదుపరి ప.2.26 నుండి 3.12 వరకు, **అమృత ఘడియలు:** రా.2.03 నుండి 3.40 వరకు.

సూర్యోదయం : 6.24
సూర్యాస్తమయం: 5.23
రాహుకాలం : ప.1.30 నుండి 3.00 వరకు
యమగండం : ఉ.6.00 నుండి 7.30 వరకు

సోషల్ టాక్

పరిస్థితులు

జీవితంలో ఎలాంటి పరిస్థితులనైనా తట్టుకుని నిలబడగలగటమే ఎదగటానికి ఏకైక మార్గం. మీరు ఎన్నో నైపుణ్యాలను కలిగి ఉండవచ్చు. కానీ పరిస్థితులు మారతాయి. అప్పుడు వాటికి తలొగ్గటమే వాటిని ఎదుర్కోవటం కూడా అవుతుంది.

– విశ్వనాథన్ ఆనంద్, చదరంగ దిగ్గజం

ఐక్యత

మీరు సమాజాన్ని మార్చాలనుకుంటే, అధికారంలో ఉన్నవారికి నిజం చెప్పే ధైర్యం మీకుండాలి. ఆ ధైర్యానికి ఐక్యత అనే విడదీయరాని శక్తి తోడవ్వాలి. అసమానతలపై పోరాటం సుదీర్ఘమైనది. న్యాయం సాధించే వరకు ముందుకు సాగుతూనే ఉండాలి.

– జిగ్నేష్ మేవాణీ, సామాజిక కార్యకర్త

చూడొద్దు!

ఎప్పుడూ కూడా ఆశను వదులుకోకండి. ఒకరి సహకారం కోసం చూడకండి. మీ అవకాశాలను మీరే సృష్టించుకోండి. ఈ మాటలేవీ అనుసరించటానికి కష్టమైనవి కాదు. మీ కోసం మీరు నిలబడితే, ఇతరుల కోసమూ మీరు నిలబడగలరు.

– నక్షత్ర బాగ్వే, నటుడు, ‘గే’ మ్యాన్

ఐశ్వర్యం

నిజమైన సంతృప్తి మనం కూడబెట్టుకునే సంపద నుండి రాదు. ఒకరికి చూపును ఇవ్వటం ద్వారా మనం స్పృశించిన జీవితాల నుంచి వస్తుంది. కంటి చూపు అని మాత్రమే కాదు. జీవితంలో ఒకరికి దారి చూపించగల శక్తి మన దగ్గర ఉండటం ఒక ఐశ్వర్యం.

– వికాస్ మహాత్మే, నేత్ర వైద్యుడు

ప్రేరణ

మనం ఎన్ని ప్రేరణాత్మకమైన కోట్స్, వీడియోలు, ప్రసంగాలు వినినా, చూసినా, చదివినా, మన లోపలి నుండి ప్రేరణ అనేది జనించకపోతే ఏ కోచ్, ఏ పోషకాహార నిపుణుడు, ఏ లైఫ్ స్టయిల్ గురువు మనల్ని మార్చలేరు. ఇదంతా మన నుండే మొదలవ్వాలి.

– ల్యూక్ కౌటిన్హో, ‘ద కామ్ ప్రిస్క్రిప్షన్’ సహ రచయిత

ప్రతిఫలం

ఇతరులకు సహాయం చేయటం ద్వారా మాత్రమే ఒకరు ఎదుగుతారు. ప్రకృతిని మనం సంరక్షిస్తే, ప్రకృతి మనకు ఫలాలను అందిస్తుంది కదా, ఆ విధంగా! అయితే ప్రతిఫలాపేక్షతో సాయం, సంరక్షణ ఉండకూడదు. అది మన బాధ్యతగా భావించాలి.

– దేవదత్ పట్నాయక్, మిథాలజిస్ట్

క్షమించండి, తీర్పు అనంగీకారం!

విశ్లేషణ

ప్రకాశ్ అంబేడ్కర్

‘తమిళనాడు రాష్ట్రం వర్సెస్ తమిళనాడు గవర్నర్’ కేసులో సుప్రీం కోర్టు ఇటీవల తీర్పు చెప్పింది. ఈ తీర్పు నేపథ్యం: తమిళనాడు శాసనసభ ఆమోదించిన బిల్లులను ఆ రాష్ట్ర గవర్నర్ ఆమోదించలేదు. వాటిని ఆయన రాష్ట్రపతికి పంపించారు. రాష్ట్రపతి కూడా ఆ బిల్లులకు సమ్మతి తెలుపలేదు. మరోసారి పరిశీలించవలసిందిగా కోరుతూ శాసనసభకు తిప్పి పంపనూ లేదు. ఈ పరిస్థితి రాష్ట్ర ప్రభుత్వం–గవర్నర్ మధ్య వివాదానికి దారితీసింది.

ఇక్కడ మూడు ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి: 1. ఆమోదం పొందని బిల్లుపై సుప్రీం కోర్టు విచారణ జరిపి తీర్పు చెప్పగలదా? శాసనసభ ఆమోదించి పంపినా గవర్నర్ లేదా రాష్ట్రపతి దానికి సమ్మతి ఇవ్వనప్పుడు అది చట్టం హోదా పొందినట్లేనని భావించవచ్చా? 2. ఆ బిల్లుకు ఆమోద ముద్ర వేయాలంటూ గవర్నర్ లేదా రాష్ట్రపతిని, ఆర్టికల్ 142 కింద, సంపూర్ణ న్యాయం అనే సూత్రం ప్రాతిపదికగా సుప్రీం కోర్టు బలవంత పెట్టగలదా? 3. శాసనసభ–గవర్నర్ మధ్య వివాదాన్ని పరిష్కరించే అధికారం రాజ్యాంగం సుప్రీం కోర్టుకు దఖలు పరిచిందా?

రాజ్యాంగం ఏం చెబుతోంది?

ఆర్టికల్ 200 ప్రకారం, గవర్నర్ బిల్లును అందుకున్న తరువాత సాధ్యమైనంత త్వరగా దానికి ఆమోదముద్ర వేయాలి లేదా తన వ్యాఖ్యలు జోడించి వెనక్కు పంపాలి లేదా రాష్ట్రపతికి నివేదించాలి. ఒకసారి తిప్పిపంపిన తర్వాత, శాసనసభ ఆ బిల్లును మళ్లీ పంపితే, దానికి ఆమోదముద్ర వేయడం తప్ప గవర్నర్‌కు మరో మార్గం లేదు. తమిళనాడు విషయంలో బిల్లుకు గవర్నర్ ఆమోదముద్ర వేయలేదు, వెనక్కు పంపలేదు. శాసనసభ తనకుతానుగా అదే బిల్లును రెండోసారి ఆమోదించి గవర్నర్‌కు పంపింది.

గవర్నర్ ఎంతకాలం బిల్లును పెండింగులో పెట్టగలరు? రాజ్యాంగం కాలపరిమితి విధించడం లేదు. ‘సాధ్యమైనంత త్వరగా’ తిప్పి పంపాలని మాత్రమే చెబుతోంది. ఒకవేళ బిల్లు ఆమోదించడానికి నిరాకరిస్తే? అలాంటప్పుడు రెండు ప్రత్యామ్నాయాలు ఉన్నాయి. ఒకటి, గవర్నర్ లేదా రాష్ట్రపతి మీద చట్టసభల్లో అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టడం. రెండు, ఆ బిల్లును మరోసారి పరిశీలించి ఆమోదించి పంపడం. తమిళనాడు శాసనసభ ఈ రెండో మార్గం ఎంచుకుంది. అది ప్రారంభించిన ఈ రాజ్యాంగ సంప్రదాయానికి రాజ్యాంగబద్ధత ఉందా? సుప్రీం కోర్టు ఈ అంశాన్ని చర్చించలేదు.

మరొక పరిస్థితిని పరిశీలిద్దాం. గవర్నర్ ఒక బిల్లును రాష్ట్రపతి పరిశీలన కోసం నివేదించినప్పుడు, రాష్ట్రపతి దానికి ఆమోదముద్ర వేయకుండా నిలిపివేస్తే, రాష్ట్ర శాసనసభ ఏం చేయాలి? రాష్ట్రపతి నుండి ఎలాంటి సందేశం రాకపోతే, శాసనసభ స్వయంగా బిల్లును పున:పరిశీలించి రెండోసారి ఆమోదించవచ్చు లేదా తిరస్కరించవచ్చు. బిల్లు రెండోసారి సభ ఆమోదం పొందినప్పుడు, ఆమోద ముద్ర వేయడం తప్ప రాష్ట్రపతికి మరో మార్గం లేదు. ఆర్టికల్ 143 కింద, రాష్ట్రపతి సుప్రీం కోర్టును అడిగిన ప్రశ్న: రాష్ట్రపతి ఎంతకాలం బిల్లును నిలిపివేయవచ్చు? దీనికి సమాధానంగా ఒక సంప్రదాయాన్ని నెలకొల్పే అవకాశం ఇదే ఆర్టికల్ కల్పిస్తోంది. సుప్రీంకోర్టు ఈ విషయంలో మార్గదర్శక న్యాయస్థానంగా వ్యవహరించకుండా, దేశానికి సూపర్ హీరోగా, బాస్‌గా వ్యవహరించింది.

◆ ఆర్టికల్ 12 ప్రకారం, ‘స్టేట్’ అంటే రాష్ట్రంలో రాష్ట్ర ప్రభుత్వం, శాసనసభ; కేంద్రంలో కేంద్రప్రభుత్వం, పార్లమెంటు అవుతాయి. గవర్నర్‌పై తమిళనాడు రాష్ట్రం పిటిషన్ వేయడం అంటే తన మీద తనే కేసు వేసుకున్నట్లు అవుతుంది. ఈ ముఖ్యాంశాన్ని సుప్రీం కోర్టు పరిశీలించలేదు.

ప్రస్తుత పరిస్థితి

ప్రస్తుత కేసులో రాష్ట్రపతి బిల్లును తిప్పి పంపలేదు, ఆమోద ముద్రా వేయలేదు. రాష్ట్రపతి బిల్లుకు ఆమోదం ఇవ్వకపోయినా, లేదా సందేశంతో వెనక్కు పంపకపోయినా, శాసనసభకు ఉన్న ప్రత్యామ్నాయం ఆ బిల్లును తిరిగి పరిశీలించడం. అలా రాష్ట్రపతి సలహా లేకుండా బిల్లును పున:పరిశీలించి ఆమోదిస్తే, రాష్ట్రపతి దానికి ఆమోదముద్ర వేయడం తప్ప మరోలా చేయలేరు. భవిష్యత్తులో శాసనసభకు రాష్ట్రపతికి మధ్య విభేదాలు వస్తాయని రాజ్యాంగం ఊహించలేదు.

కానీ సుప్రీం కోర్టు తీర్పు వ్యవస్థల అధికార పరిధి అంశాన్ని కూడా పరిగణనలోకి తీసుకోలేదు. ఇదే ప్రధాన సమస్య. ఆర్టికల్ 145 ప్రకారం, సుప్రీం కోర్టుకు తన కార్యకలాపాలకు అవసరమైన నియమావళిని రూపొందించుకునే అధికారం ఉంది. అలాగే, ఆర్టికల్స్ 118, 208 ప్రకారం, పార్లమెంటు, రాష్ట్ర శాసనసభలు తమ సభావ్యవహారాల నిర్వహణకు అవసరమైన నియమావళిని రూపొందించుకునే అధికారం కలిగి ఉన్నాయి. ఆర్టికల్స్ 122, 212 ప్రకారం సభా కార్యకలాపాలను కోర్టులో ప్రశ్నించే వీల్లేదు.

రాష్ట్రం, కేంద్రం నడుమ వివాదమా?

భారత రాజ్యాంగం శాసనసభ, గవర్నర్ మధ్య సంబంధాన్ని స్పష్టంగా నిర్వచించింది. అయితే, ఆచరణలో అనేక సందిగ్ధతలు ఉత్పన్నమవుతున్నాయి. బిల్లులు స్పీకర్ ద్వారా మాత్రమే గవర్నర్‌కు చేరతాయి. గవర్నర్ సమ్మతి పొందే వరకు బిల్లు శాసనసభ ఆస్తిగా ఉంటుంది. ఆమోదముద్ర పడిన తర్వాత అది చట్టంగా మారుతుంది. బిల్లు ఆమోదముద్ర పొందనంత వరకు ఈ వ్యవహారంలో న్యాయస్థానం జోక్యం చేసుకోలేదు.

ఆర్టికల్ 212 ప్రకారం శాసనసభ ప్రక్రియలు న్యాయస్థాన అధికార పరిధిలోకి రావు. అదే సమయంలో, ఆర్టికల్స్ 32, 131 ప్రకారం, ప్రాథమిక హక్కుల ఉల్లంఘన లేదా రాష్ట్రం–కేంద్రం నడుమ వివాదాలు సుప్రీంకోర్టు పరిధిలోకి వస్తాయి. గవర్నర్ లేదా రాష్ట్రపతి బిల్లుపై సంతకం చేయకపోవడం రాష్ట్రం–కేంద్రం మధ్య వివాదం అవుతుందా? అలా అయ్యేట్లయితే అది సుప్రీం పరిధిలోకి వస్తుంది. సమస్య ఏమిటంటే, సుప్రీంకోర్టు తీర్పు ఈ అంశాన్ని పరిశీలించలేదు. ఈ ప్రతిష్టంభనను అధిగమించడానికి రెండు మార్గాలు ఉన్నాయి. ఒకటి, శాసనసభ బిల్లును రెండోసారి ఆమోదించడం. దీనివల్ల గవర్నర్ ఆమోదం ఇవ్వకుండా తప్పించుకోలేరు. రెండవది, ఆర్టికల్ 156(1) ప్రకారం, రాష్ట్రపతి సంతృప్తి మేరకు గవర్నర్ పదవిలో ఉంటారు. అసెంబ్లీ తీర్మానం చేసి, గవర్నర్‌ను వెనక్కి పిలిపించవలసిందిగా రాష్ట్రపతిని కోరవచ్చు. తమిళనాడు అసెంబ్లీ ఈ మార్గాన్ని ఉపయోగించకపోవడం వల్ల రాజ్యాంగ సంక్షోభం ఉత్పన్నమైంది.

గవర్నర్ ఒక బిల్లును రాష్ట్రపతికి రిజర్వ్ చేసినప్పుడు, ఆయన తన అధికారాన్ని రాష్ట్రపతికి అప్పగించినట్లే. అందువల్ల రాష్ట్రపతి, గవర్నర్ ఒకే గుర్తింపు కలిగిన వారవుతారు. ఈ ముఖ్యాంశాన్ని సుప్రీం కోర్టు పరిశీలించలేదు. ఆర్టికల్ 12 ప్రకారం ‘స్టేట్’ అంటే రాష్ట్రంలో రాష్ట్ర ప్రభుత్వం, శాసనసభ; కేంద్రంలో కేంద్రప్రభుత్వం, పార్లమెంటు అవుతాయి. కాబట్టి, రాష్ట్రం గవర్నర్‌పై పిటిషన్ వేయడం అంటే తన మీద తనే కేసు వేసుకున్నట్లు అవుతుంది. ఇదెలా సాధ్యం? రాష్ట్రంలోని ఒక విభాగం మరొక విభాగానికి వ్యతిరేకంగా రిట్ పిటిషన్‌ను ఎలా దాఖలు చేయగలదో తేల్చడంలో అత్యున్నత న్యాయస్థానం విఫలమైంది. ఈ కారణాల వల్లనే నేను ఆ తీర్పుతో ఏకీభవించడం లేదు.

వ్యాసకర్త లోక్‌సభ, రాజ్యసభ మాజీ సభ్యులు, అడ్వకేట్
(‘ద ఫ్రీ ప్రెస్ జర్నల్’ సౌజన్యంతో)

వెనిజులాపై అమెరికా యుద్ధోన్మాదం

వెనుకబడిన, బలహీనమైన చిన్న దేశా లను, ఆ దేశాల ప్రభుత్వాలను ఆయుధ బలంతో తన చెప్పుచేతుల్లో పెట్టుకోవడం, తన మాట వినని ప్రభుత్వాలు కూలిపోయేలా చేయడం, అది సాధ్యం కాకపోతే యుద్ధం ద్వారా తన కీలుబొమ్మ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం, తరు వాత ఆ దేశాల సహజ వనరులను తరలించుకుపోవడం అమెరికా అనుసరిస్తున్న విధానంగా ఉంది. నేడు వెనిజులాపై దాని యుద్ధ సన్నాహాలు ఆ విధానంలో భాగమే.

దక్షిణ అమెరికా దేశమైన వెనిజులాపై దాడి చేయడానికి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కరేబియన్ దీవులకు 8 వార్‌షిప్‌లతో పాటు అతిపెద్ద విమాన వాహక నౌకను, 10 వేల మంది సైనికులను పంపాడు. ఇది ఇలా ఉండగా 2025 సెప్టెంబర్ 2 నాడు వెనిజులా నుంచి పోతున్న పడవలపై అమెరికా దాడి చేసి 11 మంది ప్రాణాలు తీసింది. ఈ దాడికి కారణం పడవల్లో వెనిజులా మాదక ద్రవ్యాలను రవాణా చేయడమే అంటున్నది.

వెనిజులాపై అమెరికా వ్యతిరేకత చాలా కాలంగా కొనసాగుతున్నది. ఆ దేశ భూగర్భంలో చమురు, సహజ వాయువు నిక్షేపాలు, వజ్రాలు, బంగారం వంటివి అపారంగా ఉన్నాయి. తన బహుళ జాతి సంస్థల ద్వారా వాటిని తరలించుకు పోతున్న అమెరికాకు, 1999లో వెనిజులా అధ్యక్షునిగా ఎన్నికైన హ్యూగో చావేజ్ అడ్డు కట్ట వేశాడు. ప్రభుత్వ సంస్థలను జాతీయం చేయడాన్ని వ్యతిరేకిస్తున్న పెట్టుబడిదారీ అనుకూల ముఠా చావేజ్ ప్రభుత్వంపై తిరుగుబాటు

ప్రయత్నాలకు మద్దతిచ్చింది.

ఆ తర్వాత రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలు పెరిగాయి. బొలీవియా దేశ ప్రభుత్వానికి వ్యతిరేకంగా హింసాత్మక సమూహాలకు ఒక అమెరికా రాయబారి సహకరించినట్లు వచ్చిన ఆరోపణల నేపథ్యంలో ఆ దేశానికి మద్దతుగా 2008లో అమెరికా రాయబారిని వెనిజులా దేశం నుంచి బహిష్కరించింది. చావేజ్ మరణం తర్వాత వరుసగా మూడు సార్లు నికోలస్ మదురో అధ్యక్షుడయాడు. తమ దేశ పెట్టుబడిదారులకు చెందిన వెనిజులాలోని సంస్థలనూ, గనులనూ ఆ దేశం జాతీయం చేసినందుకు నష్టపరిహారం చెల్లించాలని అమెరికా కోర్టులు తీర్పులు వెల్లడించాయి.

సార్వభౌమాధికారం గల ఒక దేశానికి సొంత నిర్ణయాలు తీసుకునే హక్కు ఉంటుంది. వెనిజులా అలాంటి దేశం కాబట్టి చమురు పరిశ్రమలను, ఖనిజాల గనులను జాతీయం చేసింది. ఆ దేశ నిర్ణయాలపై అమెరికా కోర్టులు తీర్పులు ఎలా ఇస్తాయి? వెనిజులా నుంచి ఎవరూ చమురు కొనవద్దని అమెరికా ఆంక్షలు (2023) విధించి ఆర్థికంగా దాన్ని దెబ్బతీస్తోంది.

అలాగే వెనిజులాపై యుద్ధానికి సిద్ధమై ఆ దేశ గగన స్థలాన్ని మూసి వేస్తున్నట్లు ప్రకటించింది అమెరికా. అధ్యక్షుడు నికోలస్ మదురో దేశం విడిచిపెట్టి పోవాలని, అతని మంత్రి వర్గ ముఖ్య సహచరులను కాపాడుకోమని ట్రంప్ బెదిరించినట్లు ‘హెరాల్డ్’ పత్రిక పేర్కొంది. ట్రంప్ ప్రభుత్వ ప్రకటనను వెనిజులా తీవ్రంగా ఖండించింది. ఇది ఏకపక్ష చర్య అని పేర్కొంది. ట్రంప్ ప్రకటన నేపథ్యంలో విమాన సర్వీసులను నిలిపి వేసిన స్పెయిన్, పోర్చుగల్, కొలంబియా, చిలీ, బ్రెజిల్, తుర్కియే దేశాలపై వెనిజులా ఆగ్రహం వ్యక్తం చేసి ఆ దేశాలకు సంబంధించిన విమాన సంస్థలపై శాశ్వత నిషేధం విధిస్తున్నట్లు ప్రకటించింది.

సార్వభౌమాధికారం గల ఒక దేశ గగన స్థలాన్ని మరొక దేశం మూసి వేస్తున్నట్లు ప్రకటించడం అంతర్జాతీయ ఒడంబడికలకు విరుద్ధమైనది. ఒక స్వతంత్ర దేశమైన వెనిజులా అధ్యక్షుణ్ణి పట్టి అప్పగించమని అమెరికా కోరడం, నికోలస్ మదురో సమాచారం ఇస్తే ఏకంగా 5 కోట్ల డాలర్ల బహుమతి ప్రకటించడం దాని హంతక మనస్తత్వానికి నిదర్శనం.

– బొల్లిముంత సాంబశివరావు
రైతు కూలీ సంఘం (ఆం.ప్ర.) రాష్ట్ర కార్యవర్గ సభ్యులు

తెలుగు భాషోద్ధారకుడు

ఇన్ బాక్స్

తెలుగు భాష, సాహిత్యం పదికాలాలపాటు కళకళలాడుతుందంటే, దానికి ప్రధాన కారకుల్లో ఛార్లెస్ ఫిలిప్ బ్రౌన్ ఒకరు. 1798 నవంబరు 10న కలకత్తాలో జన్మించిన బ్రౌన్‌కు, పందొమ్మిదేళ్లు వచ్చేవరకూ తెలుగు భాష తెలియదు. జిల్లా కలెక్టర్‌గా ఉద్యోగ బాధ్యతల్లో భాగంగా తెలుగు నేర్చుకోవలసి వచ్చింది. కడప జిల్లా కలెక్టర్ హన్బరీకి అసిస్టెంట్‌గా ఉన్నప్పుడు తెలుగువారికి రెండు ధర్మబడులు ప్రారంభించి విద్యార్థులతో, ప్రజలతో మమేకమై భాషలో పట్టు సాధించాడు. 1823 జూన్ నెలలో ‘అబే దుబాయ్’ అనే మిషనరీ... హిందువుల ఆచారాలపై ఫ్రెంచ్ భాషలో రచించిన పుస్తకం దొరికింది. అందులో వేమన గూర్చి చదివాడు. అంతే! మచిలీపట్నం కోర్టులో ‘సదర్ అమీనా’గా ఉన్న తిప్పాభట్ల శివశాస్త్రికి చెప్పి వేమన పద్యాలు దొరికినంతవరకూ సేకరించాడు. 2,500 పద్యాలలో 693 పరిష్కరించి ఇంగ్లిష్‌లోకి అనువదించి వేమనను ప్రపంచానికి పరిచయం చేశాడు. వందలాది తెలుగు గ్రంథాలను సేకరించి పోర్ట్ సెయింట్ జార్జ్ గెజిట్ ప్రెస్‌లో అచ్చు వేశాడు. కేవలం పుస్తక సేకరణ, అచ్చు వేయడం మాత్రమే కాకుండా తెలుగు భాషా సంస్కరణ చేసి నూతన ఒరవడి నెలకొల్పాడు.

ఛార్లెస్ ఫిలిప్ బ్రౌన్

అప్పటివరకు తెలుగు రచన గొలుసుకట్టుగా ఉండేది. దాన్ని మార్చి పదాలు విడివిడిగా రాసే పద్ధతి ప్రవేశపెట్టాడు. పుస్తక రచనలో పేరాలుగా విభజించే పద్ధతి బ్రౌన్ చేసిన నూతన సంస్కరణ. అదేవిధంగా పుటల సంఖ్యను ప్రవేశపెట్టాడు. రచనలో విరామ చిహ్నాలయిన ఫుల్‌స్టాఫ్, కామా, సెమికోలన్, ప్రశ్నార్థకం, కుండలీకరణ లాంటివి బ్రౌన్ నేర్పిన పద్ధతి. ఆంధ్ర శబ్ద చింతామణి, జిల్లా నిఘంటువు (1825), నలచరిత్ర (1841), భారతము ఆదిపర్వము (1843), వసుచరిత్ర, మనుచరిత్ర (1851), ఇంగ్లిష్–తెలుగు, తెలుగు–ఇంగ్లిష్ నిఘంటువులు (1852), తాతాచారి కథలు (1855), 42కు పైగా ద్విపద కావ్యాలు, మరెన్నో లెక్కకు మించిన గ్రంథాలు ముద్రించాడు. తమాషా ఏమంటే అన్నీ తన సొంత డబ్బుతోనే పరిష్కరించి, పండితులకు జీతాలిచ్చి, కొన్నిసార్లు అప్పులు చేసి, తెలుగు భాషాభివృద్ధికి కృషి చేశాడు. తెలుగు క్రైస్తవ లోకానికి కూడా బ్రౌన్ చేసిన సేవ అజరామర మైనదే. బైబిలు అనువాదాల్లో ఉన్న బాప్టిజం, ఆమెన్, హాల్లెలూయ, సబ్బాతు అనే పదాలకు ధార్మికార్థం చెడకుండా యథాతథంగా ఉంచాడు. అనారోగ్యం వల్ల 1884 డిసెంబరు 12న లండన్ వెస్ట్ బార్న్ గ్రోవ్‌లో తుదిశ్వాస విడిచిన బ్రౌన్ తెలుగు వారి ఆత్మబంధువు.

– ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారి I పరిశోధకులు
(రేపు సీపీ బ్రౌన్ వర్ధంతి)

పునరుత్పాదక విద్యుత్తే అధికం

డేటా పాయింట్

దేశంలో అక్టోబరు 31 నాటికి మొత్తం స్థాపిత విద్యుదుత్పత్తి సామర్థ్యం 5.05 లక్షల మెగావాట్లు. ఇందులో శిలాజ ఇంధనాల ద్వారా 2.46 లక్షలు, పునరుత్పాదక ఇంధన వనరులు సహా మిగతావాటి ద్వారా 2.59 లక్షల మెగావాట్ల ఉత్పత్తి జరుగుతోంది.





ధర్మబద్ధ జీవితమే...

దత్తబోధ



శ్రీ గణపతి సచ్చిదానందస్వామి

మూర్ఖత్వాన్ని వదిలి శ్రద్ధగా శాస్త్రబద్ధమైన పనులు చేసే వారికి తప్పక విజయం లభిస్తుంది. కరంద – వీరాదేవి రాజదంపతుల పుత్రుడు విరజుడు. అతడు వీరుడు, విద్యావంతుడు. విశాల దేశపురాజ కుమార్తె విశాలికి అతడి ఖ్యాతి తెలిసి వివాహం చేసుకోవాలనుకుంది. విరజుడు పొరుగు రాజ్యంపై యుద్ధానికి పోయి దురదృష్టవ శాత్తు ఓడి బందీ అవుతాడు. దీంతో అతడి తండ్రి కరందముడు వెంటనే దండెత్తి వెళ్లి శత్రువులను చెండాడి కుమారుని తీసుకువచ్చాడు. అదే సమయంలో విశాల దేశపు రాజు తన కుమార్తెకు వివాహం చేయడానికి స్వయంవరం ప్రకటించాడు. ఓటమి అవమానంతో ఉన్న విరజుడు స్వయంవరానికి హాజరు కాలేదు. అతడు రాకపోవడం వల్ల స్వయంవరం విఫలమైంది. ఫలితంగా విశాలి అడవి చేరి తపస్సు చేస్తున్నది.

వీరాదేవి తన కుమారునిచే ‘కిమిచ్ఛక’ వ్రతం చేయించింది. ఈ వ్రత నియమానుసారం వ్రతకర్త ఎవరేమడిగితే దాన్ని ఇచ్చి తీరాలి. అందుకే ‘మాకొక ముద్దుల మనుమణ్ణి ఇవ్వు’ అన్న తండ్రి కోరిక తీర్చడానికి ఒప్పుకున్నాడు. ప్రస్తుతం తపస్సులో ఉన్న విశాలి వివాహానికి ఒప్పుకోదనే ఉద్దేశంతోనే అతడు ఇందుకు అంగీకరించాడు. ఆమెను వెదుకుతూ వెళ్ళి ఒక రాక్షసుని చేతిలో చిక్కి ఉన్న విశాలిని చూసి, రాక్షసుణ్ణి చంపి ఆమెను ఇంటికి తీసుకువెళ్లి వివాహం చేసుకున్నాడు. వారి కుమారుడే ‘మరుత్తు’. పట్టాభిషేకానికి విరజుడు తిరస్కరించటం చేత మనుమడైన మరుత్తును పట్టాభి షిక్తుణ్ణి చేశాడు కరందముడు. మరుత్తు నాగలోకంపై దండెత్తడంతో భయపడిన నాగులు విశాలిని శరణువేడారు. కుమారుని నివారించమని భర్తను కోరిందామె. మరుత్తు తండ్రిని తిరస్కరించటం వల్ల తండ్రీ కొడుకులకు యుద్ధం అనివార్యమయింది. అప్పుడు దేవతలు వచ్చి వారిని శాంతింపజేశారు. నాగులు రక్షింపబడ్డారు. అర్థంలేని మొండితనం చూపటం వల్ల విరజుడు మొదట్లో దెబ్బతిని పెద్దల మాటకు కట్టుబడి తర్వాత సుఖవంతుడయ్యాడు. అలాగే మరుత్తు కూడా మొండితనంతో నాగులకు అపకారం చేశాడు. చివరికి దేవతలపై గౌరవంతో యుద్ధం వదిలివేశాడు. కనుక నియమ నీతి ధర్మబద్ధ జీవితమే అందరికీ ఉపకరిస్తుంది.

వడ్డనకు సిద్ధం



ఏకంగా రూ.15,651.83 కోట్ల వడ్డనకు రంగం సిద్ధం

సాక్షి, అమరావతి: ''విద్యుత్ చార్జీలు పెంచం.. ఇచ్చిన మాటకు కట్టుబడి ఉన్నాం'' బుధవారం అమరావతిలో హెచ్ఓడీల సదస్సు సాక్షిగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు చెప్పిన మాటలివి. ఎన్నికల ముందు కూడా ఆయన ఇలాంటి కబుర్లు ఎన్నో చెప్పారు. ఊరూవాడా ప్రచార సభల్లో ఊదర గొట్టారు. ఒకవైపు ముఖ్యమంత్రి బుధవారం ఇలా మాట్లాడుతుండగానే రాష్ట్ర ప్రజలపై కొత్త సంవత్సరంలో మోపనున్న కరెంటు చార్జీల భారం విషయం బైటపడింది. కొత్తగా రూ.15,651.93 కోట్ల మేర విద్యుత్ చార్జీల బాదుడుకు ముఖ్యమంత్రి చంద్రబాబు రంగం సిద్ధం చేసినట్లు ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్సీ) వద్ద ఉన్న ప్రతిపాదనలు తెలియజేస్తున్నాయి. చంద్రబాబు ప్రభుత్వం ఇప్పటికే రూ.17,349 కోట్ల మేర కరెంటు చార్జీల భారం రాష్ట్ర ప్రజలపై మోపింది. కొత్తగా మరో రూ.15,651.93 కోట్ల మేర కరెంటు చార్జీల భారం మోపనున్నట్లు తెలుస్తోంది.



టారిఫ్ ప్రతిపాదనల వివరాలు కనిపించకుండా నిలిచిపోయిన ఏపీఈఆర్సీ వెబ్‌సైట్

ఏపీఈఆర్సీ వద్ద ఏఆర్ఆర్ నివేదిక

ఏపీఈఆర్సీ అధికారిక వెబ్‌సైట్‌లో చార్జీల పెంపు ప్రతిపాదనలు బయటపడ్డాయి. 2026–27 ఆర్థిక సంవత్సరానికి ఆంధ్రప్రదేశ్ తూర్పు(ఏపీఈపీడీసీఎల్), మధ్య(ఏపీసీపీడీసీఎల్), దక్షిణ(ఏపీఎస్పీడీసీఎల్) విద్యుత్ పంపిణీ సంస్థ(డిస్కం)లు ఆదాయ, అవసరాల నివేదిక (అగ్రిగేట్ రెవిన్యూ రిక్వైర్‌మెంట్ –ఏఆర్ఆర్)లను ఏపీఈఆర్సీకి గత నెల(నవంబర్) 30న సమర్పించాయి. అయితే ఆ వివరాలేవీ బయటపెట్టకుండా రహస్యంగా ఉంచాయి. ఈ విషయాన్ని 'లెక్కలు చెప్పని డిస్కంలు' శీర్షికతో సాక్షి మంగళవారం వెలుగులోకి తీసుకువచ్చింది. దీంతో బుధవారం టీడీపీ కరపత్రం ఈనాడు పత్రికలోనూ, మరో ఆంగ్ల పత్రికలోనూ ఏఆర్ఆర్‌కు సంబంధించిన ప్రకటన వెలువడింది. మధ్యాహ్నానికి ఏపీఈఆర్సీ వెబ్‌సైట్‌లోనూ అవే వివరాలు ప్రత్యక్షమయ్యాయి. కానీ చిత్రంగా సాయంత్రానికి వెబ్‌సైట్‌ను మెయింటెనెన్స్ పేరుతో పూర్తిగా ఆపేశారు. దీంతో డిస్కంల ప్రతిపాదనలేవీ ఏపీఈఆర్సీ వెబ్‌సైట్‌లో కనిపించకుండా మాయమైపోయాయి. చార్జీలు పెంచడం లేదని సీఎం ప్రకటించిన నేపథ్యంలోనే ఏపీఈఆర్సీ వెబ్‌సైట్ నుంచి ఏఆర్ఆర్ వివరాలను ఎవరూ చూడకుండా చేసినట్లు తెలిసింది.

బాదుడు ఇలా..

2025–26 ఆర్థిక సంవత్సరంలో డిస్కంల ఖర్చులు, ఆదాయాలను లెక్కించి, 2026–27 సంవత్సరానికి అంచనాలను రూపొందించారు. దాని ప్రకారం..దక్షిణ డిస్కంలో నెట్‌వర్క్ నిర్వహణ, విద్యుత్ సరఫరా వ్యయం రూ.23,777.87 కోట్లుగా లెక్కించారు. అందులో రూ.14,016.06 కోట్ల మేర ప్రస్తుత ధరల ప్రకారమే చార్జీలు వసూలు చేస్తే సమకూరుతుంది. అలాగే టారిఫ్ యేతర రాబడి మరో రూ.1838.31 కోట్లు వస్తుంది. ఈ రెండూ పోగా ఇంకా రూ.7923.50 కోట్లు లోటు ఉంటుంది. దీంతో రూ.7733.85 కోట్లను చార్జీల ద్వారా వసూలు చేస్తే ఈ లోటు తీరుతుందని ఏపీఎస్పీడీసీఎల్ ప్రతిపాదించింది. అదే విధంగా మధ్య డిస్కం వచ్చే ఏడాది ఖర్చు రూ.14,446.93 కోట్లు అవుతుందని అంచనా వేసింది. ప్రస్తుత టారిఫ్ ప్రకారం అయితే రూ.10,344.51 కోట్లు, టారిఫ్‌యేతర రాబడి రూ.613.27 కోట్లు వస్తుందని చెప్పింది. అంటే ఇంకా రూ.3465.35 కోట్ల ఆదాయం అవసరం అవుతుందని ఏపీసీపీడీసీఎల్ అడిగింది. అదే విధంగా తూర్పు డిస్కం వచ్చే ఆర్థిక సంవత్సరానికి రూ.21,730.59 కోట్లు కావాలని అడిగింది. ఇందులో ప్రస్తుత రేట్ల ప్రకారం రూ.16,550.98 కోట్లు, టారిఫ్ కాకుండా ఇతర ఆదాయం రూ.567.29 కోట్లు పోగా ఇంకా రూ.4,612.32 కోట్లు లోటు ఉంటుందని వివరించింది. అందుకే కొత్త చార్జీల ద్వారా రూ.4,452.73 కోట్లు వసూలు చేసుకుంటామని ఏపీఈపీడీసీఎల్ చెప్పుకొచ్చింది. ఈ లెక్కన మొత్తం రూ.15,651.93 కోట్ల ఆదాయ లోటును డిస్కంలు ఏఆర్ఆర్‌లో చూపించాయి. ఈ మొత్తాన్ని 2026–27 ఆర్థిక సంవత్సరం టారిఫ్(చార్జీలు) ద్వారా వసూలు చేసుకోవడానికి అనుమతించాల్సిందిగా ఏపీఈఆర్సీని కోరాయి.

కొత్త చార్జీల భారం చిన్న వినియోగదారులపైనే

ఏఆర్ఆర్‌లో మరో బాధాకరమైన విషయం ఏమిటంటే ఈ మొత్తం చార్జీల భారం లోటెన్షన్(ఎల్‌టీ)విద్యుత్ సర్వీసులు అంటే గృహ, వాణిజ్య, చిన్న పరిశ్రమలు, సంస్థలు, వ్యవసాయ సర్వీసుల నుంచే వసూలు చేయనున్నారు. అయితే కొన్ని వర్గాలకు రాష్ట్ర ప్రభుత్వం రాయితీ, ఉచిత విద్యుత్‌ను అందించాల్సి ఉంది. ఆ మేరకు వారిపై కొత్త చార్జీల భారం పడకుండా ప్రభుత్వమే రూ.15,651.93 కోట్ల లోటును భరిస్తామని ప్రకటిస్తే ప్రజలపై ప్రస్తుత భారాలు కొనసాగినా, కొత్త చార్జీల భారం తప్పే అవకాశం ఉంది. కాగా సోలార్ ప్యానెళ్ల తయారీ పరిశ్రమలకు కొత్త టారిఫ్‌ను ఈ సారి డిస్కంలు ప్రతిపాదించాయి. మొదటి 7 సంవత్సరాలకు యూనిట్ రూ.4 చొప్పున, తర్వాత 8 సంవత్సరాలకు యూనిట్‌కు రూ.4.50 చొప్పున చార్జీలు వసూలు చేస్తామని వెల్లడించాయి. అదే విధంగా టైమ్ ఆఫ్ డే(టీఓడీ) ధరలను కూడా సవరించాయి. ప్రస్తుతం పీక్ అవర్స్ (విద్యుత్ డిమాండ్ అధికంగా ఉండే సమయం)లో యూనిట్‌కు రూ.0.50 అదనంగా వసూలు చేస్తుండగా దానిని రూ.1 కి పెంచాలని డిస్కంలు ప్రతిపాదించాయి. అంతేకాకుండా పీక్ అవర్స్‌గా లెక్కించే నిర్ధేశిత సమయాలను కూడా మార్చాయి. ఉదయం 6 గంటల నుంచి 10 గంటల వరకూ, తిరిగి సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకూ పీక్ అవర్స్‌గా ప్రస్తుతం లెక్కిస్తుండగా, ఇకపై ఉదయం 5 గంటల నుంచి 9 గంటల వరకూ, రాత్రి 7 గంటల నుంచి 11 గంటల వరకూ పీక్ అవర్స్‌గా పరిగణిస్తామని తెలిపాయి.

మూడు ప్రాంతాల్లో బహిరంగ విచారణ

డిస్కంలు ఇచ్చిన ఏఆర్ఆర్ ప్రతిపాదనలపై ఏపీఈఆర్సీ జనవరి 20,22,23, 27 తేదీల్లో హైబ్రిడ్ పద్ధతిలో బహిరంగ విచారణ చేపట్టనుంది. అంటే నేరుగానూ, వీడియో కాన్ఫరెన్స్ ద్వారానూ ప్రజల అభిప్రాయాలు, అభ్యంతరాలు తీసుకుంటుంది. 20వ తేదీ ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకూ తిరుపతిలోనూ, 22, 23 తేదీల్లో ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకూ విజయవాడలోనూ, 27వ తేదీన అదే సమయాల్లో కర్నూలులోని ఏపీఈఆర్సీ కార్యాలయంలోనూ బహిరంగ విచారణ నిర్వహించనుంది. ఈ విచారణ అనంతరం వచ్చిన సూచనల ఆధారంగా డిస్కంల ప్రతిపాదనలను పరిశీలించి కొత్త టారిఫ్‌పై ఏపీఈఆర్సీ నిర్ణయాన్ని వెలువరిస్తుంది. దాని ప్రకారం వచ్చే ఏడాది అంటే 2026 ఏప్రిల్ 1 నుంచి కొత్త టారిఫ్ చార్జీలు అమలులోకి వస్తాయి.

ఇప్పటికే రూ.17,349 కోట్ల మేర కరెంటు చార్జీల భారం

అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పెంచేది లేదని, అవసరమైతే తగ్గిస్తామని, వినియోగదారులే విద్యుత్ అమ్ముకునేలా చేస్తామని ప్రగల్భాలు పలికారు చంద్రబాబు. కానీ అధికారం చేపట్టిన తొలి ఏడాదిలోనే రూ.15,485.36 కోట్ల చార్జీల భారాన్ని వేసి విద్యుత్ చార్జీల బాదుడికి శ్రీకారం చుట్టారు. తొలి ఏడాదికి వసూలు చేసిన రూ.2,787.18 కోట్లలో రూ.1,863.64 కోట్లకు ఏపీఈఆర్సీ నుంచి అనుమతి లభించింది. అంటే చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఏర్పాటైన ఏడాది కాలంలోనే ఏకంగా రూ.17,349 కోట్ల మేర కరెంటు చార్జీల భారం ప్రజలపై మోపినట్లయ్యింది. రూ.923.55 కోట్లను ప్రజలకు తిరిగి ఇచ్చేయమని ఏపీఈఆర్సీ చెప్పకపోతే చార్జీల భారం మొత్తం రూ.18,272.55 కోట్లు అయ్యేదే.. ఇది చాలదన్నట్లు ఇప్పుడు రూ.15,651.93 కోట్ల బాదుడుకు రంగం సిద్ధమైంది.

ఏ డిస్కంలో ఎంత బాదుడంటే..

దక్షిణ డిస్కం రూ.7,733.85 కోట్లు	మధ్య డిస్కం రూ.3,465.35 కోట్లు
తూర్పు డిస్కం రూ.4,452.73 కోట్లు	మొత్తం రూ.15,651.93 కోట్లు


ఏపీసీపీడీసీఎల్ ప్రతిపాదించిన ఏఆర్ఆర్ కాపీ

APSPDCL

Revenue Impact

Revenue impact due to proposed Tariffs

Category	LT Supply: FY 2026-27 as per present tariffs (Crs.)	LT Supply: FY 2026-27 as per Proposed tariffs (Crs.)	LT Supply: Impact	HT Supply: FY 2026-27 as per present tariffs (Crs.)	HT Supply: FY 2026-27 as per Proposed tariffs (Crs.)	HT Supply: Impact	Total Impact (LT+HT)
Domestic	2708.98	3451.56	742.58	16.23	16.23	0.00	742.58
Commerical & Others	1484.64	1512.06	27.42	803.94	795.30	-8.64	18.78
Industry	482.44	482.44	0.00	5698.51	5698.51	0.00	0.00
Institutional	1120.21	1120.21	0.00	1213.13	1213.13	0.00	0.00
Agriculture & Related	278.81	7251.30	6972.49	1842.12	1842.12	0.00	6972.49
Resco				205.36	205.36	0.00	0.00
Total	6075.08	13817.57	7742.49	9779.29	9770.65	-8.64	7733.85

Note : The revenue at proposed tariff is arrived as per the directions in Go.Rt.No.161, dt.15-11-21

APCPDCL

Revenue Impact:

Revenue impact due to proposed Tariffs

Category	LT Supply: FY 2026-27 as per present tariffs (Crs.)	LT Supply: FY 2026-27 as per Proposed tariffs (Crs.)	LT Supply: Impact	HT Supply: FY 2026-27 as per present tariffs (Crs.)	HT Supply: FY 2026-27 as per Proposed tariffs (Crs.)	HT Supply: Impact	Total Impact (LT+HT)
Domestic	3171.44	4457.19	1285.75	24.21	24.21	0.00	1285.75
Commerical & Others	1462.31	1462.42	0.10	771.18	779.25	8.08	8.18
Industry	472.02	472.02	0.00	3467.11	3183.17	-283.93	-283.93
Institutional	304.18	304.18	0.00	642.40	642.40	0.00	0.00
Agriculture & Related	594.53	3049.88	2455.35	48.40	48.40	0.00	2455.35
Total	6004.48	9745.69	3741.21	4953.30	4677.44	-275.86	3465.35

APEPDCL

CATEGORY	LT: Existing Tariff (Rs Cr)	LT: Proposed Tariff (Rs Cr)	LT: Impact (Rs. Cr)	HT: Existing Tariff (Rs Cr)	HT: Proposed Tariff (Rs Cr)	HT: Impact (Rs. Cr)	TOTAL: Existing Tariff (Rs Cr)	TOTAL: Proposed Tariff (Rs Cr)	TOTAL: Impact (Rs. Cr)
I-Domestic	3847.23	5260.77	1413.54	35.84	35.79	-0.04	3883.07	5296.56	1413.50
II-Commercial & Others	1668.84	1663.60	-5.24	1281.62	1269.55	-12.07	2950.46	2933.15	-17.31
III-Industrial	425.45	425.45	0.00	7105.84	7102.35	-3.49	7531.28	7527.79	-3.49
IV-Institutional	432.53	432.53	0.00	1150.52	1150.52	0.00	1583.05	1583.05	0.00
V-Agriculture & Related	991.16	4051.20	3060.04	179.26	179.26	0.00	1170.42	4230.46	3060.04
TOTAL	7365.21	11833.54	4468.33	9753.06	9737.46	-15.60	17118.27	21571.00	4452.73

ఏపీఎస్పీడీసీఎల్, ఏపీసీపీడీసీఎల్, ఏపీఈపీడీసీఎల్ వినియోగదారులపై పాత, కొత్త టారిఫ్‌ల ప్రభావం ఇలా..

ఎవరిది విజన్? ఎవరిది విధ్వంసం?

- సీఎం చంద్రబాబును నిలదీసిన మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్
- విద్య, వైద్యం, వ్యవసాయం, సంక్షేమం, పోర్టుల నిర్మాణమే మా ప్రయారిటీ
- అప్పులు, అసమర్థతతో విధ్వంస పాలన మీ రియాలిటీ
- రాష్ట్ర స్థూల ఉత్పత్తి 10.4 శాతమైతే సొంత పన్నుల ఆదాయ వృద్ధి 2.58 శాతమేనా?
- దేశ జీడీపీలో 2014–19 మధ్య రాష్ట్ర వాటా 4.45.. 2019–24 మధ్య రాష్ట్ర వాటా 4.78 శాతం
- ఈ లెక్కన మీ పాలన బాగున్నట్లా? మా పాలన బాగున్నట్లా?
- ఐదేళ్లలో మా హయాంలో చేసిన అప్పు కేవలం రూ.3.32 లక్షల కోట్లే
- 18 నెలల మీ పాలనలో ఏకంగా రూ.2,66,715 కోట్ల అప్పు

సాక్షి, అమరావతి: 'రాష్ట్ర స్థూల ఉత్పత్తి (జీఎస్‌డీపీ) మీరు చెప్పినట్లు 10.4 శాతంగా ఉన్నట్లయితే.. రాష్ట్ర సొంత పన్నుల ఆదాయ వృద్ధి 2.58 శాతానికి ఎందుకు పరిమితమైంది? అసమర్థతతో కూడిన విధ్వంస పాలనకు ఇది తార్కాణం కాదా?' అని సీఎం చంద్రబాబును మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ సూటిగా ప్రశ్నించారు. ప్రపంచంలో ఎక్కడైనా జీడీపీ వృద్ధి.. పన్నుల ఆదాయ వృద్ధి సమానంగా ఉంటుందనానరు. బాబు అడుగడుగునా అబద్ధాలు చెబుతూ, వాస్తవాలను వక్రీకరిస్తూ అంకెల గారడీ చేస్తున్నారని మండిపడ్డారు. హైదరాబాద్‌లో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విద్య, వైద్యం, వ్యవసాయం, సంక్షేమం, పోర్టుల నిర్మాణం ప్రాధాన్యాంశాలుగా పనిచేసిందని చెప్పారు. కాగ్ నివేదికలోని గణాంకాలను ఉటంకిస్తూ చంద్రబాబు ప్రభుత్వ విధానాలను కడిగి పారేశారు. ఆ వివరాలు బుగ్గన మాటల్లోనే..

- బాబు థియరీ ఎప్పుడూ ప్రాక్టికల్‌గా మారదు. 2014–15లో ఆయన పాలన బ్రహ్మాండంగా ఉంటే.. దేశ జీడీపీలో రాష్ట్ర వాటా 4.45 శాతానికి ఎందుకు పరిమితమైంది? వైఎస్ జగన్ హయాంలో 2019–24లో రెండేళ్లు కరోనా ఉన్నప్పటికీ దేశ జీడీపీలో రాష్ట్ర వాటా 4.78 శాతానికి పెరిగింది. ఎవరి పాలన బాగున్నట్టు?
- 2019–24 మధ్య జీఎస్‌డీపీ 9.7 శాతం పెరగ్గా.. ఆదాయం 10.7 శాతం పెరిగింది. ఇవాళ కూటమి ప్రభుత్వంలో చంద్రబాబు చెప్పినట్లు 12 శాతం జీఎస్‌డీపీ పెరిగితే ఆదాయం ఎందుకు కేవలం 3 శాతం మాత్రమే పెరుగుతుంది? వైఎస్సార్‌సీపీ హయాంలో 2019–24 మధ్య జీఎస్‌డీపీ 10.2 శాతం పెరగ్గా.. ఆదాయం కూడా 9.8 శాతం పెరిగింది. ఇప్పుడు చంద్రబాబు ప్రభుత్వం 18 నెలల పాలనలో 12 శాతం జీఎస్‌డీపీ పెరిగిందంట. ఆదాయం మాత్రం 3 శాతం మాత్రమే పెరిగిందని చెబుతున్నారు. ఇదెలా సాధ్యం?

- దేశ వ్యాప్తంగా తలసరి ఆదాయంలో 2013–14 నుంచి 2018–19 వరకు మీ పరిపాలనలో ఆంధ్రప్రదేశ్ 18వ స్థానంలో ఉంది. మా పరిపాలనలో అది 15వ స్థానానికి పెరిగింది.

ఇవాళ రాష్ట్రం శ్రీలంక అయిపోవడం లేదా?

- ఇప్పుడు బాబు సర్కార్ 18 నెలల పాలనలో దాదాపు రూ. 2,66,175 కోట్లు అప్పుచేసిన మాట వాస్తవం కాదా? బడ్జెట్ అప్పు రూ.1,54,880 కోట్లు, బడ్జెట్ బయట అప్పు రూ.1,11,295 కోట్లు చేసిన మాట వాస్తవం కాదా? మా హయాంలో రూ.10 లక్షల కోట్లు అప్పు చేశారని సీఎం స్థానంలో ఉండి పచ్చి అబద్ధాలు ఎలా చెబుతావ్ బాబూ? మీరు అసెంబ్లీ సాక్షిగా ప్రవేశపెట్టిన లెక్కల ప్రకారమే.. మా ప్రభుత్వం దిగిపోయే నాటికి రాష్ట్రం అప్పు రూ.7,21,918 కోట్లు మాత్రమే. ఇందులో 2019లో మీ ప్రభుత్వం దిగిపోయే నాటికి ఉన్న అప్పు రూ.3,90,247 కోట్లు. ఈ లెక్కన మేము ఐదేళ్లలో రూ.3.32 లక్షల కోట్లు అప్పు చేస్తే.. మీరు ఏడాదిన్నర లోనే రూ.2.66 లక్షల కోట్లు అప్పు చేసి.. మా అప్పుల గురించి మాట్లాడతావా? ఇవాళ రాష్ట్రం శ్రీలంక అయిపోవడం లేదా?
- 2025–26లో దేశ వ్యాప్తంగా చూస్తే అప్పులు చేయడంలో ఏపీ రూ.63,052 కోట్లతో దేశంలోనే ప్రథమ స్థానంలో ఉందని కాగ్ చెప్పింది. ఆదాయ వృద్ధిలోనూ వెనుకబడిపోతున్న మీరా సంపద సృష్టి గురించి మాట్లాడేది?
- పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి 2024 అక్టోబర్ 9న రూ.2,348 కోట్లు కేంద్రం అడ్వాన్సుగా ఇస్తే.. మీరు ఎస్ఎన్ఏ అకౌంట్‌లో వేయకుండా వేరే ప్రయోజనాల కోసం ఆ డబ్బులు ఖర్చుపెట్టారు. మళ్లీ మార్చి 12న రూ.2,705 కోట్లు మీ అకౌంట్లో వేస్తే.. అందులో రూ.570 కోట్లు పోలవరానికి ఖర్చు పెట్టి మిగిలిన డబ్బులు మీ సొంతానికి వాడుకున్నారు. ఇవాళ్టికి రూ.1,107 కోట్లు ఇతర ఖర్చులకు మళ్లించిన మాట వాస్తవం కాదా? మా హయాంలో మేమే డబ్బులు ఖర్చుపెట్టి.. కేంద్రం ఎప్పుడు రీయింబర్స్ చేస్తుందా అని చూసేవాళ్లం.
- విద్యుత్‌కు సంబంధించి మీ హయాంలో అప్పు 24 శాతం పెరిగితే మా హయాంలో 7 శాతం పెరిగింది.
- మరోవైపు సూపర్ సిక్స్ సూపర్ హిట్ అని చెబుతున్నారు. అంటే పీఎం కిసాన్ రూ.6 వేలు కాకుండా అన్నదాత సుఖీభవలో రైతులందరికీ రూ.20 వేలు వచ్చాయా? ఇప్పటి వరకు ఒక్కో రైతుకు రూ.40 వేలు రావాలి, వచ్చాయా? యువగళం కింద ఉపాధి లేని నిరుద్యోగులకు నెలకు రూ.3 వేలు ఇస్తున్నారా? ఆడబిడ్డ నిధి వచ్చిందా? తల్లికి వందనం కూడా అరకొరగా ఇచ్చారు. మూడు సిలెండర్లు అన్నారు, ఒక్కటిచ్చి చేతులు దులుపుకున్నారు. ఈ పథకాలేవీ ఇవ్వకుండానే మీరు చేసిన అప్పు ఏమైంది బాబూ?

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
భారత ప్రభుత్వ రంగ సంస్థ
Union Bank of India
A Government of India Undertaking

నోటీసు - I

ఆర్‌బిఐ సూచనలకు అనుగుణంగా, బ్యాంక్ ప్రస్తుత కస్టమర్ల కెవైసి నికాలానుగుణంగా అప్‌డేట్ చేసే ప్రక్రియలో ఉంది మరియు సేవింగ్స్ బ్యాంక్ మరియు/లేదా కరెంట్ డిపాజిట్ ఖాతాను నిర్వహిస్తున్నప్పటికీ చాలా కాలంగా వారి ఖాతాలను నిర్వహించని కస్టమర్లతో సంబంధాన్ని పునరుద్ధరించే ప్రక్రియలో ఉంది.

పైన పేర్కొన్న ప్రక్రియలో, జీరో బ్యాలెన్స్ ఉన్న అనేక ఖాతాలు 30.09.2022న లేదా అంతకు ముందు పనిచేయనివి (డోర్మాంట్)గా మారాయని బ్యాంక్ గమనించింది. అటువంటి డోర్మాంట్ ఖాతాల దుర్వినియోగాన్ని నివారించడానికి, గత 5 సంవత్సరాల నుండి నిర్వహించబడని మరియు గత 3 సంవత్సరాల నుండి డోర్మాంట్ స్థితిలో ఉన్న అటువంటి అన్ని ఖాతాలను మూసివేయాలని బ్యాంక్ నిర్ణయించింది.

అటువంటి కస్టమర్లందరికీ మేము తెలియజేస్తున్నాము, వారి జీరో బ్యాలెన్స్ డోర్మాంట్ ఖాతాలను యాక్టివేట్ స్థితికి పునరుద్ధరించాలనుకునే కస్టమర్లతో బ్యాంక్ తన సంబంధాన్ని కొనసాగించడానికి ఆసక్తిగా ఉంది. అందువల్ల ఈ నోటీసు తేదీ నుండి 30 రోజులలోపు వారి కెవైసిని నవీకరించడానికి మరియు కార్యకలాపాలను తిరిగి ప్రారంభించడానికి సంబంధిత/సమీప శాఖను సంప్రదించవలసిందిగా ఇందుమూలంగా అటువంటి కస్టమర్లందరికీ సలహా ఇస్తున్నాము.

పైన పేర్కొన్న మూసివేత ప్రక్రియ నుండి కింది ఖాతాలు మినహాయించబడతాయి:

PMJDY (BSBDA/BSBDS) స్కీమ్, కోర్టు ఉత్తర్వు / ఐటీ శాఖ లేదా ఏదైనా ఇతర చట్టబద్ధమైన అధికారం ద్వారా ఖాతాలు స్తంభింపజేయబడ్డాయి, డిఇఎ నిధి ఖాతాలు, లాకర్‌కు లింక్ చేయబడిన ఖాతా, ఏదైనా మొత్తానికి తాత్కాలిక హక్కు ఉన్న ఖాతాలు.

ఈ నోటీసు వచ్చిన తేదీ నుండి 30 రోజుల లోపు మీ KYC పత్రాలను సమర్పించి మీ బ్యాంక్ ఖాతాను యాక్టివేట్ చేసుకోని యెడల, అన్ని జీరో బ్యాలెన్స్ ఖాతాలు బ్యాంక్ వారిచే మూసివేయబడతాయని దయచేసి గమనించగలరు.

తేదీ: 11.12.2025

జీఎస్‌డీపీ పెరిగితే ఆదాయం పెరగాలి కదా?

- మరి ఖజానా ఖాళీ అని పదేపదే ఎందుకంటున్నారు?
- సీఎం చంద్రబాబుకు ఎస్వీ సతీష్‌కుమార్‌రెడ్డి సూటి ప్రశ్న

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో జీఎస్‌డీపీ పెరిగితే ఆదాయం పెరగాలి కదా.. మరి నోరు తెరిస్తే ఎప్పుడూ ఖజానా ఖాళీ అని ఎందుకు అంటున్నారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్వీ సతీష్ కుమార్‌రెడ్డి సీఎం చంద్రబాబును ప్రశ్నించారు. ఆయన ప్రెస్‌మీట్లు పెట్టి పవర్ పాయింట్ ప్రజెంటేషన్లు ఇస్తుంటారని.. ఈ 18 నెలల కాలంలో ప్రజలు సంతోషంగా ఉన్నారా? లేదా చూద్దామన్నారు. మీ ఇష్టం వచ్చిన ఏ అంగడికైనా వెళ్దాం.. లేదా ఏదైనా తోపుడు బండి, కిరణా కొట్టుకైనా వెళ్దాం.. ఆదాయం పెరిగిందా? లేదా అని వారినే నేరుగా అడుగుదాం. ఎలాంటి సమాధానం చెబుతారో చూద్దామా? అంటూ సీఎంకు సవాల్ విసిరారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం సతీష్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ ఏమన్నారంటే..

ఎన్నికల హామీలు ఏమయ్యాయి?

2024 మే 9న సూపర్ సిక్స్ అంటూ గొప్పగా పేపర్లకు ప్రకటనలు ఇచ్చారు. అందులో యువతకు 20 లక్షల ఉద్యోగాలు, నెలకు రూ.3,000 నిరుద్యోగ భృతి హామీ ఇవ్వకుండా మోసం చేశారు. రైతులనూ వంచించారు. అలాగే, ప్రతీ మహిళకు నెలకు రూ.1,500 ఇస్తానన్న హామీ కూడా గాలిలో కలిసిపోయింది. ఏటా మూడు ఉచిత సిలిండర్లు ఇస్తానని చెప్పి ఒక్కటి మాత్రమే కొందరికి ఇచ్చి చేతులు దులుపుకున్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణానికి సంబంధించి ప్రభుత్వం ఆర్టీసీకి ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు.

రైతుల పరిస్థితి దారుణం..

చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతుల పరిస్థితి దారుణంగా తయారైంది. ఏ ఒక్క పంటకూ గిట్టుబాటు ధరలేదు. వైఎస్ జగన్ ప్రభుత్వం ఇచ్చినట్లు బత్తాయి, అరటి, ఉల్లి, టమాట వంటి పంటలకు మద్దతు ధరలు ఇచ్చే ధైర్యం చంద్రబాబుకు లేదా? మార్కెట్లో జోక్యం చేసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వానికి, ముఖ్యమంత్రికి లేదా? ఏ పనీ చెయ్యకుండా 'గొప్పంతా నాది దిబ్బంతా అవతలి వ్యక్తిదే'.. అన్నట్లుగా నీ భజన నీవే చేసుకుంటున్నావు. పరకామణి కేసులోగానీ, తిరుపతి లడ్డూ కల్తీ విషయంలోగానీ బాధ్యతంతా లేబొరేటరీ, సంబంధిత అధికారులకే ఉంటుంది. సీఎంకు ఏం సంబంధం ఉంటుంది. ఇక తిరుపతి లడ్డూ అపవిత్రమైందంటూ డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ ఆ రోజు తిరుమల మెట్లు కడిగాడు. ఇప్పుడు విశాఖలో 1.80 లక్షల కేజీల గోమాంసం దొరికింది. ఇప్పుడాయన ఎందుకు నోరు విప్పడంలేదు? పవన్ ద్వంద్వ వైఖరి చిన్నపిల్లాడికి కూడా అర్థమైపోయింది. మద్యం అక్రమ కేసులో వైఎస్సార్‌సీపీకి చెందిన బీసీ నాయకుడు జోగి రమేష్‌ను అన్యాయంగా అరెస్టుచేసి జైలుకు పంపారు

చొరబాటుదారుల ఓట్ల కోసమే!

అందుకే ప్రతిపక్షాలు ఎస్ఐఆర్‌ను వ్యతిరేకిస్తున్నాయి

- అక్రమంగా వలస వచ్చినవారికి ఓటు హక్కు ఇవ్వాలా?
- విపక్షాలపై కేంద్ర హోంశాఖ అమిత్ షా ఆగ్రహం
- ఎన్నికల సంస్కరణలపై లోక్‌సభలో ప్రత్యేక చర్చ


అమిత్ షా

న్యూఢిల్లీ: దేశంలో ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ఐఆర్)పై ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలను కేంద్ర హోంశాఖ అమిత్ షా కొట్టిపారేశారు. ఓటర్ల జాబితా ప్రక్షాళన జరిగితే.. తప్పుడు మార్గాల్లో ఎన్నికల్లో నెగ్గే అవకాశం పోతుందని విపక్షాలు ఆందోళన చెందుతున్నాయని విమర్శించారు. ఎన్నికల్లో కాంగ్రెస్ వరుస ఓటములకు ఆ పార్టీ నాయకత్వమే తప్ప ఈవీఎంలు లేదా ఓట్ల చోరీ కారణం కాదని తేల్చిచెప్పారు. దేశంలో ఎన్నికల సంస్కరణలపై బుధవారం లోక్‌సభలో ప్రత్యేక చర్చను అమిత్ షా ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రతిపక్షాలపై విరుచుకుపడ్డారు. రాజకీయ లబ్ధి కోసం అక్రమ వలసదారులను ఓటర్ల జాబితాలో కొనసాగించడానికే ఎస్ఐఆర్‌ను విపక్షాలు వ్యతిరేకిస్తున్నాయని మండిపడ్డారు. ఎవరు ఎంతగా వ్యతిరేకించినా, సభ నుంచి ప్రతిపక్షాలు ఎన్నిసార్లు వాకౌట్ చేసినా సరే చొరబాటుదారులను గుర్తించడం, వారి ఓట్లను తొలగించడం, వారిని బయటకు పంపించడం తథ్యమని తేల్చిచెప్పారు. అక్రమంగా మన దేశంలోకి ప్రవేశించినవారికి ఓటు హక్కు ఇవ్వాలనడం న్యాయమేనా? అని ప్రశ్నించారు. చొరబాటుదారులను అధికారికంగా గుర్తించి, ఎన్నికల జాబితాలో చేర్చాలంటూ నిస్సిగ్గుగా వాదిస్తున్నాయంటూ విపక్షాలపై ఆగ్రహం వ్యక్తంచేశారు.

మూడుసార్లు ఓట్ల చోరీ జరిగింది

''దేశంలో మూడుసార్లు ఓట్ల చోరీ జరిగింది. జవహర్‌లాల్ నెహ్రూ, ఇందిరా గాంధీ, సోనియా గాంధీ ఓట్ల చోరీకి పాల్పడ్డారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ ప్రధానమంత్రి కావాలని కోరుతూ 28 మంది ఆయనకు మద్దతిచ్చారు. నెహ్రూకు కేవలం ఇద్దరే మద్దతుగా నిలిచారు. అయినప్పటికీ ఓట్ల చోరీతో నెహ్రూ ప్రధానమంత్రి అయ్యారు. ఇందిరా గాంధీ ఎన్నికను న్యాయస్థానం కొట్టివేసింది. అయినా సరే ఆమె ప్రధానమంత్రి అయ్యారంటే కారణం ఓట్ల చోరీ. ఇక సోనియా గాంధీ ఈ దేశ పౌరురాలు కాకముందే ఎన్నికల్లో ఓటు వేశారు. అలా చేయడం ఓటు చోరీ కాదా? విపక్ష నాయకులు కేసుల్లో ఓడిపోతే న్యాయమూర్తిని నిందిస్తున్నారు. ఎన్నికల్లో ఓడిపోతే ఈవీఎంలపై నిందలేస్తున్నారు. ఆ నిందలను జనం పట్టించుకోకపోతే ఓట్ల చోరీ జరిగిందంటున్నారు. బిహార్‌లో కాంగ్రెస్ పరాజయానికి ముమ్మాటికీ ఆ పార్టీ నాయకత్వమే కారణం. ఈవీఎంలు లేదా ఓట్ల చోరీ కారణం అనడం ఉత్తమాట. కాంగ్రెస్ పెద్దలు ఏదో ఒకరు ఆ పార్టీ కార్యకర్తలకు సమాధానం చెప్పక తప్పదు.

కాంగ్రెస్ హయాంలోనే ఎస్ఐఆర్ ప్రారంభం

ఎస్ఐఆర్ గురించి ప్రతిపక్షాలు పెద్ద ఎత్తున తప్పుడు ప్రచారం చేస్తున్నాయి. ప్రజలను మభ్యపెట్టాలని చూస్తున్నాయి. చొరబాటుదారులు మన ప్రధానమంత్రిని, ముఖ్యమంత్రులను ఎన్నుకొనే పరిస్థితి ఉంటే దేశ ప్రజాస్వామ్యం భద్రంగా ఉంటుందా? ఈ విషయం అందరూ ఆలోచించాలి. చరిత్ర గురించి మేము మాట్లాడడం ప్రతిపక్షాలకు నచ్చడం లేదు. చరిత్ర తెలుసుకోకుండా సమాజం గానీ, దేశం గానీ ఎలా ముందుకెళ్తాయి. దేశంలో మొట్టమొదటి ఎస్ఐఆర్‌ను 1952లో నిర్వహించారు. అప్పట్లో కాంగ్రెస్ అధికారంలో ఉంది. నెహ్రూ ప్రధానమంత్రిగా ఉన్నారు. రెండోసారి 1957లో నెహ్రూ హయాంలో, మూడోసారి 1961లో నెహ్రూ హయాంలోనే ఎస్ఐఆర్ నిర్వహించారు. ఆ తర్వాత లాల్ బహదూర్ శాస్త్రి హయాంలో, ఇందిరా గాంధీ హయాంలో, రాజీవ్ గాంధీ హయాంలో, పీవీ నరసింహారావు హయాంలో కూడా ఎస్ఐఆర్ చేపట్టారు. అనంతరం అటల్ బిహారీ వాజ్‌పేయి పాలనలో, మన్మోహన్ సింగ్ పాలనలోనూ ఎస్ఐఆర్ జరిగింది. అప్పట్లో ఎస్ఐఆర్‌ను ఏ పార్టీ కూడా వ్యతిరేకించలేదు. ఎన్నికలు స్వచ్ఛంగా జరగాలంటే, ప్రజాస్వామ్యం ఆరోగ్యవంతంగా ఉండాలంటే ఎస్ఐఆర్ అవసరం కాబట్టి వ్యతిరేకించలేదు.

ప్రజాస్వామ్యాన్ని అప్రతిష్టపాలు చేస్తున్నాయి

మృతి చెందినవారి పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించడం, 18 ఏళ్ల వయసున్నవారిని చేర్చడం, విదేశీయులను తొలగించడం ఎస్ఐఆర్ అసలు ఉద్దేశం. ఈ ప్రక్రియను వ్యతిరేకించడం ద్వారా ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేయొచ్చని ప్రతిపక్షాలు భావిస్తున్నాయి. నిజానికి మన దేశ ప్రజాస్వామ్యాన్ని అప్రతిష్టపాలు చేస్తున్నాయి. ఓట్ల చోరీ ఓట్ల చోరీ అంటూ కేకలు పెట్టారు. చొరబాటుదారులను కాపాడాలంటూ యాత్రలు చేశారు. చివరికి బిహార్ ఎన్నికల్లో మూడింట రెండొంతుల మెజార్టీతో మేమే గెలిచాం. ఎన్నికల్లో ఓడిపోతే ఎన్నికల సంఘాన్ని, ఓటర్ల జాబితాను తప్పుపట్టడం, ఆరోపణలు చేయడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదు. ఓటర్ల జాబితాలో అవకతవకలు జరిగితే ప్రతిపక్షాలు ఎన్నికల్లో ఎందుకు పోటీచేశాయి? దేశంలో ఇప్పటిదాకా ఎన్నికల్లో బీజేపీ గెలిచిన సందర్భాల కంటే ఓడిపోయిన సందర్భాలే ఎక్కువ. అయినా సరే ఏనాడూ ఎన్నికల సంఘాన్ని తప్పుపట్టలేదు. ఈవీఎంలతో ఎన్నికల చోరీని అడ్డుకోవచ్చు. తప్పుడు పనులు చేయడం సాధ్యం కాదు. అందుకే విపక్షాలు ఈవీఎంలు వద్దంటున్నాయి. వారి బండారం పూర్తిగా బయటపడింది. దేశ ప్రజలు ప్రతిపక్షాలకు ఓటు వేయడం లేదు. ఎస్ఐఆర్‌తో చొరబాటుదారుల ఓట్లు కూడా రద్దయితే ఇక పుట్టగతులు ఉండవని ప్రతిపక్షాలు భయపడుతున్నాయి. 2004, 2009లో ఈవీఎంలతో ఎన్నికలు జరిగాయి. అప్పుడు కాంగ్రెస్ గెలిచింది కదా! 2014లో ఓడిపోయిన తర్వాత ఈవీఎంలపై ఆ పార్టీ ఆరోపణలు చేస్తోంది. ప్రతిపక్షాలు లేవనెత్తే అంశాలపై చర్చించకుండా మేము పారిపోవడం లేదు. ఎస్ఐఆర్ అంశం ఇప్పుడు ఎన్నికల సంఘం పరిధిలో ఉంది. అందుకే సభలో చర్చించలేం. ఎన్నికల సంస్కరణలపై చర్చించాలని కోరితే వెంటనే అంగీకరించాం. ఎస్ఐఆర్‌పై ఏకపక్షంగా అసత్య ప్రచారం చేయడం, ప్రజలను తప్పుదోవ పట్టించడం ఇకనైనా మానుకోవాలి'' అని అమిత్ షా తేల్చిచెప్పారు. ఎన్నికల సంస్కరణలపై చర్చ సందర్భంగా సభ నుంచి ప్రతిపక్షాలు వాకౌట్ చేశాయి.

'సర్'ను గబ్బర్‌సింగ్‌లా మార్చారు

''గౌరవప్రదమైన 'సర్' పదాన్ని గబ్బర్‌సింగ్‌లా భయంకరమైన అంశంగా మార్చారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(సర్) పేరిట ప్రజలను వేధిస్తున్నారు. సర్ సర్ అంటూ బీజేపీ ఎంతగా గొంతు చించుకున్నా బెంగాల్ ప్రజలు మాత్రం మేడమ్‌(మమతా బెనర్జీ) అంటూ నిలుస్తారు. బీజేపీ నేతలు బెంగాల్‌లో కేవలం ఎన్నికల సమయంలోనే ప్రజలకు కనిపిస్తుంటారు. ఎన్నికల్లో ఓడిపోయి ఇంటికి తిరిగివెళ్తారు. బీజేపీ బిహార్‌లో గెలిచిందేమో గానీ బిహార్‌లో వారి ఆటలు సాగవు. అసెంబ్లీ ఎన్నికల ముందే ఓటర్ల జాబితా సమగ్ర సవరణ ఎందుకు చేపట్టారో ప్రభుత్వం సమాధానం చెప్పాలి'' **- శతాబ్ది రాయ్, తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ**

బ్యాలెట్ పేపర్ల విధానం కావాలి

''ఎన్నికల్లో మళ్లీ బ్యాలెట్ పేపర్ల విధానం తీసుకురావాలి. ఎన్నికల సంఘం కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు పనిచేస్తోంది. చాలా ఏళ్లుగా బీజేపీకి సహకరిస్తోంది. ఎన్నికల సంఘానికి కల్పించిన కొన్ని చట్టపరమైన వెసులుబాట్లను తొలగించాలి. ప్రధాన ఎన్నికల కమిషనర్(సీఈసీ), ఎన్నికల కమిషనర్ల ఎంపికకు సంబంధించిన ప్యానెల్‌లో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిని కూడా చేర్చాలి'' **- డింపుల్ యాదవ్, సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ**

ఎస్ఐఆర్ అంటే బ్యాక్‌డోర్ ఎన్ఆర్‌సీ

''పౌరుల జాతీయ రిజిస్టర్‌(ఎన్ఆర్‌సీ)కి మరో రూపమే ఎస్ఐఆర్. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ముసుగులో దొడ్డిదారిన ఎన్ఆర్‌సీని అమలు చేస్తున్నారు. మతం ఆధారంగా ఓటు హక్కును తొలగించడానికి ద్రోహపూరితమైన ప్రక్రియ జరుగుతోంది. ఓటు హక్కును ప్రాథమిక హక్కుగా మార్చాలి. ఎస్ఐఆర్ చేపట్టడం పార్లమెంటరీ వ్యవస్థను ఉల్లంఘించడమే అవుతుంది. పౌరులకు పార్లమెంట్ ఇచ్చిన హక్కులను కాలరాస్తున్నారు. సుప్రీంకోర్టు తీర్పునకు కూడా ఈ ప్రక్రియ విరుద్ధమే'' **- అసదుద్దీన్ ఒవైసీ, ఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ**

ప్రజల హృదయాలను మోదీ హ్యాక్ చేశారు

ఎన్నికల్లో నెగ్గడానికి ఈవీఎంలను హ్యాక్ చేయాల్సిన అవసరం ప్రధాని మోదీకి ఎంతమాత్రం లేదు. ఎందుకంటే ఆయన ప్రజల హృదయాలను హ్యాక్ చేశారు. వారి మనసులు గెల్చుకున్నారు. ప్రజల అండతో ఎన్నికల్లో విజయం సాధిస్తున్నారు. ఈవీఎంలను హ్యాక్ చేస్తున్నారంటూ ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదు. పార్లమెంట్ కార్యకలాపాలు సజావుగా సాగకుండా ప్రతిపక్ష సభ్యులు ఉద్దేశపూర్వకంగా అలజడి సృష్టిస్తున్నారు'' **- కంగనా రనౌత్, బీజేపీ ఎంపీ**

మళ్లీ బూత్‌ల ఆక్రమణ, రిగ్గింగ్ కావాలా?

''ఎన్నికల్లో బ్యాలెట్ పేపర్ల విధానం మళ్లీ ప్రవేశపెడితే అప్పటి అరాచకాలు పునరావృతం అవుతాయి. బూత్ ఆక్రమణ, రిగ్గింగ్ మళ్లీ జరుగుతుంది. ఎన్నికల్లో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల(ఈవీఎం)ల వాడకాన్ని సుప్రీంకోర్టు, హైకోర్టులు సమర్థించాయి. ఈవీఎంలకు అనుకూలంగా ఎన్నో తీర్పులిచ్చాయి. ఈవీఎంలను హ్యాక్ చేయడం సాధ్యం కాదు. ఈవీఎంలను హ్యాక్ చేసి చూపించాలని ఎన్నికల సంఘం డిమాండ్ చేస్తే ఎవరూ ముందుకు రాలేదు. ఈవీఎంలను అనుమానాలను ఇకనైనా మానుకోవాలి. ఈవీఎంలతో ఎన్నికలు వేగంగా, సురక్షితంగా జరుగుతాయి. బిహార్ అసెంబ్లీ ఎన్నికల ముందు ఓట్ల చోరీ అంటూ కాంగ్రెస్ నేతలు ఆరోపణలు చేశారు. కానీ, ఎన్నికలు ముగిసిన తర్వాత ఓట్ల చోరీ అంశంపై ఒక్క ఫిర్యాదు కూడా చేయలేదు. నిజంగా ఓట్ల చోరీ జరిగిందని రుజువులుంటే ఎందుకు ఫిర్యాదు చేయలేదో కాంగ్రెస్ నాయకులు చెప్పాలి. ఎన్నికలు స్వచ్ఛంగా, పారదర్శకంగా జరగడానికి ఎన్నికల సంఘం అన్ని రకాల చర్యలూ తీసుకుంటోంది. ఎన్నికల వరుస పరాజయాలను జీర్ణించుకోలేక ఎన్నికల సంఘంపై అనవసర ఆరోపణలు చేస్తున్నారు. బీజేపీ మరో 15–20 ఏళ్లపాటు అధికారంలో కొనసాగడం తథ్యం'' **- రవి శంకర్ ప్రసాద్, బీజేపీ సభ్యుడు, కేంద్ర మాజీ మంత్రి**

అమిత్ షా, రాహుల్ మాటల యుద్ధం

లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, అమిత్ షాల మధ్య తీవ్రస్థాయిలో మాటల యుద్ధం జరిగింది. ఓట్ల చోరీపై తనతో చర్చకు సిద్ధమా? అని రాహుల్ సవాలు విసిరారు. ఎన్నికల సంఘం అండతోనే బీజేపీ ఓట్ల దొంగతనం చేస్తోందని మండిపడ్డారు. దేశ చరిత్రలో తొలిసారిగా ఎన్నికల కమిషనర్లకు పూర్తి స్వేచ్ఛ, అధికారాలు ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నారని, దీని వెనుక ఉద్దేశం ఏమిటో ప్రభుత్వం చెప్పాలని డిమాండ్ చేశారు. హరియాణాలో ఓట్ల చోరీ జరగలేదంటూ అమిత్ షా అబద్ధాలు చెబుతున్నారని ధ్వజమెత్తారు. అక్కడ ఓట్ల చోరీకి ఆధారాలున్నాయని చెప్పారు. అమిత్ షా స్పందిస్తూ ప్రతిపక్ష నాయకుడు చెప్పినట్లు తాను నడుచుకోవాలా? అని నిలదీశారు. విపక్షాల ఆరోపణలను ఖండిస్తున్నామని తెలిపారు. అమిత్ షా భయపడుతున్నారని, ఆత్మరక్షణ ధోరణిలోకి వెళ్లిపోయారని రాహుల్ ఎద్దేవా చేశారు.

రాహుల్ గాంధీ

నా ప్రశ్నకు సమాధానమేది?

ఓట్ల చోరీ అనేది అతిపెద్ద దేశద్రోహమని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. లోక్‌సభలో తాము అడిగిన ప్రశ్నలకు అమిత్ షా సమాధానం ఇవ్వలేదని విమర్శించారు. రాహుల్ బుధవారం పార్లమెంట్ ప్రాంగణంలో మీడియాతో మాట్లాడారు. ఓటర్ల జాబితాలో పారదర్శకత, ఓట్ల చోరీ, ఈవీఎంల పనితీరు గురించి తాము ప్రశ్నిస్తే అమిత్ షా ఒక్కమాట కూడా మట్లాడలేదని అన్నారు. ఓట్ల చోరీపై ఇప్పటికే ఆధారాలు చూపించానని గుర్తుచేశారు. కానీ, అమిత్ షా దానిపై స్పందించలేదని రాహుల్ ఆక్షేపించారు. అనంతరం 'ఎక్స్'లో పోస్టు చేశారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలు వేర్వేరు రాష్ట్రాల్లో ఓట్లు వేస్తున్నారని, దీనిపై అమిత్ షా ఎందుకు మాట్లాడడం లేదని నిలదీశారు. ఎన్నికల కమిషనర్ల నియామక ప్రక్రియ నుంచి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిని ఎందుకు పక్కనపెట్టారో చెప్పాలని నిలదీశారు.

హెచ్‌1బీ వీసా ఇంటర్వ్యూలు వాయిదా

- వేలాదిమంది దరఖాస్తుదారుల్లో తీవ్ర ఆందోళన
- మళ్లీ వచ్చే ఏడాది ఏప్రిల్/మేలో ఇంటర్వ్యూలు

న్యూఢిల్లీ: హెచ్‌1బీ వీసా ఇంటర్వ్యూలను హఠాత్తుగా వాయిదా వేయడంతో వేలాది మంది భారతీయ దరఖాస్తుదారుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. షెడ్యూల్ ప్రకారం ఈ నెలలో జరగాల్సిన ఇంటర్వ్యూలను వాయిదా వేస్తున్నట్లు అమెరికా ఇమిగ్రేషన్ వర్గాలు వెల్లడించాయి. దరఖాస్తులదారులకు ఈ–మెయిల్ ద్వారా సమాచారం చేరవేశాయి. ఇంటర్వ్యూలు మళ్లీ ఎప్పుడు ప్రారంభమవుతాయన్న దానిపై ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు. హెచ్‌1బీ వీసా దరఖాస్తుదారుల సోషల్ మీడియా ఖాతాల ప్రొఫైల్స్‌ను, సోషల్ మీడియాలో వారు చేసిన పోస్టులను క్షుణ్నంగా తనిఖీ చేయాలంటూ అమెరికా ప్రభుత్వం ఇటీవలే ఆదేశాలు జారీ చేసిన సంగతి తెలిసిందే. అనుమానాస్పద, అభ్యంతరకరమైన పోస్టులు చేసినట్లు తేలితే వీసా లభించదని డొనాల్డ్ ప్రభుత్వం పరోక్షంగా స్పష్టంచేసింది. ప్రొఫైల్స్ సైతం అనుమానాస్పదంగా ఉంటే వీసా ఇంటర్వ్యూకు పిలుపు రాకపోవచ్చు. తాజా ఆదేశాల నేపథ్యంలోనే భారత్‌లో హెచ్‌1బీ వీసా ఇంటర్వ్యూలను తాత్కాలికంగా నిలిపివేసినట్లు తెలుస్తోంది. ఈ నెలలో జరగాల్సిన ఇంటర్వ్యూలు వచ్చే ఏడాది ఏప్రిల్ లేదా మే నెలల్లో ప్రారంభం కానున్నట్లు సమాచారం. అమెరికా నుంచి ఇండియాకు వచ్చినవారు ఇప్పటికిప్పుడు తిరిగి వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. హెచ్‌1బీ వీసా ఇంటర్వ్యూ వెంటనే జరగకపోవడమే ఇందుకు కారణమని చెబుతున్నారు. వారు మరో నాలుగైదు నెలలపాటు వేచి చూడక తప్పదు. హెచ్‌1బీ మాత్రమే కాకుండా ఇతర వీసాల ఇంటర్వ్యూలను సైతం వాయిదా వేస్తున్నారు. సోషల్ మీడియా పోస్టులను, ప్రొఫైళ్లను తనిఖీ చేసిన తర్వాత వారికి ఇంటర్వ్యూ పిలుపులు రావొచ్చు. వీసా దరఖాస్తుదారులెవరూ కాన్సులర్ కార్యాలయాలకు రావొద్దని అమెరికా ఎంబసీ సూచించింది. కొత్త అపాయింట్‌మెంట్ తేదీ కోసం వేచి చూడాలని స్పష్టంచేసింది. ఇంటర్వ్యూలు వాయిదాపడిన దరఖాస్తుదారులు సోషల్ మీడియాలో తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నెల 18వ తేదీన జరగాల్సిన ఇంటర్వ్యూ వచ్చే ఏడాది ఏప్రిల్ 30వ తేదీకి వాయిదా పడిందని ఓ యువకుడు వాపోయాడు. ఇదిలా ఉండగా, ఇంటర్వ్యూలను వాయిదా వేయడాన్ని అమెరికా కంపెనీలు తప్పుపడుతున్నాయి. నైపుణ్యం కలిగిన మానవ వనరులు దూరమయ్యే అవకాశం ఉందని ఆందోళన చెందుతున్నాయి.

సీఐసీ ఎంపికపై... రాహుల్ అసమ్మతి

న్యూఢిల్లీ: నూతన ప్రధాన సమాచార కమిషనర్ (సీఐసీ) ఎంపిక ప్రక్రియ తుది అంకానికి చేరింది. ఇందుకోసం ప్రధాని నరేంద్ర మోదీ సారథ్యంలోని త్రిసభ్య కమిటీ బుధవారం ఢిల్లీలో భేటీ అయింది. సీఐసీతో పాటు మరో 8 మంది సమాచార కమిషనర్ల పేర్లను ఖరారు కూడా ఈ భేటీలో చేసినట్టు సమాచారం. అయితే ఈ పేర్లను కమిటీ సభ్యుడైన విపక్ష నేత రాహుల్ గాంధీ వ్యతిరేకించారు. ఈ మేరకు తన అసమ్మతితో లేఖ కూడా సమర్పించారు. అభ్యర్థులకు సంబంధించి రాహుల్ మరిన్ని వివరాలు కోరినట్టు సమాచారం. వారి ఎంపికకు అనుసరించిన ప్రాతిపదికను కూడా ఆయన ప్రశ్నించినట్టు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. భేటీలో కమిటీ సభ్యుడైన కేంద్ర హోం మంత్రి అమిత్ షా కూడా పాల్గొన్నారు. సమాచార హక్కు చట్ట సంబంధిత వివాదాల పరిష్కారానికి అంటున్న అపెలెట్ విభాగమైన సీఐసీలో ప్రస్తుతమిద్దరే కమిషనర్లున్నారు. సీఐసీతో పాటు 8 ఖాళీలున్నాయి. ఈ విషయమై సుప్రీంకోర్టు పదేపదే కేంద్రానికి తలంటిన నేపథ్యంలో ఖాకీల భర్తీ ప్రక్రియ వేగం పుంజుకుంది. సీఐసీ పదవి కోసం 81 మంది, కమిషనర్ పోస్టులకు 161 మంది దరఖాస్తు చేసుకున్నారు.

అమ్మకు బదులు అమ్మాయి

- నోబెల్ వేడుకకు 'మచాడో' దూరం
- కూతురు చేతికి శాంతి బహుమతి

నోబెల్ శాంతి బహుమతితో మచాడో కూతురు

ఓస్లో: వెనెజులాలో ప్రజాస్వామ్యం కోసం అలుపెరగని పోరాటం చేస్తున్న సాహసి, ప్రతిపక్ష నాయకురాలు మారియా కొరినా మచాడో.. ఆ నిప్పుకణిక లేకుండానే.. నోబెల్ శాంతి బహుమతి ప్రదానోత్సవం బుధవారం ఓస్లోలో జరిగింది. భయంకరమైన పరిస్థితుల నడుమ రాలేకపోయినప్పటికీ, ఆమె కూతురు అనా కొరినా సోసా.. వేదికపై తల్లి తరపున ఆ చారిత్రక గౌరవాన్ని స్వీకరించారు. మచాడో ఈ ఏడాది జనవరి 9 నుండి అజ్ఞాతంలో ఉన్నారు. అదేరోజు, ఆమె వెనెజులా రాజధాని కారకాస్‌లో తన మద్దతుదారులతో కలిసి నిరసనలో పాల్గొన్నారు.

త్వరలో మనతో మారియా..

నార్వేజియన్ నోబెల్ కమిటీ చైర్, జోర్గెన్ వాట్నే ఫ్రైడ్నెస్ సభలో చేసిన వ్యాఖ్యలు ఆహూతులను కదిలించాయి. 'మారియా కొరినా మచాడో ఈ రోజు వేడుకకు హాజరయ్యేందుకు తన శక్తి మేరకు ప్రయత్నించారు. ఆమె రాలేకపోయినా, సురక్షితంగా ఉన్నారని ధ్రువీకరించడానికి ఎంతో సంతోషిస్తున్నాం. ఆమె త్వరలోనే ఓస్లోలో మనతో ఉంటారు'.. అని ప్రకటించగానే సభ చప్పట్లతో దద్దరిల్లింది. ముందుగా నోబెల్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్, మచాడో ప్రతినిధి ఆమె రాలేకపోతున్నారని ప్రకటించారు. ఈ సందర్భంగా మచాడో కుమార్తె అనా కొరినా సోసా.. తన తల్లి స్థానాన్ని అలంకరించారు.

ఈ బహుమతి వెనెజులా ప్రజలందరిది

నోబెల్ వెబ్‌సైట్‌లో విడుదలైన మచాడో ప్రసంగం ఆద్యంతం ఉద్వేగాన్ని నింపింది. 'నేను ఓస్లో చేరుకోవడానికి ఎందరో ప్రాణాలను పణంగా పెట్టారు. వారికి నేను కృతజ్ఞురాలిని. ఈ గుర్తింపు వెనెజులా ప్రజలకు ఎంత ముఖ్యమో ఇది తెలియజేస్తుంది'.. అన్న ఆమె గొంతులో పోరాట స్ఫూర్తి ప్రతిధ్వనించింది. 'ఈ బహుమతి మొత్తం వెనెజులా ప్రజలందరిది. నేను రాగానే, రెండేళ్లుగా చూడని నా కుటుంబ సభ్యులను, నా పిల్లలను కౌగిలించుకుంటాను'.. అని ఉద్వేగంతో ఆమె చెప్పారు.

ఐదుగురూ నిర్బంధంలోనే..

గతంలో కూడా ఐదుగురు నోబెల్ శాంతి బహుమతి గ్రహీతలు (నర్గెస్ మొహమ్మది–2023, అలెస్ బియాలియాట్స్కి–2022, లియు జియాబో–2010, ఆంగ్ సాన్ సూ కీ–1991, కార్ల్ వాన్ ఒసియెట్జ్కీ–1935) నోబెల్ అవార్డు ప్రకటించే సమయానికి జైలులో లేదా నిర్బంధంలో ఉండటం గమనార్హం.

మరో 220 విమానాలు రద్దు

- కొనసాగుతున్న ఇండిగో సంక్షోభం
- ఇండిగో కార్యకలాపాలపై డీజీజీఏ ప్రత్యేక దృష్టి

న్యూఢిల్లీ: ఇండిగో విమానాల సంక్షోభం కొనసాగుతూనే ఉంది. బుధవారం 220 విమానాలు రద్దయ్యాయి. ఈ నెల 2వ తేదీ నుంచి ఇప్పటిదాకా 4,000కుపైగా విమానాలు రాకపోకలు సాగించలేదు. ఎక్కడికక్కడ ఎయిర్‌పోర్టుల్లోనే ఆగిపోయాయి. ఇండిగో నిర్వాకం వల్ల వేలాది మంది ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటూనే ఉన్నారు. అయితే, పరిస్థితి క్రమంగా అదుపులోకి వస్తోందని, రద్దవుతున్న విమానాల సంఖ్య తగ్గిపోతోందని ఇండిగో వర్గాలు వెల్లడించాయి. మరోవైపు ఇండిగో కార్యకలాపాలపై ప్రత్యేకంగా నిఘా పౌర విమానయాన డైరెక్టర్ జనరల్(డీజీసీఏ) ప్రత్యేకంగా దృష్టి పెట్టింది. ఇండిగో ప్రధాన కార్యాలయంలో తమ సిబ్బందిని నియమించాలని నిర్ణయించింది. ఇందుకోసం ఇద్దరు ప్రభుత్వ అధికారులతో సహా ఎనిమిది మంది సీనియర్ కెప్టెన్లతో ఒక బృందాన్ని ఏర్పాటు చేసింది. ఈ బృందం ఇండిగో గుర్గావ్ కార్యాలయంలో మకాం వేసి విమానాల రాకపోకలు, రద్దు, సిబ్బంది కొరత వంటి అంశాలను స్వయంగా పర్యవేక్షించనుంది. అలాగే డీజీసీకే నిత్యం నివేదిక సమర్పిస్తుంది.

సీఈఓకు డీజీసీఏ సమన్లు

ఇండిగో సీఈఓ పీటర్ ఎల్‌బెర్స్ డీజీసీఏ సమన్లు జారీ చేసింది. గురువారం తమ ఎదుట హాజరు కావాలని ఆదేశించింది. సంక్షోభంపై పూర్తి వివరాలతో నివేదిక ఇవ్వాలని పేర్కొంది. మరోవైపు 11 ఎయిర్‌పోర్టుల్లో ఇండిగో ఆపరేషన్లను స్వయంగా తనిఖీ చేయాలని నిర్ణయించినట్లు డీజీసీఏ వెల్లడించింది. ఇందుకోసం నియమించిన ప్రత్యేక సిబ్బంది రాబోయే రెండు మూడు రోజుల్లో ఆయా ఎయిర్‌పోర్టుల్లో తనిఖీలు చేస్తారని వెల్లడించింది. సవరించిన విమానాల షెడ్యూల్‌ను ఇండిగో ఇప్పటికే డీజీసీఏకు సమర్పించింది.

పరిహారం ఇవ్వాలి: ఢిల్లీ హైకోర్టు

ఇండిగో విమానాల సంక్షోభంపై వెంటనే ఎందుకు చర్యలు తీసుకోలేదని ఢిల్లీ హైకోర్టు బుధవారం కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. పరిస్థితి చెయ్యిదాటిపోయే దాకా ఎందుకు వేచి చూశారని ఆక్షేపించింది. ఇంత జరుగుతున్నా ఏం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేసింది. విమానాల రద్దు వల్ల నష్టపోయిన ప్రయాణికులకు తగిన పరిహారం ఇవ్వాల్సిందేనని పేర్కొంది. ఇందుకోసం చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని, ఇండిగో యాజమాన్యాన్ని ఆదేశించింది. విచారణ కమిటీ నివేదికను సీల్డ్ కవర్‌లో అందజేయాలని స్పష్టంచేసింది.

క్షమాపణ కోరిన ఇండిగో చైర్మన్

ఇండిగో విమానాల రద్దు, ఆలస్యంగా రాకపోకలు, ప్రయాణికుల ఇబ్బందులపై తమ ఎయిర్‌లైన్స్ బోర్డు పూర్తిస్థాయిలో అధ్యయనం చేయబోతున్నట్లు ఇండిగో చైర్మన్ విక్రమ్ సింగ్ మెహతా బుధవారం తెలిపారు. ఈ మేరకు ఒక వీడియో సందేశం విడుదల చేశారు. సంక్షోభానికి మూల కారణం ఏమిటో తెలుసుకుంటామని, ఇందుకోసం టెక్నికల్ నిపుణుల సహాయం తీసుకుంటామని చెప్పారు. ప్రయాణికులను క్షమాపణ కోరుతున్నానని వ్యాఖ్యానించారు. వారి అంచనాలకు తగ్గట్టుగా తాము పని చేయలేకపోయామని అంగీకరించారు. వారం రోజుల్లో తమపై ఎన్నో ఆరోపణలు, విమర్శలు వచ్చాయని, అందులో కొన్ని సరైనవి, మరి కొన్ని సరైనవి కానివి ఉన్నాయని విక్రమ్ సింగ్ మెహతా పేర్కొన్నారు. విమానాల రద్దు అనేది ఉద్దేశపూర్వకంగా జరిగింది కాదని వివరణ ఇచ్చారు.

దీపావళికి విశ్వ కిరీటం

- యునెస్కో సాంస్కృతిక వారసత్వ హోదా
- విశ్వ వేదికపై మెరిసిన పండుగ

న్యూఢిల్లీ: భారతదేశ సాంస్కృతిక వైభవానికి, తరతరాల జీవన సంస్కృతికి అత్యంత అరుదైన గౌరవం దక్కింది. చీకటిని చీల్చే దివ్య కాంతుల పండుగ దీపావళి.. బుధవారం యునెస్కో సాంస్కృతిక వారసత్వ నిధిగా ప్రపంచ వేదికపై ఘనంగా ఆవిష్కృతమైంది. యునెస్కో ఇన్‌టాంజిబుల్ కల్చరల్ హెరిటేజ్ జాబితాలో స్థానం సంపాదించుకుంది. దీంతో దేశవ్యాప్తంగా సంబరాలు అంబరాన్ని తాకాయి. ఢిల్లీలోని ఎర్రకోట వేదికగా జరుగుతున్న యునెస్కో కీలక సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. యునెస్కో కమిటీ కీలక చర్చల అనంతరం దీపావళిని గౌరవప్రదమైన ఈ జాబితాలో చేర్చినట్లు ప్రకటించగానే, ప్రాంగణమంతా 'జై హింద్', 'వందేమాతరం', 'భారత్ మాతా కీ జై' నినాదాలతో మారుమోగింది. వేదిక ముందు సంప్రదాయ వస్త్రధారణతో కళాకారులు ప్రదర్శనలు ఇవ్వగా, భారీ తెరపై దీపావళి పండుగ చిత్రాలు కనువిందు చేశాయి.

జాబితాలో 16వ అంశంగా దీపావళి

యునెస్కో యునెస్కో ఇన్‌టాంజిబుల్ కల్చరల్ హెరిటేజ్ జాబితాలో భారత్ నుంచి చేరిన 16వ అంశం దీపావళి. ఈ జాబితాలో ఇప్పటికే కుంభమేళా, కోల్‌కతా దుర్గా పూజ, గుజరాత్‌కు చెందిన గర్బా నృత్యం, యోగా, వేద పఠన సంప్రదాయం, రామాయణం ఇతిహాసం సంప్రదాయ ప్రదర్శన అయిన రామలీల వంటి 15 ఇతర అంశాలు ఉన్నాయి.

దీపావళి లోతైన భావోద్వేగం

యునెస్కో ఇన్‌టాంజిబుల్ కల్చరల్ హెరిటేజ్ జాబితా ఖరారుకు ఏర్పాటు చేసిన కమిటీ 20వ సమావేశంలో దీపావళిని ఎంపిక చేసినట్లు ప్రకటన వెలువడిన వెంటనే.. కేంద్ర సాంస్కృతిక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ దేశం తరపున కీలక ప్రకటన చేశారు. 'ప్రతి భారతీయుడికి, దీపావళి అనేది లోతైన భావోద్వేగం, ఇది తరతరాలుగా అనుభూతి చెందుతోంది, జీవిస్తోంది, ఆస్వాదిస్తోంది'.. అని షెకావత్ తన ప్రసంగంలో అభివర్ణించారు. ఈ గుర్తింపు ద్వారా, 'యునెస్కో పునరుద్ధరణ, శాంతి, మంచికి విజయం సాధించాలనే శాశ్వత మానవ వాంఛను గౌరవిస్తోంది'.. అని కేంద్ర మంత్రి పేర్కొన్నారు. కుమ్మర్ల నుంచి కళాకారుల వరకు లక్షలాది చేతులు ఈ వారసత్వాన్ని సజీవంగా ఉంచుతున్నాయని స్పష్టం చేశారు.

భారత్ ఆతిథ్యం ఇదే తొలిసారి

యునెస్కో అంతర–ప్రభుత్వ కమిటీ సమావేశానికి భారత్ ఆతిథ్యం ఇవ్వడం ఇదే మొదటిసారి. యునెస్కో ప్రపంచ వారసత్వ ప్రదేశమైన ఎర్రకోట సముదాయంలో డిసెంబర్ 8 నుంచి 13 వరకు ఈ 20వ సమావేశం జరుగుతోంది. దీపావళిని యునెస్కో జాబితాలో చేర్చినందుకు పాకిస్తాన్ దౌత్యవేత్త షోయబ్ సర్వార్ భారత్‌కు అభినందనలు తెలిపారు. దాదాపు వారం రోజులుగా యునెస్కో నిర్వహిస్తున్న ఈ కీలక సమావేశంలో 80 దేశాలు సమర్పించిన మొత్తం 67 నామినేషన్లను పరిశీలిస్తున్నారు. మంగళవారం, బంగ్లాదేశ్ నుండి వచ్చిన తంగైల్ సంప్రదాయ చీర నేతకళ, ఆఫ్గానిస్తాన్ నుంచి బెహజాద్ శైలిలో సూక్ష్మ చిత్రలేఖనాన్ని యునెస్కో జాబితాలో చేర్చారు. పురుషుల అబా (గావున్) అయిన 'బిష్ట్' తయారీ నైపుణ్యాలు, అభ్యాసాలు కూడా ఈ జాబితాలో చేరాయి. ఇరాక్, జోర్డాన్, కువైట్ దేశాలకు చెందిన సాంస్కృతిక అంశాలు కూడా బుధవారం యునెస్కో జాబితాలో స్థానం పొందాయి.

సాక్షి
గుంటూరు
గురువారం । 11 । డిసెంబర్ । 2025

సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం బుధవారం 575.90 అడుగులకు చేరింది. శ్రీశైలం నుంచి 50,623 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది.



పులిచింతల సమాచారం

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టుకు ఎగువ నుంచి 400 క్యూసెక్కులు వచ్చి చేరుతుండగా, దిగువకు 4400 క్యూసెక్కులు వదులుతున్నారు. నిల్వ 43.0610 టీఎంసీలు.



నిమ్మకాయల ధరలు

తెనాలి: తెనాలి మార్కెట్ యార్డులో బుధవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.800, గరిష్ట ధర రూ.1900, మోడల్ ధర రూ.1200 వరకు పలికింది.

న్యూస్‌రీల్

అక్రమ మైనింగ్‌పై విజిలెన్స్ అధికారుల దాడి

ఫిరంగిపురం: గుంటూరు జిల్లా అమీనాబాద్ కొండ ప్రాంతంలోని 545–25సర్వే నెంబర్‌లో అక్రమంగా మట్టి తవ్వకాలు నిర్వహిస్తున్నారన్న సమాచారంతో మైనింగ్ విజిలెన్స్ అధికారులు మంగళవారం రాత్రి దాడులు చేశారు. విజిలెన్స్ సీఐ చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విజిలెన్స్ ఏజీ అనిల్‌బాబు, సిబ్బందితో కొండ ప్రాంతానికి వెళ్లినట్లు తెలిపారు. ఆ ప్రాంతంలో మట్టి తవ్విన ఆనవాళ్లు, కొందరు వ్యక్తుల తోపాటు పొక్లయిన్ ఉండటంతో వారిని ప్రశ్నించినట్లు చెప్పారు. భాగ్యారావు అనే వ్యక్తి తవ్వకాలు చేయిస్తున్నట్లు తెలిసిందని, మైనింగ్‌శాఖ అనుమతి పత్రాలు అడగటంతో ఇంకా రావాల్సి ఉందంటూ చెప్పడంతో కేసు నమోదు చేసినట్లు చెప్పారు. పొక్లయిన్‌ను సీజ్ చేసి వీఆర్వో రామాంజి ద్వారా పోలీసు స్టేషన్‌కు తరలించాలని చెప్పామన్నారు.

కాంట్రాక్టర్ల బకాయిలు వెంటనే చెల్లించాలి

తాడేపల్లి రూరల్: కాంట్రాక్టర్లకు బకాయిలను వెంటనే చెల్లించాలని స్టేట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ బిల్డింగ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ (సబ్కా) నాయకులు డిమాండ్ చేశారు. గుంటూరు జిల్లా కొలనుకొండలోని సబ్కా కార్యాలయంలో రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపాలిటీలలో ప్రభుత్వ పనులు చేస్తున్న కాంట్రాక్టర్ల సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ డిప్యూటీ జనరల్ సెక్రటరీ కొండా రమేష్ మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా కాంట్రాక్టర్లకు సుమారు రూ.2 వేల కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉందని వివరించారు. డిప్యూటీ కోఆర్డినేటర్ సాధురావు, అసోసియేషన్ నాయకులు జీవీఆర్ నాయుడు, వి.శ్రీనివాసరావు, ఎ.సునీల్‌కుమార్, కె.వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ ఫౌండేషన్ డే వేడుకలు

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసి 70 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ప్రాజెక్ట్ అధికారులు డ్యామ్ ఫౌండేషన్ స్టోన్ వద్ద బుధవారం వేడుక నిర్వహించారు. ముందుగా తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ప్రాజెక్టు కుడి కాలువ గేట్స్ డీఈ శ్రీకాంత్, డీఈలు మురళీధర్, రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంతకాల పత్రాలున్న బాక్సులతో మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, పార్టీ నేతలు

సంతకాల ప్రతుల వాహనాన్ని జెండా ఊపి ప్రారంభిస్తున్న ప్రత్తిపాడు నియోజకవర్గ సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్

చేబ్రోలు పాతపోలీసు స్టేషన్ సెంటర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ తదితరులు

బాబు కుట్రపై సంతకాల సేకరణం

- వైఎస్సార్‌సీపీ చేపట్టిన కోటి సంతకాల సేకరణకు అనూహ్య మద్దతు
- ఇప్పటికే లక్ష్యాన్ని అధిగమించి.. కొనసాగిన సంతకాల సేకరణ
- గుంటూరు జిల్లాలో 4,78,059 సంతకాల సేకరణ
- నియోజకవర్గాల నుంచి జిల్లా కార్యాలయానికి సంతకాల పత్రాలు

వైద్య కళాశాలల ప్రైవేటీకరణపై ప్రజల నుంచి తీవ్ర నిరసన

గుంటూరు బృందావన్ గార్డెన్స్‌లో భారీ బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చేపట్టిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమం గుంటూరు జిల్లాలో విజయవంతమైంది. పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు బుధవారం జిల్లాలోని అన్ని నియోజకవర్గాల నుంచి ప్రజలు సంతకాలు చేసిన పత్రాలను ఆయా నియోజకవర్గ సమన్వయకర్తలు, నాయకులు, కార్యకర్తలు భారీ ర్యాలీలతో జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయానికి తీసుకొచ్చారు. వైద్య కళాశాలలు ప్రభుత్వ రంగంలోనే కొనసాగాలంటూ అన్ని వర్గాల ప్రజలు స్వచ్ఛందంగా సంతకాలు చేయడం ద్వారా తమ ఆకాంక్షను వెలిబుచ్చారు.

■ తెనాలి నియోజకవర్గంలో...

తెనాలి నియోజకవర్గంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో భాగంగా 75 వేల మంది సంతకాలు చేశారు. పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త అన్నాబత్తుని శివకుమార్ నేతృత్వంలో బోసు రోడ్డులోని చిట్టి ఆంజనేయస్వామి గుడి సెంటరు నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అనుబంధ కమిటీల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో ర్యాలీగా సాగారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదిక, వెనుక భారీ ఫ్లెక్సీ ఉంచారు. ఆ వేదికపై సంతకాలు చేసిన పత్రాల బాక్స్‌లను ఉంచారు. వాటిని ప్రత్యేక వాహనంలో గుంటూరుకు తరలించారు. వాహనాన్ని అన్నాబత్తుని శివకుమార్ స్వయంగా నడిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, తెనాలి ఎంపీపీ ధర్మరాజుల చెన్నకేశవులు, తెనాలి రూరల్, కొల్లిపర మండలాల పార్టీ అధ్యక్షులు చెన్నుబోయిన శ్రీనివాసరావు, కల్లం వెంకటప్పారెడ్డి, అనుబంధ కమిటీల నాయకులు పాల్గొన్నారు.

■ గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో...

గుంటూరు పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త, పార్టీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు నేతృత్వంలో సిద్ధార్థనగర్‌లోని క్యాంపు కార్యాలయం నుంచి బృందావన్ గార్డెన్స్‌రోడ్డులో ఉన్న పార్టీ జిల్లా కార్యాలయం వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. నియోజకవర్గంలో ప్రజలు సంతకాలు చేసిన 74,763 పత్రాలను బాక్సుల్లో ఉంచి, వాటిని ఆటోపై ప్రదర్శిస్తూ ర్యాలీ కొనసాగించారు. అంబటి రాంబాబు బుల్లెట్ నడుపుతూ బైక్ ర్యాలీలో పాల్గొన్నారు. మిర్చి యార్డు మాజీ చైర్మన్ నిమ్మకాలయ రాజనారాయణ, కార్పొరేటర్లు, అనుబంధ విభాగాల నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకులు పెద్ద సంఖ్యలో ర్యాలీలో పాల్గొన్నారు.

■ గుంటూరు తూర్పు నియోజకవర్గంలో..

గుంటూరు తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరి ఫాతిమా నేతృత్వంతో మంగళదాస్‌నగర్‌లోని కార్యాలయం నుంచి పార్టీ జిల్లా కార్యాలయం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. 65 వేల మందికిపైగా సంతకాలు చేయగా.. ఆ పత్రాలను కార్యాలయంలో అందజేశారు. ఇందులో పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

■ ప్రత్తిపాడు నియోజకవర్గంలో...

ప్రత్తిపాడు నియోజకవర్గ సమన్వయకర్త బాలసాని కిరణ్ కుమార్, పరిశీలకుడు గులాం రసూల్, ఐదు మండలాల కన్వీనర్లు, అనుబంధ విభాగాల నాయకులతో ఏటుకూరు బైపాస్ నుంచి జిల్లా పార్టీ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. నియోజకవర్గంలో 68 వేల సంతకాలు సేకరించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా పాల్గొన్నారు.

■ తాడికొండ నియోజకవర్గంలో...

తాడికొండ నియోజకవర్గంలో సమన్వయకర్త వనమా బాల వజ్రబాబు నేతృత్వంలో 64 వేల మంది నుంచి సంతకాలు సేకరించారు. ఆ పత్రాలను ర్యాలీగా జిల్లా కార్యాలయానికి తీసుకువచ్చారు. నాలుగు మండలాలకు చెందిన పార్టీ కన్వీనర్లు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు భారీగా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

పొన్నూరు నియోజకవర్గంలో

వైద్య కళాశాలల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా పొన్నూరు నియోజకవర్గంలో 65 వేల మంది సంతకాలు చేశారు. పార్టీ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ నేతృత్వంలో పొన్నూరు ఐలాండ్ సెంటర్ నుంచి సంతకాల పత్రాలు ఉంచిన బాక్సులతో ర్యాలీ నిర్వహించారు. చేబ్రోలు, నారాకోడూరు మీదుగా గుంటూరులోని పార్టీ జిల్లా కార్యాలయానికి తరలించారు.

మంగళగిరి నియోజకవర్గంలో

మంగళగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ కార్యాలయం నుంచి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావుల ఆధ్వర్యంలో ప్రజల సంతకాలతో కూడిన పత్రాలను భారీ ర్యాలీగా పార్టీ నాయకులు, కార్యకర్తలు జిల్లా పార్టీ కార్యాలయానికి తరలించారు. పార్టీ కార్యాలయం నుంచి తెనాలి బైపాస్ ఫ్లయ్ ఓవర్ వరకు ర్యాలీ నిర్వహించారు. మంగళగిరి నియోజవర్గంలో 66,296 మంది సంతకాలు చేశారు. కార్యక్రమంలో మంగళగిరి పట్టణ ఉపాధ్యక్షుడు ఎస్.కె మాబు, తాడేపల్లి పట్టణ అధ్యక్షుడు బుర్రముక్కు వేణుగోపాల సోమిరెడ్డి, మంగళగిరి మండల అధ్యక్షుడు నాలి వెంకటకృష్ణ, దుగ్గిరాల మండల అధ్యక్షులు తాడిపోయిన శివ గోపయ్య , రాష్ట్ర విభాగ నాయకులు, జిల్లా నాయకులు నియోజవర్గ విభాగ అధ్యక్షులు, సీనియర్ నాయకులు, మహిళలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జెండా ఊపి కోటి సంతకాల పత్రాలను జిల్లా కేంద్రానికి తరలిస్తున్న తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త వనమా బాల వజ్రబాబు

సంతకాల పత్రాలను ప్రజల సమక్షంలో బాక్సుల్లో సర్దుతున్న తెనాలి నియోజకవర్గ సమన్వయకర్త అన్నాబత్తుని శివకుమార్

బైకు ర్యాలీలో గుంటూరు తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరి ఫాతిమా, పార్టీ నాయకులు, కార్యకర్తలు

వైద్య కళాశాలల ప్రైవేటీకరణ ఆపి తీరాల్సిందే

- ప్రతి ఒక్కరి సంతకం డిజిటలైజేషన్ రూపంలో భద్రం
- చంద్రబాబు నిర్ణయం వెనక్కు తీసుకునే వరకు వైఎస్సార్ సీపీ ఉద్యమం
- ప్రైవేటుపరం చేస్తే మేం అధికారంలోకి రాగానే తిరిగి ప్రభుత్వ రంగంలోకే..
- పేదవారికి ఉచిత వైద్యాన్ని దూరం చేస్తున్న చంద్రబాబు సర్కారు
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు, నగర అధ్యక్షురాలు నూరి ఫాతిమా
- ఏడు నియోజకవర్గాల నుంచి పార్టీ జిల్లా కార్యాలయానికి సంతకాల పత్రాలు

కోటి సంతకాల పత్రాలను పార్టీ జిల్లా కార్యాలయంలో పరిశీలిస్తున్న అంబటి రాంబాబు

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటు రంగానికి అప్పగిస్తూ చంద్రబాబు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ప్రజలు తమ సంతకాల ద్వారా వ్యతిరేకిస్తున్నారని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు అన్నారు. వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో చేపట్టిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమం పూర్తయిన సందర్భంగా బుధవారం గుంటూరు జిల్లాలోని ఏడు నియోజకవర్గాల నుంచి సంతకాల పత్రాలను బృందావన్ గార్డెన్స్ మెయిన్ రోడ్డులోని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయానికి తరలించారు. ఈ సందర్భంగా ఆయా నియోజకవర్గాల నుంచి పత్రాలను తీసుకువచ్చిన పార్టీ సమన్వయకర్తలు, నాయకులు, కార్యకర్తలకు అంబటి రాంబాబు అభినందనలు తెలిపారు. అనంతరం గుంటూరు తూర్పు నియోజకవర్గం నుంచి భారీ ర్యాలీగా వచ్చిన నియోజకవర్గ సమన్వయకర్త, పార్టీ నగర అధ్యక్షురాలు షేక్ నూరిఫాతిమాతో కలిసి అంబటి రాంబాబు మీడియాతో మాట్లాడారు. సంతకాల సేకరణ ప్రజా ఉద్యమానికి ప్రజల నుంచి స్పందన లభించినట్లు చెప్పారు. గత ప్రభుత్వంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తీసుకొచ్చిన వైద్య కళాశాలలను ప్రభుత్వ రంగంలో నుంచి తప్పించి, ప్రయివేటు వారికి కట్టబెడుతూ చంద్రబాబు తీసుకున్న నిర్ణయాన్ని ప్రజలు వ్యతిరేకిస్తున్నారని చెప్పారు. ప్రజలు సంతకాలు చేయడం ద్వారా తమ వ్యతిరేకతను తెలిపారన్నారు.

మా ప్రభుత్వం రాగానే ఆ నిర్ణయం వెనక్కు

వైద్య కళాశాలలను పీపీఈ విధానంలో ప్రైవేటు వారికి అప్పగిస్తే.. తాము అధికారంలోకి రాగానే వైద్య కళాశాలలను తిరిగి ప్రభుత్వ రంగంలోకి తెస్తామని అంబటి రాంబాబు స్పష్టం చేశారు. ప్రతి పార్లమెంటు నియోజకవర్గానికి ప్రభుత్వ రంగంలో ఒక వైద్య కళాశాల, ఆస్పత్రిని నిర్మించేందుకు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఎంతో సదాశయంతో ముందుకు వెళ్లారని తెలిపారు. ఉద్యమంలో ఇది తొలి అడుగేనని, పీపీపీ విధానాన్ని వెనక్కు తీసుకోని పక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

సంతకాలన్నీ నిక్షిప్తం

వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ప్రజలు చేసిన సంతకాల పత్రాలు డిజిటలైజేషన్ చేసి భద్రపరుస్తున్నామని అంబటి చెప్పారు. ప్రతి పత్రంపై సంతకం చేసిన వారి పేరు, వారి సెల్ నంబరు ఉంటాయని, వాటని డిజిటల్ కాపీ రూపంలో భద్రపరుస్తామన్నారు. జిల్లాలోని ఏడు నియోజకవర్గాల నుంచి వచ్చిన సంతకాల పత్రాలను ఈ నెల 15వ తేదీన తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయానికి పంపుతామని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరేట్ ఎదుట చర్మకార వృత్తిదారుడు అచ్చియ్య వైద్య కళాశాలల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా అంబటి రాంబాబు సమక్షంలో సంతకం చేశారు. వైసీపీ నగర అధ్యక్షురాలు షేక్ నూరిఫాతిమా మాట్లాడుతూ కోటి మంది సంతకాలు చేయడాన్ని చూసి, చంద్రబాబు ప్రభుత్వం వెన్నులో వణుకు పుడుతోందన్నారు. కార్యక్రమంలో మిర్చి యార్డు మాజీ చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ, అనుబంధ విభాగాల నాయకులు, కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షుడు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీ వెంకటేశ్వర బాలకుటీర్
లలిత కళా ఉత్సవం

గుంటూరు ఎడ్యుకేషన్: శ్రీ వేంకటేశ్వర బాలకుటీర్ వజ్రోత్సవాలను పురస్కరించుకుని బుధవారం సాయంత్రం మల్లారెడ్డినగర్‌లోని ఎంఎస్ఆర్ కన్వెన్షన్‌లో 28వ లలిత కళా ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఏఎన్‌యూ విశ్రాంత రిజిస్ట్రార్ రావెల సాంబశివరావు అధ్యక్షతన జరిగిన సభలో వివిధ రంగాల్లో సేవలందిస్తున్న ముగ్గురు ప్రముఖులకు సంస్థ వ్యవస్థాపకురాలు డాక్టర్ నన్నపనేని మంగాదేవి పురస్కారాలను ప్రదానం చేశారు. రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆచార్య కొత్త మధుమూర్తి, ఏఎన్‌యూ ఇన్‌చార్జ్ వీసీ ఆచార్య కె. గంగాధరరావు అతిథులుగా మాట్లాడారు. బాల సాహిత్యకారుడు, విశ్రాంత గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు డాక్టర్ వితాల రాజేశ్వర శర్మకు డాక్టర్ మంగాదేవి విశిష్ట సేవా పురస్కారం,

ముగ్గురు ప్రముఖులకు పురస్కారాలు ప్రదానం

జట్టు ఆశ్రమ నిర్వాహకురాలు వెనిగండ్ల పద్మజకు మాలతీ ప్రమదా పురస్కారం, అంతరిక్ష పరిశోధనలపై ఆసక్తి కనబరుస్తున్న కె.కైవల్యారెడ్డికి ప్రతిభా పల్లవం పురస్కారాన్ని ప్రదానం చేశారు. గ్రహీతలకు రూ.25 వేల నగదు, ప్రశంసాపత్రం అందజేశారు. ఉత్సవాల నేపథ్యంలో వివిధ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. బాలకుటీర్ సహ వ్యవస్థాపకురాలు ప్రభావతి శత జయంతి సందర్భంగా ఆమెకు నివాళులర్పించారు. ఆకాశవాణి విశ్రాంత డైరెక్టర్ కృష్ణకుమారి, పాలడుగు లక్ష్మణరావు, సీఏవో రఘురాం, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పద్మజ, రాజేశ్వరశర్మ, కైవల్యారెడ్డికి పురస్కారాలు ప్రదానం చేసిన మధుమూర్తి, గంగాధరరావు, మంగాదేవి, కృష్ణకుమారి తదితరులు

క్లుప్తంగా

పత్తికి రూ.12వేలు మద్దతు ధర ప్రకటించాలి

లక్ష్మీపురం (గుంటూరు వెస్ట్): గుంటూరు సీపీఐ కార్యాలయం వద్ద సీపీఐ-ఏఐకేఎస్ ఆధ్వర్యంలో పత్తి రైతుల సమస్యలపై బుధవారం పెద్ద ఎత్తున ధర్నా జరిగింది. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ పత్తి రైతుల సంఘం రాష్ట్ర కార్యదర్శి డి.శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. పత్తి రైతులు ఎదుర్కొంటున్న నష్టాలు, సీసీఐ కొనుగోలు కేంద్రాల అవకతవకలపై రాష్ట్ర-జాతీయ స్థాయి నేతలు తీవ్రంగా స్పందించారు. ఈ సందర్భంగా సీపీఐ జాతీయ సమితి సభ్యులు ముప్పాళ్ల నాగేశ్వరరావు, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే.వి.వి.ప్రసాద్, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జంగాల అజయ్‌కుమార్ మాట్లాడుతూ తుపాన్లు, అధిక వర్షాలు, తెగుళ్లతో ఎకరాకు దిగుబడి 10 క్వింటాళ్ల నుంచి 3-4 క్వింటాళ్లకు పడిపోయి రైతులు నష్టాల్లో కూరుకుపోయారని తెలిపారు. రైతుల కష్టాలను పట్టించుకోకుండా సీసీఐ తేమ శాతం పేరుతో పత్తిని తిరస్కరించడం అన్యాయం తప్ప మరేమీ కాదని పేర్కొన్నారు. ప్రస్తుతం రైతులు క్వింటాకు రూ.5 వేలు, రూ.6వేలకే ప్రైవేటు వ్యాపారులకు అమ్ముకోవాల్సి వస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతాంగాన్ని కాపాడాలంటే కనీసం క్వింటాకు రూ.12 వేలు మద్దతు ధర ప్రకటించడం తప్పనిసరి అని నేతలు స్పష్టం చేశారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సీసీఐ జనరల్ మేనేజర్ రాజేంద్ర పాల్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ గుంటూరు జిల్లా కార్యదర్శి కోట మాల్యాద్రి, నగర కార్యదర్శి అరుణ్‌కుమార్, రైతు సంఘం నాయకులు కొల్లి రంగారెడ్డి, పచ్చల శివాజీ, అలాగే ప్రకాశం, పల్నాడు, గుంటూరు జిల్లాల నుంచి వచ్చిన పత్తి రైతులు, రైతు సంఘం కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పార్టీ ఆందోళనలకు చంద్రబాబు భయపడుతున్నారు

- అందుకే పోలీసులతో అణచి వేయాలని చూస్తున్నారు
- కోటి సంతకాల పత్రాల తరలింపులో మీడియాతో తెనాలి మాజీ ఎమ్మెల్యే శివకుమార్

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి: చంద్రబాబు ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణలో భాగంగా నియోజకవర్గంలో సేకరించిన 74 వేల సంతకాల పత్రాల తరలింపును తెనాలిలో అట్టహాసంగా నిర్వహించారు. స్థానిక బోసుబొమ్మలోని చిట్టి ఆంజనేయస్వామి ఆలయం సెంటరులో ఏర్పాటైన ప్రత్యేక వేదికపై ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ తెనాలి నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నిర్వహించే కార్యక్రమాలను పోలీసులతో అణచివేయాలని, అడ్డుకోవాలని పాలకవర్గాలు చూస్తున్నాయంటే ప్రజావ్యతిరేకతకు భయపడుతున్నాయన్నారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ నిర్ణయంపై ప్రజలనుంచి సేకరించిన సంతకాల పత్రాలను ప్రజల సమక్షంలో బాక్సుల్లో సర్ది, జిల్లా కేంద్రానికి తరలించే కార్యక్రమానికి ముందురోజునుంచీ పోలీసులు అభ్యంతరం పెట్టటం ఇందుకు ఉదాహరణగా చెప్పారు.

ప్రజల నుంచి అద్భుతమైన స్పందన...

మెడికల్ కాలేజీలను ప్రైవేటుకు అప్పగించాలనుకుంటున్న చంద్రబాబు ప్రభుత్వ నిర్ణయం మంచిది కాదనే భావనతో ప్రజాభిప్రాయాన్ని తెలుసుకునేందుకు పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కోటి సంతకాల సేకరణకు పిలుపునిచ్చినట్టు గుర్తుచేశారు. ఆ ప్రకారం గత రెండు నెలలుగా జరిగిన సంతకాల సేకరణకు అద్భుతమైన స్పందన లభించిందన్నారు. శిబిరాలు ఏర్పాటు చేసినా, ఇంటింటికీ వెళ్లినా ప్రజలు ముందుకొచ్చి స్వచ్ఛందంగా సంతకాలను చేశారని తెలిపారు. చంద్రబాబు ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాలు, విద్యపై ప్రజలు తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారని చెప్పారు. అందుకే మెడికల్ కాలేజీలను పీపీపీ పద్ధతిలో ప్రైవేటుకు అప్పగించాలని చూడటం తమకు ఆమోదయోగ్యం కాదని, పునఃసమీక్షించుకోవాలని ప్రజలు మాండేట్ ఇచ్చారని వివరించారు. సహకరించిన ప్రజలకు, సంతకాల సేకరణలో కృషిచేసిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల నేతలకు శివకుమార్ ధన్యవాదాలను తెలియజేశారు.

మేం అప్పుడు అభ్యంతరం పెట్టామా ?

సంతకాల పత్రాల తరలింపు ప్రక్రియను పోలీసులు ఆపాలని చూశారని చెబుతూ ఆదిమని అడిగితే రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడా అనుమతి లేదన్నారని శివకుమార్ చెప్పారు. తాము అధికారంలో ఉన్నపుడు ప్రతిపక్షంలో ఉన్న కూటమి పార్టీలు ఆందోళన కార్యక్రమాలు చేసినపుడు అభ్యంతరపెట్టామా? అని ప్రశ్నించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, వైస్‌చైర్మన్ అత్తోట నాగవేణి, తెనాలి ఎంపీపీ ధర్మరాజుల చెన్నకేశవులు, కొల్లిపర మండల పార్టీ అధ్యక్షుడు కల్లం వెంకటప్రసాద్‌రెడ్డి, పార్టీ నాయకులు మైలా విజయనాయుడు, కొర్రా యశోద, కొంగర రాగమంజరి, షేక్ దుబాయ్ బాబు, నిట్టా బాలు, కుర్రా శ్రీను పాల్గొన్నారు.

మాల 'గెజిటెడ్' అసోసియేషన్ కార్యవర్గం

నెహ్రూనగర్ (గుంటూరు ఈస్ట్): మాల గెజిటెడ్ అధికారుల అసోసియేషన్ (మాల్ గోపా) గుంటూరు జిల్లా సాధారణ సమావేశం స్థానిక ఏసీ లా కాలేజీలో రాష్ట్ర అధ్యక్షులు జంగం విజయానంద్ అధ్యక్షతన జరిగింది. జిల్లా కొత్త కార్యవర్గం ఎన్నుకున్నట్టు ఎన్నికల అధికారి రాష్ట్ర సెక్రెటరీ జనరల్ పోలా కోటి రామకృష్ణ ప్రకటించారు. జిల్లా అధ్యక్షులుగా తెనాలి ప్రకాష్ రావు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కూచిపూడి నెహ్రూ బాబు, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా బాబు ప్రవీణ్ కుమార్, జనరల్ సెక్రెటరీగా చెరుకూరి జాన్ మణికుమార్, ఉపాధ్యక్షులుగా దారా కోటయ్య, పుల్లగూర శామ్యూల్ పాల్, సుధాకర్, తమలపాకుల బుల్లయ్యలు ఎన్నికైనట్టు పేర్కొన్నారు. జాయింట్ సెక్రెటరీలుగా గుంటి ప్రకాష్, పచ్చల కుమార్ రాజా, జెజ్జం రవికుమార్, ఎద్దు రత్నరాజు, ట్రెజరర్‌గా కోట వెంకటేశ్వర్లు, ఉమెన్ వింగ్ సెక్రెటరీగా కొమ్మెర యూనీస్ రాణి, నీలం రమణ, తెనాలి జోష్ మేరీ, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులుగా గౌతం ప్రసన్న, ఏ.నవ్యత కుమార్ ఎన్నికైనట్టు తెలిపారు.

సాక్షి Smart Economic Display

ఇసుక అక్రమ తవ్వకాలకు అడ్డుకట్ట

కొల్లిపర: మండల కేంద్రంలోని కృష్ణా నది కరకట్ట దిగువున అనుమతి లేకుండా బుధ వారం ట్రాక్టర్లలో ఇసుక లోడింగ్ చేస్తున్నవారిపై అధికారులు కన్నెర్ర చేశారు. రెవెన్యూ ఆర్ఐ వంశీకృష్ణ, మండల సర్వేయర్ హరికృష్ణ సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. వారి వద్ద ఎటువంటి అనుమతి పత్రాలు లేక పోవటంతో హెచ్చరించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సిద్ధార్థ, ఎస్ఐ ప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఫ్రీ ఇసుక విధానం ద్వారా ఇసుక తరలించే సమయంలో మండల పరిధిలోని వినియోగదారులు వారి వద్ద ఆయా గ్రామ పంచాయతీ కార్యదర్శి .అనుమతి పత్రం తీసుకుని స్థానిక రెవిన్యూ శాఖకు అందిస్తే వాటిని పరిశీలించి అధికారులు ఇసుక తరలించ డానికి అనుమతి పత్రం జారీ చేస్తారన్నారు.

కొల్లిపర తిరుపతమ్మ గుడి వద్ద ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ పట్టుకుని నదిలో ఇసుక అనులోడింగ్ చేయిస్తున్న ఆర్ఐ వంశీకృష్ణ

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము

మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు నోటీసు

ఆర్.ఓ.సి.నెం.3356/2025/ఇ1 | నిట్ నెం:57/జే.టి.ఓ/2025-26 | తేది:10.12.2025

మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ-సాధారణ నిధులు నిధుల క్రింద ఈ దిగువ ఉదహరించిన పనులకు గాను ఇ-ప్రొక్యూర్మెంట్ ద్వారా టెండరు పిలువబడినది.

మొత్తం పనులు : 07	అంచనా వ్యయము: రూ.26.35 లక్షలు
పని నెం. 01 నుండి 07 వరకు :	
1.టెండరు షెడ్యూల్ డౌన్ లోడ్ కొరకు నిర్ణయించిన ప్రారంభ తేది:	ది.11.12.2025 ఉదయము గం. 11.00 ని॥ల నుండి
2. టెండరు షెడ్యూల్ డౌన్ లోడ్ కొరకు నిర్ణయించిన చివరి తేది:	ది.15.12.2025 ఉదయము గం.11.00 ని॥ల వరకు
3. ప్రైస్ బిడ్ తెరుచు తేదీ:	ది.15.12.2025 మధ్యాహ్నము గం.02.00 ని॥లకు

మిగతా వివరములకు ఇ-ప్రొక్యూర్మెంట్ వెబ్సైట్ http://www.apeprocurement.gov.in చూడగలరు.

కమీషనర్, మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ

జీజీహెచ్‌లో మాతృమరణాలపై సమీక్ష

సాక్షి ఎఫెక్ట్

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో బుధవారం మాతృమరణాలపై సమీక్ష జరిగింది. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ యశ్వి రమణ అధ్యక్షతన ఆయన చాంబర్‌లో సమీక్ష నిర్వహించారు. జీజీహెచ్‌లో మరణాలపై ఆడిట్ నిర్వహించడం లేదంటూ నవంబరు 16న 'అటకెక్కిన డెత్ ఆడిట్' శీర్షిక పేరుతో 'సాక్షి' జిల్లా ఎడిషనల్ కథనం ప్రచురితమైంది. సాక్షి కథనానికి స్పందించిన ఆసుపత్రి అధికారులు బుధవారం సమీక్ష నిర్వహించారు. జనరల్ మెడిసిన్, పీడియాట్రిక్స్, న్యూరాలజీ, ఎమర్జెన్సీ మెడిసిన్ వైద్యులతో సమీక్ష చేశారు. గత రెండు నెలలుగా జీజీహెచ్‌లో ఆయా వార్డుల్లో చనిపోయిన రోగుల మరణాలపై సమీక్ష నిర్వహించారు. తురకపాలెం మెలియోడోసిస్, ఇటీవల కొత్తగా వస్తున్న స్క్రబ్‌టైఫస్ మరణాలపై ప్రత్యేక సమీక్ష చేశారు. జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ చనిపోయిన వారి కేస్ షీట్‌లను 24 గంటల్లోగా మెడికల్ విభాగానికి అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి మంగళవారం మరణాలపై సమీక్ష నిర్వహించారని సమావేశంలో నిర్ణయించారు. సమావేశంలో జనరల్ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ ఉషారాణి, పీడియాట్రిక్స్ విభాగాధిపతి డాక్టర్ దేవకుమార్, న్యూరాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ బిందు నర్మద, ఎమర్జెన్సీ మెడిసిన్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రాధికారాణి, పలువురు వైద్యులు పాల్గొన్నారు.

14న అండర్-12 బాలుర క్రికెట్ జిల్లా జట్టు ఎంపిక

గుంటూరు వెస్ట్ (క్రీడలు): జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 14న గుంటూరు అరండల్‌పేటలోని గురవయ్య హైస్కూల్ క్రికెట్ మైదానంలో అండర్-12 బాలుర జిల్లా స్థాయి క్రికెట్ జట్టు ఎంపిక పోటీలు నిర్వహిస్తామని త్రీమెన్ కమిటీ సభ్యులు యు.మహతి శంకర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2013 సెప్టెంబర్ 1 తర్వాత 2015 ఆగస్ట్ 31 ముందు జన్మించిన వారై ఉండాలన్నారు. పాల్గొనే చిన్నారులు ఉదయం 7:30 గంటలకు రిపోర్ట్ చేయాలన్నారు. వయస్సు ధృవీకరణ పత్రంతోపాటు ఆధార్ జిరాక్స్, ఒరిజినల్ తీసుకురావాలన్నారు.

శేకూరులో మహిళకు స్క్రబ్ టైఫస్ లక్షణాలు

చేబ్రోలు: చేబ్రోలు మండలం శేకూరు గ్రామానికి చెందిన ఓ మహిళకు స్క్రబ్ టైఫస్ వ్యాధి లక్షణాలు కనిపించటం బుధవారం కలకలం రేపింది. శేకూరు గ్రామానికి చెందిన జి.సంధ్య కొద్ది రోజులుగా జ్వరంతో బాధపడుతూ వడ్లమూడి, అంగలకుదురు తదితర ప్రాంతాల్లో చికిత్స పొందింది. ప్రకాశం జిల్లా పాకాల ప్రాంతానికి చెందిన సంధ్య కుటుంబం కొద్ది కాలం క్రితం శేకూరు గ్రామంలోని తంగెళ్లమూడి వెళ్లే రహదారి ప్రాంతంలో ఇల్లు అద్దెకు తీసుకొని నివసిస్తున్నారు. ఐదు రోజులుగా జ్వరంతో బాధపడుతుండటంతో తెనాలి రూరల్ మండల పరిధిలోని అంగలకుదురులోని కుమార్తె ఇంటి వద్ద ఉండి స్థానికంగా వైద్య సేవలు తీసుకుంది. వడ్లమూడిలోని ప్రైవేటు వైద్యశాలలో చికిత్స తీసుకుంటున్న బాధితురాలు మెరుగైన వైద్య సేవల కోసం తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తీసుకువెళ్లారు. అక్కడ స్క్రబ్ టైఫస్ పరీక్షలు నిర్వహించారు. ప్రాథమిక లక్షణాల ఉండటంతో నిర్ధారణ పరీక్ష కోసం గుంటూరుకు పంపారు. రెండు రోజుల్లో వ్యాధి నిర్ధారణ ఫలితం వస్తుందని వైద్యులు తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

GOLD FINANCE

- బంగారం బ్యాంకులలో / ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) ఫోన్ : 81422 92071
- బంగారం కొనబడును. బ్యాంకులో ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకి తీసుకుంటాం. ✆ 88024 89999
- బంగారం కొనబడును. బ్యాంకులలో ఇతర ప్రైవేటుసంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకు కొనబడును ✆ 8790741166

WANTED

- Wanted Experienced Lady Tele callers in Education Consultancy in Lakshmipuram Guntur. Sal: 10 to 15K, Qualification: Degree, Cont: 9052975353
- ప్రముఖ సెక్యూరిటీ సంస్థ నందు గుంటూరులో పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. అర్హత: 10th, వయస్సు: 40సం॥లోపు, 12గం డ్యూటీ, జీతం 11k-13k నం॥ 9704060536
- APSRTC ఆవరణలో పనిచేయుటకు యువతి యువకులు కావలెను. అర్హత: 10th-డిగ్రీ, ఆకర్షణీయమైన జీతం ఇవ్వబడును. సంప్ర॥ 9705283264
- యడ్లపాడు వద్ద బోయపాలెంలో పని చేయుటకు సెక్యూరిటీ సూపర్‌వైజర్స్, గార్డ్స్ కావలెను. అర్హత: 10th-డిగ్రీ, 8గం॥-14000, 12గం॥-13500. 9502087373
- GNT నారాకోడూరులో ప్రముఖ కంపెనీ నందు సెక్యూరిటీ గార్డ్స్, ఆఫీసర్స్ కావలెను డ్యూ. 8గం, జీ: 10-14k. Q10th, వ20-50✆8520977729, 59
- 30 to 65 yrs బ్యాంకు అనుబంధ సంస్థలో జీతం + Inc 35 వేలు. టీం మేనేజర్స్, ఎగ్జిక్యూటివ్స్. Q: 10th -డిగ్రీ, రిటైర్డ్, బిజినెస్, ఇన్సూరెన్స్ ఏజెంట్స్, మ్యూచువల్ ఫండ్స్, మార్కెటింగ్ నో టార్గెట్. ✆ 90524 70111
- సెక్యూరిటీ సూపర్‌వైజర్స్ జీ: 15000 కోదాడ దగ్గర మేళ్ళచెరువులో కావలెను. 8 గం॥ డ్యూటీ, తక్కువ రేటుకు భోజనం, ఫ్రీ ఫ్యామిలీ రూం. ✆ 90143 51804, 86884 17132
- యాడ్ ఏజన్సీ నందు పనిచేయుటకు అకౌంటెంట్ Min 2 సం॥ అనుభవం కలిగిన (స్త్రీ) (M.S. Office, Excel & Word) కావలెను. (Salary 25,000) గ్రాఫిక్ డిజైనర్ Photoshop, Coreldraw లో 2 సం॥ అనుభవం కలిగిన వారు కావలెను. శాలరీ 30,000. లేజర్ యాడ్స్, అరండల్‌పేట, గుంటూరు. Cell: 77028 34555
- ప్రభుత్వ సంస్థలలో కాంట్రాక్ట్ & ఔట్‌సోర్సింగ్ జాబ్స్ అటెండర్స్, క్లర్క్, డేటా ఎంట్రీ, ఆఫీసు అసిస్టెంట్స్. Cell : 9703602687
- యూనిటీ హోంకేర్ హైదరాబాద్‌లో వృద్ధులను పేషెంట్లను పిల్లలను చూసుకొనుటకు ఇంటి/వంటపనికి వర్కర్స్/నర్సులు కావలెను. ఫోన్: 8121631212, 9640016901
- Hydలో పెద్దవారికి సేవ చేయుటకు బేబీకేర్, ఇంటి / వంట పనికి హెల్పర్స్, ఆయాలు, కేర్‌టేకర్స్ స్త్రీ / పు కా. జీ : 18,000 to 30,000/- రూం + మీల్స్ ఫ్రీ. Ph : 6300639598

సాక్షి క్లాసిఫైడ్స్
గుంటూరు ప్యాక్ రూ.475/- మాత్రమే (3 లైన్లు)
ప్రతి అదనపు లైను రూ.100/- మాత్రమే
ప్రతి 3 ప్రకటనలకు 2 ప్రకటనలు ఉచితం
ప్రతి ప్రకటనపై G.S.T. 5% అదనం
ఈ పేపర్‌లో ప్రకటనల కొరకు సంప్రదించండి
గుంటూరు
7075167663
7075167541

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని విశ్వసించి పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరుతున్నది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ దినపత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

పంజాబ్ నేషనల్ బ్యాంక్ / punjab national bank (భారత ప్రభుత్వరంగ సంస్థ)

అసెట్ రికవరీ మానిటరింగ్ బ్రాంచ్ డి నెం.9-13-45/2/9/1, 5వ అంతస్తు, ఎమ్‌వీఆర్ వినాయగర్ ట్రేడ్ సెంటర్, వీఐపీ రోడ్డు విశాఖపట్నం-530020. ఫోన్ : 96409 33383, 98312 00669

చరాస్తుల అమ్మకానికి వేలం అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్సు, 2002 లోని రూలు 6(2) తో చదువుకోవలసిన ప్రకారం సెక్యూరిటైజేషన్ & రీకనస్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్టు 2002 క్రింద చరాస్తుల అమ్మకానికి ఇ-వేలం ప్రకటన

సెక్యూర్డ్ క్రెడిటార్ అయిన పంజాబ్ నేషనల్ బ్యాంక్ వారికి దిగువ తెలిపిన ఋణగ్రహీతలు/హామీదారులు చెల్లించవలసిన బకాయి మొత్తంను రాబట్టుకొనుటకు బ్యాంక్/సెక్యూర్డ్ క్రెడిటార్ అధీకృత అధికారిచే భౌతికంగా స్వాధీనం చేసుకున్న, సెక్యూర్డ్ క్రెడిటార్‌కు హైపొథికేట్/తనఖాపెట్టిన/ఛార్జి చేసిన దిగువ వివరించిన చరాస్తిని "ఎక్కడ ఎలా ఉన్నది" "అక్కడ అలా" మరియు "అక్కడ ఏమున్నదో అది" అనే ప్రాతిపదికన దిగువ తెలిపిన పట్టికలోని తేదిలో విక్రయించబడునని ప్రజానీకానికి, ముఖ్యంగా దిగువ తెలిపిన ఋణగ్రహీతలు, హామీదారులకు తెలియజేయడమైనది. రిజర్వు ధర, జమ చేయవలసిన ధరావత్తు సొమ్ము వివరములు దిగువ పట్టికలో తెలియజేయడమైనది.

బ్రాంచ్ పేరు : ARMB విశాఖపట్నం

ఇ-వేలం తేది & సమయం: 30.12.2025, ఉ॥ 11.00 గం.ల నుండి సా॥ 4.00 గం.ల వరకు
ధరావత్తు సమర్పించుటకు ఆఖరి తేది: 30.12.2025, మ॥ 3.00 గం.ల వరకు

ఋణగ్రహీత పేరు & చిరునామా : మెస్సర్స్ డి డి & కంపెనీ (ఋణగ్రహీత) మరియు శ్రీ డి. దినేష్ (హామీదారు). కార్ లోన్ అకౌంట్ నెం.019500NG00007980 & చిరునామా : మెస్సర్స్ డి డి & కంపెనీ (ఋణగ్రహీత) మరియు శ్రీ డి. దినేష్ (హామీదారు), ఫ్లాట్ నెం.401, కొత్త 7, కమలేష్ గ్రాండ్, లక్ష్మీపురం, 4వ లేన్, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522007. మొత్తం బకాయి: తేది.31.03.2025 నాటికి బకాయి రూ.39,01,214.68/- (అక్షరాల ముప్పై తొమ్మిది లక్షల ఒక వెయ్యి రెండు వందల పద్నాలుగు రూపాయల అరవై ఎనిమిది పైసలు మాత్రమే) తదుపరి వడ్డీ మరియు ఛార్జీలతో కలిపి చెల్లించవలెను. స్వాధీనత యొక్క స్వభావం : భౌతికంగా స్వాధీనం. చరాస్తి వివరములు:

క్ర.సం.	రిజిస్ట్రేషన్ నెం.	రిజిస్ట్రేషన్ తేది	ఛాసిస్ నెం.	ఇంజన్ నెం	తయారు చేయబడిన సం॥	మోడల్
1	AP39EJ8899	26-03-2020	WDD2131226L0256000619	65692980048702	06/2019	MERCEDEZ BENZ E350D BS VI

రిజర్వు ధర : రూ.30.80 లక్షలు | ధరావత్తు : రూ.3.08 లక్షలు | బిడ్ పెంపుదల మొత్తం : రూ.0.10 లక్షలు

సెక్యూర్డ్ క్రెడిటార్ వారికి తెలిసినంత వరకు ఉన్న ఎన్‌కంబరెన్స్ వివరములు : బ్యాంక్ రికార్డ్స్ ప్రకారం ఏవిధమైన ఎన్‌కంబరెన్స్ లేవు

ఇ-వేలం నియమ నిబంధనలు : (1). సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్సు 2002 లోని నియమ & నిబంధనలను అనుసరించి దిగువ తదుపరి తెలిపిన నిబంధనలను అనుసరించి అమ్మకం జరుపబడును. (2). ఆస్తులను "ఎక్కడ ఎలా ఉన్నవి అక్కడ అలాగే పద్ధతి, అక్కడ ఏమున్నవో అదే పద్ధతిపై" విక్రయించబడతాయి. (3). అధీకృత అధికారి గారి వద్దగల పైన తెలిపిన షెడ్యూలులోని సెక్యూర్డ్ ఆస్తికి సంబంధించిన ఉత్తమ వివరముల మేరకు తెలుపబడినవి. కాని సదరు వివరములలోని తప్పులకు, తప్పుడు వివరములకు, వదిలివేయబడుటలకు అధీకృత అధికారి గారి సమాధానం తెలుపవలసిన అవసరం లేదు. (4). అమ్మకం ఇ-వేలం పోర్టల్ https://BAANKNET.COM ద్వారా ఆన్‌లైన్‌లో దిగువ సంతకందారు తేది. 30.12.2025 న ఉదయం 11.00 గం॥ల నుండి సా॥ 4.00 గం॥ల వరకు నిర్వహించబడును. 5. అమ్మకం యొక్క పూర్తి వివరములతో నియమ నిబంధనల కొరకు దయచేసి https://BAANKNET.COM & www.pnbindia.in వెబ్ సైటులు చూడవలెను.

తేది: 09.12.2025, ప్రదేశం : విశాఖపట్నం — సం/- అధీకృత అధికారి, పంజాబ్ నేషనల్ బ్యాంక్

కెనరా బ్యాంక్ Canara Bank (భారత ప్రభుత్వరంగ సంస్థ) A Government of India Undertaking | సిండికేట్ Syndicate

ఎ ఆర్ ఎమ్ బ్రాంచ్, సర్కిల్ ఆఫీసు, డి.నెం. 54-15-4బి, క్రింది అంతస్తు, లక్ష్మి అవెన్యూ, శ్రీనివాసనగర్ బ్యాంక్ కాలనీ, రింగ్ రోడ్డు, విజయవాడ ఏపి-520008, ఫోన్: 8331011695, ఇ-మెయిల్: armvij@canarabank.com

స్థిరాస్తుల అమ్మకానికి వేలం అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్సు, 2002 లోని 8(6) నిబంధనలతో చదవబడు సెక్యూరిటైజేషన్ & రీకనస్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్టు, 2002 క్రింద స్థిరాస్తులు అమ్మకానికి ఇ-వేలం అమ్మకం ప్రకటన. కెనరా బ్యాంక్ ఎ.ఆర్.ఎం బ్రాంచ్ విజయవాడ వారికి దిగువ తెలిపిన ఋణగ్రహీత(లు)/హామీదారు(లు) చెల్లించవలసిన క్రింద పేర్కొన్న బకాయి మొత్తంను రాబట్టుకొనుటకు కెనరా బ్యాంక్ సంబంధిత బ్రాంచ్‌ల అధీకృత అధికారిచే నిర్మాణాత్మక/భౌతికంగా స్వాధీనం చేసుకున్న, సెక్యూర్డ్ క్రెడిటార్‌కు తనఖాపెట్టిన/ఛార్జి చేసిన దిగువ వివరించిన స్థిరాస్తులను తేది 29.12.2025 న "ఎక్కడ ఎలా ఉన్నది" "అక్కడ అలా" మరియు "అక్కడ ఏమున్నదో అది" అనే ప్రాతిపదికన విక్రయించబడునని యావన్మంది ప్రజానీకానికి మరియు ముఖ్యంగా దిగువ తెలిపిన ఋణగ్రహీతలు మరియు హామీదారులకు తెలియజేయడమైనది. బ్యాంకు వారి పరిజ్ఞానం మేరకు తాకట్టు ఋణభారాలు లేని స్థిరాస్తుల వివరములు.

ఇ-వేలం తేది & సమయం: 29.12.2025, మ॥ 02.00 గం.ల నుండి సా॥4.00 గం.ల వరకు (అమ్మకం ముగిసేవరకు ప్రతి 5 నిమిషముల వ్యవధిలో అపరిమిత పొడిగింపుతో)
ధరావత్తు సమర్పించుటకు ఆఖరి తేది: 29.12.2025, మ॥ 12.00 గం॥ల లోపు

రిజర్వు ధరలో 10% ధరావత్తు సొమ్మును M/s. పిఎస్‌బి అలియన్స్ ప్రైవేట్ లిమిటెడ్ (baanknet) పోర్టల్ యొక్క ఇ-వ్యాలెట్‌లో నేరుగా గాని లేదా ఆ పోర్టల్‌లో చలానా జెనరేట్ చేసుకొని చలాన్‌లోని ఖాతా వివరములకు ధరావత్తును RTGS/NEFT ద్వారా తేది: 29.12.2025, మ॥ 12.00 గం.ల లోపుగా పొందుపరిచి జమచేయాలి.

వ.నెం	ఋణగ్రహీత / హామీదారులు & బ్రాంచ్ వివరములు (అన్ని ఖాతాలు ఎ.ఆర్.ఎం బ్రాంచ్ విజయవాడకు బదిలీ చేయడమైనవి)	తనఖాలో ఉన్న ఆస్తి వివరములు	రిజర్వు ధర (రూ.లో)	ఇ.ఎం.డి (రిజర్వు ధరలో 10%)
1	చంద్రమౌళీనగర్ బ్రాంచ్, గుంటూరు. మెస్సర్స్ సూర్య బాలాజీ కాటన్ ట్రేడర్స్, పార్ట్‌నర్లు: శ్రీ జి కోటేశ్వరరావు మరియు శ్రీ జి వెంకటేశ్వర్లు మరియు మెస్సర్స్ శేషసాయి ట్రేడర్స్ ప్రొప్రయిటర్: శ్రీ జి కోటేశ్వరరావు. తేది 09.12.2025 నాటికి బకాయి మొత్తం: రూ. 25,31,09,852.82 + వడ్డీ + ఇతర ఖర్చులు	గుంటూరు జిల్లా, నరసరావుపేట రెవెన్యూ డిస్ట్రిక్ట్, సత్తెనపల్లి సబ్-డిస్ట్రిక్ట్ & మున్సిపాలిటీ, వార్డు నెం.5, క్రొత్త డోర్ నెం. 20-03-64, రిజిస్టర్డ్ సేల్ డీడ్ డాక్యుమెంట్ నెం. 4212/1996 తేది 19.12.1996 ప్రకారం శ్రీమతి గుడిపూడి రమాదేవి, భర్త: ఆంజనేయులు పేరున గల 125 చ॥గ॥ల స్థలంతో ఒక్కో అంతస్తుకు 880 చ॥అ॥లు కలిగిన ఆర్‌సిసి రూఫ్ గ్రౌండ్ & ఫస్ట్ ఫ్లోర్ రెసిడెన్షియల్ బిల్డింగ్ యావత్తు. హద్దులు డీడ్ ప్రకారం.	రూ. 36.00 లక్షలు	రూ. 3.60 లక్షలు
2	చంద్రమౌళీనగర్ బ్రాంచ్, గుంటూరు. మెస్సర్స్ శ్రీ సాయి దివ్య కాటన్స్ ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రొప్రయిటర్ శ్రీ కె.శ్రీనివాసులు. తేది 05.12.2025 నాటికి బకాయి మొత్తం: రూ. 6,44,51,325.72/- + వడ్డీ + ఇతర ఖర్చులు	గుంటూరు జిల్లా, నరసరావుపేట రిజిస్ట్రేషన్ డిస్ట్రిక్ట్, చిలకలూరిపేట సబ్-డిస్ట్రిక్ట్, చిలకలూరిపేట మున్సిపల్ ఏరియా, పురుషోత్తపట్నం గ్రామం, డి.నెం. 362/1ఎ, డాక్యుమెంట్ నెం.179/2013, తేది.11.01.2013 ప్రకారం శ్రీ కె శ్రీనివాసులుకి చెందిన 968.00 చ॥గ॥లు ఖాళీ స్థలం. హద్దులు డీడ్ ప్రకారం.	రూ. 22.74 లక్షలు	రూ. 2.274 లక్షలు

* బ్యాంకుకు తెలిసిన/తెలియని బకాయిలు/టాక్స్‌లు ఏవైనా ఉన్నచో అవి వేలం కొనుగోలుదారే భరించాలి మరియు తుది బిడ్ మొత్తంతోపాటు అవి కూడా చెల్లించవలసి ఉంటుంది

ఆస్తి తనిఖీ తేది & సమయం: 24.12.2025, ఉ॥ 11.00 గం॥ల నుండి సా॥4.00 గం॥ల వరకు.
అమ్మకానికి సంబంధించిన సవివరమైన నియమ నిబంధనలకు కెనరా బ్యాంక్ వెబ్‌సైట్ www.canarabank.com లో ఏర్పాటు చేసిన "ఇ-వేలం" లింక్‌ను రిఫర్ చేయండి లేదా కెనరా బ్యాంక్ ఎ.ఆర్.ఎం బ్రాంచ్, విజయవాడ అధీకృత అధికారి గారిని ఆఫీసు పనివేళలలో సంప్రదించగలరు. ఫోన్: 8331011695
బిడ్డర్లు తమ ఆఫర్‌లను, ఆస్తి రిజర్వు ధర 25 లక్షల వరకు ఉన్నవాటికి రూ. 10,000/- గుణింపులో హెచ్చించవలెను. రిజర్వు ధర 25 లక్షల నుండి 50 లక్షల వరకు ఉన్నవాటికి రూ. 25,000/- గుణింపులో హెచ్చించవలెను రిజర్వు ధర 50 లక్షల నుండి 100 లక్షల వరకు ఉన్నవాటికి రూ. 50,000/-గుణింపులో హెచ్చించవలెను మరియు రిజర్వు ధర 100 లక్షల కన్నా ఎక్కువ ఉన్నట్లయితే రూ. 1,00,000/- గుణింపులో హెచ్చించవలెను. 'ఆన్‌లైన్' వేలం ముగిసేలోపు అత్యధిక బిడ్ (రిజర్వు ధర కన్నా ఎక్కువ) సమర్పించిన బిడ్డర్ విజయవంతమైన బిడ్డర్‌గా ప్రకటించబడతారు.
ఇ-వేలం విధానం, నియమ నిబంధనల కొరకు సర్వీసు ప్రొవైడర్‌ను సంప్రదించండి: మెస్సర్స్ పిఎస్‌బి అలయన్స్(baanknet), వెబ్‌పోర్టల్ https://baanknet.com/eauction-psb హెల్ప్‌డెస్క్: 7046612345/6354910172/8291220220/9892219848 / 8160205051, ఇ-మెయిల్: support.baanknet@psballiance.com

తేది: 10.12.2025, ప్రదేశం: విజయవాడ — సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

kotak కొటక్ మహీంద్రా బ్యాంక్ లిమిటెడ్ — **డిమాండ్ నోటీసు**

నమోదిత కార్యాలయం : 27 BKC, C 27, G బ్లాక్, బాంద్రా కుర్లా కాంప్లెక్స్, బాంద్రా (E), ముంబయి-400051.
శాఖ కార్యాలయం: # 6-3-1109/1, 2వ అంతస్తు, నవభారత్ ఛాంబర్స్, రాజ్‌భవన్ రోడ్, సోమాజిగూడ, హైదరాబాద్ -500082

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 లోని సెక్షన్ 13(2) క్రింద చట్టబద్ధమైన నోటీసు

బ్యాంకింగ్ రెగ్యులేషన్ యాక్ట్, 1949 మీనింగ్ పరిధిలోని బ్యాంకింగ్ కంపెనీ అయిన కొటక్ మహీంద్రా బ్యాంక్ లిమిటెడ్ తమ నమోదిత కార్యాలయం: 27 BKC, C27, G బ్లాక్, బాంద్రా కుర్లా కాంప్లెక్స్, బాంద్రా (E), ముంబయి-400051 మరియు శాఖ కార్యాలయం మరియు ప్రాంతీయ కార్యాలయం : # 6-3-1109/1, 2వ అంతస్తు, నవభారత్ ఛాంబర్స్, రాజ్‌భవన్ రోడ్, సోమాజిగూడ, హైదరాబాద్ -500082 (ఇకమీదట "ది బ్యాంక్/KMBL"గా నిర్దేశించబడును) యొక్క అధీకృత అధికారియైన దిగువ సంతకందారు, సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద నియమించబడి, దిగువ తెలిపిన నోటీసును మీకు ఇందుమూలంగా జారీచేస్తున్నారు:- సదరు చట్టంలోని సెక్షన్ 13(2) మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రూల్స్, 2002లోని రూల్ 3 ప్రకారం ఈ నోటీసు జారీచేయబడినది.

ఖాతాదారు (రుణగ్రహీత(లు)/సహ-రుణగ్రహీత(లు) మరియు గ్యారంటార్(లు)) పేరు, లోన్ అకౌంట్ నంబర్లతో	డిమాండ్ నోటీసు ప్రకారం బకాయి మొత్తం	తనఖాపెట్టిన ఆస్తి వివరణ:
లోన్ అకౌంట్ నం. LAP18438595, CRN No. 12091807, 1. శ్రీ దేగల వెంకట సుధాకర్ తండ్రి దేగల యతిరాజులు, ఇం.నం.8-3-1111-2, కేశవ నగర్, శ్రీనగర్ కాలనీ, పంజాగుట్ట, హైదరాబాద్-500073, తెలంగాణ-ఇండియా, మరియు శ్రీ దేగల వెంకట సుధాకర్, C/o లక్ష్మీ ఆయిల్ ఫిల్లింగ్స్, 164సి 165బి 167ఎ, నల్లపాడు రోడ్, గుంటూరు-522003, ఆంధ్రప్రదేశ్-ఇండియా, మరియు శ్రీ దేగల వెంకట సుధాకర్ C/o. మెడినోవ డయాగ్నోస్టిక్స్, ఎర్రగడ్డ బ్రాంచ్ గ్రౌండ్ ఫ్లోర్, భావు ఎన్‌క్లేవ్, ఇ ఎన్ టి హాస్పిటల్ ప్రక్కన, హైదరాబాద్-500038, తెలంగాణ-ఇండియా, మరియు శ్రీ దేగల వెంకట సుధాకర్ తండ్రి దేగల యతిరాజులు, విల్లా నం.33, పామ్ బ్రీజ్ గేటెడ్ కమ్యూనిటీ, సర్వే నం.లు 17, 19, 20, 21 మరియు 22, పంజేషా జమాల్ బౌలి, మణికొండ జాగీర్ గ్రామం, రాజేంద్రనగర్ మండలం, హైదరాబాద్-500088, మరియు శ్రీ దేగల వెంకట సుధాకర్ తండ్రి దేగల యతిరాజులు, ఫ్లాట్ నం.102-డి, మొదటి అంతస్తు, శ్రీ బాలాజీ గుల్‌మొహర్ టౌన్ షిప్, బ్లాక్ డి, బాచుపల్లి గ్రామం, కుత్బుల్లాపూర్ మండలం, హైదరాబాద్-500118 మరియు శ్రీ దేగల వెంకట సుధాకర్ తండ్రి దేగల యతిరాజులు, ఫ్లాట్ నం.604-ఎ, 6వ అంతస్తు, శ్రీ బాలాజీ గుల్‌మొహర్ టౌన్‌షిప్, బ్లాక్ డి, బాచుపల్లి గ్రామం, కుత్బుల్లాపూర్ మండలం, హైదరాబాద్-500118 మరియు శ్రీ దేగల వెంకట సుధాకర్ తండ్రి దేగల యతిరాజులు, డోర్ నం.2-14-107, అస్సెన్‌మెంట్ నం.1578/డి-01, ప్లాట్ నం.72 సంతోషి మాత టెంపుల్ ఎదుటి లేన్, శ్యామల నగర్, 3వ లైన్, డి.నం.229/బి, నల్లపాడు గ్రామం, గుంటూరు-522006 మరియు శ్రీ దేగల వెంకట సుధాకర్ తండ్రి దేగల యతిరాజులు, డోర్ నం.25-2-47, అస్సెన్‌మెంట్ నం. 35560/డివన్, బ్లాక్ నం.20, టి.ఎస్ నం.745, కొత్త వార్డు నం.22, మున్సిపల్ పాత వార్డు నం.17, అడప వారి వీధి, అగ్రహారం, రామచంద్రాపురం గుంటూరు జిల్లా - 522003 (రుణగ్రహీత), 2. శ్రీమతి నళిని రాణి గల్లా భర్త డి.వి.సుధాకర్, డి.నం.8-3-228, ప్లాట్ నం.241, కళ్యాణ్ నగర్, వెంగళరావు నగర్, హైదరాబాద్-500060, తెలంగాణ-ఇండియా మరియు శ్రీమతి నళిని రాణి గల్లా భర్త డి.వి.సుధాకర్, ఇం.నం.8-3-1111-2, కేశవ్ నగర్, శ్రీనగర్ కాలనీ, పంజాగుట్ట, హైదరాబాద్-500073, తెలంగాణ-ఇండియా, మరియు శ్రీమతి నళిని రాణి గల్లా, C/o లక్ష్మీ కన్‌స్ట్రక్షన్స్, గ్రౌండ్ ఫ్లోర్, G-10, భాను ఎన్‌క్లేవ్, ఇ ఎన్ టి హాస్పిటల్ ప్రక్కన, ఎర్రగడ్డ, హైదరాబాద్-500038, తెలంగాణ-ఇండియా, మరియు శ్రీమతి నళిని రాణి గల్లా భర్త డి.వి.సుధాకర్, విల్లా నం.33, పామ్ బ్రీజ్ గేటెడ్ కమ్యూనిటీ, సర్వే నం.లు 17, 19, 20, 21 మరియు 22, పంజేషా జమాల్ బౌలి, మణికొండ జాగీర్ గ్రామం, రాజేంద్రనగర్ మండలం, హైదరాబాద్-500088, మరియు శ్రీమతి నళిని రాణి గల్లా భర్త డి.వి.సుధాకర్, ఫ్లాట్ నం.102-డి, మొదటి అంతస్తు, శ్రీ బాలాజీ గుల్‌మొహర్ టౌన్‌షిప్, బ్లాక్ డి, బాచుపల్లి గ్రామం, కుత్బుల్లాపూర్ మండలం, హైదరాబాద్-500118 మరియు శ్రీమతి నళిని రాణి గల్లా భర్త డి.వి.సుధాకర్, ఫ్లాట్ నం.604-ఎ, 6వ అంతస్తు, శ్రీ బాలాజీ గుల్‌మొహర్ టౌన్‌షిప్, బ్లాక్ డి, బాచుపల్లి గ్రామం, కుత్బుల్లాపూర్ మండలం, హైదరాబాద్-500118 మరియు శ్రీమతి నళిని రాణి గల్లా భర్త డి.వి.సుధాకర్, డోర్ నం.2-14-107, అస్సెన్‌మెంట్ నం.1578/డి-01, ప్లాట్ నం.72 సంతోషి మాత టెంపుల్ ఎదుటి లేన్, శ్యామల నగర్, 3వ లైన్, డి.నం.229/బి, నల్లపాడు గ్రామం, గుంటూరు-522006 మరియు శ్రీమతి నళిని రాణి గల్లా భర్త డి.వి.సుధాకర్, డోర్ నం.25-2-47, అస్సెన్‌మెంట్ నం. 35560/డివన్, బ్లాక్ నం.20, టి.ఎస్ నం.745, కొత్త వార్డు నం.22, మున్సిపల్ పాత వార్డు నం.17, అడప వారి వీధి, అగ్రహారం, రామచంద్రాపురం గుంటూరు జిల్లా - 522003 (సహ-రుణగ్రహీత), 3. యశస్వి దేగల తండ్రి దేగల వెంకట సుధాకర్, ఇం.నం.8-3-1111-2, కేశవ్ నగర్, శ్రీనగర్ కాలనీ, పంజాగుట్ట, హైదరాబాద్-500073, తెలంగాణ-ఇండియా, మరియు యశస్వి దేగల తండ్రి దేగల వెంకట సుధాకర్, విల్లా నం.33, పామ్ బ్రీజ్ గేటెడ్ కమ్యూనిటీ, సర్వే నం.లు 17, 19, 20, 21 మరియు 22, పంజేషా జమాల్ [illegible]	డిమాండ్ నోటీసు తేది: 19 నవంబరు, 2025 NPA తేది: 08 నవంబరు, 2025 పూర్తి బకాయి మొత్తం: 19 నవంబరు, 2025 నాటికి రూ.5,91,08,379.37/- (ఐదు కోట్ల తొంభై ఒక్కలక్షల ఎనిమిది వేల మూడు వందల డెబ్బై తొమ్మిది రూపాయల [illegible])	తనఖా పెట్టిన ఆస్తి-1 వివరణ: సేల్‌డీడ్ నం. 62/2018, తేది: 04-01-2018 క్రింద కవర్ అయిన ఆస్తి షెడ్యూల్: రంగారెడ్డి, రాజేంద్రనగర్ మండలం, మణికొండ జాగీర్ గ్రామంలో సర్వే నం.లు 25/2, 33/E & 131 మరియు మణికొండ జాగీర్ గ్రామం, పంజేషా జమాల్ బౌలిలో సర్వే నం.లు 17, 19, 20, 21 & 22లోని పామ్ బ్రీజ్ గేటెడ్ కమ్యూనిటీలో గల 4500 చ.అడుగుల సేలబుల్ ఏరియాతో స్టెయిర్‌కేస్ మరియు పెంట్‌రూమ్‌తో గ్రౌండ్ ప్లస్ ఒక అప్పర్ ఫ్లోర్ కలిగిన 406 చదరపు గజాల విస్తీర్ణం, విల్లా నం. 33 యావత్తు. సరిహద్దులు: భూమి సరిహద్దులు: ఉత్తరం: మణికొండ జాగీర్ గ్రామం, సర్వే నం.33/పార్ట్, మణికొండ జాగీర్ గ్రామం (హనుమాన్ నగర్ లేఅవుట్)లోని సర్వే నం.26, 27 మరియు మణికొండ జాగీర్ గ్రామం, పంజేషా జమాల్ బౌలిలోని సర్వే నం.22, దక్షిణం: మణికొండ జాగీర్ గ్రామం, పంజేషా జమాల్ బౌలిలోని సర్వే నం.18 మరియు కమ్యూనిటీ హాల్ మరియు సర్వే నం.132, తూర్పు: మణికొండ జాగీర్ గ్రామంలోని సర్వే నంబర్లు 130 మరియు 132, పశ్చిమం: 20-0 వెడల్పు రోడ్డు. విల్లా సరిహద్దులు: ఉత్తరం: విల్లా నం.34, దక్షిణం: 30-0 వెడల్పు రోడ్డు, తూర్పు: విల్లా నం.48, పశ్చిమం: 30-0 వెడల్పు రోడ్డు. తనఖాపెట్టిన ఆస్తి-2 వివరణ: సేల్ డీడ్ నం.11388/2017, తేది: 09-09-2017 క్రింద ఆస్తి షెడ్యూల్: రంగారెడ్డి జిల్లా, కుత్బుల్లాపూర్ మండలం, బాచుపల్లి గ్రామం వద్ద బ్లాక్ డిలో 'శ్రీ బాలాజీ గుల్‌మొహర్ టౌన్‌షిప్' లో సర్వే నంబర్లు 307 పార్ట్, 307/A/A, 307/A/C, 307/A/E, 307/A/FGH పార్ట్, 307/A/L/M పార్ట్‌లో 50 చ.గజాల అవిభాజ్య వాటా భూమి విస్తీర్ణం (ఎ.3-31 గుంటలలో)తో పాటు 1760 చదరపు అడుగుల బిల్టప్ ఏరియాతో (కామన్ ఏరియాలు, సదుపాయాలు, సింగిల్ కార్ పార్కింగ్‌తో సహా) ఆమోదిత ప్లాన్ ప్రకారం (గ్రౌండ్ ఫ్లోర్‌పై ఫ్లాట్ నం.02-G గా పేరు గల & నామన్‌క్లేచర్ & బ్రోచర్ ప్రకారం మొదటి అంతస్తు పై సెమీ-ఫినిష్డ్ ఫ్లాట్ నం.102-డి మొత్తం. సరిహద్దులు: భూమి సరిహద్దులు: ఉత్తరం: రోడ్డు, దక్షిణం: సర్వే నం. 307 పార్ట్, తూర్పు: సర్వే నం.307 పార్ట్ మరియు 306, పశ్చిమం: రోడ్ మరియు సర్వే నం.352, ఫ్లాట్ నం.102-డి సరిహద్దులు: ఉత్తరం: కారిడార్, దక్షిణం: ఖాళీ, తూర్పు: ఖాళీ, పశ్చిమం: ఖాళీ. తనఖాపెట్టిన ఆస్తి-3 వివరణ: సేల్ డీడ్ నం.11389/2017, తేది: 04-08-2017 క్రింద ఆస్తి షెడ్యూల్: రంగారెడ్డి జిల్లా, కుత్బుల్లాపూర్ మండలం, బాచుపల్లి గ్రామం వద్ద బ్లాక్ ఎలో 'శ్రీ బాలాజీ గుల్‌మొహర్ టౌన్‌షిప్' లో సర్వే నంబర్లు 307 పార్ట్, 307/A/A, 307/A/C, 307/A/E, 307/A/FGH పార్ట్, 307/A/L/M పార్ట్‌లో 50 చ.గజాల అవిభాజ్య వాటా భూమి విస్తీర్ణం (ఎ.3-31 గుంటలలో)తో పాటు A బ్లాక్‌లో 2046 చదరపు అడుగుల బిల్టప్ ఏరియాతో (కామన్ ఏరియాలు, సదుపాయాలు, సింగిల్ కార్ పార్కింగ్‌తో సహా) ఆమోదిత ప్లాన్ ప్రకారం 5వ అంతస్తుపై ఫ్లాట్ నం.504-A గా పేరుగల & నామన్‌క్లేచర్ & బ్రోచర్ ప్రకారం 6వ అంతస్తుపై సెమీ-ఫినిష్డ్ ఫ్లాట్ నం.604-A మొత్తం. సరిహద్దులు: భూమి సరిహద్దులు: ఉత్తరం: రోడ్డు, దక్షిణం: సర్వే నం. 307 పార్ట్, తూర్పు: సర్వే నం.307 పార్ట్ మరియు 306, పశ్చిమం: రోడ్ మరియు సర్వే నం.352, ఫ్లాట్ నం.604-A సరిహద్దులు : ఉత్తరం: ఖాళీ, దక్షిణం: ఖాళీ, తూర్పు: కారిడార్, పశ్చిమం: ఖాళీ. తనఖాపెట్టిన ఆస్తి-4 వివరణ: పార్టిషన్ డీడ్ నం.2852/2001, తేది: 27-03-2001 క్రింద కవర్ అయిన ఆస్తి షెడ్యూల్: గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్, నల్లపాడు గ్రామం, డి.నం. 229/B, నం.44/71 కలిగిన లేఅవుట్ ప్లాన్ ప్రకారం ప్లాట్ నం.72 కలిగిన ప్రస్తుత అస్సెన్‌మెంట్ నం. 1578/D-01 తో డోర్ నం.2-14-107 కలిగిన ప్రస్తుతంగల అన్ని నిర్మాణాలతో నివాస భవనంలోని RCC రూఫ్ గ్రౌండ్ మరియు మొదటి అంతస్తుతో పాటు 487 చ.గజాలు లేదా 409.13 చ.మీటర్ల విస్తీర్ణం గల స్థలం యావత్తు. సరిహద్దులు: తూర్పు: 40 అ.వెడల్పు మున్సిపల్ రోడ్డు, 51 అ., పశ్చిమం: దక్షిణామూర్తికి చెందిన నం.51, కలిగిన ప్లాట్, 51 అ, ఉత్తరం: 40 అ.వెడల్పు మున్సిపల్ రోడ్, 86 అ., దక్షిణం: నం.71 కలిగిన ప్లాట్, 86 అ. [illegible]

ప్రదేశం: హైదరాబాద్, తేది: 11.12.2025 — సం/- అధీకృత అధికారి, కొటక్ మహీంద్రా బ్యాంక్ లిమిటెడ్

క్లుప్తంగా

స్క్రబ్ టైఫస్ వ్యాధిపై అవగాహన అవసరం

దుగ్గిరాల: స్క్రబ్ టైఫస్ వ్యాధి పట్ల ప్రజలు అవగాహన కలిగి ఉండాలని పీహెచ్‌సీ డాక్టర్ ఇజాజ్ అబ్దుల్ రెహమాన్ తెలిపారు. దుగ్గిరాల పీహెచ్‌సీలో బుధవారం స్క్రబ్ టైఫస్ వ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. తీవ్ర తలనొప్పి, తీవ్ర ఒళ్లు నొప్పులు, జ్వరం, శరీరంపై దద్దుర్లు వంటి లక్షణాలు కనిపిస్తాయన్నారు. ఈ లక్షణాలు ఉన్న వారు వెంటనే ఆరోగ్య కార్యకర్తలను లేదా ఆసుపత్రిని సకాలంలో సంప్రదించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సునీత, ఆరోగ్య పర్యవేక్షకురాలు భాగ్య లలితకుమారి, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

మానవ హక్కుల పరిరక్షణ ప్రభుత్వ బాధ్యత

మంగళగిరి టౌన్: మానవ హక్కుల పరిరక్షణ ప్రభుత్వాల బాధ్యత అని నేషనల్ హ్యూమన్ రైట్స్ ఆంధ్రప్రదేశ్ జాయింట్ సెక్రటరీ సాయిచంద్ అన్నారు. అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం ఆయన కార్యాలయంలో మాట్లాడారు. మానవ హక్కులు ప్రజాస్వామ్య సమాజానికి పునాదివంటివని పేర్కొన్నారు. పౌరులు తమ హక్కులను అనుభవిస్తూనే ఇతర హక్కులను గౌరవించాలని సూచించారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలి

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధి కొత్తూరు(ప్యారీకంపెనీ) ప్రాంతంలో పూరిల్లు దగ్ధమై సర్వం కోల్పోయిన బాధిత కుటుంబాన్ని వెంటనే ఆదుకోవాలని సీపీఐ తాడేపల్లి ప్రాంత సహాయ కార్యదర్శి తుడిమెల్ల వెంకటయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నాయకులతో కలిసి ఆయన బాధిత కుటుంబాన్ని బుధవారం పరామర్శించారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా కత్తి మైనర్‌బాబు నివాసం ఉంటున్న పూరిల్లు పూర్తిగా దగ్ధమైందని.. బాధిత కుటుంబానికి భరోసా కల్పించాలని అన్నారు. సీపీఐ సీనియర్ నాయకులు మునగాల రామారావు పాల్గొన్నారు.

అంకిత భావంతో పనిచేస్తే ఉన్నత శిఖరాలు

ఫిరంగిపురం: అంకిత భావంతో పనిచేస్తే ఉన్నత శిఖరాలు సాధించవచ్చని ఎంఈవోలు షేక్.మహబూబ్‌సుభాని, రవికాంత్‌లు అన్నారు. ఈనెల 7న నిర్వహించిన జిల్లా ఎస్టీయూ 79వ కౌన్సిల్ సమావేశంలో మండలానికి చెందిన రాష్ట్ర కౌన్సిలర్‌గా పి.త్యాగరాజు, జిల్లా ఉపాధ్యక్షుడిగా వి.శౌరి, పీఎస్‌హెచ్‌ఎం జిల్లా కార్యదర్శిగా ఏవీరాజులు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని విద్యాశాఖ కార్యాలయంలో బుధవారం అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఎన్నికైన ఉపాధ్యాయులను సన్మానించారు. ఎస్టీయూ మండల అధ్యక్షుడు పాలడుగు ప్రసాద్, కార్యదర్శి సుందరరావు, ఆర్థిక కార్యదర్శి ఎం.శ్రీను, ఉపాధ్యాయులు సుందర్ రావు, అనిల్, సాంబశివరావు, బాలు, అంకమ్మ రావు, శ్రీరాం కుమార్, యూటీఎఫ్ నాయకులు శ్రీనివాస కార్తిక్, శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

వడ్డమానులో మంత్రి నారాయణ పర్యటన

తాడికొండ: రెండో విడత భూసమీకరణలో భాగంగా ఏపీ పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ తుళ్లూరు మండలం వడ్డమాను గ్రామంలో బుధవారం పర్యటించారు. స్థానిక ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్, సీఆర్డీయే అడిషనల్ కమిషనర్ ఎ.భార్గవ్ తేజతో కలిసి రైతులతో ఆయన సమావేశం ఏర్పాటు చేసి అభిప్రాయాలు సేకరించారు. ఆయనకు పలువురు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేశారు. గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు పూర్ణచంద్రరావు మాట్లాడుతూ.. మేము భూములిస్తే ఎన్ని రోజుల్లో మాకు అభివృద్ధి చేసి రిటర్నబుల్ ప్లాట్లు ఇస్తారని ప్రశ్నించారు. మూడేళ్లలో అభివృద్ధి చేసి ఇస్తానని మంత్రి తెలుపగా సమయానికి మాకు ఇవ్వకపోతే ఏడాదికి రూ.5 లక్షలు రైతులకు చెల్లించేలా బాండ్ ఇవ్వాలని కోరారు. సీఎంతో మాట్లాడి చెబుతామని మంత్రి పేర్కొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

ఫిరంగిపురం: మండలంలోని నుదురుపాడు, కండ్రిక, బేతపూడి, గుండాలపాడు, యర్రగుంట్లపాడు, పొనుగుపాడు, మునగపాడు, మేరికపూడి గ్రామాలకు గురువారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆ శాఖ ఏఈ దుర్గాప్రసాద్ బుధవారం తెలిపారు. విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని.. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

ప్రైవేటుపై పోరు.. ఉద్యమ హోరు

సంతకాల ప్రతుల వాహనాన్ని జెండా ఊపి ప్రారంభిస్తున్న మురుగుడు, వేమారెడ్డి

తాడికొండలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వనమా బాల వజ్రబాబు

- స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన విద్యార్థులు, ప్రజలు
- కోటి సంతకాల సేకరణకు విశేష స్పందన

మంగళగిరి టౌన్: కోటి సంతకాలతో చంద్రబాబు సర్కార్ ఆలోచన మారాలని ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, వైఎస్సార్ సీపీ మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డిలు పేర్కొన్నారు. మంగళగిరి మండల పరిధి ఆత్మకూరు నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో బుధవారం మంగళగిరి నియోజకవర్గ వ్యాప్తంగా సేకరించిన సంతకాల ప్రతులను గుంటూరు జిల్లా పార్టీ కార్యాలయానికి ప్రత్యేక వాహనంలో తరలించారు. నియోజకవర్గ పార్టీ కార్యాలయం నుంచి బైపాస్ తెనాలి ఫ్లై ఓవర్ వరకు సుమారు 500 మందికి పైగా నాయకులు, కార్యకర్తలు ర్యాలీగా వెళ్లారు. ముందుగా సంతకాల పత్రాలు భద్రపరిచిన బాక్సులను వాహనంలో ఎక్కించి పార్టీ జెండా ఊపి గుంటూరు బయలు దేరారు. ఈ సందర్భంగా మురుగుడు, వేమారెడ్డిలు మాట్లాడుతూ.. నియోజకవర్గంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం పూర్తయిందని, విజయవంతం చేసిన నాయకులు, కార్యకర్తలను అభినందిస్తున్నామని అన్నారు.

మంగళగిరి నియోజకవర్గంలో 66 వేల సంతకాలు..

మంగళగిరి నియోజకవర్గంలో 66,380 మంది మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ సంతకాలు చేయడం చూస్తుంటే చంద్రబాబు ప్రభుత్వంపై ప్రజా వ్యతిరేకత ఎలా ఉందో అర్థమవుతోందని మురుగుడు, వేమారెడ్డి పేర్కొన్నారు. చంద్రబాబు ప్రభుత్వ నిరంకుశ పీపీపీ విధానానికి ప్రజలు పెట్టిన ప్రతీ సంతకం ప్రజా ఉద్యమ గళంగా నిలబడుతుందన్నారు. ఈనెల 15వ తేదీన జిల్లాస్థాయిలో జరిగే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బుర్రముక్కు వేణుగోపాల సోమిరెడ్డి, తాడిబోయిన శివగోపయ్య, నాళి వెంకట కృష్ణయ్య, షేక్ మహబూ, ఈదులమూడి డేవిడ్ రాజు, రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మండల, పట్టణ, గ్రామ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు. సంతకాల సేకరణ కార్యక్రమంలో నియోజకవర్గంలో ఆత్మకూరు గ్రామం ముందు నిలిచినట్లు నాయకులు తెలిపారు. గ్రామ అధ్యక్షులు కొల్లి శ్యామ్‌కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో సుమారు 4000 సంతకాలను సేకరించారని, గ్రామ నాయకులకు ప్రోత్సాహకంగా సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి రూ.10 వేలను ప్రకటించి ఆ నగదును మండల అధ్యక్షులు నాళి వెంకటకృష్ణ చేతుల మీదుగా అందజేశారు.

తాడికొండ నియోజకవర్గంలో 64 వేల సంతకాల సేకరణ..

ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా తాడికొండ నియోజకవర్గంలో 64 వేల సంతకాలు సేకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేశామని వనమా పేర్కొన్నారు. అనంతరం ర్యాలీగా జిల్లా కేంద్రానికి నాయకులు, కార్యకర్తలతో కలిసి వెళ్లి జిల్లా పార్టీ అధ్యక్షులు అంబటి రాంబాబుకు కోటి సంతకాల సేకరణ ప్రతులను అందజేశారు. కార్యక్రమంలో 4 మండలాల పార్టీ అధ్యక్షులు మార్పుల శివరామిరెడ్డి, తాళ్లూరి వంశీకృష్ణ, వంగా పోలారెడ్డి, మైనేని నాగమల్లేశ్వరావు, జెడ్పీటీసీ సభ్యురాలు దాసరి కత్తిరేణమ్మ, వివిధ విభాగాల నాయకులు మల్లంపాటి రాఘవరెడ్డి, బాకి వెంకటస్వామి, దమ్మాటి మోహనరావు, షేక్ అజీస్, గుంటి రఘువరన్, బొంతా శ్రీకాంత్, మల్లంపాటి చంద్రశేఖర్ రెడ్డి, షేక్ బాబావలి, సలీమ్, ఫిరోజ్ ఖాన్, షేక్ మీర్జావలి, ఆరేపల్లి జోజి, కొప్పుల శేషగిరిరావు, నేలపాటి నాగేంద్ర, చుండు వెంకట రెడ్డి, బెజ్జం రాంబాబు, ఐనవోలు సుధీర్, కోలేటి అనీల్, ఆలోకం సురేష్, శ్రీహరి, తుమ్మూరు వరప్రసాద్‌రెడ్డి, రాము, జానీ, జానీ బాషా, బెజ్జం ప్రకాశరావు, బి.సలోమాన్, సయ్యద్ సైదు సాహెబ్, మోరం రెడ్డి, షేక్ మస్తాన్, టి.కృష్ణ, రామారావు, వెంకటరామిరెడ్డి, జుబేర్, షేక్ అబ్బాస్, తమ్మనంపల్లి శాంతయ్య, షేక్ రబ్బాని, అబ్దుల్ రసూల్, సయ్యద్ జిలానీ, షేక్ సుభానీ, కొరివి కిషోర్, కొరివి చెన్నయ్య, మిరియాల శివరామకృష్ణ, షేక్ బుడే, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజలకు అన్యాయం చేస్తే సహించం..

తాడికొండ: ప్రైవేటీకరణతో ప్రజల భవిష్యత్తును అంధకారం చేయాలని చూస్తే సహించేది లేదని వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ ఇన్‌చార్జి వనమా బాల వజ్రబాబు అన్నారు. బుధవారం నియోజకవర్గ కేంద్రమైన తాడికొండలో కోటి సంతకాల సేకరణ ప్రతులను జిల్లా కేంద్రానికి తరలించే ప్రక్రియకు ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. తొలుత ప్రధాన కూడలిలోని అంబేడ్కర్ కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రజల వద్ద నుంచి సేకరించిన కోటి సంతకాల సేకరణ ప్రతుల వాహనాన్ని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదవాడికి ఉచితంగా వైద్యం, వైద్య విద్యను అందించాలనే లక్ష్యంతో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మెడికల్ కాలేజీలను తీసుకువచ్చారని గుర్తుచేశారు. దీనిని చూసి ఓర్వలేని చంద్రబాబు పేదలకు వైద్యం అందకుండా చేసే కుట్రతో మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు మొగ్గు చూపాడని మండిపడ్డారు. పేదలంటే బాబుకు మొదటి నుంచి చిన్నచూపు ఉందని వాపోయారు.

కార్యకర్తలతో ర్యాలీగా వెళుతున్న ఎమ్మెల్సీ మురుగుడు, వేమారెడ్డి

గుంటూరులో జిల్లా పార్టీ అధ్యక్షులు అంబటి రాంబాబుకు కోటి సంతకాల పత్రాలను అందజేస్తున్న వనమా

అధికారుల సమన్వయ కమిటీ సమావేశం నేడు

మంగళగిరి టౌన్: ముక్కోటి ఉత్సవం(ఈనెల 30న) నిర్వహణలో భాగంగా ఏర్పాట్లపై వివిధ శాఖాధికారులతో గురువారం సమన్వయ కమిటీ సమావేశం నిర్వహిస్తున్నట్లు మంగళగిరి తహసీల్దార్ దినేష్‌రాఘవేంద్ర బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 11 గంటలకు శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారి దేవస్థానం ఆవరణలో ఈ సమీక్షా సమావేశం జరుగుతుందని.. మంగళగిరి పరిధిలోని ప్రభుత్వ వివిధ శాఖాధికారులు సమావేశంలో పాల్గొనాలని కోరారు. ముక్కోటి ఏకాదశి ఉత్తర ద్వార దర్శనానికి హాజరయ్యే భక్తులకు ఏర్పాటు చేయాల్సిన సౌకర్యాల దృష్ట్యా తీసుకోవాల్సిన చర్యల నిమిత్తం ఈ సమీక్షా సమావేశంలో చర్చించనున్నట్లు ఆయన ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

ప్రత్యేక విద్యుత్ అదాలత్ రేపు

మంగళగిరి టౌన్: విద్యుత్ సమస్యల పరిష్కారానికి మంగళగిరిలో ప్రత్యేక విద్యుత్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు మంగళగిరి డివిజన్ విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జె.సంజీవరావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మంగళగిరి పట్టణ పరిధిలోని చిల్లపల్లి కల్యాణ మండపంలో శుక్రవారం ఉదయం 10.30 గంటలకు కార్యక్రమం జరుగుతుందని.. విజయవాడ సీజీఆర్ఎఫ్ చైర్‌పర్సన్ విక్టర్ ఇమ్మానియేల్ హాజరుకానున్నట్లు తెలిపారు. మంగళగిరి, తాడేపల్లి, దుగ్గిరాల మండలాల్లోని విద్యుత్ వినియోగదారులు విద్యుత్ సమస్యలను ఈ అదాలత్ కార్యక్రమం ద్వారా పరిష్కరించుకోవచ్చని పేర్కొన్నారు.

పల్స్‌పోలియో విజయవంతానికి కృషి

ఫిరంగిపురం: పల్స్‌పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిన బాధ్యత ఆరోగ్యసిబ్బందిపై ఉందని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి శ్రావణ్‌బాబు అన్నారు. ఫిరంగిపురం, నుదురుపాడు పీహెచ్‌సీలు, వేములూరిపాడు సబ్‌సెంటర్లను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా వ్యాక్సిన్ క్యారియర్, ఐస్ ప్యాక్స్, వ్యాక్సినేషన్ రికార్డులు పరిశీలించి మాట్లాడారు. ఈనెల 21, 22, 23 తేదీల్లో పల్స్‌పోలియో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో 0–5ఏళ్ల పిల్లలు 2,14,981 మంది ఉన్నారని.. 958 బూత్‌లు, 25 పీహెచ్‌సీలు, 47 యూపీహెచ్‌సీలు, 2మున్సిపాల్టీలు, 2కార్పొరేషన్లు ఉన్నాయని చెప్పారు. వీటిల్లో 4090 మంది ఆరోగ్య, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొంటారన్నారు. ఆయన వెంట వీఎస్‌ఆర్ శాస్త్రి, హెచ్‌ఎస్ షేక్ అబ్దుల్ రెహమాన్, సిబ్బంది ఉన్నారు.

అంతర పంటలతో అధిక లాభాలు

అంతర పంటలను పరిశీలిస్తున్న రాజకుమారి

ఫిరంగిపురం: పత్తి, మిరప పంటలతో పాటు అంతర పంటల సాగుతో రైతులు అధిక లాభాలు పొందవచ్చని ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మేనేజర్ కె.రాజకుమారి అన్నారు. మండలంలోని 113.తాళ్లూరు, హౌస్ గణేష్‌పాడు గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయ పంటలను బుధవారం ఆమె పరిశీలించారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఐదు రోజుల శిక్షణలో భాగంగా వారికి మిరప క్షేత్రాలను చూపించి వాటిలో అంతర పంటల సాగు, ఐదు రకాల అంతర పంటలు వేసే విధానం, వాటితో కలిగే ప్రయోజనాలను వివరించారు. అంతర పంటల సాగుతో రైతులకు లాభాలతో పాటు పశు గ్రాసం ద్వారా ఆదాయం చేకూరుతుందని చెప్పారు. ఆర్బీఎస్ విత్తనాలు వేయడం వల్ల కలిగే ప్రయోజనాలు వివరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఏ ఉమాదేవి, మాస్టర్ ట్రైనర్ చింతావరప్రసాద్, నాగరాజు, మోడల్ మేకర్స్ ఇ.వెంకటేశ్వర్లు, అన్నామణి, సిబ్బంది పాల్గొన్నారు.

ఫార్మసీ విద్యార్థుల ప్రతిభ

బహుమతులు సాధించిన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

మంగళగిరి టౌన్: మంగళగిరి మండల పరిధి ఆత్మకూరులోని నిర్మల ఫార్మసీ కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటినట్లు కళాశాల యాజమాన్యం పేర్కొన్నారు. కళాశాలలో ప్రతిభ చాటిన విద్యార్థులను బుధవారం కళాశాల ప్రతినిధులు అభినందించారు. డిసెంబర్ 3, 4 తేదీల్లో 'బయో ఫార్మాస్యూటికల్ ఫార్మా డెవలప్‌మెంట్ అండ్ నానో క్యారియర్ డిజైన్ ఫర్ ఎంజైమ్ బేసిడ్ సైటోటాక్సిక్ థెరాప్యూటిక్స్ ఇన్ కాన్సర్ ట్రీట్‌మెంట్' అంశంపై విజయవాడ కేవీఎస్‌ఆర్ సిద్దార్థ ఫార్మసీ కళాశాలలో జాతీయ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో వివిధ కళాశాలల నుంచి పలువురు విద్యార్థులు పాల్గొని పరిశోధనా అంశాలను ప్రదర్శించారు. నిర్మల ఫార్మసీ కళాశాల బీఫార్మసీ మూడో సంవత్సరం చదువుతున్న విద్యార్థిని అక్ష సాత్విక డాకింగ్ అధ్యయనాలు అనే అంశంపై చేసిన ప్రజెంటేషన్‌కు మొదటి బహుమతి లభించింది. అదే కళాశాలలో ఫార్మసీ మూడో సంవత్సరం చదువుతున్న విద్యార్థినులు హర్షిత, అక్షితలు టీకా కోసం మైక్రోబైమ్ థెరపీ అంశంపై చేసిన ప్రదర్శనకు మూడో బహుమతి లభించింది. విజయం సాధించిన విద్యార్థులకు మార్గదర్శకత్వం వహించిన డాక్టర్ కె.సౌజన్య, వి.పద్మజలను కళాశాల కరస్పాండెంట్ సిస్టర్ నిర్మల జ్యోతి, ప్రిన్సిపల్ పాముల రెడ్డి అభినందించారు. విద్యార్థుల ప్రతిభను వెలికితీసేందుకు కళాశాల చేస్తున్న నిరంతర ప్రోత్సాహం, మార్గదర్శకాలు, ఉపాధ్యాయుల కృషి ఈ విజయాలకు కారణమని కళాశాల యాజమాన్యం పేర్కొంది.

జేకేఆర్ బాధితులకు న్యాయం చేయాలి

నిడుముక్కలో నిరసన శిబిరం వద్ద నినాదాలు చేస్తున్న రవీంద్ర

తాడికొండ: ఏఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు జంజనం కోటేశ్వరరావు బాధితులకు న్యాయం చేయాలని విశ్రాంత డిప్యూటీ తహసీల్దార్ రవీంద్ర తెలిపారు. తాడికొండ మండలం నిడుముక్కల గ్రామంలో పూలింగ్‌కు వ్యతిరేకంగా జంజనం కోటేశ్వరరావు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఇదే కార్యక్రమం ఎదుట నిరాహార దీక్షా శిబిరం చేపట్టి రవీంద్ర రెండో రోజు బైఠాయించారు. రియల్ ఎస్టేట్ పేరుతో ప్రజల నుంచి కోట్ల రూపాయిలు కొల్లగొట్టిన మోసగాడు జంజనం కోటేశ్వరరావు అని.. ప్లాట్లు ఇస్తానని చెప్పి రూ.18 లక్షలు తీసుకొని ఎగ్గొట్టి డబ్బులు అడిగితే జేకేఆర్ బెదిరిస్తున్నారని రవీంద్ర ఆరోపించారు. ఇలా చాలా మంది బాధితులు ఉన్నారని.. జేకేఆర్ బాధితులకు ప్రభుత్వం న్యాయం చేయాలని రవీంద్ర పేర్కొన్నారు. కాగా దీక్షా శిబిరాన్ని పరిశీలించిన తాడికొండ పోలీసులు ఇరుపక్షాలను సర్దుబాటు చేసేందుకు యత్నించగా ఫలించలేదు.

వృద్ధులకు పండ్లుపంపిణీ

తాడేపల్లి రూరల్: ప్రపంచ మావన హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని తాడేపల్లి బైపాస్ రోడ్డులోని అఖిల భారతీయ బ్రాహ్మణ వృద్ధాశ్రమంలో బుధవారం జాతీయ మానవ హక్కుల కమిటీ జిల్లా అధ్యక్షులు మున్నంగి వివేకానందరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఉండేల చంద్ర ఓబుల రెడ్డిలు వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మానవ హక్కుల కమిటీ మంగళగిరి మండల అధ్యక్షులు పులివర్తి రాంబాబు, కొల్లి వెంకట చంద్రశేఖర్ రెడ్డి, గోపి, సుభాని తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు న్యాయం చేయాలి

తాడేపల్లి రూరల్: ఎన్నికలకు ముందు నారా లోకేష్ కార్మికులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని సీఐటీయూ నాయకులు వేముల దుర్గారావు డిమాండ్ చేశారు. బుధవారం బ్రహ్మానందపురంలో ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు నిర్వహిస్తున్న దీక్షలను నాయకులు స్టీవెన్, సాంబశివరావు, గురవయ్యలతో కలిసి ప్రారంభించి కార్మికులకు మద్దతు తెలియజేశారు. కార్మికులు గత 372 రోజులుగా దీక్షలు నిర్వహిస్తున్నారని.. వారికి న్యాయం చేయాలని నాయకులు కోరారు. దీక్షల్లో రిబ్కా, లక్ష్మి, శారద, మరియమ్మ, సువర్ణకుమారి కూర్చొనగా, నాయకులు అంబయ్య, ఆశీర్వాదం, టి.నాగేశ్వరరావు, డి.నాగేశ్వరరావు, సుభాని, ఇశ్రాయేల్, దేవ, ఇమాంబి, శారమ్మ, నాగమల్లేశ్వరి, సూర్య ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఆరో రోజు ప్రపంచ బ్యాంకు బృందం పర్యటన

తాడికొండ: సీఆర్డీయే ప్రధాన కార్యాలయంలో ప్రపంచ బ్యాంక్, ఆసియా అభివృద్ధి బ్యాంక్, జాయింట్ టెక్నికల్ మిషన్స్‌లో భాగంగా 6వ రోజు పలు అంశాలపై సమీక్షలు నిర్వహించారు. బుధవారం ఉదయం సీఆర్డీయే ప్రధాన కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఏఐడీయూపీ ప్రాజెక్టు అమలులో భాగంగా బృందంతో కమిషనర్ కె.కన్నబాబు, అడిషనల్ కమిషనర్ ఎ.భార్గవ తేజ, సీఆర్డీయే అధికారులు సమావేశమై రాజధానిలోని పలు ప్రాజెక్టులలో పబ్లిక్–ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ అమలుపై సమీక్షలు నిర్వహించారు. అమరావతి ఇంటిగ్రేటెడ్ అర్బన్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ అమలులో భాగంగా పీపీపీ విధానంపై ప్రపంచ బ్యాంకు–ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంకు బృందం ఏపీ సీఆర్డీయే అధికారులతో చర్చలు జరిపారు. కార్యక్రమంలో బృందం నుంచి వరల్డ్ బ్యాంక్ టాస్క్ టీమ్ లీడర్ జెరాల్డ్ ఒలివర్, లీడ్ ఎకనామిస్ట్ డాక్టర్ మార్సిన్ పియాట్‌కోవ్స్కీ, సీనియర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫైనాన్స్ స్పెషలిస్ట్ మార్క్ అలెగ్జాండర్ గిబ్లెట్, ఇంటర్నేషనల్ ఫైనాన్స్ కార్పొరేషన్, పీపీపీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ స్పెషలిస్ట్ ఇన్వెస్ట్‌మెంట్ ఆఫీసర్ శ్రీమతి హర్షా ఖుబ్చందాని పాల్గొన్నారు.

పరిశోధనలే లక్ష్యంగా ఎంవోయూ



మంగళగిరి టౌన్: పరస్పర సహకారంతో కూడిన పరిశోధనలే లక్ష్యంగా ఎంవోయూ కుదుర్చుకున్నట్లు ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ సతీష్ కుమార్, రిజిస్ట్రార్ ప్రేమ్‌కుమార్‌లు స్పష్టం చేశారు. మంగళగిరి మండల పరిధి ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీలో బుధవారం శ్రీవిష్ణు గ్రూప్‌తో ఏపీ ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీ ఎంవోయూ పత్రాలపై సంతకాలు చేసింది. ఈ సందర్భంగా వర్సిటీ ప్రతినిధులు మాట్లాడుతూ.. అంతర్జాతీయ విద్యా ప్రమాణాలతో ముందుకు సాగుతున్న ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీ పరిశోధనల దిశగా అడుగులు వేసిందని అన్నారు. కార్యక్రమంలో రీసెర్చ్ డీన్ డాక్టర్ రంజిత్ థాపాలు, శ్రీవిష్ణు గ్రూప్ వైస్‌చైర్మన్ రవిచంద్ర రాజగోపాల్, పలువురు ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీ ప్రతినిధులు, శ్రీవిష్ణుగ్రూప్ ప్రతినిధులు పాల్గొన్నారు.

పిల్లల రక్షణకు బాలల పరిరక్షణ కమిటీ

సమావేశంలో మాట్లాడుతున్న సిస్టర్ విద్య

తాడేపల్లి రూరల్: పిల్లల రక్షణ కోసమే గ్రామస్థాయి బాలల పరిరక్షణ కమిటీ (వీసీపీసీ) ఏర్పాటు చేశారని గుడ్ షెపర్డ్ కాన్వెంట్ సిస్టర్స్ స్వచ్ఛంద సంస్థ చైల్డ్ ప్రొటెక్షన్ ప్రాజెక్ట్ అధికారి విద్య అన్నారు. ఉండవల్లి ఆర్‌సీఎం చర్చి వద్ద బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. తాడేపల్లి రూరల్ పరిధిలోని 10 గ్రామాలలో బాలల హక్కుల పరిరక్షణ, బాల్య వివాహాల నివారణ, బడిఈడు పిల్లలు బడి బయట ఉండకూడదనే లక్ష్యంతో పనిచేస్తున్నామని పేర్కొన్నారు. పిల్లల భద్రత కోసం కమిటీని ఏర్పాటు చేశామని వివరించారు. పిల్లలు సున్నిత స్వభావం కలవారని.. రోజూ ఎన్నో ప్రమాదాలు, వేధింపులకు వారు గురవుతున్నారని వాపోయారు. కార్యక్రమంలో ఉండవల్లి సచివాలయ అడ్మిన్ ఇన్‌చార్జి సెక్రటరీ ఎ.రామకృష్ణ, మహిళా పోలీస్ సౌందర్య, గుడ్ షెపర్డ్ సిబ్బంది అత్తోట పోతురాజు, కె.అనూష, భాగ్యలక్ష్మి, కీర్తి, సుద్దపల్లి సుప్రియ, విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

అమరావతిలో గ్రామకంఠాల సమస్యకు పరిష్కారం

సిబ్బందితో మాట్లాడుతున్న భార్గవ్ తేజ

తాడికొండ: అమరావతిలో గ్రామకంఠాల సమస్యను పరిష్కరించేందుకు సీఆర్డీయే క్షేత్రస్థాయిలో విస్తృతంగా పనిచేస్తోందని సీఆర్డీయే అడిషనల్ కమిషనర్ ఎ.భార్గవ్ తేజ అన్నారు. రాజధాని గ్రామాలలో గ్రామకంఠాల సమగ్ర వివరాలు, మినహాయింపులు, ప్రతిపాదనల వివరాలు సేకరించేందుకు బుధవారం రాయపూడిలో సీఆర్డీయే ప్రధాన కార్యాలయంలోని సమావేశ మందిరంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామకంఠాల సమగ్ర వివరాల సేకరణలో క్షేత్రస్థాయి సిబ్బంది ఎలాంటి అలసత్వం ప్రదర్శించకుండా పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో గుంటూరు జిల్లా జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ ఐఏఎస్, తెనాలి సబ్‌కలెక్టర్ వి.సంజన సింహ, అమరావతిలోని ఎల్‌పీఎస్ యూనిట్ల స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, మండల తహసీల్దార్లు, వారి కార్యాలయ సిబ్బంది, సర్వేయర్లు, రెవెన్యూ, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఈ–లాటరీ విధానంలో రిటర్నబుల్ ప్లాట్ల కేటాయింపు

తాడికొండ: రాజధాని కోసం ఏపీ సీఆర్డీయే పరిధిలో భూసమీకరణ పథకంలో సీడ్ యాక్సిస్ రహదారి నిర్మాణం నిమిత్తం ఏపీ సీఆర్డీయే వారికి భూములను అందజేసిన ఉండవల్లి గ్రామ రైతులకు రిటర్నబుల్ ప్లాట్లు కేటాయించేందుకు బుధవారం రాయపూడిలోని ఏపీ సీఆర్డీయే ప్రధాన కార్యాలయంలో ఈ–లాటరీ నిర్వహించారు. వీటిలో 11 నివాస ప్లాట్లు కాగా 5 వాణిజ్య ప్లాట్లు.. మొత్తంగా 11 మంది రైతులు, భూయజమానులకు ఈ–లాటరీ విధానంలో ఆన్‌లైన్ ర్యాండమ్ సిస్టం ద్వారా ప్లాట్లను కేటాయించారు. ఈ సందర్భంగా సీఆర్డీయే స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఏజీ చిన్నికృష్ణ ప్లాట్లు పొందిన రైతులకు భౌగోళికంగా వారి ప్లాట్లు ఎక్కడ కేటాయించారో వివరించడానికి ప్రత్యేకంగా జీఐఎస్ సిబ్బంది, గ్రామ సర్వేయర్లను నియమించామన్నారు. కార్యక్రమంలో పలువురు సీఆర్డీయే అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా...

రేణిగుంట నుంచి స్పైస్‌జెట్ విమానాలు బంద్

మూసి ఉన్న స్పైస్‌జెట్ కౌంటర్

రేణిగుంట : తిరుపతి జిల్లా రేణిగుంట నుంచి విమానయాన సంస్థ స్పైస్‌జెట్ తన సర్వీసులను బుధవారం నుంచి నిలిపివేసింది. రేణిగుంట–హైదరాబాద్ మధ్య నిత్యం రెండు సర్వీసులను నడుపుతుండగా.. అంతర్గత కారణాలవల్ల వీటిని నిలిపివేసినట్లు సమాచారం. రానున్న ఆర్నెల్లపాటు స్పైస్‌జెట్ సేవలు రేణిగుంటలో అందుబాటులో ఉండవని విమానాశ్రయంలో చర్చించుకుంటున్నారు. ఎయిర్‌పోర్టు ఆవరణలో ఉన్న స్పైస్‌జెట్ కౌంటర్‌ను సైతం తాత్కాలికంగా మూసివేశారు.

ఉపాధ్యాయుడికి దేహశుద్ధి చేసిన గ్రామస్తులు

రణస్థలం: శ్రీకాకుళం జిల్లా రణస్థలం మండలంలోని కొవ్వాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినితో ఆ పాఠశాల ఉపాధ్యాయుడు అసభ్యంగా ప్రవర్తించిన ఘటన వెలుగు చూసింది. పోలీసుల కథనం మేరకు.. కొవ్వాడ హైస్కూల్లో ఇంగ్లిష్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న జాన్ విల్సన్ బాబు 8వ తరగతి చదువుతున్న విద్యార్థినితో అసభ్యంగా ప్రవర్తించాడు. బాలిక మూడు రోజులుగా స్కూల్‌కు వెళ్లకపోవడంతో కుటుంబ సభ్యులు ఆరా తీయగా అసలు విషయం చెప్పింది. టీచర్ విల్సన్ బాబు తనను ఇబ్బంది పెడుతున్నాడని, శరీరంపై చేయి వేసి అసభ్యంగా ప్రవర్తించాడని, అసభ్యంగా మాట్లాడుతున్నాడని వివరించింది. కోపోద్రిక్తులైన కుటుంబ సభ్యులు, స్థానికులు పాఠశాలకు వెళ్లి టీచర్‌ను ప్రశ్నించారు. గతంలో ఇలానే రెండు సార్లు ప్రవర్తించడంతో తల్లిదండ్రులు హెచ్చరించి వదిలేశారు. మళ్లీ మూడోసారి జరగడంతో దేహశుద్ధి చేశారు. పాఠశాలలో ఉద్రిక్త వాతావరణం నెలకొనడంతో హెచ్‌ఎం పద్మావతి పోలీసులకు ఫోన్ చేశారు. జేఆర్ పురం పోలీసులు పాఠశాలకు చేరుకొని తల్లిదండ్రులను, గ్రామస్తులను సముదాయించారు. ఉపాధ్యాయుడిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. ఘటనపై పూర్తిస్థాయి విచారణ చేపట్టి, ఉన్నతాధికారులకు నివేదిస్తామని డిప్యూటీ డీఈఓ ఆర్. విజయకుమారి తెలిపారు.

కొల్లగొడుతున్నా.. మిన్నకుందూరే..!

గ్రావెల్ తరలింపుపై అధికారుల డ్రామా
తప్పించుకునేందుకు తిప్పలు

ఏడాది క్రితం వరకు కుందూనది వెంట ఉన్న కరకట్టలు

గ్రావెల్‌ను తరలించడంతో ఖాళీ అయిన కరకట్ట

- ఏడాదిగా యథేచ్ఛగా కుందూనది కరకట్ట గ్రావెల్ తరలింపు
- రూ.కోట్లు విలువైన గ్రావెల్ కొల్లగొట్టిన అక్రమార్కులు
- రిజిస్టర్ పోస్టు ద్వారా కోవెలకుంట్ల, గోస్పాడు పోలీస్‌స్టేషన్లకు ఫిర్యాదులు

ప్రొక్లెయిన్లతో కరకట్టబెలుకును తరలిస్తున్న దృశ్యం(ఫైల్)

సాక్షి, టాస్క్‌ఫోర్స్: కుందూ నది కరకట్టపై ఏడాదిగా గ్రావెల్‌ను యథేచ్ఛగా తరలించుకుపోతున్నా.. పట్టించుకోని కేసీ కెనాల్ అధికారులు తాజాగా డ్రామా మొదలు పెట్టారు. రైతులు, ప్రజా సంఘాల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తడంతో తప్పించుకునేందుకు సాకులు చెబుతున్నారు. పనిఒత్తిడి వల్ల గమనించలేకపోయామని, ఈ అక్రమాలపై పోలీసులకు తెలియజేశామని తమ తప్పును కప్పిపుచ్చుకుంటున్నారు. ఇటీవల కోవెలకుంట్ల, గోస్పాడు పోలీస్ స్టేషన్లకు రిజిస్టర్ పోస్టు ద్వారా ఫిర్యాదులు చేసి చేతులు దులుపుకున్నారు. ఆ ఫిర్యాదుల్లో సమగ్రవివరాలు పొందుపరచకపోవడంతో పోలీసులూ ఏమీ చేయలేక చేష్టలుడిగి చూస్తున్నారు.

కూటమి అధికారంలోకి వచ్చినప్పటి నుంచే..!

వర్షాకాలంలో కుందూనది పొంగి వరద నీరు గ్రామాలు, పొలాలను ముంచెత్తుతుండడంతో సమస్య పరిష్కారానికి వైఎస్సార్‌సీపీ హయాంలో చర్యలు చేపట్టారు. నంద్యాల, వైఎస్సార్ కడప, నెల్లూరు జిల్లాల్లో రూ.1,350 కోట్లతో కుందూనది విస్తరణ పనులు జరిగాయి. ఈ పనుల్లో భాగంగా మట్టి(బెలుకు) కరకట్టలను పటిష్టం చేశారు. అయితే తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చాక ఆ పార్టీ నేతలు, అక్రమార్కులు కలగలసి కరకట్టపై గ్రావెల్‌ను యథేచ్ఛగా కొల్లగొట్టడం మొదలు పెట్టారు. ఏడాదిగా ఈ తంతు జరుగుతున్నా.. కరకట్ట పటిష్టతను పర్యవేక్షించాల్సిన కేసీ కెనాల్ అధికారులు పట్టించుకోలేదు. ఫలితంగా అక్రమార్కులు రూ.కోట్లు దండుకున్నారు. ముఖ్యంగా కోవెలకుంట్ల, గోస్పాడు మండలాల పరిధిలో ఉన్న కరకట్టపై గ్రావెల్‌ను అధికారపార్టీ నేతల అండదండలతో తరలించుకుపోయారు. ఫలితంగా ఈ ప్రాంతాల్లో కరకట్ట పూర్తిగా మాయమైంది. దీనిపై విమర్శలు వెల్లువెత్తడంతో అధికారులు కళ్లుతెరిచారు. తమ నిర్లక్ష్యాన్ని కప్పిపుచ్చుకునేందుకు కొత్త డ్రామా మొదలు పెట్టారు.

ట్రాక్టర్ గ్రావెల్ రూ. వెయ్యి నుంచి రూ.1,200కు..!

అక్రమార్కులు కరకట్టలపై గ్రావెల్‌ను ట్రాక్టర్‌కు రూ.వెయ్యి నుంచి రూ.1200 వరకు అమ్మి సొమ్ము చేసుకున్నారు. కోవెలకుంట్ల తహసీల్దార్ కార్యాలయానికి కేవలం వంద మీటర్ల దూరంలోనే మట్టిని వందల సంఖ్యలో ట్రాక్టర్లపై తరలిస్తున్నా రెవెన్యూ అధికారులు కానీ, కేసీ కెనాల్ అధికారులు కానీ పట్టించుకోకపోవడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. కేసీ కెనాల్ అధికారుల నుంచి అనుమతి తీసుకున్నామన్న సాకుతో అక్రమార్కులు గత రెండు, మూడు నెలల నుంచి ఇతర నిర్మాణ పనులకు బెలుకును తరలించారు. ఈ ప్రాంతంలో కరకట్ట పూర్తిగా మాయం కావడంతో వర్షాకాలం కుందూ నది పొంగి మళ్లీ గ్రామాలను ముంచెత్తే ఆస్కారం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయినా ఇప్పటికీ అధికారులు, ప్రభుత్వం పట్టించుకోవడం లేదు.

నకిలీ మద్యం తయారీలో ఆ ముగ్గురే కీలకం!

- చక్రంతిప్పిన జనార్దన్‌రావు, జయచంద్రారెడ్డి, గిరిధర్‌రెడ్డి
- వీరి కనుసన్నల్లోనే ములకలచెరువు ప్లాంట్
- పీఏ రాజేష్ రిమాండ్ రిపోర్టులో ఆసక్తికర అంశాలు

ములకలచెరువు: ములకలచెరువు నకిలీ మద్యం ప్లాంట్ నిర్వహణలో జనార్దన్‌రావు, జయచంద్రారెడ్డి, గిరిధర్‌రెడ్డిలు ముగ్గురే కీలకమని పీఏ రాజేష్ విచారణలో తేలింది. వీరి కనుసన్నల్లోనే ప్లాంట్ నడిచిందని, వచ్చిన లాభాన్ని రాజేష్ ఖాతా నుంచే పంచుకున్నారని రిమాండ్ రిపోర్టులో ఎక్సైజ్ పోలీసులు పేర్కొన్నారు. రాష్ట్రంలో సంచలనం రేపిన ములకలచెరువు నకిలీ మద్యం కేసులో ఏ5గా ఉన్న మాజీ టీడీపీ ఇన్‌చార్జ్ జయచంద్రారెడ్డి పీఏ పీ.రాజేష్‌ను మంగళవారం రాత్రి ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేసి తంబళ్లపల్లె కోర్టులో హాజరుపరచగా అతనికి జడ్జి 14 రోజుల పాటు రిమాండ్ విధించిన విషయం పాఠకులకు తెలిసిందే. రాజేష్ రిమాండ్ రిపోర్టులో పలు ఆసక్తికర విషయాలు బయట పడ్డాయి. దీనిప్రకారం.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రైవేటు వైన్ షాపులు అమల్లోకి తెచ్చారు. ఈ క్రమంలో షాపు నంబరు 85 పీఏ రాజేష్ పైన, 93 షాపు నంబరు కట్టా సురేంద్రనాయుడు పైన డ్రాల్లో కేటాయించారు. ఈ రెండు షాపులను జయచంద్రారెడ్డి బావమరిది గిరిధర్‌రెడ్డి చూసుకునేవాడు. రెండు షాపులకు మద్యం తరలించడానికి రాజేష్ పేరు మీద ఒక వాహనం కొనుగోలు చేశారు. మద్యం అమ్మకాలు తగ్గడంతో నష్టం వాటిల్లుతోందని విజయవాడకు చెందిన స్నేహితుడైన జనార్దన్‌రావును జయచంద్రారెడ్డి సంప్రదించాడు. ములకలచెరువులో నకిలీ మద్యం ప్లాంట్ ఏర్పాటు చేసి నియోజకవర్గ వ్యాప్తంగా నకిలీ మద్యం బెల్టుషాపుల ద్వారా విక్రయిస్తే అధిక మొత్తంలో లాభాలు చవిచూడవచ్చని జనార్దన్‌రావు చెప్పడంతో ఇందుకు జయచంద్రారెడ్డి, గిరిధర్‌రెడ్డి, కట్టా సురేంద్రనాయుడు అంగీకరించారు. ఇందులో భాగంగా రాక్ స్టార్, ఆంధ్రావైన్స్ మద్యం షాపుల నిర్వహణ బాధ్యతలను జనార్దన్‌రావుకు అప్పగించారు. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి షాపులను జనార్దన్‌రావు తన అనుచరులతో కలిసి నిర్వహిస్తున్నారు. నకిలీ మద్యం అమ్మకాల నగదు, రెండు షాపుల మద్యం అమ్మకాల నగదును జయచంద్రారెడ్డి ఇంట్లో పనిచేసే అన్బురాసు సేకరించి కట్టా రాజుకు ఇవ్వడంతో రాజేష్ ఖాతాలో జమ చేసేవారు. స్టాక్ కొనుగోలుకు, లాభాలు పంచుకోవడానికి రాజేష్ ఖాతాలోని సొమ్ము ఉపయోగించేవారు. నకిలీ మద్యానికి అవసరమైన స్పిరిట్, ఖాళీ బాటిళ్లు, మూతలు, స్టిక్కర్లకు కావాల్సిన సొమ్మును రాజేష్ ఖాతా నుంచే సంబంధిత వ్యక్తులకు ట్రాన్స్‌ఫర్ చేసేవారు. అక్టోబర్ 3వ తేదీ నకిలీ మద్యం గుట్టురట్టు నేపథ్యంలో తన రెండు ఫోన్లలోని డేటాను ఫార్మెట్ చేయాలని, సంబంధిత పరికరాలను ధ్వంసం చేయాలని జయచంద్రారెడ్డి ఆదేశించాడు. రాజేష్‌ను కూడా మొబైల్ స్విచ్చాఫ్ చేసేసి ఎక్కడికైనా పారిపోవాలని సూచించాడు.

ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్‌కు చేదు అనుభవం

- క్రోసూరు మండలం అందుకూరులో సమస్యలపై నిలదీసిన మహిళ
- పంచాయతీ ఎన్నికల్లో టీడీపీ ఓటమి ఖాయమని కుండబద్దలు

ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్‌ను నిలదీసిన మహిళ

అందుకూరు(క్రోసూరు): గ్రామంలో సమస్యలు ఎవరూ పట్టించుకోవటం లేదని, ఇలానే చేస్తే వచ్చే పంచాయతీ ఎన్నికల్లో టీడీపీ ఓటమి ఖాయమని ఓ మహిళ కుండబద్దలు కొట్టింది. పల్నాడు జిల్లా పెదకూరపాడు నియోజకవర్గంలో వంద రోజులు వంద గ్రామాలు అంటూ ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ గ్రామ సభలు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా క్రోసూరు మండలంలోని అందుకూరు గ్రామంలో బుధవారం జరిగిన గ్రామ సభలో ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ పాల్గొన్నారు. ఆయన ప్రసంగిస్తుండగా ఓ మహిళ కల్పించుకుని ఎమ్మెల్యేను నిలదీసింది. గ్రామంలో సమస్యలు ఎవరూ పట్టించుకోవటం లేదని, అధికారులు గానీ, పార్టీ నాయకులు గానీ, పట్టించుకోకపోవటంతో రోజుల తరబడి కార్యాలయాల చుట్టూ తిరగాల్సివస్తోందని, ఇలాఅయితే పంచాయతీ ఎన్నికల్లో టీడీపీ ఓడిపోవటం ఖాయమని, పార్టీ రాదని, ఇది నా ఒక్కరి మాట కాదని, 60 శాతం మంది ఇదే చెప్పుకుంటున్నారని కడిగిపారేసింది. దీంతో ఎమ్మెల్యే ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. వెంటనే పార్టీ నాయకులు జోక్యం చేసుకుని ఆమెను పక్కకు పంపించేశారు.

న్యాయవాదిపై సీఐ దురుసు ప్రవర్తన

- హిందూపూర్ వన్‌టౌన్ సీఐ దురుసు ప్రవర్తనపై న్యాయవాదుల ఆగ్రహం
- సివిల్ కేసులో జోక్యం చేసుకున్న సీఐని ప్రశ్నించిన న్యాయవాది
- 'ఆఫ్ట్రాల్ అడ్వొకేట్' అంటూ స్టేషన్ నుంచి గెంటేసిన సీఐ

రోడ్డుపై బైఠాయించిన న్యాయవాదులు

హిందూపురం: ఓ కోర్టు కేసు విషయమై అడిగేందుకు వెళ్లిన న్యాయవాది అబ్దుల్ రహీంపై దురుసుగా ప్రవర్తించి, 'ఆఫ్ట్రాల్ అడ్వొకేట్' అంటూ స్టేషన్ నుంచి గెంటేసిన శ్రీ సత్యసాయి జిల్లా హిందూపురం వన్‌టౌన్ సీఐ రాజగోపాల్‌నాయుడు తీరును నిరసిస్తూ న్యాయవాదులు బుధవారం పెద్ద ఎత్తున ఆందోళన చేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వన్నేరువప్ప, కార్యదర్శి రామచంద్రప్ప ఆధ్వర్యంలో హిందూపురంలో విధులను బహిష్కరించి, అంబేడ్కర్ సర్కిల్‌కు ర్యాలీగా చేరుకున్నారు. అక్కడ మానవహారంగా ఏర్పడడంతో పాటు రాస్తారోకో చేశారు. సీఐని వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఓ సివిల్ వివాదం కోర్టులో నడుస్తుండగానే వన్‌టౌన్ సీఐ రాజగోపాల్ నాయుడు ట్రాన్స్‌కో ఏఈకి ఫోన్ చేసి వ్యతిరేక పక్షానికి విద్యుత్ కనెక్షన్ ఇవ్వాలని ఆదేశించారు. దీంతో న్యాయవాది అబ్దుల్ రహీం మంగళవారం పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి సివిల్ వివాదంలో ఏ హక్కుతో జోక్యం చేసుకున్నారని సీఐను ప్రశ్నించారు. దీంతో సీఐ ఆగ్రహంతో స్టేషన్ నుంచి బయటకు పో అంటూ న్యాయవాదిపై దురుసుగా వ్యవహరించారు. పోలీసు సిబ్బందితో దాడి చేయించి.. స్టేషన్ నుంచి బయటకు నెట్టేశారు. 'ఆఫ్ట్రాల్ అడ్వొకేట్' అంటూ అవహేళనగా మాట్లాడారు. దీనిపై న్యాయవాది రహీం స్థానిక బార్ అసోసియేషన్‌లో ఫిర్యాదు చేశారు న్యాయవాదులు బుధవారం విధులను బహిష్కరించి అంబేడ్కర్ సర్కిల్లో ఆందోళన చేపట్టారు. ఎస్పీ వచ్చి సీఐపై చర్యలు తీసుకునే దాకా ఆందోళన విరమించేదిలేదని భీష్మించారు. వన్‌టౌన్ సీఐ రాజగోపాల్ నాయుడు కానిస్టేబుళ్లతో అక్కడికి వచ్చి వీడియో తీస్తూ హల్‌చల్ చేశారు. 'అందర్నీ వీడియోలు తీసుకోండి. కేసులు నమోదు చేద్దాం' అంటూ సిబ్బందిని ఆదేశించారు. సీఐ వైఖరితో మరింత ఆగ్రహించిన న్యాయవాదులు దాదాపు నాలుగు గంటల పాటు రోడ్డుపై బైఠాయించారు. ట్రాఫిక్ స్తంభించింది.

తిరుమల తిరుపతి దేవస్థానములు : తిరుపతి
శ్రీ పద్మావతి చిల్డ్రన్స్ హార్ట్ సెంటర్, (S.V. ప్రాణదాన ట్రస్ట్).
ప్రకటన
1) కాంట్రాక్ట్ అందజేసిన తేదీ నుండి ఒక సంవత్సర కాలానికి పారా–మెడికల్ మరియు ప్రైవేట్ సెక్యూరిటీ సిబ్బంది సరఫరా కొరకు ఇ-టెండరు కోరబడుచున్నది. టెండరు డాక్యుమెంట్లు 10-12-2025న ఉ.10.00 గం. నుండి డౌన్‌లోడ్ కొరకు లభిస్తాయి. బిడ్ల స్వీకరణకు చివరి తేదీ: 20-12-2025న ఉ.10.00 గం.కు. ఆసక్తి మరియు అర్హత గల బిడ్డర్లు తమ బిడ్లను టెండరు ప్రకటనలో తెలిపిన నియమ నిబంధనల ప్రకారం దాఖలు చేయవలెను. మరింత సమాచారం కొరకు www.tirumala.org లేదా https://tender.apeprocurement.gov.in/ దర్శించండి.
TTD-40021/10/2025-PRO SEC (Adv.No.317) Dt: 10-12-2025 — ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్

SPORTS AUTHORITY OF ANDHRA PRADESH
IGMC STADIUM, LABBIPET, BANDAR ROAD, VIJAYAWADA
Tenders are hereby invited from reputed and experienced companies for the following tenders.

S. No.	Tender ID	Name of the work	Estimate Contract Value (in Rs.)
1	873857	Providing to electrification, Compound wall, wooden flooring works Kreeda Vikasa Kendram at Jaggampeta, Kakinada District.	25,14,035/-
2	873860	Providing to civil, Play fields, and External works Kreeda Vikasa Kendram at Jaggampeta, Kakinada District.	30,13,010/-
3	873863	Providing Electrification, Compound Wall & Wooden Flooring Works to Kreeda Vikasa Kendra at Peddapuram, Kakinada District.	25,87,427/-
4	873867	Providing Civil Works, Playfields & External Works to KVK at Peddapuram, Kakinada District.	30,13,010/-
5	873872	Providing Civil Works & Electrical Works to KVK at Peddapuram, Kakinada District.	23,87,876/-

Bid Starting Date 11-12-2025. Bid End date: 19-12-2025. Tender documents are available on e-procurement platform tender.apeprocurement.gov.in. Tenders will be opened in the presence of company representatives who attend the evaluation. For further details contact: 8501074922.
Sd/- Vice Chairman and Managing Director
DIPR RO No.4656PP/CL/Advt/1/1/2021-22, Dt:10.12.2025

వేధింపులు భరించలేక పారిపోయేందుకు విద్యార్థుల యత్నం

- నారాయణ కళాశాలలో దారుణం
- నాలుగు అంతస్తుల భవనం నుంచి పైపుల ద్వారా దిగుతూ జారిపడ్డ విద్యార్థి
- అపస్మారక స్థితిలో ఇంటర్ విద్యార్థి మహీందర్ రెడ్డి
- గుట్టుచప్పుడు కాకుండా ప్రైవేటు ఆసుపత్రికి తరలించిన నారాయణ యాజమాన్యం
- చంద్రగిరి సమీపంలోని అగరాల వద్ద పోర్టు కృష్ణ కళాశాలలో ఘటన

చంద్రగిరి : నారాయణ కళాశాలలో దారుణం చోటు చేసుకుంది. అధ్యాపకుల వేధింపులు భరించలేక విద్యార్థులు క్యాంపస్ నుంచి పారిపోయేందుకు ప్రయత్నించగా, ఓ విద్యార్థి మూడవ అంతస్తు భవనం నుంచి కింద పడి తీవ్రగాయాలపాలయ్యాడు. ఈ ఘటన మంగళవారం అర్ధరాత్రి తిరుపతి జిల్లా చంద్రగిరి మండలం అగరాల సమీపంలోని నారాయణ కళాశాల (పోర్టు కృష్ణ)లో జరిగింది. స్థానికులు, విద్యార్థుల సమాచారం ప్రకారం.. అన్నమయ్య జిల్లా కలికిరికి చెందిన మహీందర్ రెడ్డి అగరాలలోని నారాయణ కళాశాలలో ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. కళాశాలలో ర్యాంకుల పేరుతో విద్యార్థుల పట్ల అధ్యాపకులు వేధింపులకు పాల్పడుతున్నారు. ఈ వేధింపులు తట్టుకోలేక మహీంధర్ రెడ్డి, మరో 5 గురు విద్యార్థులు పారిపోయేందుకు నిర్ణయించుకున్నారు. మంగళవారం అర్ధరాత్రి 1.30 గంటల సమయంలో వారంతా నాలుగో అంతస్తు నుంచి శానిటరీ పైపుల ద్వారా కిందకు దిగేందుకు యత్నించారు. ముందు ఒక విద్యార్థి క్షేమంగా దిగాడు. ఆ తర్వాత మహీంధర్ రెడ్డి కిందకు దిగుతూ మూడో అంతస్తు నుంచి జారి పడ్డాడు. అతని తలకు తీవ్ర గాయమైంది. చెవి, ముక్కు, నోటి నుంచి తీవ్ర రక్తస్రావం అయ్యి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. తోటి విద్యార్థులు కేకలు వేయడంతో కళాశాల సిబ్బంది వచ్చారు. గుట్టు చప్పుడు కాకుండా మహీంధర్ రెడ్డిని రేణిగుంట సమీపంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అతని పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

బిర్యానీ కోసం దిగారంటూ కట్టుకథ

కొందరు విద్యార్థులు బిర్యానీ తినేందుకే భవనం నుంచి దిగబోయారని, వీరిలో మహీంధర్‌రెడ్డి కింద పడ్డాడంటూ నారాయణ కళాశాల యాజమాన్యం కట్టుకథ అల్లిందని తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కళాశాలలో వేధింపులు భరించలేక విద్యార్థులు పారిపోయేందుకు యత్నించారని చెప్పారు. జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న కళాశాల పరిసరాల్లో కొన్ని దాబాలు మాత్రమే ఉన్నాయి. అవి కూడా అర్ధరాత్రి 1.30 గంటల సమయంలో తెరిచి ఉండవు. అలాంటి సమయంలో విద్యార్థులు బిర్యానీ కోసం వెళ్లి ప్రాణం మీదకు తెచ్చుకున్నాడంటూ చెప్పడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సారీ మేడమ్.. మీరు రికార్డుల్లో చనిపోయారు

- అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ కోసం వెళ్లిన మహిళా రైతుకు దిమ్మతిరిగే షాక్
- మేడికొండూరు మండలం భీమనేనివారిపాలెంలో ఘటన

రాధా రాణి

మేడికొండూరు: కళ్లెదుట మనిషి బతికి ఉన్నా.. కంప్యూటర్లలో మాత్రం ఆమెను ఎప్పుడో చంపేసింది ప్రభుత్వం. సంక్షేమ పథకాల కోసం కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న ఆ మహిళకు ఈ విషయం తెలిసి గుండె ఆగినంత పనైంది. గుంటూరు జిల్లా మేడికొండూరు మండలం, భీమనేనివారిపాలెంలో బుధవారం ఈ ఘటన జరిగింది. భీమనేనివారిపాలెం గ్రామానికి చెందిన మహిళా రైతు మద్దినేని రాధారాణికి ప్రభుత్వం నుంచి రావాల్సిన 'అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్' డబ్బులు జమ కాలేదు. దీంతో అనుమానం వచ్చిన ఆమె, బుధవారం గ్రామం పరిధిలోని అన్నదాత సుఖీభవ కేంద్రానికి వెళ్లింది. అక్కడి సిబ్బందిని తన స్టేటస్ చెక్ చేయమని కోరింది. కంప్యూటర్‌లో వివరాలు పరిశీలించిన సిబ్బంది నీళ్లు నమిలారు. మీరు చనిపోయినట్లు రికార్డుల్లో నమోదైంది అని చెప్పడంతో ఆమె కంగుతింది. 'అయ్యా.. నేను మీ కళ్ల ముందే ఉన్నాను కదా! నన్ను చనిపోయినట్లు ఎలా రాస్తారు?' అని ఆమె ఆవేదన వ్యక్తం చేసింది. ఇలా ఒక ఎంట్రీ తప్పుగా నమోదు కావడం వల్ల అర్హులైన పేదలకు అందాల్సిన సంక్షేమ ఫలాలు ఆగిపోతున్నాయి. క్షేత్రస్థాయిలో పరిశీలించకుండానే ప్రభుత్వం ఇష్టారాజ్యంగా రికార్డులు ఎలా మారుస్తుందని గ్రామస్తులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా రికార్డులను సరిచేసి తనకు అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ డబ్బులు వెంటనే విడుదల చేయాలని రాధారాణి కోరుతున్నారు.

పిన్నెల్లిపై కొనసాగుతున్న రెడ్‌బుక్ కుట్రలు

- బరితెగించి కుట్ర రాజకీయాలు చేస్తున్న చంద్రబాబు
- గుండ్లపాడు డబుల్ మర్డర్ చేసింది టీడీపీ వారేనన్న అప్పటి పల్నాడు ఎస్పీ
- టీడీపీలోని ప్రత్యర్థి వర్గం వారే చంపారన్న ప్రత్యక్ష సాక్షి, మృతుడి అల్లుడు తోట ఆంజనేయులు
- హత్యకు ఉపయోగించింది టీడీపీ ఎమ్మెల్యే జూలకంటి అనుచరుడి కారు
- టీడీపీలో ఆధిపత్య పోరులో భాగంగానే హత్య జరిగిందని తేటతెల్లం
- అయినా వైఎస్సార్‌సీపీ నేతలపై నెట్టిన చంద్రబాబు సర్కారు
- బెయిల్ రాకుండా అడుగడుగునా కుట్రలు
- నేడు మాచర్ల కోర్టులో లొంగిపోనున్న పిన్నెల్లి సోదరులు

టీడీపీ కార్యకర్తలను హత్య చేసేందుకు వినియోగించిన కారుపై జేబీఆర్ అని పచ్చ అక్షరాలతో ఉన్న స్టిక్కర్

సాక్షి, టాస్క్‌ఫోర్స్: వర్గ పోరుతో జరిగిన హత్యలకు కూడా ప్రతిపక్షంలో ఉండగా పార్టీల రంగు పులిమిన తెలుగుదేశం పార్టీ.. అధికారంలోకి వచ్చాక సొంత పార్టీలో ఆధిపత్య పోరుతో జరిగిన హత్యలను కూడా వైఎస్సార్‌సీపీ, ఆ పార్టీ నేతలపై నెట్టి శవ రాజకీయం చేస్తోంది. రెడ్ బుక్ రాజ్యాంగం, రాజకీయ కక్షతో కుట్ర పూరితంగా వ్యవహరిస్తోంది. ఇదే తీరులో పల్నాడు జిల్లాలో టీడీపీలో వర్గపోరుతో జరిగిన హత్య కేసులో వైఎస్సార్‌సీపీ మాజీ ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఆయన సోదరుడి పైనా రెడ్ బుక్ కుట్రలను అమలు చేస్తోంది. మాచర్ల నియోజకవర్గం వెల్దుర్తి మండలం గుండ్లపాడులో ఈ ఏడాది మే 24న జరిగిన టీడీపీ కార్యకర్తల జంట హత్యల కేసులో పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఆయన సోదరుడు పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి పేర్లు చేర్చి నీచ రాజకీయాలకు తెరలేపారు. ఆరోజు జవిశెట్టి వెంకటేశ్వర్లు అలియాస్ మొద్దయ్య, ఆయన తమ్ముడు కోటేశ్వరరావును హత్య చేసిన వారితో వైఎస్సార్‌సీపీకి, పిన్నెల్లి సోదరులకు ఏనాడూ ప్రత్యక్షంగా, పరోక్షంగా ఎటువంటి సంబంధం లేదు. అది కేవలం టీడీపీలో ఆధిపత్యం కోసం రెండు వర్గాల మధ్య జరిగిన వర్గ పోరు. అయినా, చంద్రబాబు కక్షపూరితంగా ఆ హత్యలను వైఎస్సార్‌సీపీపై నెట్టి, పిన్నెల్లి సోదరులపై అక్రమ కేసు పెట్టారు. పిన్నెల్లి సోదరులు పోలీసు విచారణకు అన్ని విధాలా సహకరిస్తున్నా ముందస్తు బెయిల్ రాకుండా పోలీసులతో అడ్డుకుంటున్నారు. 14 సార్లు అయ్యప్ప మాల ధరించిన పిన్నెల్లి రామకృష్ణారెడ్డి.. టీడీపీ కుట్రలతో అర్ధంతరంగా మాల తీసి గురువారం మాచర్ల కోర్టులో లొంగిపోవాల్సి వస్తోంది. చంద్రబాబు కూటమి కుట్రలపై వైఎస్సార్‌సీపీతో పాటు ప్రజలు తీవ్ర స్థాయిలో మండిపడుతున్నారు. పిన్నెల్లికి సంఘీభావం తెలిపి, అండగా నిలిచేందుకు వైఎస్సార్‌సీపీకి చెందిన పలువురు రాష్ట్ర నేతలు, ఉమ్మడి గుంటూరు జిల్లా నేతలు గురువారం మాచర్లకు రానున్నారు.

పిన్నెల్లి సోదరులపై అక్రమ కేసు...

గుండ్లపాటు జంట హత్యలకు తెలుగుదేశం పార్టీలో ఆధిపత్య పోరాటమే కారణమని మృతుల అల్లుడు, టీడీపీ నేత, ప్రత్యక్ష సాక్షి కూడా అయిన తోట ఆంజనేయులు ఇచ్చిన ఫిర్యాదులో తెలిపాడు. జవిశెట్టి వెంకటేశ్వర్లు అలియాస్ మొద్దయ్యను హతమారిస్తే టీడీపీలో తనకు ఎదురుండదని, రానున్న సర్పంచ్ ఎన్నికల్లో పోటీ ఉండదన్న కారణంతోనే తోట వెంకట్రామయ్య ఈ హత్య చేశాడని స్పష్టం చేశారు. ప్రాథమిక విచారణ అనంతరం అప్పటి పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు సైతం ఇది టీడీపీలో వర్గపోరు కారణంగా జరిగిన హత్య అని మీడియాకు వీడియో సందేశం ఇచ్చారు. కానీ, ఈ హత్య కేసులో పిన్నెల్లి సోదరులను ఇరికించాలన్న కుట్రతో ఓ కట్టుకథ అల్లారు. ఈ కేసులో నిందితులు జవిశెట్టి శ్రీను, తోట వెంకట్రామయ్య, తోట గురవయ్య, దొంగరి నాగరాజు హత్య చేసిన అనంతరం ప్రత్యక్ష సాక్షి తోట ఆంజనేయులను చూసి కారులోని కత్తులు తీసి బెదిరించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. పోతూ పోతూ '' నా కొ..రా వచ్చేది మా వైఎస్సార్ ప్రభుత్వమే. మిమ్మల్ని బతకనివ్వం. మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, వెంకట్రామరెడ్డి చెబితేనే మేం చేస్తున్నాం. మాకు ఏమైనా ఆపద వస్తే వాళ్లు చూసుకుంటారు'' అంటూ కత్తులు చూపి బెదిరిస్తూ వెళ్లారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇక్కడే పలు అనుమానాలు కలుగుతున్నాయి. నిజంగా హత్యకు పిన్నెల్లి సోదరులు కుట్ర పన్ని ఉంటే ఎవరైనా ఇలా బహిరంగంగా చెబుతారా అన్న అనుమానాలు కలుగుతాయి. ఇది కేవలం పిన్నెల్లి సోదరులను కేసులో అక్రమంగా చేర్చడానికి చంద్రబాబు ప్రభుత్వం, ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి, పోలీసులు పన్నిన కుట్రగా అర్థమవుతోంది. ఈ హత్యలో పిన్నెల్లి సోదరుల పాత్రపై ఎటువంటి ఆధారాలు దొరకలేదు. పోలీసులు ప్రాథమిక విచారణ చేయకుండా కేవలం పైనుంచి వచ్చిన ఒత్తిడితో ఎఫ్ఐఆర్‌లో వీరి పేర్లు చేర్చారని స్పష్టమవుతోంది. హత్య జరిగి ఇన్ని నెలలైనా పిన్నెల్లి సోదరుల ప్రాతను పోలీసులు నిరూపించలేకపోయారు.

ఓట్లు వేయలేదని ఎస్టీలపై పచ్చనేత బెదిరింపులు

- జింకలు వేటాడుతున్నరంటూ నెపం వేసిన టీడీపీ నేత శ్రీనివాసరావు
- భయపడి ఊరు వదిలి వెళ్లిపోయిన నాలుగు కుటుంబాలు

సాక్షి, టాస్క్‌ఫోర్స్: అధికార పార్టీకి ఓట్లు వేయలేదని ఎస్టీ కుటుంబాలను పచ్చ పార్టీ నాయకుడు బెదిరించడంతో నాలుగు కుటుంబాలు ఊరి వదిలి వెళ్లిన ఘటన శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా కందుకూరు మండలంలోని ఓగూరులో చోటుచేసుకుంది. మండలంలోని పెద ఓగూరులో కొన్నేళ్ల నుంచి 8 ఎస్టీ (యానాదులు) కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఆ కుటుంబాలను తమకు ఓట్లు వేయలేదనే నెపంతో లక్ష్యంగా చేసుకున్నారు. గ్రామానికి చెందిన డెయిరీ మాజీ చైర్మన్, టీడీపీ నాయకుడు చల్లా శ్రీనివాసరావు ఎస్టీలు ఎక్కడ కనిపించినా బెదిరింపులకు దిగుతున్నాడు. జింకలను వేటాడుతున్నారని, వారిపై కేసులు పెట్టాలని ఇటీవల శ్రీనివాసరావు పోలీసులను ఆదేశించాడు. ఈ విషయం ఎస్టీలకు తెలియడంతో అతడిని కలిశారు. 'ఏమి ఇప్పటికి కనిపించామా.. ఎన్ని జింకలు తిన్నారు చెప్పండి' అని నాయకుడు అడగడంతో 'మేము వేటాడడానికి ఓగూరులో జింకలు ఎక్కడ ఉన్నాయి.. మాకు ఏ పాపం తెలియదు' అంటూ వారు వాపోయారు. 'మీరు ఇలా చెప్పరులే... పోలీసులే మీ చేత చెప్పిస్తారు' అని శ్రీనివాసరావు వారిని బెదిరించాడు. పోలీసులు వస్తున్నారని తెలుసుకున్న నాలుగు కుటుంబాలకు చెందిన 16 మంది భయపడి ఊరు వదిలి వెళ్లిపోయారు. ఎక్కడికి వెళ్లిపోయారనేది ఆచూకీ లేదు. యానాదులను బెదిరించడం గ్రామంలో చర్చనీయాంశంగా మారింది.

● ముగ్గు-ముచ్చట



ధనుర్మాసం వచ్చిందంటే ఇంటిముంగిట తీర్చిదిద్దిన అందమైన రంగవల్లులు... ముచ్చటైన గొబ్బెమ్మలు... తెలుగింటి ఆడపడచులందరూ తమకు వచ్చిన ముగ్గులను మరొకరితో పంచుకుంటూ... తెలియని వాటిని నేర్చుకుంటూ కనిపిస్తుంటారు. మరి మీరు కూడా ముగ్గులు బాగా వేస్తారా? అలా అయితే ముచ్చటైన మీ ముగ్గులను అందమైన రంగులతో కాగితం మీద పెట్టండి. చుక్కల వివరాలతో సహా వాటిని మాకు పంపండి. అందిన వాటిలో చక్కటి ముగ్గును మీ ఫొటోతో సహా మేము ప్రచురిస్తాం.

ముగ్గులు పంపవలసిన చిరునామా
ముగ్గు-ముచ్చట, సాక్షి ఫ్యామిలీ, సాక్షి టవర్స్, రోడ్ నెం.1, బంజారాహిల్స్, హైదరాబాద్-34.
ఈ మెయిల్: muggulu.sakshi@gmail.com

● న్యూస్‌మేకర్

**కూతురు అంధురాలుగా పుడితే
వదిలి వెళ్లిపోయే తండ్రి ఉండొచ్చుగాని తల్లి ఉండదు.
అస్సాం అంధ క్రికెటర్ సిము దాస్‌ని
తల్లి అంజు దాస్ ఒక్కతే ఎన్నో కష్టాలతో పెంచింది.
ఫలితంగా ఇవాళ కూతురు భారత జట్టు తరఫున
ప్రపంచ కప్పు సాధించిన విజేతగా నిలిచింది.
ఆమెకు అస్సాం ప్రభుత్వం 10 లక్షల నగదు బహుమతి,
ప్రభుత్వ ఉద్యోగం ప్రకటించింది.
ఇదంతా ఆ తల్లి ఓర్పుకు దొరికిన ప్రతిఫలం.**

సిము దాస్

ఆ చూపు ప్రపంచం కప్పు దాకా..

నవంబర్ 23, ఆదివారం రోజు అంజు దాస్ ఎప్పట్లాగే పని ముగించుకుని ఇంటికి బయలు దేరింది. ఆమె అస్సాంలోని నగావ్ జిల్లా కొతియ టోలి అనే పల్లెలో వంట మనిషిగా, పని మనిషిగా జీవిస్తోంది. ఇల్లు మరికాస్త దూరంలో ఉందనగా ఊళ్లో ఉన్న కుర్రాళ్లంతా చప్పట్లతో, కేరింతలతో ఆమెకు ఎదురు వచ్చారు. 'అక్కా. నీ కూతురు సాధించింది. మనం వరల్డ్ కప్ గెలిచాం' అని మెచ్చుకోలుగా వాళ్లు మాట్లాడుతుంటే అంజుదాస్ కళ్ల నుంచి ధారాపాతంగా ఆనంద బాష్పాలు రాలిపడ్డాయి.

తల్లితో సిము దాస్

అస్సాం గవర్నర్ నుంచి ప్రశంస అందుకుంటున్న సిము దాస్

■ ఆమె కూతురు విజేత

అంధ మహిళా క్రికెటర్లను ప్రోత్సహించ డానికి మొట్ట మొదటిసారి 'టి 20 వరల్డ్ కప్ ఫర్ బ్లైండ్ విమెన్'ను కొలంబోలో నవంబర్ 11 నుంచి 23 తేదీల మధ్య నిర్వ హించారు. అమెరికా, ఆస్ట్రేలియా సహా మన పొరుగున ఉన్న దేశాలతో కలిపి మొత్తం ఆరు దేశాలు పాల్గొన్న ఈ పోటీలో ఇండియా జట్టు అప్రతిహతంగా సాగి ఫైనల్స్‌లో నేపాల్‌ను ఓడించి విశ్వ విజేతగా నిలిచింది. ఈ జట్టులో అంజుదాస్ కూతురు సిము దాస్ ఉంది. ఇండియా గెలవడానికి టోర్నమెంట్‌లో మొత్తం 68 విలువైన పరుగులు చేసింది. అస్సాం మారుమూల పల్లెలో నిలువ నీడ లేని కుటుంబం నుంచి కేవలం తల్లి అందించిన ప్రోత్సాహంతో సిము దాస్ ఈ అద్భుతం సాధించింది. ఆ ప్రయాణం అంతా గుర్తుకొచ్చి అంజుదాస్ కళ్లు వర్షించాయి.

■ ప్రధానే స్పందించారు

అంధ మహిళల జట్టు సభ్యులు వరల్డ్ కప్‌తో ఢిల్లీలో ప్రధానిని కలిశారు. ఆ తర్వాత అస్సాంకు సిము దాస్ చేరుకుంటే ఆమెకు ఘన స్వాగతం లభించింది. అయితే ఆ వెంటనే ఒక తెల్లవారు జామున ప్రధాని నుంచి అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మకు ఫోన్ వచ్చింది. 'నువ్వు సిము దాస్‌ను కలిశావా' అని ప్రధాని అడిగారు. 'వెంటనే కలిసి ఆమెకు కావాల్సిన సాయం చేయి' అన్నారు. అప్పటికి బిశ్వ శర్మకు సిము దాస్ గురించి తెలియదు. ఆగమేఘాల మీద తెలుసుకుని ఆమెకు పది లక్షల రూపాయల ఆర్థిక సహాయం ప్రకటించారు. ఉద్యోగం కూడా ఇస్తామని చెప్పారు. అస్సాం గవర్నర్ ఆమెను తన నివాసానికి ఆహ్వానించి మరో లక్ష రూపాయల నజరానా ఇచ్చారు. ఇన్ని ప్రశంసలు సిము దాస్ గెలుపుకు. కాదు కాదు ఆమె తల్లి గెలుపునకు.

■ తండ్రి పారిపోతే...

అంజుదాస్‌కు వివాహం అయ్యాక మొదట కొడుకు పుట్టాడు. ఆ కొడుకు అంధుడే కాదు బధిరుడు కూడా. రెండవసారి కుమార్తె పూర్తి అంధత్వంతో పుట్టింది. కూతురు అంధత్వ వార్త విన్న వెంటనే భర్త మొత్తం కుటుంబాన్ని వది లేసి పారిపోయాడు. వాళ్లకు ఇల్లు కూడా లేదు. ఊరిపెద్ద తన పొలంలో చిన్న గుడిసె వేసుకోమన్నాడు. ఆరోజు నుంచి నేటి వరకూ వాళ్లు ఆ గుడిసెలోనే ఉన్నారు. ఊరి ఉపాధ్యాయుడు సిమును చదివించమని సూచించడంతో తల్లి ధైర్యం చేసి గువహతిలో అంధ బాలికల స్కూల్లో చేర్పించింది. అక్కణ్నుంచి సిము ఢిల్లీ వరకూ వెళ్లి గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి ఇప్పుడు పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేస్తోంది. 2022లో క్రికెట్‌లో ప్రవేశించిన వెంటనే ప్రతిభ చూపుతూ జాతీయ జట్టుకు ఎంపికై ట్వంటీ ట్వంటీ కప్ గెలుపులో కీలకపాత్ర పోషించింది.

■ అమ్మ లేకపోతే...

'అమ్మ లేకపోతే నేను లేను. ఆమె తన జీవితం మొత్తం పోరాడుతూనే ఉంది. నేటికీ మా అన్నయ్యకు ఆమె సేవలు చేస్తోంది. మా కోసమే ఆమె బతికింది. నేను ఆమె కోసమే గెలిచాను. ఇంకా ఆడతాను. మా అమ్మను సంతోషంగా ఉంచాలనేదే నా కోరిక' అంది సిము దాస్.

● మన(సు)లో మాట

నవ్వినా.. ఏడ్చినా... కుప్పకూలిపోతుంటాను..?

డాక్టర్ గారూ, నేనొక చిత్రమైన సమస్యతో బాధపడుతున్నాను. అదేమంటే, రాత్రి నేను ఎంతసేపు పడుకున్నా. రోజంతా మగత గానే ఉంటుంది. కంప్యూటర్ ముందు కూర్చున్నా టీ.వి చూస్తున్నా. చివరకు భోజనం చేస్తూ చేస్తూ అలాగే పడుకుని పోతాను. డ్రైవింగ్ చేస్తూ నిద్రపోతానేమో అని ఈ మధ్య డ్రైవింగ్ చేయడం కూడా మానేశాను. అలాగే బాగా భయపడ్డా, గట్టిగా నవ్వినా కుప్పకూలిపోతాను. నేను కావాలనే ఇదంతా చేస్తున్నాననుకుని మా ఇంట్లో వాళ్లు నన్ను హాస్పిటల్‌కి తీసుకెళ్ళడం లేదు. నేను సాక్షిలో మీ కాలమ్ రెగ్యులర్‌గా చదువుతాను. కనీసం మీ సమాధానం చూసైనా ఇంట్లో వాళ్ళు నన్ను డాక్టర్‌కి చూపిస్తారనే నమ్మకంతో, నా సమస్యను మీకు మెయిల్ చేస్తున్నాను!

– స్వాతి, ప్రొద్దుటూరు

మీ సమస్య చాలా ఇబ్బందికరమైనది, మీ పరిస్థితికి బాధ కూడా కలుగుతోంది. కేవలం అవగాహనా లోపం వలన సరియైన చికిత్స అందుబాటులో ఉన్న సమస్యలని కూడా పట్టించుకోక పోవడం వల్ల ఎలా జరుగుతోందో మీ విషయాన్ని బట్టి అర్థం అవుతుంది. మీరు చెబుతున్న లక్షణాలని బట్టి మీరు 'నార్కోలెప్సీ' అనే సమస్యతో బాధపడుతున్నారని అనిపిస్తోంది. ఇది మెదడులోని 'హైపోథాలమస్ అనే భాగం పని విధానంలో మార్పుల వలన వచ్చే ఒక న్యూరో.. సైకియాట్రిక్ డిజార్డర్. ఈ సమస్యలో నిద్రకి సంబంధించిన సాధారణ లయ దెబ్బ తింటుంది. నిద్రలో వచ్చే REM & NREM అనే రెండు నిద్ర దశల క్రమ పద్ధతిలో మార్పులు ఈ సమస్యకి ప్రధాన కారణం. దాని వలన పడుకునే ముందు, నిద్ర లేచే ముందు వివిధ రకాల భ్రాంతులు కలుగుతాయి. విపరీతమైన కలలు వస్తాయి. నిద్ర లేచే ముందు శరీరం పక్షవాతానికి గురైనట్లు అనిపిస్తుంది. కాళ్లూ చేతులు కదిలించలేరు. అన్నీ వినబడతాయి, కనబడతాయి, కానీ సమాధానం చెప్పలేరు. దీని వలన విపరీతమైన భయానికి, అసౌకర్యానికీ గురౌతారు. అలాగే బాగా ఎమోషనల్ అయినప్పుడు మెలకువ స్థితిలోనే, మెదడు REM స్థితిలోకి వెళ్ళిపోతుంది. దీనివలన ఒక్కసారిగా కుప్పకూలిపోతారు. ఈ అనుభవం కూడా అత్యంత భయానకంగా ఉంటుంది. ఒక్కొక్కసారి ఈ కండిషన్‌ను 'ఫిట్స్' అనుకొని తప్పుగా వైద్యం కూడా చేసే కేసులు కూడా చూస్తుంటాను. కొంతమంది కావాలనే ఇలా చేస్తున్నారనే అసలు చికిత్సే ఇప్పించరు. పాలిసోమ్నోగ్రఫీ అనే పరీక్ష ద్వారా ఈ సమస్యను నిర్ధారించవచ్చు. అలాగే 'స్టిమ్యులెంట్సు, కొన్ని రకాల 'యాంటీ డిప్రెసెంట్' మందులు వాడితే ఈ సమస్య నియంత్రణలో ఉంటుంది. ఎక్కువగా ఎమోషన్స్ కి గురికాకుండా కౌన్సెలింగ్ కూడా తీసుకోవాలి. ఉదయంపూట కొంచెంసేపు నిద్రపోవడం కూడా ఈ సమస్యలోంచి బయట పడేందుకు దోహదం చేస్తుంది. మీరు నిరాశకు గురికాకుండా మీ ఇంట్లో వాళ్ళకి 'సాక్షి'లో నా సలహా చూపించండి. అర్థం చేసుకొని మీకు వైద్య సహాయం అందిస్తారని నా నమ్మకం. ఆల్ ది బెస్ట్!

డా. ఇండ్ల విశాల్ రెడ్డి,
సీనియర్ సైకియాట్రిస్ట్, విజయవాడ. మీ సమస్యలు, సందేహాలు పంపవలసిన మెయిల్ ఐడీ:
sakshifamily3@gmail.com

● బ్యూటిప్స్

వైట్ హెయిర్‌కి నట్స్ షెల్స్ తో చెక్

వాల్‌నట్స్ లోపల ఉన్న పప్పుని తీసుకుని షెల్స్‌ని పడేస్తుంటారు. కానీ వాల్‌నట్స్ షెల్స్ తెల్లజుట్టుని నల్లగా మార్చడంలో ప్రముఖ పాత్ర పోషిస్తాయి. వాల్‌నట్స్ షెల్స్‌ను మెత్తగా పొడిచేసుకోవాలి. ఆరు టేబుల్ స్పూన్ల పొడిని లీటరు నీటిలో వేసి అరగంటపాటు మరిగించాలి. మరిగిన నీటిని చల్లారాక వడగట్టాలి. ఈ నీటిని కుదుళ్ల నుంచి చివర్ల వరకు పట్టి మర్దన చేయాలి. రెండు గంటల తరువాత కడిగేయాలి. వారానికి రెండు సార్లు ఈ విధంగా చేయడం వల్ల మూడు నెలల్లో తెల్లజుట్టు నల్లగా... ఒత్తుగా మారు

● స్టడీ

ప్రమాద ఘంటికలు



'జిమ్‌కు వెళ్లేవారు స్టెరాయిడ్‌లు వాడుతున్నారు' అనే మాట వినిపించినప్పుడు కళ్ల ముందు కండలు తిరిగిన పురుషుడి చిత్రం ఆవిష్కృతం అవుతుంది. అయితే సీన్ మారుతోంది. పురుషులే కాదు స్టెరాయిడ్‌లు వాడుతున్న మహిళల సంఖ్య కూడా పెరుగుతున్నట్లు నివేదికలు చెబుతున్నాయి...

ప్రపంచవ్యాప్తంగా మహిళలలో అనబాలిక్ స్టెరాయిడ్‌ల వాడకం పెరిగిందని చెబుతోంది ఇంటర్నేషనల్ స్టడీస్ సిస్టమేటిక్ రివ్యూ. 2014లో స్టెరాయిడ్‌లు వాడిన మహిళలు 1.6 శాతం ఉండగా, 2024 రివ్యూ ప్రకారం 4 శాతం మంది మహిళలు స్టెరాయిడ్‌లు ఉపయోగిస్తున్నారు.

- మహిళా బాడీబిల్డర్‌లలో దాదాపు 17 శాతం మంది, ప్రతి ఆరుగురిలో ఒకరు స్టెరాయిడ్‌లను ఉపయోగిస్తున్నారని నివేదిక చెబుతోంది. ఈ పెరుగుదలకు సోషల్ మీడియాలోని 'ఫిట్‌ఫ్లూయెన్సర్స్' ప్రభావమే కారణం అనే విమర్శ ఉంది.
- స్టెరాయిడ్‌లు వాడుతున్న వారిలో ఎక్కువ మంది మహిళలకు దీర్ఘకాలంలో వాటి దుష్ప్రభావం గురించి అవగాహన లేదు. వీటిని వాడుతున్న క్రమంలో అనారోగ్య సమస్యలు ఎదురైనా వైద్యులను సంప్రదించడం లేదు.
- గతంతో పోల్చితే పవర్‌లిఫ్టింగ్, వెయిట్ లిఫ్టింగ్, బాడీబిల్డింగ్‌లలో మహిళల సంఖ్య వేగంగా పెరిగింది. 'ఆటతీరు మెరుగు పడాలి. ప్రత్యర్థిపై పైచేయి ఉండాలంటే మాదకద్రవ్యాలు వాడాలి' అనే భావన వల్ల కొందరు వాటికి దగ్గరవుతున్నారు.
- ఆస్ట్రేలియా, స్కాండినేవియాలలో చేసిన ఒక అధ్యయనం ప్రకారం...

పురుష స్నేహితులు, కోచ్‌ల వల్ల స్టెరాయిడ్‌లను ఉపయోగించడం మొదలు పెడతారు. ఇవి హానికరం అనే భావన కంటే పోటీకి అనివార్యమనే భావనే వారిలో ఉంటుంది.

స్టెరాయిడ్‌లు ఆటకు ఎంత మేలు చేస్తాయనేది పక్కన పెడితే ఆరోగ్యానికి హాని చేస్తాయి.

వాటిలో కొన్ని...

- ముఖంపై వెంట్రుకలు పెరగడం
- స్వరంలో మార్పులు
- రుతుక్రమంలో మార్పులు, సంతానలేమి
- రొమ్ము కణజాలం తగ్గడం
- మొటిమలు రావడం, వెంట్రుకలు రాలడం
- ఆందోళన, చిరాకు, తీవ్రమైన మానసిక స్థితి

స్టెరాయిడ్‌లలో సీసం, ఆర్సెనిక్, కాడ్మియంలాంటి ప్రమాదకరమైన విషపూరితాలు ఉంటాయని పరిశోధనలు తెలియజేస్తున్నాయి. ఇవి క్యాన్సర్, హృదయ సంబంధ వ్యాధులకు కారణమయ్యే విషాలు.

'ఈ ప్రమాదాలను నివారించాలంటే స్టెరాయిడ్‌ల వాడకం వల్ల కలిగే నష్టాల గురించి సోషల్ మీడియా వేదికగా ఫిట్‌నెస్ ఇన్‌ఫ్లూయెన్సర్‌ల ద్వారా విస్తృత ప్రచారం చేయడమే మార్గం' అంటున్నారు నిపుణులు.

న్యూస్‌సీన్

అందరి అమ్మ అల్కా శర్మ

భగవంతుడి అనుగ్రహాలూ, లీలలూ చాలా చిత్రవిచిత్రంగా ఉంటాయి. చాలామందిని దీవించి, వరాలిచ్చి పంపుతుంటాడా... మరి కొందరి పట్ల ఆగ్రహించడం ద్వారా చాలామందిని అనుగ్రహిస్తుంటాడు దేవుడు. అలా ఓ చిన్నారి బిడ్డకు శిక్ష విధించి... ''ఇలాంటి అభాగ్యులెందరో ఉంటారూ... వాళ్లకు నువ్వు సేవలందించ''మంటూ ఓ తల్లికి అనాథల బాధ్యతలు అప్పగించాడు. భగవంతుడు ఆదరించకపోతే అదెంత బాధాకరంగా ఉంటుందో అనుభవమైంది కాబట్టి... అలాంటి అభాగ్యులెందరినో ఆమె ఆదరిస్తోంది. హిమాచల్ ప్రదేశ్‌కు చెందిన ఓ తల్లే అల్కా శర్మ. ఎందరిలోనో స్ఫూర్తి నింపే ఆ అమ్మ కథేమిటో చూద్దాం.

దేవుడెందుకోగానీ... అల్కా శర్మ పట్ల నిర్దయగా ఉన్నాడు. ఆమె కొడుకైన అయాన్‌కు 'ఆప్సోక్లోనస్ మయోక్లోనస్ సిండ్రోమ్' – (ఓఎమ్ఎస్) అనే ఓ అరుదైన వ్యాధిని అనుగ్రహించాడు. ఆ వ్యాధి కూడా చాలా చిత్రమైంది. తాను నమ్ముకున్న భగవంతుడే తనను శిక్షించినట్టుగా... తన సొంత వ్యాధి నిరోధకవ్యవస్థ తననే కబళించి దెబ్బతీసే 'ఆటో ఇమ్యూన్' వ్యాధి అది. అమాయకమైన చిన్నారులను దెబ్బతీసే ఆ వ్యాధి... ఏదైనా వైరల్ ఇన్ఫెక్షన్ తర్వాత లేదా న్యూరోబ్లాస్టోమా అనే నరాల వ్యాధి వచ్చాక బయటపడుతుంది.

ఈ వ్యాధి లక్షణాలేమిటంటే..?

ఈ వ్యాధి ఉన్నవారి కనుగుడ్లు అత్యంత వేగంగా చకచకా అటు ఇటూ కదిలిపోతుంటాయి. ఈ కండిషన్‌ను 'ఆప్సోక్లోనస్' అంటారు. ఇలా కనుగుడ్లు చకచకా కదలడాన్ని 'డాన్సింగ్ ఐస్' (నాట్యం చేస్తున్న కళ్లు)గా కూడా అభివర్ణిస్తారు. దీనినే వైద్యపరిభాషలో 'నిస్టాగ్మస్' అంటారు. ఇక కండరాలపై అదుపు ఉండక అవి కూడా వాటంతటవే కదిలిపోతుంటాయి. ఫలితంగా కాళ్లూ చేతుల కండరాలపై పట్టు ఉండదు. ఒక్కోసారి నాలుక కండరంపైనా అదుపు ఉండదు కాబట్టి మాట ముద్ద ముద్దగా వస్తుంటుంది.

ఇలా కళ్లూ, కాళ్లూ, కండరాలపై అదుపు ఉండని ఈ 'ఆప్సోక్లోనస్ మయోక్లోనస్ సిండ్రోమ్'తో తన బిడ్డను అనుగ్రహించగానే ఓ చిర్నవ్వు నవ్వింది ఆ తల్లి. 'ఓహో... నాకీ శిక్ష విధించి ఇలాంటి అభాగ్యులెందరి బాధలనో గుర్తించమంటూ నన్ను అనుగ్రహించావా తండ్రీ'' అంటూ ఆ తల్లి అల్కా శర్మ తన బిడ్డల్లాంటి ఎందరో దివ్యాంగ బిడ్డలకేసి దయగా చూసింది. వాళ్ల బాధలు బాపేందుకు పూనుకుంది. తన భర్త నీరజ్ శర్మ కూడా ఆమె సంకల్పానికి తన చేయూతనిచ్చారు.

అప్పటికి తనకున్న బంగారాన్నీ, ఆభరణాలనూ అన్నింటినీ అమ్మేసి వచ్చిన డబ్బుతో హిమాచల్‌ప్రదేశ్‌లోని కాంగ్రా జిల్లా, ఫతేపూర్ తహసిల్‌లోని ఛత్తర్ అనే చోట దివ్యాంగులైన పిల్లల కోసం ఓ అనాథాశ్రమాన్ని ప్రారంభించింది. 'ఏంజెల్ డిజేబిలిటీ అండ్ ఆర్ఫనేజ్ హోమ్' అనే ఆ అనాథాశ్రమాన్ని మొదలుపెట్టిన నాటి నుంచీ... అంటే 2018 మొదలుకొని ఇప్పటివరకూ దాదాపు 160 మందికి పైగా దివ్యాంగ బాలిబాలికలలకు నివాస ఫిజియోథెరపీ సేవలనూ, స్పీచ్ థెరపీ వంటి చికిత్సలద్వారా సేవలందిస్తోంది అల్కా. ఈ పిల్లల్లో చాలామంది ఇప్పుడు తమ వైకల్యాన్ని అధిగమిస్తూ తమ పనులు తాము చేసుకునేలా స్వావలంబన సాధించారు.

ఇలా తన కొడుకుకు వైకల్యాన్ని ఇవ్వడం ద్వారా ఆ భగవంతుడు తనపై అలక బూనినా తాను మాత్రం తన సేవా అసిధారా వ్రతాన్ని అదేపనిగా కొనసాగిస్తూ పిల్లలను అనుగ్రహిస్తూనే ఉంది అమ్మ అల్క శర్మ.

– యాసీన్

● కొత్త దారి

అన్‌స్కూలింగ్

తల్లిదండ్రులు తమ పిల్లలను మంచి స్కూలుకు పంపాలనుకోవడం సహజం. అయితే ఈ కోల్‌కతా దంపతులు మాత్రం 'మా పిల్లలను స్కూలుకు పంపించంగాక పంపించం' అంటున్నారు. వీరి 'అన్‌స్కూలింగ్' సిద్ధాంతం ఆన్‌లైన్‌లో చర్చనీయాంశంగా మారింది.

ఈ దంపతుల దృష్టిలో సంప్రదాయ విద్య అనేది...వేస్ట్ ఆఫ్ టైమ్!

సంప్రదాయ బడుల కంటే 'ప్రాక్టికల్ ఎక్స్‌పీరియెన్స్' ద్వారా తమ పిల్లలకు చదువు చెప్పడానికి రంగంలో దిగారు.

ట్రావెల్, నేచర్ వాక్స్, వర్క్ షాప్స్, హ్యాండ్స్-ఆన్ యాక్టివిటీల ద్వారా తమ పిల్లలకు చదువు నేర్పిస్తున్నారు. విద్యాబోధనలో కొత్తదారిలో ప్రయాణిస్తున్న ఈ తల్లిదండ్రుల గురించి సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెనర్-నటి షెనాజ్ ట్రెజరీ ఒక వీడియోను షేర్ చేసింది.

ట్రావెలింగ్ ద్వారా పిల్లలు చరిత్రను బాగా అర్థం చేసుకుంటారని, పిల్లలకు ఇష్టమైన క్రికెట్ ద్వారా కూడా వారికి కష్టమనిపించే గణితాన్ని సులభంగా నేర్పించవచ్చనీ అంటున్నారు.

సంప్రదాయ కెరీర్ మార్గాలలో వెళ్లడం కంటే తమ పిల్లలను ఎంటర్‌ప్రెన్యూర్‌లుగా చూడాలని వీరు కోరుకుంటున్నారు.

'స్కూలుకు వెళ్లే విద్యార్థులు నేర్చుకోవడం కంటే ఎక్కువగా అలసిపోతున్నారు. అందుకే మేము అన్‌స్కూలింగ్ కాన్సెప్ట్‌ను ఎంచుకున్నాం. నిర్మాణాత్మక పాఠ్యాంశాలు కాకుండా పిల్లలు ఆసక్తి చూపించే అభ్యాస విధానం మంచిది. పాఠశాల విద్యతో పోల్చితే ఇంటి విద్యలో పేరెంట్స్ బాగా ఇన్‌వాల్వ్ అవుతారు' అన్నారీ దంపతులు.

ఈ వీడియోపై సోషల్ మీడియాలో రకరకాల అభిప్రాయాలు వెల్లువెత్తాయి.

'నేను కూడా మీ మార్గాన్నే అనుసరిస్తున్నాను' అని స్పందించారు సెలబ్రిటీ సారా అఫ్రీన్ ఖాన్.

'సంప్రదాయ పాఠశాల విద్య పక్కా వ్యాపారంగా మారినప్పుడు అన్‌స్కూలింగ్ అనుసరించదగిన మార్గం' అని మరొకరు స్పందించారు.

కొందరు మాత్రం ఇలా స్పందించారు...

'తోటివారితో ఎలా మెలగాలి... ఇంకా ఇతర సామాజిక సంబంధాలను అవగాహన చేసుకోవడం అనేది అన్‌స్కూలింగ్ ద్వారా సాధ్యపడదు. స్కూలు అనేది మినీ సమాజం. అక్కడ భవిష్యత్‌కు సంబంధించి ఎన్నో విషయాలను పిల్లలు సహజంగానే నేర్చుకోగలుగుతారు. బాల్య స్నేహాలకు సంబంధించి మధుర జ్ఞాపకాలకు అన్‌స్కూలింగ్‌లో అవకాశం లేదు'.

● కిచెన్‌టిప్స్

- పప్పులకు పురుగు పట్టకుండా ఎక్కువరోజులు తాజాగా ఉండాలంటే వాటిని నిల్వ చేసే డబ్బాలలో అడుగున నాలుగైదు వెల్లుల్లి రేకలు వేయాలి.
- కూరలలో ఉప్పు ఎక్కువైందనిపిస్తే వేయించిన వరిపిండిని కలపాలి.
- పప్పులో ఒక స్పూను రిఫైన్డ్ ఆయిల్ లేదా రెండు వెల్లుల్లి రేకలు వేసి వండినట్లయితే గ్యాస్ట్రిక్ ట్రబుల్‌ను తగ్గుతుంది.
- కూరగాయలను ఉడికించేటప్పుడు ముందుగా నీటిని వేడిచేసి అప్పుడు ముక్కలను వేయాలి. ఎక్కువ సేపు నీటిలో ఉండేకొద్దీ పోషకాలు నశిస్తుంటాయి. కాబట్టి నీటిలో ఉండే సమయాన్ని తగ్గించడానికి ఇదొక పద్ధతి.

బులియన్
(బంగారం 10 గ్రా.; వెండి కిలో)
డిసెంబర్ 10న ముగింపు రూ.లలో

హైదరాబాద్		విజయవాడ		విశాఖపట్నం		రాజమండ్రి		ప్రొద్దుటూరు		చెన్నై	
బంగారం (24 క్యారెట్లు)	1,28,610	బంగారం (24 క్యారెట్లు)	1,32,330	బంగారం (24 క్యారెట్లు)	1,30,310	బంగారం (24 క్యారెట్లు)	1,32,330	బంగారం (24 క్యారెట్లు)	1,27,800	బంగారం (24 క్యారెట్లు)	1,31,230
బంగారం (22 క్యారెట్లు)	1,18,100	బంగారం (22 క్యారెట్లు)	1,19,450	బంగారం (22 క్యారెట్లు)	1,19,450	బంగారం (22 క్యారెట్లు)	1,23,030	బంగారం (22 క్యారెట్లు)	1,17,580	బంగారం (22 క్యారెట్లు)	1,20,300
వెండి	1,87,000	వెండి	1,91,300	వెండి	2,07,000	వెండి	1,91,300	వెండి	1,83,000	వెండి	2,07,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.



'లండన్ స్పిరిట్' మెంటార్‌గా దినేశ్ కార్తీక్

లండన్: భారత మాజీ క్రికెటర్ దినేశ్ కార్తీక్... 'ది హండ్రెడ్' క్రికెట్ లీగ్‌లో 'లండన్ స్పిరిట్' ఫ్రాంచైజీ మెంటార్, బ్యాటింగ్ కోచ్‌గా నియమితుడయ్యాడు. ఈ మేరకు బుధవారం ఫ్రాంచైజీ వివరాలు వెల్లడించింది. ఐపీఎల్‌లో ఆర్‌సీబీ జట్టుకు మెంటార్‌గా ఉన్న దినేశ్ కార్తీక్... విదేశీ లీగ్‌లకు కోచ్, మెంటార్‌గా వ్యవహరించనుండటం ఇదే తొలిసారి. 'కార్తీక్‌ను లండన్ స్పిరిట్ బృందంలోకి సాదరంగా ఆహ్వానిస్తున్నాం. అతడికి ఆటపై అపార అనుభవం ఉంది. అది మాకు ఎంతగానో ఉపయోగ పడనుంది. అతడితో కలిసి పని చేసేందుకు ఆసక్తిగా ఎదురుచూస్తున్నాం' అని లండన్ స్పిరిట్ జట్టు డైరెక్టర్ మొ బొబాట్ తెలిపారు. గతేడాది ఐపీఎల్ అనంతరం రిటైర్మెంట్ ప్రకటించిన 40 ఏళ్ల కార్తీక్... ప్రస్తుతం ఐఎల్‌టి20 లీగ్‌లో పార్ల్ రాయల్స్‌కు ఆడుతున్నాడు. 'లండన్ స్పిరిట్ బృందంలో భాగం కావడం ఆనందంగా ఉంది. ప్రఖ్యాత లార్డ్స్ మైదానంలో నాకు ఎన్నో మధుర జ్ఞాపకాలు ఉన్నాయి. నేను భారత జట్టు తరఫున అరంగేట్రం చేసింది ఇక్కడే. టీమిండియా తరఫున చివరి టెస్టు మ్యాచ్ కూడా ఇక్కడే ఆడాను. లార్డ్స్ నా మనసుకు ఎంతో దగ్గరైంది. అలాంటి చోట చక్కటి బృందంతో కలిసి పనిచేసేందుకు ఉత్సుకతగా చూస్తున్నా' అని టీమిండియా తరఫున 26 టెస్టులు, 94 వన్డేలు, 60 టి20లు ఆడిన కార్తీక్ అన్నాడు.

యువ భారత్‌కు కాంస్యం

- కాంస్య పతక మ్యాచ్‌లో అర్జెంటీనాపై 4–2తో విజయం
- చివరి 11 నిమిషాల్లో 4 గోల్స్ చేసిన టీమిండియా
- ఫైనల్లో స్పెయిన్‌పై గెలిచి టైటిల్ నిలబెట్టుకున్న జర్మనీ

చెన్నై: సొంతగడ్డపై జరిగిన పురుషుల జూనియర్ అండర్–21 ప్రపంచకప్ హాకీ టోర్నీలో భారత జట్టు కాంస్య పతకాన్ని సొంతం చేసుకుంది. బుధవారం జరిగిన కాంస్య పతక మ్యాచ్‌లో రోహిత్ సారథ్యంలోని యువ భారత జట్టు 4–2 గోల్స్ తేడాతో విజయం సాధించింది. భారత్ తరఫున అంకిత్ పాల్ (49వ నిమిషంలో), మన్‌మీత్ సింగ్ (52వ నిమిషంలో), శార్దానంద్ తివారి (57వ నిమిషంలో), అన్‌మోల్ ఎక్కా (58వ నిమిషంలో) ఒక్కో గోల్ చేశారు. అర్జెంటీనా జట్టుకు నికోలస్ రోడ్రిగెజ్ (3వ నిమిషంలో), సాంటియాగో ఫెర్నాండెజ్ (44వ నిమిషంలో) ఒక్కో గోల్ అందించారు. ఒకదశలో 0–2తో వెనుకబడి ఓటమి వైపు పయనిస్తున్న యువ భారత జట్టు చివరి 11 నిమిషాల్లో ఒక్కసారిగా విజృంభించింది. ఏకంగా నాలుగు గోల్స్ చేసి అద్భుత విజయాన్ని సాధించింది. భారత్ చేసిన నాలుగు గోల్స్‌లో మూడు పెనాల్టీ కార్నర్‌ల ద్వారా, ఒకటి పెనాల్టీ స్ట్రోక్ ద్వారా రావడం విశేషం. మ్యాచ్ మొత్తంలో భారత్‌కు ఏడు పెనాల్టీ కార్నర్‌లు, ఒక పెనాల్టీ స్ట్రోక్... అర్జెంటీనా జట్టుకు ఆరు పెనాల్టీ కార్నర్‌లు, ఒక పెనాల్టీ స్ట్రోక్ లభించాయి. 46 ఏళ్ల ఈ టోర్నీ చరిత్రలో భారత జట్టు కాంస్య పతకం సాధించడం ఇదే తొలిసారి. 2001లో, 2016లో విజేతగా... 1997లో రన్నరప్‌గా నిలిచిన భారత్ 2005, 2021, 2023లలో కాంస్య పతక మ్యాచ్‌ల్లో ఓడిపోయి నాలుగో స్థానాన్ని దక్కించుకుంది. నాలుగో ప్రయత్నంలో భారత జట్టు కాంస్య పతక మ్యాచ్‌లో నెగ్గడం విశేషం.

ఒక్కొక్కరికి రూ. 5 లక్షలు

కాంస్య పతకం సాధించిన భారత జట్టుకు హాకీ ఇండియా నజరానా ప్రకటించింది. జట్టులోని ప్రతి సభ్యుడికి రూ. 5 లక్షలు... కోచింగ్ బృందంలోని వారికి రూ. 2 లక్షల 50 వేల చొప్పున నగదు పురస్కారం అందజేయనుంది.

జర్మనీ 8వ సారి...

మరోవైపు డిఫెండింగ్ చాంపియన్ జర్మనీ జట్టు టైటిల్ నిలబెట్టుకుంది. 'షూటౌట్'కు దారి తీసిన ఫైనల్లో జర్మనీ 3–2 గోల్స్ తేడాతో స్పెయిన్ జట్టును ఓడించి ఎనిమిదోసారి టైటిల్‌ను సొంతం చేసుకుంది. గతంలో జర్మనీ 1982, 1985, 1989, 1993, 2009, 2013, 2023లలో కూడా విజేతగా నిలిచింది.

క్రికెట్ తర్వాతే ఏదైనా: స్మృతి

న్యూఢిల్లీ: తన జీవితంలో క్రికెట్ కంటే ఇష్టమైనది మరొకటి లేదని భారత మహిళల క్రికెట్ జట్టు వైస్ కెప్టెన్ స్మృతి మంధాన పేర్కొంది. న్యూఢిల్లీలో జరిగిన అమెజాన్ సంభవ్ సమ్మిట్‌లో పాల్గొన్న సందర్భంగా స్మృతి మాట్లాడుతూ... 'నేను క్రికెట్ కంటే ఎక్కువ ప్రేమించే విషయం ప్రపంచంలో మరొకటి లేదు. భారత జెర్సీ వేసుకోవడం కన్నా పెద్ద గౌరవం ఏం ఉంటుంది. అది నాకు ఎంతో స్ఫూర్తినిస్తుంది. సమస్యలన్నీ పక్కనపెట్టి లక్ష్యంపై దృష్టి సారించేందుకు ఉపకరిస్తుంది. చిన్నప్పుడు బ్యాట్ పట్టుకున్నప్పటి నుంచి నా మదిలో ఎప్పుడూ ప్రపంచ చాంపియన్‌గా ఎదగాలనే కోరిక ఉండేది. అది ఇటీవల నిజమైంది. వన్డే ప్రపంచకప్ ఫైనల్లో నెగ్గడం మా జీవితంలో అతిగొప్ప క్షణం. ట్రోఫీ హస్తగతం అయిన సమయంలో కన్నీళ్లు ఆగలేదు' అని స్మృతి వివరించింది.

జోరు కొనసాగించాలని...

నేడు దక్షిణాఫ్రికాతో భారత్ రెండో టి20

- పటిష్టంగా టీమిండియా
- సమం చేయాలని సఫారీలు
- రాత్రి 7 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో హాట్‌స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం

ముల్లాన్‌పూర్: సొంతగడ్డపై ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టి ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో శుభారంభం చేసిన భారత క్రికెట్ జట్టు... గురువారం దక్షిణాఫ్రికాతో రెండో టి20 ఆడనుంది. వచ్చే ఏడాది ఆరంభంలో స్వదేశంలో టి20 ప్రపంచకప్ జరగనుండగా... దానికి ముందు టీమిండియా మరో తొమ్మిది మ్యాచ్‌లు మాత్రమే ఆడనుంది. ఇందులోనే జట్టు బలాబలాలు, కూర్పును సరిచూసుకోవాలని భావిస్తున్న టీమ్ మేనేజ్‌మెంట్ కటక్‌లో ఆడిన జట్టుతోనే రెండో మ్యాచ్ బరిలోకి దిగనుంది. తొలి మ్యాచ్‌లో బంతి కాస్త ఆగి వస్తున్న పిచ్‌పై మన టాపార్డర్ పెద్దగా ఆకట్టుకోలేకపోయింది. అయినా స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా ధనాధన్ ఆటతో మంచి స్కోరు చేసిన టీమిండియా... కట్టుదిట్టమైన బౌలింగ్‌తో మెరిపించింది. దక్షిణాఫ్రికా టి20 చరిత్రలోనే అత్యల్ప స్కోరు నమోదులో మన బౌలర్ల ప్రతిభ ఎంతో ఉంది. ఇప్పుడు అదే జోరు సాగిస్తూ రెండో మ్యాచ్‌లోనూ గెలిచి సిరీస్‌లో మరింత ఆధిక్యం సాధించాలని సూర్యకుమార్ యాదవ్ సారథ్యంలోని భారత్ భావిస్తుండగా... తొలి మ్యాచ్‌లో తేలిపోయిన దక్షిణాఫ్రికా ఈ పోరులో సత్తా చాటి సిరీస్ సమం చేయాలని చూస్తోంది.

టాపార్డర్ రాణించేనా!

పిచ్, ప్రత్యర్థితో సంబంధం లేకుండా దూకుడే పరమావధిగా దూసుకెళ్తున్న భారత యువ ఓపెనర్ అభిషేక్ శర్మపై అందరి దృష్టి నిలవనుంది. ముల్లాన్‌పూర్‌లో మంచి అనుభవం ఉన్న ఈ పంజాబ్ చిన్నోడు సొంతగడ్డపై ఎలాంటి ప్రదర్శన కనబరుస్తాడో చూడాలి. ఇటీవల సయ్యద్ ముస్తాక్ అలీ టి20 టోర్నీలో సిక్స్‌ల వర్షం కురిపించిన అభిషేక్... అదే పరాక్రమం కొనసాగించాలని అభిమానులు ఆశిస్తున్నారు. ఇక భారత వన్డే, టెస్టు రెగ్యులర్ కెప్టెన్ శుబ్‌మన్ గిల్ గత మ్యాచ్‌లో ఎక్కువసేపు నిలవలేకపోయాడు. గాయం నుంచి కోలుకొని జట్టులోకి వచ్చిన గిల్ మంచి ఇన్నింగ్స్ ఆడాల్సి ఉండగా... మిడిలార్డర్‌లో సూర్యకుమార్ యాదవ్, తిలక్ వర్మ కీలకం కానున్నారు. పరిస్థితులను బట్టి గేర్లు మార్చే సత్తా వీరిలో పుష్కలం. ఇక గాయం నుంచి కోలుకొని గత మ్యాచ్ ద్వారా పునరాగమనం చేసిన పాండ్యా... తన విలువ ఎంతో చాటుకున్నాడు. అటు బంతితో ఇటు బ్యాట్‌తో విజృంభించిన హార్దిక్ నుంచి మేనేజ్‌మెంట్ ఇలాంటి ప్రదర్శనే ఆశిస్తోంది. శివమ్ దూబే, జితేశ్ శర్మ ఫినిషర్ల బాధ్యత నిర్వర్తించనున్నారు. గత మ్యాచ్ ద్వారానే మూడు ఫార్మాట్‌లలో వంద వికెట్లు తీసిన తొలి భారత బౌలర్‌గా రికార్డు సృష్టించిన స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రాతో పాటు అర్ష్‌దీప్ సింగ్ బౌలింగ్‌లో కీలకం కానున్నారు. వరుణ్ చక్రవర్తి, అక్షర్ పటేల్ స్పిన్ బాధ్యతలు మోయనున్నారు.

మార్పుల్లేకుండా సఫారీ జట్టు...

మార్‌క్రమ్, యాన్సెన్

స్టార్లతో నిండి ఉన్న దక్షిణాఫ్రికా జట్టు కటక్ పిచ్‌పై ఓ మాదిరి లక్ష్యాన్ని ఛేదించలేక చతికిల బడింది. ఆ పరాజయం నుంచి పాఠాలు నేర్చుకొని రెండో మ్యాచ్‌లో పూర్తిస్థాయిలో దుమ్మురేపాలని సఫారీలు భావిస్తున్నారు. డికాక్, మార్క్‌రమ్, స్టబ్స్, బ్రెవిస్, మిల్లర్, యాన్సెన్ రూపంలో ఆ జట్టులో ప్రతిభకు కొదవ లేకపోవడంతో తొలి మ్యాచ్‌లో ఆడిన జట్టుతోనే బరిలోకి దిగనుంది. తొలి స్పెల్‌లో అర్ష్‌దీప్ కట్టిపడేయడంతో వెనుకంజలో పడ్డ సఫారీలు ఆ తర్వాత కోలుకోలేకపోయారు. దీంతో అతడిని ఎలా ఎదుర్కోవాలనే దానిపై 'ప్రొటీస్' కసరత్తులు ప్రారంభించారు. ఇక మధ్య ఓవర్లలో భారత స్పిన్నర్లు పరుగుల వేగాన్ని నియంత్రిస్తుండటంతో... దానికి విరుగుడు కనిపెట్టాలని దక్షిణాఫ్రికా భావిస్తోంది. ఓపెనర్లు, మార్‌క్రమ్, డికాక్‌లో ఒకరు సుదీర్ఘ ఇన్నింగ్స్ ఆడితే... మిగిలిన వాళ్లు ధనాధన్ షాట్‌లతో స్కోరు వేగం పెంచగలరు. బౌలింగ్‌లో ఎన్‌గిడి, నోర్జే, యాన్సెన్ కీలకం కానున్నారు. తొలి మ్యాచ్‌లో ఎంగిడి భారత టాపార్డర్ పని పట్టాడు. ఊరించే బంతులతో మూడు వికెట్లు ఖాతాలో వేసుకున్నాడు. ఈసారి అతడిని జాగ్రత్తగా ఎదుర్కోక తప్పదు. యాన్సెన్ వికెట్లు తీయకపోయినా 4 ఓవర్లలో కేవలం 23 పరుగులే ఇచ్చాడు. సఫారీ స్పిన్నర్లను మనవాళ్లు మరోసారి టార్గెట్ చేసుకునే అవకాశం ఉంది.

పిచ్, వాతావరణం

ఈ మైదానంలో ఇదే తొలి అంతర్జాతీయ పురుషుల మ్యాచ్. గతంలో ఐపీఎల్ మ్యాచ్‌లతో పాటు... రెండు మహిళల మ్యాచ్‌లకు ఈ స్టేడియం ఆతిథ్యమిచ్చింది. పిచ్ అటు బ్యాటర్లతో పాటు ఇటు పేసర్లకు సహకరించనుంది. మంచు ప్రభావం ఎక్కువ ఉండకపోవచ్చు.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

సాక్షి సినిమా

రోషన్‌ని చూస్తుంటే చరణ్‌ని చూసినట్లుంది: రానా

సందీప్ రాజ్, సాక్షి, రానా, రోషన్, విశ్వప్రసాద్, మారుతి

''మోగ్లీ 2025' సినిమాలో రోషన్‌ను చూస్తుంటే, 'చిరుత' సినిమాలో చరణ్‌ని చూసినట్లు నాకు అనిపించింది. రోషన్‌కి ఆల్ ది బెస్ట్. 'కలర్‌ఫోటో' వంటి హిట్ ఫిల్మ్ తర్వాత 'మోగ్లీ 2025' సినిమా తీయడానికి ఐదు సంవత్సరాలు పట్టిందని సందీప్ బాధపడుతున్నాడు. కానీ, సమయం గడిచిపోతుంది. సినిమాలు నిలిచిపోతాయి. 'కలర్‌ఫోటో'లానే 'మోగ్లీ 2025' సినిమా కూడా నిలిచిపోతుందని ఆశిస్తున్నాను'' అని అన్నారు హీరో రానా. రోషన్ కనకాల, సాక్షి మడోల్కర్ జంటగా, హర్ష చెముడు, బండి సరోజ్ కుమార్ కీలక పాత్రల్లో నటించిన సినిమా 'మోగ్లీ 2025'. సందీప్ రాజ్ దర్శకత్వంలో టీజీ విశ్వ ప్రసాద్, కృతీప్రసాద్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 13న థియేటర్స్‌లో రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో జరిగిన ఈ సినిమా ప్రీ రిలీజ్ వేడుకకు ముఖ్య అతిథిగా హాజరైన రానా ఈ సినిమా టికెట్‌ను కొనుగోలు చేయగా, మరో అతిథిగా హాజరైన దర్శక–నిర్మాత మారుతి 'మోగ్లీ 2025' సినిమాలోని హీరో ఇంట్రడక్షన్ సాంగ్‌ను రిలీజ్ చేశారు.

రోషన్ మాట్లాడుతూ–''ప్రతి మనిషిలో ఏదో ఒక యుద్ధం జరుగుతూనే ఉంటుంది. ప్రేమ కోసం ఈ మోగ్లీ చేసిన యుద్ధాన్ని సపోర్ట్ చేయాలని కోరుకుంటున్నాను'' అని చెప్పారు. ''అమెరికా షెడ్యూల్‌లో మాకు కేటాయించిన థియేటర్స్ మళ్లీ మాకు దొరకవు కనుక, మరొక రిలీజ్ డేట్ లేకపోవడం వల్ల ఓ పెద్ద సినిమాతో పాటు వస్తున్నాం''అని తెలిపారు టీజీ విశ్వప్రసాద్. ''మా సినిమా దారి తప్పదు. ఒక్క శాతం కూడా మిస్ కాదు''అని సందీప్ రాజ్ అన్నారు. నటులు బండి సరోజ్ కుమార్, హర్ష మాట్లాడారు.

వెంకటేశ్

హౌస్ నెం. 47లో...

'ఆదర్శ కుటుంబం హౌస్ నెం. 47'లోకి హీరో వెంకటేశ్ అడుగుపెట్టారు. వెంకటేశ్ హీరోగా త్రివిక్రమ్ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రానికి 'ఆదర్శ కుటుంబం హౌస్ నెం. 47' అనే టైటిల్ ఖరారైంది. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ పతాకంపై సూర్యదేవర రాధాకృష్ణ (చినబాబు) నిర్మిస్తున్నారు. సోమవారం ఈ సినిమా టైటిల్‌ని ప్రకటించి, ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేసి, రెగ్యులర్ షూటింగ్‌ని హైదరాబాద్‌లోని అల్యూమినియం ఫ్యాక్టరీలో ఆరంభించినట్లుగా యూనిట్ వెల్లడించింది. అలాగే ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది వేసవిలో రిలీజ్ చేయనున్నట్లుగా కూడా తెలిపారు. ''హాస్యం, హృదయాన్ని హత్తుకునే భావోద్వేగాల మేళవింపుతో కుటుంబ బంధాలను, విలువలను తెలియజేసేలా ఈ సినిమా ఉంటుంది'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. అయితే ఈ టైటిల్‌కి 'ఏకే 47' అనేది క్యాప్షన్‌గా కనిపిస్తుండటం, లోగోలో సింబాలిక్‌గా రెడ్ కలర్ కనిపిస్తుండటంతో కథలో థ్రిల్లింగ్, క్రైమ్ ఎలిమెంట్స్ కూడా ఉండే అవకాశం ఉందనే ఊహాగానాలు మొదలయ్యాయి.

భయపెట్టడానికి రెడీ

త్రిగుణ్, హెబ్బా పటేల్

త్రిగుణ్, అఖిల్ రాజ్ హీరోలుగా, హెబ్బా పటేల్ హీరోయిన్‌గా నటించిన ఎమోషనల్ హారర్ థ్రిల్లర్ సినిమా 'ఈషా'. సిరి హనుమంతు, బబ్లూ, పృథ్వీరాజ్ ప్రధాన పాత్రల్లో నటించారు. శ్రీనివాస్ మన్నె దర్శకత్వంలో కేఎల్ దామోదర ప్రసాద్ సమర్పణలో హేమ వెంకటేశ్వరరావు నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 25న విడుదల కానుంది. నిర్మాత–పంపిణీదారులు బన్నీ వాసు, వంశీ నందిపాటి ఈ సినిమాను విడుదల చేస్తున్నారు. బుధవారం జరిగిన ఈ సినిమా ట్రైలర్ సక్సెస్ సెలబ్రేషన్స్‌లో త్రిగుణ్ మాట్లాడుతూ– ''కుటుంబసమేతంగా చూడదగ్గ సినిమా ఇది. హారర్ సినిమాలను ఇష్టపడే వారందరికీ ఈ సినిమా మరింత నచ్చుతుంది'' అని చెప్పారు. ''ఎంతో కష్టపడి ఈ సినిమా చేశాం. మా సినిమాను ప్రేక్షకులు సపోర్ట్ చేయాలని కోరుకుంటున్నాం'' అన్నారు దర్శకుడు శ్రీనివాస్, నటి హెబ్బా పటేల్, నిర్మాత హేమ వెంకటేశ్వర రావు. ''కేవలం హారర్ మాత్రమే కాదు... ఈ సినిమాలో థ్రిల్లింగ్ ఎలిమెంట్స్ కూడా ఉన్నాయి'' అని చెప్పారు దామోదరప్రసాద్. ''మేం భయపెట్టడం లేట్ (12న విడుదల కావాల్సిన ఈ సినిమా 25కి వాయిదా పడిన విషయాన్ని ఉద్దేశించి) అవ్వొచ్చేమో... కానీ ఆడియన్స్‌ను భయపెట్టడం మాత్రం కన్ఫార్మ్'' అన్నారు బన్నీ వాసు, వంశీ నందిపాటి.

అప్పుడే కొత్త సినిమాలు వస్తాయి - కార్తీ

''ఊపిరి' లాంటి చిత్రాలను ఈజీగా చేయగలను. కానీ, 'అన్నగారు వస్తారు' నా వరకు చెప్పాలంటే సవాల్‌గా అనిపించింది. అయితే రచయితలకు స్వేచ్ఛ ఇస్తేనే కొత్త తరహా సినిమాలు వస్తాయి. 'అవెంజర్స్' మూవీ లాంటి విజువల్స్, మ్యూజిక్‌తో 'అన్నగారు వస్తారు' మూవీని కుమారస్వామి కొత్తగా ప్రెజెంట్ చేశారు. అందుకే ఈ సినిమా చేయడం ఎగ్జయిటింగ్‌గా అనిపించింది'' అని కార్తీ తెలిపారు. ఆయన హీరోగా, కృతీ శెట్టి హీరోయిన్‌గా నటించిన చిత్రం 'అన్నగారు వస్తారు'. నలన్ కుమారస్వామి దర్శకత్వంలో కేఈ జ్ఞానవేల్ రాజా నిర్మించిన ఈ సినిమా మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూటర్స్ ద్వారా ఈ నెల 12న తెలుగులో విడుదలవుతోంది. ఈ సందర్భంగా విలేకరులతో కార్తీ పంచుకున్న విశేషాలు.

- నలన్ కుమారస్వామి చేసిన 'సూదు కవ్వమ్'కు ఎంతోమంది ఫ్యాన్స్ ఉన్నారు. 'అన్నగారు వస్తారు' ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు అతిథిగా వచ్చిన తెలుగు దర్శకులంతా ఆ మూవీ గురించి బాగా చెప్పారు. అలాంటి డైరెక్టర్ 8 ఏళ్ల తర్వాత చేసిన చిత్రం 'అన్నగారు వస్తారు'. ఆయనపై ఉన్న నమ్మకం వల్లే ఈ మూవీలో నటించాను. ఇక సూపర్ హీరో అంటే బ్యాట్ మ్యాన్, సూపర్ మ్యాన్ అనే అనుకుంటాం. కానీ, మన సంస్కృతిలోనూ ఎన్టీఆర్, ఎంజీఆర్‌లాంటి సూపర్ హీరోస్ ఉన్నారు. అలాంటి వారు తిరిగొస్తే ఎలా ఉంటుందనే ఆలోచనతో 80వ దశకంలో మాస్ కమర్షియల్ సినిమా మేనియాను మరోసారి గుర్తు చేసేలా 'అన్నగారు వస్తారు' ఉంటుంది.
- కొత్త కథలు ఎంపిక చేసుకోవాలని ప్రయత్నం చేస్తుంటాను. నటుడిగా నాకు ప్రత్యేకత తీసుకొచ్చేది నా స్క్రిప్ట్ సెలెక్షనే. ఇక మా సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు అతిథులుగా వచ్చిన దర్శకుల్లో చాలామందిని వ్యక్తిగతంగా కలిశాను. ఆ దర్శకులు సరైన కథలతో వస్తే నటించేందుకు నేను సిద్ధంగా ఉన్నాను.
- నేను గతంలో సీరియస్, పవర్‌ఫుల్ పోలీసాఫీసర్ క్యారెక్టర్స్ చేశాను. 'అన్నగారు వస్తారు'లో పోలీస్ పాత్రని కుమారస్వామి డిఫరెంట్‌గా డిజైన్ చేశారు. జ్ఞానవేల్ రాజాగారు నా సినిమా అంటే బడ్జెట్ విషయంలో రాజీ పడరు. 'అన్నగారు వస్తారు' చిత్రంలో ఓ కొత్త ప్రపంచాన్ని సృష్టించామంటే అందుకు జ్ఞానవేల్‌గారి సపోర్ట్ కారణం. ఈ నెల 12న 'అఖండ 2'తో పాటు మా 'అన్నగారు వస్తారు' కూడా విడుదలవుతోంది. అయితే ఒక వారం రెండు మూడు సినిమాలు వచ్చినా పర్లేదు. ప్రేక్షకులు ఒక మూవీ తర్వాత మరొకటి చూస్తారు. ఓ ప్రేక్షకుడిగా నేను కూడా అలాగే చూసేవాడిని. ఏ సినిమా చూసే ఆడియన్స్ ఆ సినిమాకు ఉంటారు.
- ఎవరు కొత్త తరహా సినిమా చేసినా మనవంతు ప్రోత్సాహం అందించాలి. లేకుంటే కొత్తగా ప్రయత్నించేవారు ముందడుగు వేయలేరు. నేను నటించిన 'సత్యం సుందరం' లాంటి సినిమాను ప్రేక్షకులు ఆదరించకుంటే మరోసారి అలాంటి సినిమా చేసే ప్రయత్నం ఎవరూ చేయరు.

సస్పెన్స్... థ్రిల్



రియా కపూర్, రోహిత్, మేఘనా రాజ్‌పుత్

అబిద్ భూషణ్, రోహిత్ సహాని హీరోలుగా, రియా కపూర్, మేఘనా రాజ్‌పుత్ హీరోయిన్లుగా నటించిన చిత్రం 'మిస్ టీరియస్'. మహి కోమటిరెడ్డి దర్శకత్వంలో జై వల్లందాస్ నిర్మించారు. ఈ సినిమా ఈ నెల 12న రిలీజ్ అవుతోంది. ఈ చిత్రం ప్రీ రిలీజ్ ఈవెంట్‌కి నటుడు బ్రహ్మానందం ముఖ్య అతిథిగా హాజరై, 'మిస్ టీరియస్' ఫస్ట్ టికెట్‌ను లాంచ్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ– ''1985 ఫిబ్రవరి 1వ తేదీ నేను మొదట నటించిన సినిమా 'శ్రీ తాతావతారం'. ఆ సినిమాలో హీరో నరేశ్‌గారి కాలేజ్ ఫ్రెండ్స్ పాత్రల్లో నేను, మహి కోమటిరెడ్డి కలిసి నటించాం. 'మిస్ టీరియస్'లో నేను నటించకపోయినప్పటికీ మహి వల్లే ఈ ఈవెంట్‌కి వచ్చాను. ఈ సినిమా మంచి విజయం సాధించాలి'' అని కోరారు. ''మా సినిమా ప్రేక్షకులకు కొత్త అనుభూతి కలిగిస్తుంది'' అని మహి కోమటిరెడ్డి చెప్పారు. ''150 థియేటర్స్‌లో మా చిత్రం విడుదల చేస్తున్నాం'' అన్నారు జై వల్లందాస్.

తెలుగులోకి అందాల సుందరి

రియా సింఘా

మిస్ యూనివర్స్ ఇండియా (2024) రియా సింఘా తెలుగులో నటిస్తున్న తొలి సినిమా 'జెట్లీ'. బుధవారం (డిసెంబరు 10) ఈ అందాల సుందరి పుట్టినరోజు. ఈ సందర్భంగా 'జెట్లీ' సినిమా నుంచి రియా సింఘా ఫస్ట్ లుక్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు మేకర్స్. సత్య హీరోగా నటిస్తున్న ఈ సినిమాకు రితేష్ రానా దర్శకత్వం వహిస్తున్నారు. నవీన్ యెర్నేని, రవిశంకర్ యలమంచిలి సమర్పణలో చిరంజీవి (చెర్రీ), హేమలత పెదమల్లు ఈ సినిమాను నిర్మిస్తున్నారు. 'వెన్నెల' కిశోర్, అజయ్ కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: కాల భైరవ.

వానర వస్తున్నాడు

అవినాష్, సిమ్రాన్

అవినాష్ తిరువీధుల హీరోగా నటించి, దర్శకుడిగా పరిచయం అవుతున్న చిత్రం 'వానర'. ఈ సినిమాలో సిమ్రాన్ చౌదరి హీరోయిన్‌గా నటించగా, నందు ప్రతినాయకుడి పాత్రలో నటించారు. శంతను పత్తి సమర్పణలో అవినాష్ బుయానీ, ఆలపాటి రాజా, సి. అంకిత్ రెడ్డి ఈ సినిమాను నిర్మించారు. ఈ చిత్రాన్ని ఈ నెల 26న రిలీజ్ చేస్తున్నట్లుగా మేకర్స్ బుధవారం ప్రకటించారు. ఈ సినిమాకు సంగీతం: వివేక్ సాగర్.

ఓ సైనికుడి జీవితం

తన్వీర్, హరనాథ్, నైరా

హరనాథ్ పొలిచర్ల హీరోగా నటించి, స్వీయ దర్శకత్వంలో రూపొందించిన చిత్రం 'నా తెలుగోడు'. తనికెళ్ళ భరణి, రఘుబాబు, జరీనా వాహబ్, నైరా పాల్, రోనీ కౌలా, సుఫియా తన్వీర్ ప్రధాన పాత్రల్లో నటించిన ఈ సినిమా ఈ నెల 12న విడుదల కానుంది. ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో హరనాథ్ పొలిచర్ల మాట్లాడుతూ– ''తెలుగోడు ప్రపంచంలో ఎక్కడ ఉన్నా ఎలా కష్టపడతాడు? మంచి కోసం ఏ విధంగా పోరాడతాడు? అనేది ఈ చిత్రంలో చూపించాం. అమ్మ గురించి, డ్రగ్స్ నిర్మూలనపై అవగాహన, సైనికుడి జీవితం, బాల శిశువులను కాపాడే ప్రయాణం... ప్రధానంగా ఈ సినిమాలో ఈ నాలుగు అంశాలను ప్రేక్షకులకు అర్థం అయ్యేలా చూపించాం'' అని తెలిపారు. హీరోయిన్స్ సుఫియా తన్వీర్, నైరా పాల్ మాట్లాడారు. దర్శకులు శివ నిర్వాణ, పి. మహేశ్‌బాబు, స్వరూప్, నిర్మాత మైత్రీ నవీన్ అతిథులుగా పాల్గొని, ఈ సినిమా విజయం సాధించాలనే ఆకాంక్షను వ్యక్తపరిచారు.

స్టాక్ మార్కెట్లు

(తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
275	82
84,391	25,758

విదేశీ సూచీలు

నాస్‌డాక్	23,503	▽	74
డోజోన్స్	47,755	△	194
ఎఫ్‌టీఎస్ఈ 100	9,655	△	13
డాక్స్	24,089	▽	74
షాంఘై	3,900	▽	9
నికాయ్	50,603	▽	52

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	89.45	90.47
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	118.20	121.20
€	యూరో	ఎస్‌బీఐ	103.20	106.03
¥	జపాన్ యెన్ (100)	ఎస్‌బీఐ	56.75	58.14
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	57.38	61.24
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	67.11	70.82
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	23.10	24.60
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	23.60	24.86
¥	చైనా యువాన్	థామస్‌కుక్	11.86	13.68

రూ. 25,000తో ప్రీ-బుకింగ్

కియా నుంచి కొత్త సెల్టోస్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఆటోమొబైల్ దిగ్గజం కియా ఇండియా తాజాగా సరికొత్త సెల్టోస్ వెర్షన్‌ని ప్రవేశపెట్టింది. భద్రత, టెక్నాలజీ, డిజైన్‌కి ప్రాధాన్యమిస్తూ మిడ్‌సైజ్ ఎస్‌యూవీ విభాగంలో మరింత విశాలమైనదిగా దీన్ని తీర్చిదిద్దినట్లు బుధవారమిక్కడ నిర్వహించిన గ్లోబల్ ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా కంపెనీ ఎండీ గ్వాంగు లీ తెలిపారు. అంతర్జాతీయ ప్రమాణాలు, భారతీయ పరిస్థితులకు అనుగుణంగా కొత్త సెల్టోస్‌ను రూపొందించినట్లు చెప్పారు. వినూత్న స్టైలింగ్, ప్రీమియం ఇంటీరియర్స్, ఏడీఏఎస్ లెవెల్ 2, బోస్ 8–స్పీకర్ ఆడియో, 30 అంగుళాల పనోరమిక్ డిస్‌ప్లే ప్యానెల్ తదితర ఫీచర్లు ఇందులో ఉన్నట్లు చీఫ్ సేల్స్ ఆఫీసర్ సున్‌హాక్ పార్క్, సీనియర్ వీపీ అతుల్ సూద్ వివరించారు. దీనికి దేశవ్యాప్తంగా బుకింగ్స్ ప్రారంభించినట్లు పేర్కొన్నారు. ప్రాథమికంగా రూ. 25,000 కట్టి బుక్ చేసుకోవచ్చు. తుది ధరను జనవరి 2న ప్రకటిస్తామని, డెలివరీలు ఆ నెల మధ్య నుంచి ప్రారంభమవుతాయని పార్క్ తెలిపారు. దేశీయంగా 5,80,000 పైచిలుకు సెల్టోస్ వాహనాలను కియా విక్రయించింది.

కొత్త శిఖరాలకు వెండి ధర

- ఒకే రోజు రూ.11,500 జంప్
- ఢిల్లీలో రూ.1.92 లక్షలకు చేరిక
- రూ.800 లాభపడిన పసిడి

న్యూఢిల్లీ: వెండి ధర కొత్త రికార్డులు సృష్టించింది. ఢిల్లీ మార్కెట్లో బుధవారం ఒక్కరోజే కిలోకి రూ.11,500 ఎగసిపడడంతో రూ.1,92,000 స్థాయిని నమోదు చేసింది. వెండికి దేశీ మార్కెట్లో ఇది కొత్త జీవిత కాల గరిష్ట స్థాయి. ఒక రోజులో వెండి భారీగా పెరగడం ఇది రెండోసారి. ఈ ఏడాది అక్టోబర్ 10న కూడా కిలోకి రూ.8,500 పెరగడం గమనార్హం. బలమైన స్థానిక డిమాండ్‌కుతోడు సానుకూల అంతర్జాతీయ సంకేతాలు వెండి ధర భారీగా పెరిగేందుకు దారితీశాయి. 2024 డిసెంబర్ 31న కిలో వెండి ధర రూ.89,700గా ఉంది. అక్కడి నుంచి చూస్తే ఈ ఏడాది ఇప్పటి వరకు కిలోకి రూ.1,02,300 పెరిగింది. మరోవైపు ఢిల్లీ మార్కెట్లో 99.9 శాతం స్వచ్ఛత బంగారం 10 గ్రాములకు రూ.800 పెరిగి రూ.1,32,400కు (పన్నులు సహా) చేరుకుంది. అంతర్జాతీయ మార్కెట్లో స్పాట్ వెండి ధర ఔన్స్‌కు ఒకటిన్నర శాతం పెరిగి 61.60 డాలర్లకు చేరింది.

జీడీపీ వృద్ధి 7.2%

అంచనాలు పెంచిన ఏడీబీ

న్యూఢిల్లీ: భారత్ జీడీపీ వృద్ధి అంచనాలను 2025–26 ఆర్థిక సంవత్సరానికి 7.2 శాతానికి పెంచుతున్నట్టు ఆసియా అభివృద్ధి బ్యాంక్ (ఏడీబీ) ప్రకటించింది. గత అంచనా 6.5 శాతమే . దేశీ వినియోగం బలంగా ఉండడం, ఇటీవలి పన్ను తగ్గింపులు దీనికి మద్దతుగా నిలుస్తున్నట్టు పేర్కొంది. సెప్టెంబర్ త్రైమాసికంలో జీడీపీ వృద్ధి అంచనాలకు మించి 8.2 శాతంగా నమోదు కావడాన్ని ప్రస్తావించింది. తాజా అంచనాల నేపథ్యంలో ఆసియా ఆర్థిక వ్యవస్థ సైతం 2025లో గతంలో వేసిన 4.8% కంటే మెరుగ్గా 5.1% వృద్ధిని సాధిస్తుందని ఏడీబీ తెలిపింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలోనూ (క్యూ1/ఏప్రిల్–జూన్) భారత్ జీడీపీ 7.8 శాతం వృద్ధిని నమోదు చేయడం తెలిసిందే. దీంతో ఏప్రిల్–సెప్టెంబర్ మధ్య వృద్ధి 8 శాతానికి చేరింది.

లిస్టింగ్‌లు సూపర్ సక్సెస్

ముంబై: పబ్లిక్ ఇష్యూలు విజయవంతంగా పూర్తి చేసుకున్న మీషో, ఏక్వస్, విద్యా వైర్స్ కంపెనీల షేర్లు లిస్టింగ్‌లోనూ అదరగొట్టాయి. నష్టాల మార్కెట్లోనూ మంచి ప్రీమియంతో లిస్టయ్యాయి. తద్వారా తొలిరోజే ఇన్వెస్టర్లకు లాభాలు పంచాయి.

ఎక్స్ఛేంజీల్లో మీ'షో': ప్రముఖ ఈ-కామర్స్ సంస్థ మీషో షేరు ఇష్యూ ధర(రూ.111)తో పోలిస్తే 46.40% ప్రీమియంతో రూ.162.50 వద్ద లిస్టయ్యింది. ఒకదశలో 60% ఎగసి రూ.177.49 వద్ద గరిష్టాన్ని నమోదు చేసింది. చివరికి 54% లాభంతో రూ.170 వద్ద స్థిరపడింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.77,000 కోట్లుగా నమోదైంది.



ఏక్వస్ ఎంట్రీ ఓకే: ఏక్వస్ షేరు ఎక్స్ఛేంజీల్లోకి లాభాలతో ఎంట్రీ ఇచ్చింది. ఎన్ఎస్ఈలో ఇష్యూ ధర(రూ.124)తో పోలిస్తే 13% ప్రీమియంతో రూ.140 వద్ద లిస్టయ్యింది. కొనుగోళ్ల మద్దతు లభించడంతో 27% ర్యాలీ చేసి రూ.157 వద్ద గరిష్టాన్ని నమోదు చేసింది. చివరికి 21% లాభంతో రూ.150 వద్ద ముగిసింది. కంపెనీ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.10,060 కోట్లుగా నమోదైంది.

విద్యా వైర్స్ బౌన్స్ బ్యాక్: ఫ్లాట్‌గా లిస్టయిన విద్యా వైర్స్ షేరు ఇంట్రాడేలో బౌన్స్‌బ్యాక్ అయ్యింది. ఎన్ఎస్ఈలో ఇష్యూ ధర(రూ.52)తో పోలిస్తే 0.25% అతి స్వల్ప లాభంతో రూ.52.13 వద్ద లిస్టయ్యింది. ఒక దశలో 12.50% ఎగసి రూ.58.45 వద్ద గరిష్టాన్ని తాకింది. చివరికి 1.50% లాభంతో రూ.53 వద్ద స్థిరపడింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.1,123 కోట్లుగా నమోదైంది.

ఆఖర్లో అమ్మకాలు

మూడో రోజూ నష్టాలు

ఆఖరి గంటలో కన్జూమర్ డ్యూరబుల్స్, ప్రైవేటు బ్యాంకులు, ఐటీ షేర్లలో అమ్మకాలు వెల్లువెత్తాయి. దీంతో దేశీయ స్టాక్ మార్కెట్ మూడోరోజూ నష్టాలు మూటగట్టుకుంది. అమెరికా ఫెడరల్ రిజర్వ్ ద్రవ్య విధాన నిర్ణయాల వెల్లడి నేపథ్యంలో ఇన్వెస్టర్లు ఆచితూచి వ్యవహరించారు. సెన్సెక్స్ 275 పాయింట్లు పతనమై 84,391 వద్ద, నిఫ్టీ 82 పాయింట్లు నష్టపోయి 25,758 వద్ద ముగిశాయి. ఇరు సూచీలకిది నెలరోజు కనిష్ట స్థాయి. ఉదయం స్వల్ప లాభాలతో మొదలైన సూచీలు రోజంతా లాభ, నష్టాల మధ్య ట్రేడయ్యాయి.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..

2 లక్షలపైగా సంస్థలకు స్టార్టప్ గుర్తింపు	పదేళ్లలో ఫండ్స్ ఏయూఎం రూ. 300 లక్షల కోట్లు

టెక్ దిగ్గజాల పెట్టుబడుల జోరు..

- లిస్టులో మైక్రోసాఫ్ట్ నుంచి ఇంటెల్ వరకు బడా సంస్థలు
- దేశీయంగా సాంకేతిక రంగానికి దన్ను
- లక్షల కొద్దీ యువతకు ఉద్యోగావకాశాలు

సాంకేతిక ఆవిష్కరణలకు భారత్ మెగా హబ్‌గా మారే దిశగా చురుగ్గా అడుగులు పడుతున్నాయి. అంతర్జాతీయ టెక్ దిగ్గజాలు భారీగా పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తున్నాయి. మైక్రోసాఫ్ట్ నుంచి ఇంటెల్ వరకు పలు అగ్రగామి సంస్థలు వరుస కడుతున్నాయి. దేశీయంగా డేటా సెంటర్లు, ఏఐ ఆవిష్కరణలకు ప్రోత్సాహం లభించడంతో పాటు లక్షల సంఖ్యలో ఉద్యోగాల కల్పనకు కూడా అవకాశాలు పెరుగుతున్నాయి.

- సాక్షి, బిజినెస్ డెస్క్

న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీతో భేటీ అయిన సందర్భంగా మైక్రోసాఫ్ట్ సీఈవో సత్య నాదెళ్ల 17.5 బిలియన్ డాలర్ల పెట్టుబడులు పెట్టనున్నట్లు ప్రకటించారు. నాలుగేళ్ల వ్యవధిలో క్లౌడ్, కృత్రిమ మేధ (ఏఐ) మౌలిక సదుపాయాల కల్పనపై ఈ మొత్తాన్ని వెచ్చించనున్నారు. ఆసియాలో మైక్రోసాఫ్ట్ ఇంత భారీగా ఇన్వెస్ట్ చేయడం ఇదే ప్రథమం. భారత్ సాంకేతిక సామర్థ్యాలపై కంపెనీకి గల నమ్మకానికి ఇది నిదర్శనమని విశ్లేషకులు చెబుతున్నారు. ఇక చిప్ దిగ్గజం ఇంటెల్ కూడా భారత్ సెమీకండక్టర్ల లక్ష్యాల సాధనకు మద్దతుగా నిల్చేందుకు ముందుకొచ్చింది. ఇందుకోసం టాటా ఎలక్ట్రానిక్స్‌తో జట్టు కట్టింది. కంపెనీ సీఈవో లిప్–బు టాన్ ప్రధాని మోదీతో కూడా సమావేశమయ్యారు. అటు మరో అగ్రగామి సంస్థ అమెజాన్ సైతం భారత్‌పై మరింతగా దృష్టి పెడుతోంది. ఏఐ, ఎగుమతులు, ఉద్యోగాల కల్పనపై 35 బిలియన్ డాలర్లు ఇన్వెస్ట్ చేయనుంది. ఇక్కడ అదనంగా పది లక్షలకుపైగా ఉద్యోగావకాశాలను కల్పించాలనే ప్రణాళికల్లో ఉంది. భారత్ నుంచి 80 బిలియన్ డాలర్ల ఈ–కామర్స్ ఎగుమతులను లక్ష్యంగా నిర్దేశించుకుంది. ఇక సెర్చ్ దిగ్గజం గూగుల్ .. వైజాగ్‌లో డేటా సెంటర్‌పై 15 బిలియన్ డాలర్లు ఇన్వెస్ట్ చేస్తోంది. ఓపెన్‌ఏఐ కూడా భారత్‌లో డేటా హబ్ ఏర్పాటు చేసే సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తోంది.

రియల్టీకి కూడా ఊతం..

దేశవ్యాప్తంగా డేటా సెంటర్లను నిర్మించడంపై పెద్ద సంస్థలు ఆసక్తిగా ఉన్న నేపథ్యంలో రియల్ ఎస్టేట్ రంగానికి కూడా ఊతం లభించనుంది. డేటా సెంటర్ల రాకతో నిర్మాణ, రిటైల్, నిర్వహణ విభాగాల్లో పెద్ద సంఖ్యలో పరోక్ష ఉద్యోగాలకు ఊతం లభించనుంది. వైజాగ్‌లో గూగుల్ ఏఐ, డేటా సెంటర్ హబ్‌తో 1,00,000 పైగా ఉద్యోగాల కల్పనకు అవకాశం ఉందని అంచనా. కన్సల్టెన్సీ సంస్థ పీడబ్ల్యూసీ అధ్యయనం ప్రకారం డేటా సెంటర్లతో వచ్చే ఒక్క ప్రత్యక్ష ఉద్యోగంతో ఆరు రెట్లు పరోక్ష ఉద్యోగాల కల్పన జరిగే అవకాశం ఉంది. ఏఐ డేటా సెంటర్ బూమ్‌తో ఇంజినీర్లు, ఐటీ నిపుణులు, నిర్మాణ రంగ వర్కర్లు, రిటైల్ తదితర పరిశ్రమలలో మరింత ఉద్యోగ కల్పన జరగనుంది.

ప్రజలిచ్చిన మెమోలే ఈ కోటి సంతకాలు

- మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణపై పెల్లుబికిన ప్రజాగ్రహం
- మాజీ మంత్రి విడదల రజని

సాక్షి, అమరావతి: మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ప్రభుత్వానికి ప్రజలిచ్చిన మెమోలే కోటి సంతకాలని, ప్రజల నిర్ణయాలను గౌరవించకుండా నియంతలా ముందుకెళితే ఈ కూటమి ప్రభుత్వం పతనం కావడం ఖాయమని వైఎస్సార్‌సీపీ నాయకురాలు, మాజీ మంత్రి విడదల రజని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆమె బుధవారం మీడియాతో మాట్లాడుతూ, 'మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ రెండు నెలలుగా రాష్ట్రవ్యాప్తంగా 175 నియోజకవర్గాల్లో వైఎస్సార్‌సీపీ నిర్వహించిన ఉద్యమానికి అన్ని వర్గాల ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. యువత, ఉద్యోగులు, మేధావులు, వివిధ రంగాల నిపుణులు స్వచ్ఛందంగా తరలివచ్చి కోటి సంతకాల సేకరణలో భాగస్వాములయ్యారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఏడాదిన్నర కాలంలో ప్రభుత్వ ఆస్పత్రుల్లో సూదికి.. దూదికి కూడా కరువొచ్చింది. అంబులెన్సులు ఆగిపోయాయి. ఆరోగ్యశ్రీ నిర్వీర్యం అయిపోయింది. గత వైఎస్సార్‌సీపీ హయాంలో వైద్యారోగ్య రంగంలో తీసుకొచ్చిన విప్లవాత్మక మార్పులు, ఇప్పుడు కూటమి పాలనలో నిర్వీర్యం అవుతున్న తీరును ప్రజలు గ్రహించారు. కాబట్టే కోటి సంతకాల సేకరణ కార్యక్రమానికి స్వచ్ఛందంగా ముందుకొచ్చి మద్దతు పలుకుతున్నారు. కార్యక్రమంలో భాగంగా నవంబర్ 12న రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో ర్యాలీలు నిర్వహించి మరింతగా ప్రజల్లోకి తీసుకెళ్లాం. గడిచిన రెండు నెలలుగా స్టాప్ ప్రైవేటైజేషన్ పేరుతో ప్రింట్, ఎలక్ట్రానిక్, సోషల్ మీడియాలలో చర్చలు జరుపుతూ నష్టాలను వివరిస్తూ వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలంతా ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతి నియోజకవర్గంలో 50 వేలకు తగ్గకుండా చేయాలనుకుంటే అంతకుమించి అనూహ్య స్పందన వచ్చింది. కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని భారీగా విజయవంతం చేసిన వైఎస్సార్‌సీపీ శ్రేణులందరికీ పార్టీ తరపున కృతజ్ఞతాభినందనలు'' అని ఆమె పేర్కొన్నారు. కోటి మంది ప్రజల గుండె చప్పుడుగా ఉన్న ఈ కోటి సంతకాలను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుని పీపీపీ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

డైవర్షన్ రాజకీయాలు చేస్తున్న చంద్రబాబు ప్రభుత్వం

- బాబు సిద్ధాంతాలు కాపాడటమే పవన్ కళ్యాణ్ నైజం
- వైఎస్ జగన్‌పై విషం చిమ్మే రాజకీయాలు చేస్తున్న టీడీపీ, కూటమి భాగస్వామ్య పార్టీలు
- మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ నేత అంబటి రాంబాబు

నగరంపాలెం (గుంటూరు వెస్ట్): రాష్ట్రంలోని మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్సార్‌సీపీ చేపట్టిన కోటి సంతకాల సేకరణ ఉవ్వెత్తున ఎగసిపడుతోందని, ఈ మహోజ్వలిత ఉద్యమాన్ని అణగదొక్కేందుకు చంద్రబాబు ప్రభుత్వం రాక్షసత్వాన్ని ప్రదర్శిస్తోందని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు పేర్కొన్నారు. గుంటూరు సిద్ధార్థనగర్‌లోని తన నివాసంలో బుధవారం రాత్రి జరిగిన విలేకరుల సమావేశంలో అంబటి మాట్లాడారు. ఒకవైపు కోటి సంతకాల సేకరణ రాష్ట్ర వ్యాప్తంగా కొనసాగుతోందని, రాష్ట్ర ప్రజల దృష్టి మళ్లించాలని శక్తివంచన లేకుండా కూటమిలోని భాగస్వామ్య పార్టీలు యత్నిస్తున్నాయని ఆరోపించారు. ఈ పద్దెనిమిది నెలల కూటమి రాక్షస పాలనలో రాష్ట్ర ప్రజలకు చేసింది ఏమీ లేదని, మాజీ సీఎం వైఎస్ జగన్‌పై విషం చిమ్మే రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. వారికి అనుకూలమైన మీడియాలో వైఎస్ జగన్‌పై అసత్య ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. వైఎస్ జగన్ మాటలను వక్రీకరించి దుష్ప్రచారాలు చేస్తున్నారని విమర్శించారు. ఆఖరికి ఆలయాలను అడ్డుగా చేసుకుని వైఎస్ జగన్‌పై విమర్శలు చేయడం సరికాదని హితవు పలికారు. ఇటీవల హైదరాబాద్‌కు తన సొంత ఖర్చులతో ప్రత్యేక విమానంలో వైఎస్ జగన్ వెళ్తే దానినీ.. రాజకీయం చేయడం ఏంటని ప్రశ్నించారు. వైఎస్ జగన్‌పై, వైఎస్సార్‌సీపీపై నాయకులపై తప్పుడు ప్రచారం చేస్తే టీడీపీ వారే ఇబ్బందులకు గురవుతారని ధ్వజమెత్తారు.

పవన్ తప్పుడు ప్రచారం..

డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ మాజీ సీఎం వైఎస్ జగన్‌పై తప్పుడు ప్రచారం మొదలెట్టారని అంబటి మండిపడ్డారు. పవన్‌కు ఇదేమి కొత్తేమి కాదని, సర్వదా ఆయనకు అలవాటైందని ఆరోపించారు. 21 సీట్లు గెలిచిన ఎమ్మెల్యేలను, నియోజకవర్గాలను వదిలేసి డైవర్షన్ రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. మాజీ సీఎం వైఎస్ జగన్ ఇటీవల విలేకరుల సమావేశం నిర్వహించి అనేక అంశాల్లో సర్కారు ప్రజావ్యతిరేక చర్యలను ఎత్తిచూపితే ఏ ఒక్కదానికీ సమాధానం చెప్పలేని ప్రభుత్వం, చంద్రబాబు దండు డైవర్షన్ పాలిటిక్స్ మొదలెట్టాయని అంబటి మండిపడ్డారు. జగన్ మాటలను వక్రీకరించి దుష్ప్రచారం చేస్తున్నాయని దుయ్యబట్టారు. పరకామణి భవన నిర్మాణం, అందులో అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అమలు చేసింది. మాజీ సీఎం వైఎస్ జగనేనన్న విషయాన్ని అంబటి గుర్తుచేశారు. పవన్ కళ్యాణ్ ఏ ధర్మాన్ని పాటిస్తున్నారని ప్రశ్నించారు. ఒకసారి బాప్టిజం తీసుకున్నానని, మరోసారి సర్వ మతాలు ఒకటేనని, ప్రస్తుతం సనాతన ధర్మమని పవన్ అంటున్నారని, ఒకసారి మా నాన్న హేతువాదని, మరోసారి రామ నామస్మరణ చేస్తారని పవన్ చెబుతారని అంబటి విమర్శించారు. పవన్‌కు ఒక సిద్ధాంతం, ఒక నీతి లేవని ధ్వజమెత్తారు. పవన్‌కళ్యాణ్‌కు చంద్రబాబు సిద్ధాంతం ఒక్కటే ఉందని అంబటి మండిపడ్డారు. దైవాన్ని రాజకీయంగా వాడుకుంటున్నారని, దీనిని ప్రజలు కాదు, దైవమే సహించదని అంబటి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. టీడీపీ హయాంలో దేవాలయాల్లో అనేక దుర్ఘటనలు జరిగాయని, తిరుమలలో ముక్కోటి ఏకాదశి తొక్కిసలాటలో భక్తులు చనిపోయారని, సింహాచలంలో గోడ కూలి మరి కొందరు చనిపోయారని, వీటితోపాటు అనేక ఘటనలు జరిగాయని అంబటి విమర్శించారు. 2003లో వెయ్యి మండపాలు కూల్చింది ఎవరు, విజయవాడలో నలభైకి పైగా దేవాలయాలు కూల్చివేసింది ఎవరని, గోదావరి పుష్కరాల్లో 29 మంది భక్తులు చనిపోయింది ఎవరి హయాంలో అని అంబటి ప్రశ్నించారు.

జగన్ హయాంలో వందలాది ఆలయాల నిర్మాణం

మాజీ సీఎం వైఎస్ జగన్ హయాంలో ఎక్కడైనా ఇటువంటి దుర్ఘటనలు జరిగాయా అని అంబటి ప్రశ్నించారు. ధర్మాన్ని పాటించడంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కంటే మరొకటి లేదని ఆయన స్పష్టం చేశారు. వైఎస్ జగన్ హయాంలో వందలాది ఆలయాలను నిర్మించారని, ఆలయాల్లో పూజారులకు పారితోషికం, పూజా కార్యక్రమాల నిర్వహణకు ఇతోదిక సాయం అందించారని కొనియాడారు. సెప్టెంబర్‌లో కూటమి పాలనలో నరసింహస్వామి ఆలయంలో ఇద్దరు ఉద్యోగులు రూ.55 వేల చోరీకి పాల్పడితే స్టేషన్ బెయిల్‌తో పంపించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. పవన్ ఒక్కొక్క ఎన్నికలకు ఒక్కొక్క వేషం వేస్తారని, ఇప్పటికే మూడు వేషాలు వేశారని ఆరోపించారు. రాష్ట్ర ప్రజలే వాతలు పెడతారని అంబటి ఎద్దేవా చేశారు.

అప్పులబాధ తాళలేక ఇద్దరు రైతుల ఆత్మహత్య

కృష్ణగిరి/తాడిమర్రి: అప్పుల బాధలు, ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించకపోవడంతో కర్నూలు జిల్లాకు చెందిన ఓ రైతు, శ్రీసత్యసాయి జిల్లాకు చెందిన మరో అన్నదాత బలవన్మరణానికి పాల్పడ్డారు. కర్నూలు జిల్లా కృష్ణగిరి తొగర్చేడు గ్రామానికి చెందిన బీవై రాజశేఖర్(37) ఆరు ఎకరాల పొలంతోపాటు మరో నాలుగు ఎకరాలు కౌలుకు తీసుకుని సాగు చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. ఆయనకు భార్య మంగమ్మ, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పంట పండక చేసిన అప్పులు పెరిగిపోయాయి. పెట్టుబడులతో పాటు కుటుంబ ఖర్చుల కోసం రూ.12 లక్షల వరకూ అప్పులు చేశాడు. వాటిని ఎలా తీర్చాలో తెలియక మనస్తాపానికి గురయ్యాడు. ఆరోగ్యం బాగోలేక భార్య మంగమ్మ కోడుమూరుకు వెళ్లగా..ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

శ్రీసత్యసాయి జిల్లాలో...

శ్రీసత్యసాయి జిల్లా తాడిమర్రి మండలం పూలఓబయ్యపల్లిలో బుధవారం రైతు శెట్టిపల్లి నరసింహారెడ్డి (58) అప్పుల బాధ తాళలేక ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. రైతు నరసింహారెడ్డికి ఆరు ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. కొన్నేళ్లుగా అప్పులతో వ్యవసాయం చేస్తున్నాడు. దీంతో మనస్తాపం చెందిన నరసింహారెడ్డి బుధవారం ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

జీతాలు పెంచాలంటే సంపద సృష్టించాలి

డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

సాక్షి, అమరావతి: జీతాలు పెంచాలంటే ముందు సంపద సృష్టించాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. మనం పని చేయకుండా, మౌలిక వసతులు కల్పించకుండా అభివృద్ధి సాధ్యం కాదని అన్నారు. ఆయన బుధవారం మంగళగిరిలోని ఓ కన్వెన్షన్ హాలులో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఉద్యోగులతో మాట – మంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్లస్టర్ వ్యవస్థను రద్దు చేసి 13,350 గ్రామ పంచాయతీలను పాలనా యూనిట్లుగా మార్చామన్నారు. రాజకీయ జోక్యం పెరిగిన ఈ రోజుల్లో కూడా వ్యవస్థలు బలంగా ఉన్నాయంటే దానికి నిబద్ధత గల అధికారులే కారణమని అన్నారు.

పవన్ ప్రచార యావ..

ప్రతి పనినీ ప్రచారానికి వాడుకోవడంలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ పోటీ పడుతున్నారు. ఉద్యోగులకు సాధారణంగా ఇవ్వాల్సిన పదోన్నతులే ఇచ్చి, కొత్తగా ఇచ్చినట్లుగా ప్రచారానికి ఉపయోగించుకున్నారు పవన్ కళ్యాణ్. అందు కోసమే మాట– మంత్రి కార్యక్రమం పెట్టారు. పెద్ద మొత్తంలో కోట్లాది రూపాయిల ప్రజాధనం ఖర్చు చేశారు. దీని కోసం 13 మంది జెడ్పీ సీఈవోలు, 26 మంది డీపీవోలు, 26 మంది డ్వామా పీడీలు, 26 మంది పీఆర్ ఎస్ఈలు, 26 మంది ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈలు, 77 మంది డీడీవోలను రప్పించారు. అలాగే పదోన్నతి పొందిన 75 మంది అధికారులు, 1807 మంది పంచాయతీ డెవలప్‌మెంట్ ఆఫీసర్లను వాహనాల్లో తీసుకువచ్చారు. వీరికి ఆఫీసర్ల వ్యక్తిగత సిబ్బంది, డ్రైవర్లు అదనం. పదోన్నతులు సాధారణమే కదా.. ఇందుకు ప్రత్యేకంగా పొగిడించుకోవాలా అని పలువురు చర్చించుకోవడం గమనార్హం.

25 ఏళ్ల కలను సాకారం చేసిన జగన్

పదోన్నతుల విషయంలో నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చరిత్ర సృష్టించారు. 25 ఏళ్ల పాటు పదోన్నతుల కోసం ఎదురుచూసి ఎంపీడీవోలకు ప్రమోషన్లు ఇచ్చి, వారి పాతికేళ్ల కలను సాకారం చేశారు. సెక్రటరీలతో పాటు పలు శాఖల ఉద్యోగులకూ పదోన్నతులు కల్పించారు. వివిధ శాఖల్లో కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేశారు. 1998, 2008 డీఎస్సీలో పోస్టులు దక్కని వారికి కూడా మినిమమ్ టైం స్కేల్ (ఎంటీఎస్)తో ఉద్యోగాలిచ్చారు. అయినా ఏనాడూ ఇలా సభలు, సదస్సులు పెట్టి హడావుడి చేయలేదు. ప్రజాధనం వృథా చేయలేదు.

టీడీపీ హయాంలోనే శాలువాల కుంభకోణానికి నాంది

తిరుమల: తిరుమలలో వీఐపీలు, వీవీఐపీలను సత్కరించే సిల్క్ దుప్పటా (శాలువా)ల్లో పెద్ద ఎత్తున అవకతవకలు చోటుచేసుకున్న విషయం తాజాగా మీడియాలో రావడం మొదలు.. ఈ వ్యవహారాన్ని వైఎస్సార్‌సీపీ పాలనకు ఎలాగైనా ముడిపెట్టడానికి కూటమి పాలకులు, పచ్చమీడియా చేసిన ప్రయత్నాలు నవ్వులపాలవుతున్నాయి. ఈ దుప్పటాలను చంద్రబాబు సీఎంగా ఉన్న 2015 నుంచి చిత్తూరు జిల్లా నగరిలోని వీఆర్ఎస్ ఎక్స్‌పోర్ట్స్ అనే సంస్థ సరఫరా చేసింది. తాజా కాంట్రాక్ట్‌లోనే 15,000 దుప్పటాలను ఒక్కొక్కటి రూ.1,389 ధరకు సరఫరా చేయడానికి ఒప్పందం కుదిరింది. 2015–2025 మధ్య ఇదే సంస్థ, దాని అనుబంధ సంస్థలతో కలిసి మొత్తం రూ.54.95 కోట్ల విలువైన వస్త్రాలను టీటీడీకి అందించింది. వాస్తవానికి ఈ టెండర్ ప్రక్రియ 2014 టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఇదే వీఆర్ఎస్ ఎక్స్‌పోర్ట్ నుంచి పట్టువస్త్రాలు కొనుగోలు చేయడం ప్రారంభించింది. అప్పటి పాలకులు 2015 లో ఈ వస్త్రాలను కొనుగోలు చేసేందుకు పచ్చ జెండా ఊపారు. దీంతో అప్పటినుంచి వారి వద్దనే పట్టువస్త్రాలు టీటీడీ కొనుగోలు చేస్తూ వస్తోంది. 2014 – 19 మధ్య కాలంలో చేసిన తప్పిదాలు బయటపడకుండా ఉండేందుకు 2019–24 మధ్య స్కాములు అధికంగా జరిగాయని ప్రజల్లో తప్పుడు సంకేతాలు తీసుకెళ్లే ప్రయత్నాలను అధికారంలోకి వచ్చిన తొలి నుంచీ బాబు సర్కార్ ముమ్మరం చేసింది. శాలువాల అవకతవకల విషయంలోనూ ఇదే ధోరణిని అవలంబించాలన్న కూటమి ప్రభుత్వం, పచ్చమీడియా వైఖరి ప్రజల్లో నవ్వుల పాలయ్యింది. టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు తాజాగా చేసిన ట్వీట్ చూస్తే, ఈ వ్యవహారాన్ని వైఎస్సార్‌సీపీ పాలనకు అన్వయించాలన్న ప్రయత్నం బహిర్గతమవుతోంది.

నాణ్యత పరీక్షల్లో వెలుగులోకి...

తిరుమల శ్రీవారి దర్శనానంతరం ఆలయ రంగనాయకుల మండపంలో వీఐపీలు, వీవీఐపీలకు వేద ఆశీర్వచనం అందించిన అనంతరం ఈ సిల్క్ దుప్పటా (శాలువ)లతో సత్కరిస్తారు. ఈ దుప్పటాల్లో జరిగిన అవకతవకలకు సంబంధించి టీటీడీ ఛైర్మన్ వెల్లడించిన వివరాల ప్రకారం.. టెండర్ ప్రకారం స్వచ్ఛమైన సిల్క్ సరఫరా చేయాల్సిన బాధ్యత ఉన్న సరఫరాదారు, సంవత్సరాలుగా చౌక పాలిస్టర్ దుప్పటాలను అందిస్తూ దేవస్థానాన్ని మోసం చేశాడు. దీనిపై బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని బోర్డు నిర్ణయించింది. విజిలెన్స్ అధికారులు తిరుపతి గోదాములోని కొత్త స్టాక్ నుంచి, తిరుమల వైభవోత్సవ మండపంలో ఉన్న ఆమోదిత స్టాక్ నుంచి నమూనాలను సేకరించి బెంగళూరులోని సెంట్రల్ సిల్క్ బోర్డ్ (సీఎస్‌బీ) ప్రయోగశాలకు, అలాగే ధర్మవరంలోని ల్యాబ్‌కు పంపించారు. రెండు ల్యాబ్‌లు కూడా ఇవి పూర్తిగా పాలిస్టర్ ముడి సరకుతో తయారైనవని నిర్ధారించాయి. అసలైన సిల్క్ ఉత్పత్తులపై ఉండాల్సిన సిల్క్ హోలోగ్రామ్ కూడా కనిపించకపోవడం అనుమానాలను మరింత బలపరిచింది. టెండర్ నియమాల ప్రకారం ఇవి మల్బరీ సిల్క్‌తో 20/22 డెనియర్ కౌంట్‌తో ఉండాలి. ప్రతి దుప్పటాపై సంస్కృతం, తెలుగులో ''ఓం నమో వెంకటేశాయ'' ముద్రణతో పాటు శంఖు, చక్రం, నామం గుర్తులు, నిర్దిష్ట కొలతలు, బరువు, అంచు డిజైన్ వంటి అంశాలు తప్పనిసరి. కానీ ఇవన్నీ విస్మరించి చౌకైన ముడి సరుకుతో భారీ మోసం చేసినట్లు ఆరోపణ.

ఒక్క అంశంపైనే విచారణ

- అది కూడా నెల రోజుల్లోనే పూర్తి కావాలి
- వివేకా కేసులో సీబీఐ దర్యాప్తుపై న్యాయస్థానం ఆదేశాలు

సాక్షి, హైదరాబాద్ : మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో తాను కోరిన విధంగా దర్యాప్తునకు ఆదేశించాలన్న నర్రెడ్డి సునీత విజ్ఞప్తిని సీబీఐ కోర్టు తోసిపుచ్చింది. హత్య కేసులో మరింత లోతైన దర్యాప్తు చేపట్టేలా సీబీఐని ఆదేశించాలని కోరుతూ సునీత దాఖలు చేసిన పిటిషన్‌ను పాక్షికంగా అనుమతిస్తూ.. ఒకట్రెండు అంశాలపై దర్యాప్తునకు అనుమతి ఇచ్చింది. ఏళ్లకు ఏళ్లు దర్యాప్తు చేయడం నిందితుల హక్కులు హరించడమేనన్న సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో సీబీఐ విచారణ పూర్తి చేసేందుకు నెల రోజులు గడువు విధించింది. సునీత సూచించిన వ్యక్తులపై దర్యాప్తునకు ఆదేశించేందుకు నిరాకరించింది. తాము విధించిన షరతుల ప్రకారం దర్యాప్తు చేయాలని సీబీఐని న్యాయమూర్తి డాక్టర్ టి.రఘురామ్ ఆదేశించారు. ఉత్తర్వులు అధికారికంగా వెలువడాల్సి ఉంది.

ఆ వివరాలను ఐటీ, ఈడీలతో పంచుకోండి

- పరకామణిలో చోరీ కేసులో సీఐడీ, ఏసీబీకి హైకోర్టు ఆదేశం

సాక్షి, అమరావతి: తిరుమల శ్రీవారి పరకామణిలో చోరీ వ్యవహారంపై ఇప్పటి వరకు జరిపిన దర్యాప్తులో వెలుగు చూసిన విషయాలను అవసరమైన మేర అటు ఆదాయపు పన్ను శాఖ, ఇటు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ)లతో పంచుకోవాలని హైకోర్టు బుధవారం సీఐడీ, ఏసీబీ డీజీలను ఆదేశించింది. చోరీ వ్యవహారంలో దర్యాప్తు కొనసాగించాలని ఇద్దరు డీజీలను ఆదేశించింది. అలాగే ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని స్పష్టం చేసింది. చట్ట ప్రకారం అవసరమైన అన్నీ చర్యలు చేపట్టేందుకు వీరికి వెసులుబాటునిచ్చింది. అంతేకాక దర్యాప్తు వివరాలను రెండు సంస్థలు కూడా పరస్పరం పంచుకోవాలని తేల్చి చెప్పింది. అనుమానాస్పద స్థితిలో మరణించిన పరకామణి అప్పటి ఏవీఎస్వో వై.సతీష్‌కుమార్ పోస్టుమార్టం తాలుకు నివేదికను సీల్డ్ కవర్‌లో తమ ముందుంచాలని సీఐడీ డీజీని ఆదేశించింది. ఈ సమయంలో ఇంప్లీడ్ పిటిషన్ దాఖలు చేసిన ఏపీ సాధు పరిషత్ తరపున సీనియర్ న్యాయవాది ఉన్నం మురళీధరరావు స్పందిస్తూ, ఈ కేసు దర్యాప్తు బాధ్యతలను సీఐడీతో పాటు ఏసీబీ కూడా చూస్తోందని, దర్యాప్తు బాధ్యతల మొత్తాన్ని సీఐడీకి అప్పగించాలని ఆయన కోర్టును కోరగా, కోర్టు తిరస్కరించింది. కేసు దర్యాప్తు చాలా వరకు పూర్తయిందని, అందువల్ల ఈ దశలో అలాంటి ఉత్తర్వులు ఇవ్వలేమని తేల్చి చెప్పింది. తదుపరి విచారణను ఈ నెల 16కి వాయిదా వేసింది.



Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Published at D. No. 5 - 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503, (AP) and Printed at Jagati Publications Limited, D. No. 5 - 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503, (AP).,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of news under the PRB act) Phone No : 0863-2512581 Fax No: 0863-2512584, RNI Regn No. APTEL/2008/23801. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

• నేటి నుంచి ఆరాధనోత్సవాలు

• తరలి రానున్న నాలుగు రాష్ట్రాల భక్తులు

బ్రహ్మంగారి మఠంలో కొలువుదీరిన శ్రీ ఈశ్వరీ దేవి.. జగన్మాతగా విరాజిల్లుతున్నారు. భక్తుల కొంగుబంగారమై నిలిచి.. విశేష పూజలందుకుంటున్నారు. ఈశ్వరీదేవి మఠంలో నేటి గురువారం నుంచి అమ్మవారి ఆరాధన, గురుపూజ మహోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో అమ్మవారి చరిత్ర, ఉత్సవాల విశేషాలపై ప్రత్యేక కథనం.

• ప్రత్యేక అలంకరణలో ఈశ్వరీదేవి

ఈశ్వరీ... జగదీశ్వరీ

శ్రీ మద్విరాట్ పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి కాలజ్ఞాన ప్రబోధకర్త, రాజయోగి, హేతువాది, మహిమాన్వితులు, తత్వవేత్త, సంఘ సంస్కర్త, దైవస్వరూపులుగా వినుతికెక్కారు. ఆయన మనువరాలు శ్రీ ఈశ్వరీదేవి. ఆమె జేజినాయన వలే తత్త్వాలు, కీర్తనలు, కాలజ్ఞానం రాసి విశేష కీర్తి పొందారు. వీరబ్రహ్మేంద్రస్వామి కాలజ్ఞానం ఎక్కువగా భవిష్యత్తును తెలియజేస్తే.. ఈశ్వరిదేవి నోటి నుంచి వెలువడే మాటలు అప్పటికప్పుడే జరిగి తీరేవి.

ఆంధ్రప్రదేశ్‌లోని వైఎస్ఆర్ కడప జిల్లాలోని బ్రహ్మంగారిమఠంలో వెలసిన శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి మఠం పక్కనే ఈశ్వరీదేవి మఠం ఉంది. పరాశక్తి స్వరూపిణి పార్వతీదేవి, లక్ష్మీదేవి అంశ నుంచి ఈశ్వరీదేవి అవతరించారని భక్తుల ప్రగాఢ విశ్వాసం. ఆమె 1703లో స్వస్తిశ్రీ స్వభాను నామసంవత్సరంలో జన్మించారు. వీరబ్రహ్మేంద్రస్వామి రెండో కుమారుడైన గోవిందయ్యస్వామి, గిరియమ్మ దంపతులకు ఈశ్వరమ్మ, కాశమ్మ, శంకరమ్మ అనే ముగ్గురు కుమార్తెలు, ఓంకారమయ్య, సాంబమూర్తి అనే ఇద్దరు కుమారులు ఉన్నారు. వారిలో ఈశ్వరమ్మ పెద్దకుమార్తె. బ్రహ్మంగారి వారసత్వాన్ని పుణికిపుచ్చుకున్నారు. అందరి పిల్లల్లాగా.. వీధి బడిలో సామాన్య విద్యనభ్యసించారు. సంస్కృతం, తెలుగు భాషలలో పాండిత్యం సంపాదించారు. భారత భాగవతాది గ్రంథాలను స్వయంగా వర్ణించేవారు. నిత్యం యోగం అభ్యసించుట, గ్రంథాల పఠనంతోనే గడుపుతుండేది.

12 ఏళ్ల వయసులోనే...

ఒకరోజు గోవిందయాచార్య శయ్యపై పరుండి, తీవ్రమైన ధ్యాననిష్టలో మునిగిపోయారు. అలా మూడు రోజులు ఉన్నారు. పిలిచినా పలకలేదు. దీంతో చనిపోయారేమోనని భావించి.. ఆయన భార్య గిరియమ్మ, బంధుమిత్రులు దుఃఖించటం ప్రారంభించారు. అప్పుడు 12 ఏళ్ల వయసు ఉన్న ఈశ్వరీదేవి వచ్చి.. దుఃఖించే అంత పని ఏమి జరగలేదని, నాయన పరమాత్మతో ఆత్మను లీనం చేశారని తెలిపారు. ఆమె గది తలుపులు వేసి సాంబ్రాణి ధూపం వేశారు. వీరబ్రహ్మేంద్రస్వామి తెలిపిన 'ఓం హ్రీం క్లీం శ్రీం శివాయ బ్రహ్మణే నమః' అనే బీజాక్షరి మంత్రాన్ని జపించారు. వెంటనే గోవిందయ్య లేచి కూర్చున్నారు. ఈ విషయాన్ని చూసిన జనం సంభ్రమాశ్చర్యానికి గురయ్యారు. అప్పటి నుంచి ఈశ్వరీదేవి సామాన్య మనిషి కాదని, మహిమాన్వితురాలని గుర్తించారు. తండ్రినే గురువుగా భావించి.. ఆయన ద్వారా మంత్రోపదేశం నేర్చుకున్నారు.

14 ఏళ్లు తపస్సు చేసి...

బ్రహ్మంగారి మఠానికి సమీపాన ఉన్న నల్లమల కొండ గుహలో 14 ఏళ్లు కఠోర తపస్సు చేసి.. అష్టాంగయోగాది, జ్ఞానవాక్సిద్ధి పొందారు. శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి స్వప్నసాక్షాత్కార దర్శనం పొంది.. ఆయన ఆజ్ఞ ప్రకారం బ్రహ్మతత్వాన్ని బహుళ ప్రచారం చేయడానికి సంకల్పించారు. తల్లిదండ్రులు వివాహ ప్రయత్నం చేయగా.. నిరాకరించారు. లోక కల్యాణార్థం బ్రహ్మచర్య దీక్ష బూని ఆత్మతత్వ బోధనలు రచించారు.

మఠాధీశులై...

తండ్రి గోవిందయ్య స్వామి యోగ సమాధి నిష్ట వహించిన దివ్య సన్నిధానానికి గర్భగుడి, అంతరాలయం, ముఖ మండపం నిర్మించి ప్రత్యేక(చిన్న) మఠం ఏర్పాటు చేశారు. ఆ మఠానికి మఠాధీశులై నిత్యపూజ కార్యక్రమాలు, ఆరాధన గురు పూజోత్సవాలు నిర్వహిస్తుండేవారు. అమ్మవారి బోధనలు విని ఆకర్షితులై.. ఎంతో మంది శిష్యులుగా మారారు. రాజయోగినిగా మారి, శిష్యసమేతంగా దేశ పర్యటన చేసి భక్తితత్వాన్ని ప్రచారం చేశారు. భక్తులకు ఎన్నో లీలలు ప్రత్యక్షంగా చూపించారు. ఎందరినో సంస్కరించి జ్ఞాన దీప్తిలా భాసిల్లి.. జనుల గుండెల్లో అమ్మవారిగా కొలువైనారు.

• భక్తుల కొంగు బంగారంగా అమ్మవారు

సజీవ సమాధి

ఈశ్వరమ్మ వారు 1789లో శ్రీ సౌమ్యనామ సంవత్సర మార్గశిర బహుళ నవమినాడు సజీవ సమాధి నిష్ట వహించారు. నాటినుంచి లోకకల్యాణార్థం యోగ నిద్రముద్రితురాలై భక్తజనుల నిత్య నీరాజనాలు స్వీకరిస్తున్నారు. చిన్నమఠం శ్రీ ఈశ్వరిదేవిమఠంగా పేరొందినది. అమ్మవారు సజీవ సమాధి నిష్ట పొందిన సందర్భాన్ని పురస్కరించుకుని ఏటా ఆరాధన, గురుపూజ మహోత్సవాలు నిర్వహిస్తున్నారు. అమ్మవారిని గురువుగా భావిస్తారు కనుక శిష్యులు, భక్తులు ఈ కార్యక్రమాన్ని కనుల పండువగా నిర్వహిస్తారు.

• శక్తి స్వరూణిగా ఈశ్వరీదేవి ప్రసిద్ధి

భారీగా భక్తుల రాక

దేశ వ్యాప్తంగా పలు ప్రాంతాల నుంచి భక్తులు తరలిరానున్నారు. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల నలుమూలల నుంచే కాకుండా.. కర్ణాటక, తమిళనాడు ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తారు. వీరి సౌకర్యం కోసం పలు ప్రాంతాల నుంచి ఆర్టీసీ సంస్థ ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపనుంది.

- వడ్ల మల్లికార్జున ఆచార్య,
సాక్షి, కడప

వైభవోపేతంగా ఉత్సవాలు... ఘనంగా ఏర్పాట్లు...

శ్రీ వీరశివకుమారస్వామి

శ్రీ ఈశ్వరీమాత అనుగ్రహంతో ఏటా ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఈ ఏడాది కూడా ఉత్సవాలను వైభవోపేతంగా నిర్వహించేందుకు దేవదాయ శాఖ సిబ్బంది, అమ్మవారి శిష్యులు, భక్తుల సహకారంతో అధికారులు మఠంలో భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఏటా భక్తుల సంఖ్య పెరుగుతోంది. ఈ ఏడాది కూడా అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరుతున్నాను.

- శ్రీ వీరశివకుమారస్వామి, మఠాధిపతి,
శ్రీ ఈశ్వరీదేవి మఠం, బ్రహ్మంగారిమఠం

ఆరాధనోత్సవాలు

నేటి నుంచి 16 వరకు అమ్మవారి ఆరాధన గురుపూజ మహోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ ఉత్సవాల్లో రోజూ ఉదయం ప్రభాతసేవ, పంచామృతాభిషేకం, కుంకుమార్చన, మధ్యాహ్నం నైవేద్యం, నీరాజనం, తీర్థప్రసాద వినియోగం, సాయంత్రం సూక్తపారాయణం, అభిషేకం, కుంకుమార్చన, రాత్రి నైవేద్యం, నీరాజనం, తీర్థప్రసాద వినియోగం తదితర కార్యక్రమాలు నిర్వహిస్తారు. అలాగే భక్తుల కాలక్షేపం కోసం సంగీత విభావరి, హరికథలు, భజన కార్యక్రమాలు ఉంటాయి.

- 11న కలశోత్సవం, కలశ స్థాపనతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి.
- 12న ఉదయం అశ్వవాహనం, రాత్రి హంస వాహనంపై అమ్మవారి ఊరేగింపు
- 13న (ఈశ్వరీదేవి మార్గశిర బహుళ నవమిన మహాదేవి సజీవ సమాధి నిష్ట వహించిన రోజు) ఉదయం దేవతా ఆవాహనం, శాంతి హోమం, సామూహిక కుంకుమార్చనలు, మధ్యాహ్నం దీక్షా అలంకరణ ఉత్సవం, సాయంత్రం సహస్ర దీపాలంకరణ, తులా భారం, ఊయల సేవ, రాత్రి సింహ వాహన గ్రామోత్సవం ఉంటాయి.
- 14న గుడి ఉత్సవం, రాత్రి పుష్పరథోత్సవం
- 15న పూర్వపు మఠాధిపతులు వీరబ్రహ్మాయాచార్య స్వాముల వారి ఆరాధన, గ్రామోత్సవం
- 16న మహాప్రసాద వినియోగంతో ఉత్సవాలు ముగుస్తాయి.

• నిర్మల వాణి

రాజ్యలక్ష్మీ తత్త్వం అంటే?

మానవ సంక్షేమం కోసం సాగర మథన సమయంలో సముద్రం నుండి లక్ష్మీదేవి ఉద్భవించింది. ఎప్పుడైతే ఆమె సముద్రం నుండి బయల్వెడలిందో అప్పుడు ఆమె రాజ్యలక్ష్మిగా, గృహలక్ష్మిగా మార్పు చెందింది. మానవులు సామూహికతలో ఆనందిస్తూ ఉన్నతి పొందడానికి, వారి కుడి పార్శ్వంలో ఉన్న శ్రీ రాజ్యలక్ష్మి ఆశీస్సులే కారణం. ప్రజాసంక్షేమం కోసం, ప్రజాసౌకర్యం కొరకు ఈ రాజ్యలక్ష్మి శక్తి పనిచేస్తుంది. లక్ష్మీ తత్త్వ సారం మనలోనే ఉంది. మనలో గృహలక్ష్మి తత్త్వం స్థిరపడిన తరువాత సామూహిక జీవనం వచ్చింది.

శ్రీ మాతాజీ నిర్మలాదేవి

అదే రాజ్యలక్ష్మి తత్త్వం. రాజ్య అంటే రాజ్యం, లేక రాజసం. అందుచేత ఎప్పుడైతే లక్ష్మి రాజోచితమైన వైభవంతో కూడిన లక్ష్మిగా వెలుగొందుతుందో అప్పుడు ఆమె సామూహికతకు ప్రతీక అవుతుంది. రాణి తన కోసం తాను జీవించదు. ప్రజలందరి సంక్షేమం కోసం ఆమె జీవిస్తుంది. శ్రీ రాజ్యలక్ష్మి రాజులకు అధిదేవత.

తమలో ఏ కోశానా సుగుణమనేది లేని రాజులు, ప్రజల బాగోగులు ఏ విధంగా చూడగలరు? మన దేశాన్ని గొప్ప గొప్ప రాజులు పాలించారు. కారణం మన సాంప్రదాయం బహు గొప్పది. రాజులను శాసించగలిగే పుణ్య పురుషులు మనకుండేవారు. ఉదాహరణకు శివాజి ప్రభువునకు మంచి సద్గురువు ఉండేవాడు. అలానే జనకమహారాజుకి కూడా. అలాగ ప్రతి రాజు ఒక గురువును కలిగి ఉండేవాడు. శ్రీరామునికి కూడా ఒక గురువు ఉన్నాడు. వారందరూ సద్గురువులు. ఆ రాజులందరూ సాధు పుంగవులలా తమ జీవితం గడిపారు. అంతర్గతంగాను, బాహ్యపరంగాను అసలు సిసలైన పుణ్య పురుషుల్లాగ మెలిగారు. ఆనాడు ఆధ్యాత్మిక ప్రవృత్తి గలిగిన రాజులనే ప్రజలు గౌరవించేవారు. వారినే అంగీకరించేవారు.

శివాజీ, రాణాప్రతాప్ లేక ఏ శాలివాహనుని చరిత్ర చూసినా, ఆనాటి రాజులందరూ శక్తి పూజ జరిపేవారు. శ్రమించి ధర్మస్థాపన చేసేవారు. ఆ రోజుల్లో రాజకీయవేత్తలు మనకన్నా తక్కువస్థాయిలో ఉన్న ప్రజల జీవన ప్రమాణాన్ని ఏ విధంగానైనా మెరుగుపరచాలని తపన పడేవారు. చాలా మంది ధనికులు తమ సంపదను దాన ధర్మాలకై వినియోగించారు. ఆ రోజుల్లో జరిగిన ఎన్నో కార్యక్రమాలు కేవలం దాతృత్వం వలననే జరిగాయి. వారెన్నడూ తమ పిల్లలు భోగభాగ్యాలతో తులతూగాలని ఆలోచించలేదు. తమ వద్ద గల స్వల్ప ధనాన్ని కూడా పేదలకిచ్చి వారికి మేలు చేయాలనే ఆలోచనలలో వుండేవారు. మానవుల సంక్షేమాన్ని చూసే రాజ్యలక్ష్మి తత్త్వాన్ని గురించి వారికెవరూ ప్రత్యేకించి వివరించే అవసరం వుండేది కాదు. అది తమ బాధ్యతగా వారు స్వీకరించేవారు. ప్రజల బాగోగులు చూడటం, వారి జీవితాలను మెరుగుపరచడమే తమ ధ్యేయమన్న విధంగా వారి ఆలోచనలు సాగేవి.

- డా. పి.రాకేశ్
(పరమ పూజ్య శ్రీ మాతాజీ నిర్మలా దేవి ప్రవచన సారాంశం ఆధారంగా)

• వృక్ష దేవత

అరటిచెట్టు వెనక ఆధ్యాత్మిక రహస్యం

హిందూ సంప్రదాయంలో అత్యంత పవిత్రమైన వృక్షాలలో అరటి చెట్టు ఒకటి. ఈ చెట్టును దేవ వృక్షంగా, సాక్షాత్తు శ్రీమహావిష్ణువుకు ప్రతీకగా భావిస్తారు. అందుకే ఏ శుభకార్యం జరిగినా, పూజాది కార్యక్రమాలు నిర్వహించినా అరటి ఆకులు, గెలలు తప్పనిసరి. అయితే, ఈ పవిత్రమైన చెట్టును ఇంట్లో సరైన దిశలో నాటడం వల్ల అపారమైన శ్రేయస్సు పాజిటివ్ ఎనర్జీ కలుగుతాయని వాస్తు, జ్యోతిష్య శాస్త్ర నిపుణులు చెబుతున్నారు. ఈశాన్యదిశలో అరటి చెట్టును నాటడం వెనుక ఉన్న ఆధ్యాత్మిక రహస్యం ఏమిటో తెలుసుకుందాం..

ఈశాన్యం అనేది శుభాలకు నిలయంగా భావిస్తారు. ముఖ్యంగా వాస్తు శాస్త్రం ప్రకారం, అరటిచెట్టును నాటడానికి ఈశాన్య దిశ అంటే తూర్పు-ఉత్తర దిక్కుల మధ్య మూల. ఇది అత్యంత శ్రేయస్కరం అయింది. ఈశాన్యాన్ని దేవతల స్థానంగా, శివుడు, గురువు బృహస్పతి కి సంబంధించిన దిక్కుగా భావిస్తారు. ఈ దిశలో అరటి చెట్టు ఉండడం వల్ల ఇంట్లో పాజిటివ్ ఎనర్జీ ప్రవాహం పెరుగుతుంది. అరటి చెట్టు బహస్పతి గ్రహానికి సంబంధించినది. ఈశాన్యంలో అరటి చెట్టును నాటి, పూజించడం ద్వారా జాతకంలో గురు గ్రహం బలం పెరుగుతుంది.

గురు బలం పెరిగితే, జ్ఞానం, విద్య, అదృష్టం, ఆర్థిక స్థిరత్వం కలుగుతాయి. గురువారం రోజున శ్రీమహావిష్ణువుకు అరటి చెట్టు రూపంలో పూజ చేయడం, పసుపు నీరు పోయడం వల్ల లక్ష్మీనారాయణుల అనుగ్రహం లభించి, ఆర్థిక ఇబ్బందులు తొలగిపోతాయని విశ్వసిస్తారు.

అరటి చెట్టు నాటేటప్పుడు పాటించాల్సిన వాస్తు నియమాలు ఏమిటంటే..? అరటి చెట్టు ఇంట్లో శుభాన్ని తీసుకురావాలంటే, కొన్ని నియమాలను పాటించాల్సి ఉంటుంది. ఈశాన్యంతో పాటు, ఉత్తర లేదా తూర్పు దిశలో కూడా నాటవచ్చు. అయితే అరటిచెట్టు నీడ ఇంటిపై పడకుండా చూసుకోవడం ముఖ్యం.

ముఖ్య గమనిక.. అరటి చెట్టును ఇంటి ప్రధాన ద్వారం ముందు భాగంలో నాటకూడదు. ఎల్లప్పుడూ ఇంటి పెరట్లో లేదా కాంపౌండ్ లోపల వెనుక భాగంలో ఉండేలా చూసుకోవాలి. అరటి చెట్టుకు దగ్గరలోనే తులసి మొక్కను నాటడం అత్యంత శుభప్రదంగా పరిగణిస్తారు. తులసి విష్ణువుకు అత్యంత ప్రీతిపాత్రమైనది కాబట్టి, ఇద్దరి అనుగ్రహం లభిస్తుంది. అరటి చెట్టు చుట్టూ ఎల్లప్పుడూ శుభ్రంగా ఉంచాలి. ఆకులు ఎండిపోకుండా చూసుకోవడం, ఎండిన ఆకులను ఎప్పటికప్పుడు తొలగించడం ద్వారా ప్రతికూల శక్తిని నివారించవచ్చు. పవిత్రమైన అరటి చెట్టును ఈశాన్యంలో నాటి, నిత్యం పూజించడం ద్వారా ఆ ఇంట్లో సుఖ సంతోషాలు, శ్రేయస్సు ఎల్లప్పుడూ వెల్లివిరుస్తాయని ఆధ్యాత్మిక పెద్దలు చెబుతున్నారు.

- పసుపులేటి వెంకటేశ్వరరావు

ఒక్కడే దేవుడు అనుటలోని పరమార్థం

• సువార్త

'కుమారుడు తన తండ్రిని ఘనపరచును గదా... నా నామమును నిర్లక్ష్యపెట్టు యాజకులారా, నేను తండ్రినైతే నాకు రావలసిన ఘనత ఏమాయెను?' (మలాకీ 1:6).

దేవాది దేవుడు ఈజిప్ట్ రాజైన ఫరోకు, ఫరో ప్రజలకు మోషేను దేవుడిగా నియమించాడు. ఆత్మ సంబంధ ఇశ్రాయేలీయులు అనబడే క్రైస్తవుల మీద ఆత్మ సంబంధ రాజుగా, హృదయ పరిపాలకుడుగా మెస్సీయ అనబడే క్రీస్తు దేవునిచేత నియమించబడ్డాడు. దేవుడు ఇలా ఎవరికి ఏ హోదా ఇచ్చినా తన అరుదైన సొంతదైన గొప్ప మహిమను ఎవరికి ఇచ్చువాడుకాడు. దేవునికి ఉన్న అత్యున్నత హోదా తండ్రి. అందుకే ఆయన తండ్రియైన దేవుడు.

'ఒక్కడే మీ తండ్రి' అన్నది యేసు ఉన్నత బోధ. అందరికి తండ్రియైన దేవుడు ఒక్కడే' అన్నది అపొస్తలుల సంపూర్ణ బోధ. దేవుడు తన స్థాయిని అనగా తండ్రి అను తన స్థానాన్ని ఎవరికి ఇచ్చువాడు కాడు. క్రీస్తుకు సమస్తమును లోపరచినా ఆ ఒక్క దేవుడు తప్ప, ఆయనకు అనగా క్రీస్తునకు సమస్తమును లోపరచబడి ఉన్నాయి.

ఇశ్రాయేలీయుల నాయకుడైన మోషే కొద్దిపాటి అవిధేయతతో పాలు తేనేలు ప్రవహించే దేశమైన కనానులో ప్రవేశించకపోయినా, దేవుని కృపను బట్టి ఇప్పుడు పరదైసులో నిశ్చింతగా ఉన్నాడు. తండ్రియైన దేవునిపట్ల యేసు సంపూర్ణ విధేయతతో జీవించి ప్రభువుగా క్రీస్తుగా నేడు పరలోకమందు దేవుని కుడి పార్శ్వమున కూర్చుని పరలోకం కేంద్రంగా పరిపాలన సాగిస్తూ ఉన్నాడు. ఈ భూమి మీద దేవ దేవున్ని తండ్రిగా క్రీస్తు ఆరాధించి ఘనపరచిన విధానం అద్భుతం. క్రొత్త నిబంధన ప్రారంభ పుస్తకాలలో అనగా క్రీస్తు బోధలలో దేవుడు ఏమై ఉన్నాడో క్షుణ్ణంగా పరిశీలించబద్దులము. సువార్తలలో ఆ పరమ దేవున్ని యేసుక్రీస్తు వారు ఎలా పరిచయం చేసినట్టుగా రాయబడింది? అలాగే దేవుడు యేసును ఈ లోకానికి ఎలా పరిచయం చేసాడు? అన్న వివరాలు ముఖ్యమైనవే. ఈ క్రమంలో అపవాది, వాని దూతలు ఈ ఇరువురిని ఎలా చూస్తున్నారు అన్నది కీలక సమాచారమే. ఈ ముగ్గురి నుండి అనగా యెహోవా దేవుడు, ఆయన కుమారుడైన క్రీస్తు, సత్య విరోధి సాతానుల నుండి ఒక ముఖ్య విషయం గూర్చిన మరింత లోతైన సమాచారం ఇప్పుడు తెలుసుకోక తప్పదు.

శీర్షిక దిగువ ఈ వ్యాసపు పై వాక్యంలో దేవుడు స్వయంగా నేను తండ్రిని అంటూ తన గూర్చి తాను చెప్పుకోవడం చూస్తున్నాము. పితరుల కాలంలో సర్వశక్తిమంతుడుగా, ధర్మశాస్త్ర కాలంలో యెహోవాగా తనను తాను పరిచయం చేసుకున్నాడు. ఇదే కాలంలో తండ్రిగా కూడా తనను తాను అభివర్ణించుకున్నాడు. అదే వచనం పైన చూస్తాము

యేసు బాప్తిస్మము తీసుకున్న వెంటనే ''ఇదిగో ఈయనే నా ప్రియ కుమారుడు. ఈయన యందు నేను ఆనందించుచున్నాను. ఈయన మాట వినుడి'' అంటూ ఒక శబ్దము ఆకాశము నుండి వినపడింది. ఈ విధంగా దేవుడు యేసుక్రీస్తును నా ప్రియ కుమారుడు అంటూ పరిచయం చేశాడు. ఈ సత్యం ప్రకారంగా యేసు దేవునికి కుమారుడు. కాబట్టి దేవుని దివ్య మాటలు, క్రీస్తు బోధలు, అపొస్తలుల ఉపదేశాలను బట్టి చూస్తే క్రీస్తు దేవునికి కుమారుడు. తండ్రి తండ్రే, కుమారుడు కుమారుడే అన్న వివేచనతో కూడిన ఇంపైన గ్రహింపుతో చూస్తే యావత్భక్తుల పాలిట క్రీస్తు తండ్రిస్థానంలో లేడని అర్థం అవుతుంది. విశ్వాస విషయములో దేవుని కుమారుని గూర్చిన జ్ఞాన విషయములో అందరి మధ్య ఏకత్వం కుదిరితే తండ్రి ఎవరో అన్నది ఇట్టే తెలిసి పోతుంది (ఎఫెసీ 4: 4-6,11,12). మాకు యెహోవా తండ్రే, యేసు కూడా తండ్రే అనంటే దేవుని దివ్య సంకల్పానికి ఒక అర్థ పరమార్థం ఉండదు.

''మనుష్యులు మీ సత్క్రియలను చూచి పరలోకమందున్న మీ తండ్రిని మహిమపరచాలి. మీరు పరలోకమందున్న మీ తండ్రికి కుమారులై ఉండునట్లు మీ శత్రువులను ప్రేమించండి'' అంటూ ఇలా కొండమీది తన ప్రసంగములో క్రీస్తు అద్వితీయ సత్య దేవున్ని తండ్రిగా భక్త సమాజానికి పరిచయం చేయడం విశేషం. దేవునికి ప్రార్థన చేయడం ఎలాగో విద్యలేని పామరులైన తన శిష్యులకు నేర్పుతూ దేవున్ని ''పరలోకమందున్న మా తండ్రీ'' అంటూ విరివిగా వేడుకోమన్నాడు. అవసరాలు తీర్చుకోమన్నాడు. దేవుడు నాకు తండ్రి అంటూ చెప్పుకుంటూ అంతటా సంచరించినా క్రీస్తు దేవున్ని తండ్రిగానే అందరికి పరిచయం చేశాడు. స్వకీయ మహిమను వెదకేలా తండ్రియైన దేవుని మహిమను ఏనాడూ దొంగిలించలేదు. ఈ లోక ఘనత మహిమల కోసం ఆయన ఎప్పుడూ వెంపర్లాడలేదు.

- జేతమ్

• మంచి మాటలు

- మనం చేసే పని ఎంతమంది చూస్తారన్నది ముఖ్యం కాదు. అది ఎంతమందికి ఉపయోగపడింది అనేదే ముఖ్యం. మంచి పని చేసేటపుడు మనం కనపడాల్సిన అవసరంలేదు. మంచితనం కనపడితే చాలు.
- 'చిరునవ్వును మించిన అలంకరణ లేదు. వినయాన్ని మించిన ఆభరణం లేదు.
- అహంకారం, గర్వం, పొగరు... చాలా ఖరీదైనవి. మనకువాటిని కొనుక్కునే స్తోమత లేదు. అందుకే... చవగ్గా దొరికే సంతోషం, ప్రేమ, చిరునవ్వు, ఆప్యాయత, సర్దుకుపోవడం... అనే వాటితోనే సరిపెట్టుకుందాం.
- ప్రమాదమైనా సింహాన్నే ప్రేమించు, ప్రమాదం లేదనుకుని నక్కలతో చెలిమి వద్దు. అసలు ప్రమాదం గుంట నక్కలతోనే.
- మితిమీరిన నమ్మకం చాలా ప్రమాదం... నమ్మకం ఎంత బలపడితే నమ్మకద్రోహం అంత గట్టిగా తగులుతుంది!

• ఇస్లాం వెలుగు

సజీవమైన వక్ఫ్ అది

వక్ఫ్ అంటే స్థిరమైనది. నిలకడగా ఉండేది. ధర్మసొత్తు అని అర్థం. ఎవరైనా సరే నేను ఈ ఆస్తిని వక్ఫ్‌గా ఇస్తున్నాను అంటే అది అల్లాహ్ ఆస్తిగా పరిగణింపబడుతుంది. ఇందులో ఈద్గా, మస్జిద్, దర్గా, కబ్రస్తాన్, అనాథాశ్రయం, మదర్సా, విద్యాలయాలు, విద్యార్థులకు కావలసిన పుస్తకాలు మొదలైనవి సమకూర్చవచ్చు. అదేవిధంగా వితంతువులకు, నిరుపేదలకు, చిరు వ్యాపారస్తులకు సహాయం అందించవచ్చు.

హిజ్రీ శకం13వ సంవత్సరంలో అంటే ఇప్పటికీ 1337 సంవత్సరాలకు పూర్వం మదీనాలో నీటి కరువు ఏర్పడింది. అక్కడ ఒక యూదుడు తన బావి నీరు ప్రజలకు అమ్మేవాడు. దైవప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు సల్లం) గారితో ముస్లింలు నీటి సమస్య ఉందని. ఆ నీటి సమస్యను పరిష్కరించాలని కోరారు.

అప్పుడు దైవప్రవక్త: ఎవరు బావిని కొని వక్ఫ్ చేస్తారో వారికి అల్లాహ్ స్వర్గంలో ఒక కొలను ఏర్పాటు చేస్తాడు అని ప్రకటించారు.

అప్పుడు మూడవ ఖలీఫా హజ్రత్ ఉస్మాన్ రజి ఆ యూదునితో ''నీ బావిని నేను కొంటాను'' అన్నారు. ''నేను అమ్మను'' అన్నాడతను. ఎందుకంటే అది అతని ఉపాధి గనుక. సరే నాకు సగం బావి అమ్ము. ఒక రోజు నీవు వాడుకో ఒక రోజు నేను వాడుకుంటాను అన్నారు.

ఈ విషయం నచ్చి అతడు సగం బావి హజ్రత్ ఉస్మాన్ రజి గారికి అమ్మి వేశాడు. ముస్లిములు, ముస్లిమేతరులు అందరూ ఉచితంగా బావి నీరు తీసుకు వెళుతున్నారు. అయితే రెండవరోజు కొనడానికి ఎవరూ వచ్చేవారు కాదు, అలా అతని నీటివ్యాపారం మందగించడం వల్ల అతడు సగం బావిని కూడా 35వేల దిర్హములకు హజ్రత్ ఉస్మాన్ రజి గారికి అమ్మివేశాడు.ఆ విధంగా ఆ బావి మదీనా వాసుల కోసం వక్ఫ్ చేయబడింది.

ఆ బావి నీరు పారడం వల్ల అక్కడ ఖర్జూరపు చెట్లు మొలిచాయి. అలా 1500 చెట్లు పెరిగాయి. వాటి ఖర్జూరాలు దానం చేసేవారు. సౌదీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత దానికి ప్రహరీ గోడ నిర్మించి ఆయన పేరు మీద ఆ తోటను మునిసిపాలిటీలో రిజిస్టర్ చేయించింది. ఆయన పేరు మీదనే ఒక బ్యాంక్ అకౌంట్ తెరిచింది. సగం ఖర్జూరాలు బీదలకు పంచగా సగం ఖర్జూరాలు అమ్మగా వచ్చిన డబ్బు పెద్ద మొత్తంలో ఉస్మాన్ రజి గారి బ్యాంకులో జమ అవుతూ పోయింది.

అప్పుడు ప్రభుత్వం ఒక విశాలమైన స్థలం కొని ఆయన పేరు మీద ఒక హోటల్ నిర్మించింది. దాని ఆదాయం సంవత్సరానికి 50 మిలియన్లు. ఆ విధంగా హజరత్ ఉస్మాన్ రజి గారి పేరు మీద విద్యుత్ బిల్లు, పన్నులు ప్రభుత్వానికి వసూలు అవుతున్నాయి. బ్యాంకులో డబ్బులు జమ అవడం వల్ల పేదప్రజలకు ప్రయోజనం చేకూరుతోంది. ఇది నిరంతరంగా కొనసాగుతున్న కొనసాగుతున్న ఒక సజీవమైన వక్ఫ్ ఆస్తి.



- మొహమ్మద్ అబ్దుల్ రషీద్

సాక్షి ప్లస్
గురువారం । 11-12-2025

బిజినెస్ రీల్

2026లో సౌత్ సెంట్రల్ క్లౌడ్ రీజియన్ అందుబాటులోకి

మైక్రోసాఫ్ట్ సీఈవో సత్య నాదెళ్ల వెల్లడి

న్యూఢిల్లీ: హైదరాబాద్‌లో తమ సౌత్ సెంట్రల్ క్లౌడ్ రీజియన్ వచ్చే ఏడాది మధ్య నాటికి అందుబాటులోకి రాగలదని టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ సీఈవో సత్య నాదెళ్ల వెల్లడించారు. టెక్నాలజీ శకంలో భారత్ సాధిస్తున్న పురోగతికి తమ భారీ పెట్టుబడులే నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. 2030 నాటికి భారత్‌లో 17.5 బిలియన్ డాలర్ల పెట్టుబడులు పెట్టనున్నట్లు ఆయన ప్రకటించడం, ప్రధాని నరేంద్ర మోదీతో భేటీ కావడం తెలిసిందే. 'పెట్టుబడుల విషయంలో చాలా ఉత్సాహంగా ఉన్నాం. ప్రధాని మోదీతో కలిసి, ఈ విషయంపై చర్చించాను కూడా. నె వివిధ సందర్భాల్లో భారత్ వచ్చాను. పీసీ నుంచి మొదలు క్లయింట్ సర్వర్, వెబ్ ఇంటర్నెట్, క్లౌడ్ మొబైల్ వరకు వివిధ శకాల్లో వచ్చాను. టెక్నాలజీ వినియోగ రేటు తగ్గలేదు. ఈ నేపథ్యంలో ఏఐ శకాన్ని తీసుకుంటే ఇటు ప్రజలకు అటు సంస్థలకు కూడా ప్రయోజనకరంగా ఉండేలా దీన్ని మరింతగా ఎలా ఉపయోగించాలనేది ఆలోచించాల్సిన అంశం. దేశంలోనే అగ్రస్థాయి టెక్ కంపెనీగా ఉంటూ, కేవలం టెక్నాలజీ గురించి మాటలు చెప్పడమో లేదా స్వయంగా వినియోగించుకోవడానికే తప్ప దాన్ని మరో వినూత్న టెక్నాలజీని సృష్టించేందుకు ఉపయోగించకపోతే మరింత వెనుకబడిపోయే పరిస్థితి తలెత్తుతుంది' అని నాదెళ్ల చెప్పారు. పేమెంట్లు, ఆరోగ్య సంరక్షణ, బీమా తదితర రంగాల్లో ప్రైవేట్ రంగం పూర్తి స్థాయిలో పాలుపంచుకుంటోందని ఆయన పేర్కొన్నారు.

తెలంగాణలో కీటో మోటార్స్ ప్లాంటు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఎలక్ట్రిక్ వాహనాల తయారీ సంస్థ కీటో మోటార్స్ తెలంగాణలోని జడ్చర్లలో ప్లాంటు ఏర్పాటు చేయనుంది. ఇందుకోసం రూ. 300 కోట్లు వెచ్చించనుంది. దీనికి సంబంధించి తెలంగాణ ప్రభుత్వంతో అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదుర్చుకుంది. దీనితో వచ్చే మూడేళ్లలో ప్రత్యక్షంగా, పరోక్ష

2,000 పైగా ఉద్యోగాల కల్పన జరిగే అవకాశం ఉంది. ఇందులో ఇంట్రా-సిటీ, ఇంటర్-సిటీ ప్రజా రవాణాకు ఉపయోగపడే 9 మీటర్లు, 13 మీటర్ల ఎలక్ట్రిక్ బస్సులను కంపెనీ తయారు చేయనుంది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

11-12-2025

విశాఖ	640-00
చిత్తూరు	663-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	650-00
విజయవాడ	670-00
రిటైల్ ధర (డజను)	90.00
హైదరాబాద్	651-00
వరంగల్	653-00
రిటైల్ ధర	7.11

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
EICHERMOT	7,233.00	1.54
HINDALCO	821.6	1.07
HDFCLIFE	771	1.06
TATASTEEL	162	0.83
SUNPHARMA	1,788.50	0.7

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
INDIGO	4,810.00	-3.17
ETERNAL	282.7	-3.09
TRENT	4,013.00	-1.77
ADANIENT	2,213.90	-1.39
JSWSTEEL	1,093.30	-1.31

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	6,597
ఎన్ఎస్ఈ	95,827
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	1,38,696
ఎఫ్ఐఐ	- 1,651
డీఐఐ	+ 3,752

ముడిచమురు... (బ్యారెల్)

	రాత్రి 11.30కు		క్రితం ముగింపు
నైమెక్స్ లైట్ స్వీట్	58.04	$	58.25
బ్రెంట్	61.75	$	61.94

5 కంపెనీలు లిస్టింగ్‌కు రెడీ

తాజాగా సెబీ గ్రీన్ సిగ్నల్

- జాబితాలో మోల్బియో డయాగ్నోస్టిక్స్
- లీప్ ఇండియా, ఎల్‌డొరాడో అగ్రిటెక్
- టెక్నోక్రాఫ్ట్ వెంచర్స్, ఫుడ్‌లింక్ ఎఫ్అండ్‌బీ

ఈ కేలండర్ ఏడాది(2025) సరికొత్త రికార్డు నెలకొల్పే బాటలో ప్రైమరీ మార్కెట్లు పలు లిస్టింగ్‌లతో కదం తొక్కుతున్నాయి. ఇప్పటికే సెంచరీ మార్క్‌కు చేరువైన ఐపీవోలు రూ. 1.6 లక్షల కోట్లకుపైగా సమీకరించాయి. ఈ బాటలో తాజాగా క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ మరో 5 కంపెనీలకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. వివరాలు చూద్దాం..



న్యూఢిల్లీ: పబ్లిక్ ఇష్యూ చేపట్టేందుకు తాజాగా సెబీ నుంచి 5 కంపెనీలకు అనుమతి లభించింది. జాబితాలో లీప్ ఇండియా, ఎల్‌డొరాడో అగ్రిటెక్, మోల్బియో డయాగ్నోస్టిక్స్, టెక్నోక్రాఫ్ట్ వెంచర్స్, ఫుడ్‌లింక్ ఎఫ్అండ్‌బీ హోల్డింగ్స్(ఇండియా) చేరాయి. నిధుల సమీకరణకు వీలుగా ఈ కంపెనీలన్నీ జూన్ నుంచి సెప్టెంబర్ మధ్య కాలంలో సెబీకి ముసాయిదా ప్రాస్పెక్టస్ దాఖలు చేశాయి. అయితే మరోపక్క ఐనాక్స్ క్లీన్ ఎనర్జీ, స్కై అల్లాయ్స్ అండ్ పవర్ వెనకడుగు వేశాయి. ఈ నెల మొదట్లో సెబీ నుంచి ఐపీవో పత్రాలను వాపస్ తీసుకున్నాయి. వీటిలో ఐనాక్స్ క్లీన్ ఎనర్జీ తాత్కాలికంగానే ప్రాస్పెక్టస్‌ను వెనక్కి తీసుకున్నట్లు తెలుస్తోంది. ప్రీఐపీవో రౌండ్‌లో భాగంగా కంపెనీ ఇటీవల రూ. 5,000 కోట్లు సమకూర్చుకున్న నేపథ్యంలో ఫైనాన్షియల్స్‌పై సవరించిన ముసాయిదా పత్రాలను తిరిగి దాఖలు చేయనున్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి.

రూ. 2,400 కోట్లపై కన్ను

పబ్లిక్ ఇష్యూలో భాగంగా సప్లైచైన్ అసెట్ పూలింగ్ కంపెనీ లీప్ ఇండియా రూ. 400 కోట్ల విలువైన ఈక్విటీని కొత్తగా జారీ చేయనుంది. వీటికి జతగా మరో రూ. 2,000 కోట్ల విలువైన షేర్లను ప్రస్తుత వాటాదారులు ఆఫర్ చేయనున్నారు. దీంతో లిస్టింగ్ ద్వారా రూ. 2,400 కోట్లు సమీకరించాలని ఆశిస్తోంది. ఈక్విటీ జారీ నిధుల్లో రూ. 300 కోట్లు రుణ చెల్లింపులకు, మిగిలిన నిధులను వర్కింగ్ క్యాపిటల్ అవసరాలకు వెచ్చించనుంది.

రూ. 1,000 కోట్లకు రెడీ

శ్రీకార్ సీడ్స్ బ్రాండ్ కంపెనీ ఎల్‌డొరాడో అగ్రిటెక్ ఐపీవోలో భాగంగా రూ. 340 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. అంతేకాకుండా మరో రూ. 660 కోట్ల విలువైన షేర్లను కంపెనీ ప్రమోటర్లు విక్రయానికి ఉంచనున్నారు. తద్వారా రూ. 1,000 కోట్లు సమీకరించాలని భావిస్తోంది. విత్తనాలుసహా.. సస్యరక్షణ సొల్యూషన్స్ సమకూర్చే తెలంగాణ కంపెనీ ఈక్విటీ జారీ నిధుల్లో రూ. 245 కోట్లు రుణ చెల్లింపులు, సాధారణ కార్పొరేట్ అవసరాలకు వినియోగించనుంది.

పీఈ సంస్థల వాటాలు

పీఈ సంస్థలు టెమాసెక్, మోతీలాల్ ఓస్వాల్‌కు పెట్టుబడులున్న మోల్బియో డయాగ్నోస్టిక్స్ ఐపీవోలో భాగంగా రూ. 200 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. అంతేకాకుండా వీటికి జతగా మరో 1.25 కోట్ల షేర్లను కంపెనీ ప్రస్తుత వాటాదారులు ఆఫర్ చేయనున్నారు. ఈక్విటీ జారీ నిధుల్లో రూ. 99 కోట్లు కొత్త ఆర్అండ్‌డీ యూనిట్(ఎక్సలెన్స్ సెంటర్, ఆఫీస్ స్పేస్) ఏర్పాటుకు వెచ్చించనుంది.

కేంద్రీకృత కిచెన్ల ఏర్పాటు

కేటరింగ్, ఫుడ్ రిటైల్ చైన్ కంపెనీ ఫుడ్‌లింక్ ఎఫ్అండ్‌బీ హోల్డింగ్స్(ఇండియా) ఐపీవోలో భాగంగా రూ. 160 కోట్ల విలువైన ఈక్విటీని కొత్తగా జారీ చేయనుంది. అంతేకాకుండా మరో 1.19 కోట్ల షేర్లను కంపెనీ ప్రమోటర్లు, ప్రస్తుత వాటాదారులు విక్రయానికి ఉంచనున్నారు. ఈక్విటీ జారీ నిధులను కొత్త కేంద్రీకృత కిచెన్ల ఏర్పాటుతోపాటు, మెటీరియల్ అనుబంధ సంస్థ ఫుడ్‌లింక్ గ్లోబల్ రెస్టారెంట్స్ అండ్ కేటరింగ్ సర్వీసెస్ కొత్తగా నెలకొల్పనున్న క్యాజువల్ డైనింగ్ రెస్టారెంట్లకు వినియోగించనుంది. ఇండియా బిస్ట్రో, ఆర్ట్ ఆఫ్ దమ్, చైనా బిస్ట్రో తదితర బ్రాండ్లతో 30 క్యాజువల్ రెస్టారెంట్లు, క్లౌడ్ కిచెన్లను నిర్వహిస్తోంది.

తాజా ఈక్విటీ, ఓఎఫ్ఎస్

ఐపీవోలో భాగంగా వేస్ట్‌వాటర్ ట్రీట్‌మెంట్ సొల్యూషన్లు అందించే టెక్నోక్రాఫ్ట్ వెంచర్స్ 95.05 లక్షల ఈక్విటీ షేర్లను కొత్తగా జారీ చేయనుంది. అంతేకాకుండా మరో 23.76 లక్షల షేర్లను కంపెనీ ప్రమోటర్ సంస్థ కార్తికేయ కన్‌స్ట్రక్షన్స్ ఆఫర్ చేయనుంది. ఈక్విటీ జారీ నిధులలో రూ. 138 కోట్లు వర్కింగ్ క్యాపిటల్ అవసరాలకు, మిగిలిన నిధులను సాధారణ కార్పొరేట్ అవసరాలకు కేటాయించనుంది.

రెండు కంపెనీల దరఖాస్తు

- జాబితాలో స్టీమ్‌హౌస్ ఇండియా
- సిటియస్ ట్రాన్స్‌నెట్ ఇన్వెస్ట్ ట్రస్ట్

రవాణా సంబంధ మౌలిక సదుపాయాలలో పెట్టుబడులు చేపట్టే సిటియస్ ట్రాన్స్‌నెట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్(ఇన్విట్) పబ్లిక్ ఇష్యూకి వస్తోంది. ఇందుకు అనుమతించమంటూ సెబీకి ప్రాస్పెక్టస్ దాఖలు చేసింది. దీనిలో భాగంగా యూనిట్ల జారీ ద్వారా రూ. 1,340 కోట్లు సమీకరించే యోచనలో ఉంది. ఇష్యూ నిధుల్లో రూ. 1,235 కోట్లు ఎస్ఆర్‌పీఎల్‌లో సెక్యూరిటీల కొనుగోలు, టీఈఎల్, జేఎస్ఈఎల్, ధోలా, డిబంగ్ తదితర ఎస్‌పీవీ ప్రాజెక్టులలో పెట్టుబడులు చేపట్టనుంది. మరికొన్ని నిధులను సాధారణ కార్పొరేట్ అవసరాలకు వెచ్చించనుంది. దాదాపు 3,407 కిలోమీటర్ల పోర్ట్‌ఫోలియో(ఆస్తులు)ను కలిగి ఉంది. గతేడాది(2024-25) రూ. 1,987 కోట్ల ఆదాయం, రూ. 418 కోట్ల నికర నష్టం ప్రకటించింది.

రూ. 425 కోట్లకు సై

ఇండస్ట్రియల్ స్టీమ్, గ్యాస్ సరఫరా చేసే స్టీమ్ హౌస్ ఇండియా ఐపీవోకు వీలుగా సెబీకి అప్‌డేటెడ్ ప్రాస్పెక్టస్‌ను జత చేసింది. జూలైలో గోప్యతా విధానంలో దరఖాస్తు చేయడంతో తాజాగా పత్రాలు దాఖలు చేసింది. ఇష్యూలో భాగంగా రూ. 345 కోట్ల విలువైన ఈక్విటీని కొత్తగా జారీ చేయనుంది. వీటికి జతగా మరో రూ. 80 కోట్ల విలువైన షేర్లను ప్రమోటర్ ఆఫర్ చేయనున్నారు. తద్వారా 425 కోట్లు సమీకరించే ప్రణాళికల్లో ఉంది. ఈక్విటీ జారీ నిధులను రుణ చెల్లింపులు, అంకలేశ్వర్, పనోలీ యూనిట్ల విస్తరణకు, దహేజ్‌లో కొత్త స్టీమ్ జనరేషన్ యూనిట్ ఏర్పాటుకు వినియోగించనుంది. 2024-25లో రూ. 395 కోట్ల ఆదాయం, రూ. 31 కోట్ల నికర లాభం ఆర్జించింది.

భారత్‌లో ఐపీవోల సందడి

- ఏడాదికి 20 బిలియన్ డాలర్ల ఇష్యూలు సర్వసాధారణం
- జేపీ మోర్గాన్ ఈక్విటీ క్యాపిటల్ మార్కెట్స్ హెడ్ అభినవ్

ముంబై: ప్రస్తుతం ఏడాదికి 20 బిలియన్ డాలర్ల(రూ. 1.8 లక్షల కోట్లు) విలువైన పబ్లిక్ ఇష్యూలు భారత్‌లో సర్వసాధారణ విషయంగా మారిపోయినట్లు ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకింగ్ దిగ్గజం జేపీ మోర్గాన్ పేర్కొంది. గతేడాది స్థాయిలో ఇప్పటికే ఈ కేలండర్ ఏడాది(2025)లో 21 బిలియన్ డాలర్ల ఇష్యూలు వెలువడినట్లు జేపీ మోర్గాన్ ఈక్విటీ క్యాపిటల్ మార్కెట్స్ హెడ్ అభినవ్ భారతి పేర్కొన్నారు. వెరసి ఈ ఏడాది 23 బిలియన్ డాలర్ల విలువైన ఇష్యూలతో ముగియనున్నట్లు తెలియజేశారు. రూ. 10,000 కోట్ల విలువైన ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ ఏఎంసీ తదితర ఇష్యూలు ఇందుకు సహకరించనున్నట్లు తెలియజేశారు. ఇకపై ఇదేస్థాయిలో ఇష్యూలు మార్కెట్లను ముంచెత్తే వీలున్నట్లు అభిప్రాయపడ్డారు.

నెస్లేకు కీలక మార్కెట్‌గా భారత్

- టాప్-5లో ఒకటి అవుతుంది
- కంపెనీ భారత చైర్మన్ మనీష్ తివారీ

న్యూఢిల్లీ: బహుళజాతి ఎఫ్ఎంసీజీ సంస్థ 'నెస్లే ఎస్ఏ'కి రానున్న సంవత్సరాల్లో టాప్-5 మార్కెట్లలో భారత్ కూడా ఒకటిగా మారుతుందని ఆ సంస్థ భారత చైర్మన్, ఎండీ మనీష్ తివారీ ప్రకటించారు. భారత్‌లో బలమైన వృద్ధికి వీలుగా ఉన్న స్థూల ఆర్థిక పరిస్థితులు అనుకూలిస్తాయన్నారు. అయితే, నెస్లే ఇండియా ఎంత వేగవంతమైన వృద్ధిని సాధిస్తుంది? అదే సమయంలో ఇతర మార్కెట్లలో నెస్లే ఎస్ఏకి వృద్ధి ఎంతన్న దానిపై ఇది ఆధారపడి ఉంటుందన్నారు. ప్రస్తుతం భారత్‌లో కంపెనీ వార్షిక అమ్మకాలు రూ.20వేల కోట్ల స్థాయిలో ఉన్నాయని, అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న మార్కెట్లలో ఒకటిగా ఉన్నట్లు పేర్కొన్నారు. మ్యాగీ ఉత్పత్తులకు భారత్ అతిపెద్ద మార్కెట్‌గా ఉంటే, ఆ తర్వాత కిట్‌క్యాట్‌కు సైతం ద్వితీయ అతిపెద్ద మార్కెట్‌గా ఉన్నట్లు తివారీ చెప్పారు. ''భారత్‌లో ప్రతి మూడు ఇళ్లకు గాను రెండింటిలో నెస్లే ఉత్పత్తులను వినియోగిస్తున్నారు. ఇది మరింత వృద్ధి చెందాలని కోరుకుంటున్నాం. మా ఉత్పత్తులు మరింత విశ్వసనీయంగా, ఎక్కువ మంది వినియోగదారులకు అందుబాటులో ఉంటాయి''అని పేర్కొన్నారు. కార్యకలాపాల విస్తరణలో భాగంగా పట్టణాల కంటే అధికంగా వృద్ధి చెందుతున్న గ్రామీణ మార్కెట్లలో ఎక్కువ వాటాను సొంతం చేసుకోవడంపై గత కొన్ని త్రైమాసికాల నుంచి దృష్టి సారించినట్లు తివారీ తెలిపారు. గ్రామీణ మార్కెట్లలో ఒకటిన్నర రెట్లు అధిక వృద్ధిని ఆశిస్తున్నట్లు చెప్పారు.

ప్రీమియం ఉత్పత్తులపై దృష్టి

భారత్‌లో ప్రీమియం ఉత్పత్తులపై దృష్టి సారిస్తున్నట్లు తివారీ ప్రకటించారు. ఇక్కడి 2-3 కోట్ల గృహాలు ఐరోపా మార్కెట్ల స్థాయిలో ప్రీమియం ఉత్పత్తులను వినియోగిస్తున్నట్లు చెప్పారు. భారత్‌లో తలసరి వినియోగం పరంగా వృద్ధికి అపార అవకాశాలున్నట్లు తెలిపారు. ఆదాయపన్ను మినహాయింపు, జీఎస్‌టీ రేట్ల కోతతో ఎఫ్ఎంసీజీ మార్కెట్ పుంజుకున్నట్లు పేర్కొన్నారు.

2 లక్షలపైగా సంస్థలకు స్టార్టప్ గుర్తింపు

వాణిజ్య, పరిశ్రమల శాఖ వెల్లడి

న్యూఢిల్లీ: ఇప్పటివరకు రెండు లక్షలకు పైగా సంస్థలు స్టార్టప్ గుర్తింపు పొందాయని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ వెల్లడించింది. 2,01,335 స్టార్టప్‌లను పరిశ్రమలు, అంతర్గత వాణిజ్య ప్రోత్సాహ విభాగం డీపీఐఐటీ గుర్తించినట్లు తెలిపింది. ఇవి దేశవ్యాప్తంగా 21 లక్షల పైచిలుకు ఉద్యోగాలను కల్పాయని పేర్కొంది. 2025 జూన్ వరకు 14 రంగాలవ్యాప్తంగా ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక పథకం (పీఎల్ఐ) కింద రూ. 1.88 లక్షల కోట్ల పెట్టుబడులు వాస్తవ రూపం దాల్చాయని శాఖ వివరించింది. దీనితో అదనంగా రూ. 17 లక్షల కోట్ల విలువ చేసే ఉత్పత్తి/అమ్మకాలు జరిగాయని, 12.3 లక్షల మేర ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగాల కల్పన జరిగిందని పేర్కొంది. పీఎల్ఐ స్కీముతో ఎలక్ట్రానిక్స్, ఫార్మా, టెలికం, నెట్‌వర్కింగ్ ప్రోడక్ట్స్, ఫుడ్ ప్రాసెసింగ్ తదితర రంగాల నుంచి ఎగుమతులు కూడా గణనీయంగా పెరిగాయి. స్టార్టప్ ఇండియా కార్యక్రమం కింద స్టార్టప్‌గా గుర్తింపు పొందిన సంస్థలకు ఆదాయ పన్ను రాయితీ తదితర ప్రోత్సాహకాలు లభిస్తాయి. మరోవైపు, వ్యాపారాల నిర్వహణను సరళతరం చేసే క్రమంలో నిబంధనల భారాన్ని కూడా గణనీయంగా తగ్గించినట్లు కేంద్రం తెలిపింది. గత 11 ఆర్థిక సంవత్సరాల్లో (2014-25) భారత్‌లోకి 748.38 బిలియన్ డాలర్ల విదేశీ పెట్టుబడులు వచ్చాయని వివరించింది. అంతక్రితం 11 ఏళ్లలో (2003-14) వచ్చిన 308.38 బిలియన్ డాలర్లకు ఇది 143 శాతం అధికమని పేర్కొంది.

బీఎస్ఈ 4 కొత్త ఇండెక్సులు

- లార్జ్ క్యాప్ కంపెనీలతో ఏర్పాటు
- విలువ, నాణ్యత, నిలకడతో కూర్పు

న్యూఢిల్లీ: స్టాక్ ఎక్స్ఛేంజీ దిగ్గజం బీఎస్ఈ తాజాగా నాలుగు కొత్త ఇండెక్సులకు తెరతీయనుంది. వీటిని లార్జ్ క్యాప్ ఫ్యాక్టర్ ఇండెక్సులుగా ప్రవేశపెట్టనుంది. ఇందుకు బీఎస్ఈ ఇండెక్స్ సర్వీసెస్ మొమెంటమ్, నిలకడ(తక్కువ ఆటుపోట్లు), విలువ, నాణ్యత ఆధారంగా రూపొందించనుంది. తద్వారా ఇన్వెస్టర్లు ప్రత్యేక మార్కెట్ వ్యూహాలను అనుసరించేందుకు వీలు చిక్కనుంది. బీఎస్ఈ లార్జ్ క్యాప్ మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్(టీఎంసీ) నుంచి ఏర్పాటుకానున్న ఈ ఇండెక్సుల షేర్లకు 5 శాతం పరిమితిని అమలు చేయనుంది. బీఎస్ఈ లార్జ్‌క్యాప్ 100 పేరుతో మొమెంటమ్ 30, లో వొలాటిలిటీ(నిలకడ) 30, వేల్యూ 30, క్వాలిటీ 30 పేరుతో కొత్త ఇండెక్సులను ప్రవేశపెట్టనుంది. బీఎస్ఈ లార్జ్‌క్యాప్ 100 పేరుతో విడుదలకానున్న తాజా ఇండెక్సులను రన్నింగ్ ప్యాసివ్ వ్యూహాల కోసం ఈటీఎఫ్‌లు, ఇండెక్స్ ఫండ్స్ వినియోగించుకునేందుకు వీలుంటుందని బీఎస్ఈ పేర్కొంది.

ఏబీ రెనెవబుల్స్‌పై బ్లాక్‌రాక్ కన్ను

రూ. 3,000 కోట్ల పెట్టుబడులకు సై

ముంబై: గ్లోబల్ అసెట్ మేనేజర్ బ్లాక్‌రాక్ తాజాగా ఆదిత్య బిర్లా(ఏబీ) గ్రూప్ పునరుత్పాదక(రెనెవబుల్) బిజినెస్‌లో మైనారిటీ వాటా కొనుగోలు చేయనుంది. ఇందుకు అనుగుణంగా రూ. 3,000 కోట్లు ఇన్వెస్ట్ చేసేందుకు సిద్ధపడుతోంది. గ్లోబల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పార్ట్‌నర్స్(జీఐపీ) ద్వారా తొలుత రూ. 2,000 కోట్లు ఇన్వెస్ట్ చేసేందుకు కట్టుబడినట్లు బ్లాక్‌రాక్ పేర్కొంది. తదుపరి గ్రీన్ షూ ఆప్షన్‌లో భాగంగా మరో రూ. 1,000 కోట్లు ఇన్వెస్ట్ చేయనున్నట్లు తెలియజేసింది. వెరసి ఏబీ గ్రూప్ దిగ్గజం గ్రాసిమ్‌కు చెందిన ఏబీ రెనెవబుల్స్ విలువను రూ. 14,600 కోట్లుగా బ్లాక్‌రాక్ మదింపు చేసింది.

4.3 గిగావాట్ల సామర్థ్యం

ఇప్పటివరకూ ఏబీ రెనెవబుల్.. సోలార్, హైబ్రిడ్, ఫ్లోటింగ్ సోలార్ తదితర డైవర్సిఫైడ్ పోర్ట్‌ఫోలియోతో 4.3 గిగావాట్ల పునరుత్పాదక విద్యుత్ సామర్థ్యాన్ని సొంతంగానే ఏర్పాటు చేసుకుంది. కర్బనాలకు చెక్‌పెట్టడం, శుద్ధ ఇంధనాల వినియోగానికి పెరుగుతున్న డిమాండ్ నేపథ్యంలో దేశీయంగా పునరుత్పాక ఇంధన రంగంలో అపార అవకాశాలున్నట్లు ఆదిత్య బిర్లా గ్రూప్ చైర్మన్ కుమార మంగళం బిర్లా ఈ సందర్భంగా పేర్కొన్నారు. రానున్న కాలంలో రెనెవబుల్స్ సామర్థ్యాన్ని రెట్టింపునకుపైగా అంటే 10 గిగావాట్లకు చేర్చుకునే లక్ష్యంతో ఉన్నట్లు వెల్లడించారు. వెరసి రెనెవబుల్స్ బిజినెస్ గ్రూప్‌నకు చోదక శక్తిగా అవతరించే వీలున్నట్లు అభిప్రాయపడ్డారు.

పదేళ్లలో రూ. 300 లక్షల కోట్లు

2035 కల్లా ఫండ్స్ ఏయూఎం నాలుగింతలు

- గ్రో, బెయిన్ అండ్ కంపెనీ అంచనా
- అక్టోబర్ చివరికి రూ.80 లక్షల కోట్లు
- పెరుగుతున్న రిటైలర్ల భాగస్వామ్యం

న్యూఢిల్లీ: రిటైల్ ఇన్వెస్టర్ల అండతో దేశంలో మ్యూచువల్ ఫండ్స్ పరిశ్రమ మరింత విస్తరించనుంది. ఫండ్స్ సంస్థల నిర్వహణలోని ఆస్తులు (ఏయూఎం) వచ్చే పదేళ్ల కాలంలో గణనీయంగా పెరగనున్నట్లు గ్రో, బెయిన్ అండ్ కంపెనీ సంయుక్త నివేదిక అంచనా వేసింది. 2025 అక్టోబర్ చివరికి మ్యూచువల్ ఫండ్స్ పరిశ్రమ ఏయూఎం రూ.79.88 లక్షల కోట్లుగా ఉంటే, 2035 నాటికి రూ.300 లక్షల కోట్లకు చేరుకోనున్నట్లు తెలిపింది. ఇందులో డైరెక్ట్ ఈక్విటీ హోల్డింగ్స్ విలువ రూ.250 లక్షల కోట్లుగా ఉంటుందని పేర్కొంది. డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ల విస్తరణ, పెరుగుతున్న రిటైల్ ఇన్వెస్టర్ల ప్రాతినిధ్యాన్ని ఈ నివేదిక ప్రధానంగా ప్రస్తావించింది. ప్రస్తుతం మ్యూచువల్ ఫండ్స్ పథకాల్లో 10 శాతం గృహాలే మదుపు చేస్తుండగా, వచ్చే దశాబ్ద కాలంలో 20 శాతానికి విస్తరించనున్నట్లు అంచనా వేసింది. స్పెక్యులేటివ్ ట్రేడింగ్ నుంచి దీర్ఘకాలం కోసం పెట్టుబడులు పెట్టడం, డిజిటల్ సాధనాల వ్యాప్తి, బలమైన మార్కెట్ పనితీరు ఇందుకు దోహదం చేయనున్నట్లు పేర్కొంది. డెరివేటివ్స్ మార్కెట్లో స్పెక్యులేటివ్ ట్రేడింగ్ కట్టడికి సెబీ ఇటీవలి కాలంలో తీసుకున్న కఠిన చర్యలను ప్రస్తావించింది. ఇవి సైతం ఫండ్స్ విస్తరణకు దోహదం చేయనున్నట్లు పేర్కొంది. కొత్తగా 9 కోట్ల మంది రిటైల్ ఇన్వెస్టర్లు జెన్ జెడ్, మిలీనియల్స్ నుంచి వస్తారంటూ.. ఇందుకు పెరుగుతున్న డిజిటల్ వినియోగం, పెరుగుతున్న ఆర్థిక అక్షరాస్యతను ప్రస్తావించింది.

దీర్ఘకాల దృక్పథం..

ఇన్వెస్టర్లలో దీర్ఘకాల పెట్టుబడుల ధోరణి బలపడుతున్నట్లు ఈ నివేదిక తెలిపింది. ఐదేళ్లకు పైగా ఫండ్స్‌లో కొనసాగిస్తున్న పెట్టుబడులు 7 శాతం నుంచి 16 శాతానికి పెరిగినట్టు వెల్లడించింది. అంతేకాదు ఐదేళ్లకు పైగా కొనసాగుతున్న సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (సిప్) పెట్టుబడులు సైతం 12 శాతం నుంచి 21 శాతానికి పెరిగినట్టు నిదర్శనాలుగా పేర్కొంది. గత ఐదేళ్లలో మ్యూచువల్ ఫండ్స్ ఫోలియోలు (ఒక పథకంలో పెట్టుబడికి కేటాయించే సంఖ్య) రెండున్నర రెట్లు పెరిగాయని వెల్లడించింది. ఫోలియోలు గణనీయంగా పెరిగినప్పటికీ పెట్టుబడుల రాక కేవలం 7 శాతమే పెరగడం వెనుక, కొత్త ఇన్వెస్టర్లు తక్కువ మొత్తం పెట్టుబడులతో వస్తుండడాన్ని కారణంగా ప్రస్తావించింది. ''సిప్ పెట్టుబడులు ఏటా 25 శాతం చొప్పున గత దశాబ్ద కాలంలో పెరుగుతూ వచ్చాయి. 30 ఏళ్లలోపు వయసున్న ఇన్వెస్టర్లు ఇప్పుడు 40 శాతానికి చేరారు. 2018-19 నాటికి 23 శాతంగానే ఉన్నారు''అని ఈ నివేదిక వివరించింది. భారత్ 10 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ ప్రయాణంలో రిటైల్ పెట్టుబడులు ప్రధాన చోదకం కానున్నాయని, ఫైనాన్షియల్ ఎకోసిస్టమ్ వ్యాప్తంగా 7 లక్షల కొత్త ఉద్యోగాలను కల్పించనున్నట్టు ఈ నివేదిక అంచనా వేసింది.

ఫండ్స్-ఈక్విటీలకు ప్రాధాన్యం..

సంప్రదాయ పొదుపు సాధనాల నుంచి పెట్టుబడుల ఆధారిత సాధనాల వైపు ఇన్వెస్టర్లు క్రమంగా మళ్లుతున్నారని బెయిన్ పార్ట్‌నర్ సౌరభ్ త్రిహాన్ తెలిపారు. మ్యూచువల్ ఫండ్స్, ఈక్విటీల్లో ప్రత్యక్ష పెట్టుబడులు ఇటీవలి కాలంలో వేగవమంతైన వృద్ధిని చూస్తున్నట్టు చెప్పారు. ''భారతీయులు 'తొలుత పొదుపు నుంచి ముందుగా పెట్టుబడి పెట్టు' మనస్తత్వానికి మారుతున్నట్టు గుర్తించామని గ్రో సహ వ్యవస్థాపకుడు హర్ష జైన్ తెలిపారు.

ప్రిక్వార్టర్ ఫైనల్లో తరుణ్

కటక్: ఒడిశా మాస్టర్స్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్–100 బ్యాడ్మింటన్ టోర్నీలో హైదరాబాద్ ప్లేయర్, టాప్ సీడ్ తరుణ్ మన్నేపల్లి శుభారంభం చేశాడు. తొలి రౌండ్లో 'బై' పొంది నేరుగా రెండో రౌండ్ మ్యాచ్ ఆడిన తరుణ్ 21–5, 21–8తో భారత్‌కే చెందిన మానవ్ చౌధరీని ఓడించి ప్రిక్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లాడు. రెండో సీడ్ కిరణ్ జార్జి, నాలుగో సీడ్ ప్రియాన్షు రజావత్, ఏడో సీడ్ శంకర్ ముత్తుస్వామి కూడా ముందంజ వేశారు. కిరణ్ జార్జి 21–12, 21–13తో రాజేశ్ శ్రీకర్ (భారత్)పై, ప్రియాన్షు 21–19, 14–21, 21–13తో సనీత్ దయానంద్ (భారత్)పై, శంకర్ 21–19, 23–21తో దర్శన్ పూజారి (భారత్)పై నెగ్గారు. మరోవైపు గతవారం గువాహటి సూపర్–100 టోర్నీలో విజేతగా నిలిచిన సంస్కార్ సరస్వత్ అదే జోరును కొనసాగించలేకపోయాడు. క్వాలిఫయర్ హోదాలో మెయిన్ 'డ్రా'లో ఆడిన సంస్కార్ తొలి రౌండ్లోనే ఇంటిదారి పట్టాడు. రౌనక్ చౌహాన్ 11–21, 21–14, 21–9తో సంస్కార్‌పై గెలిచి రెండో రౌండ్‌లోకి ప్రవేశించాడు. హైదరాబాద్ ప్లేయర్ కలగొట్ల లోకేశ్ రెడ్డి రెండో రౌండ్‌లో 25–23, 13–21, 15–21తో బిస్మో రాయ ఒక్టోరా (ఇండోనేసియా) చేతిలో పోరాడి ఓడిపోయాడు.

శ్రియాన్షి, ఉన్నతి ముందంజ

మహిళల సింగిల్స్ విభాగంలో టాప్ సీడ్ ఉన్నతి హుడా, హైదరాబాద్ ప్లేయర్ శ్రియాన్షి వలిశెట్టి ప్రిక్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించారు. తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో ఉన్నతి 21–12, 21–18తో ప్రాకృతి భరత్ (యూఏఈ)పై, శ్రియాన్షి 21–17, 21–12తో అలీషా నాయక్ (భారత్)పై గెలిచారు. భారత్‌కే చెందిన అనుపమ, తస్నిమ్ మీర్, ఆకర్షి కశ్యప్, తాన్యా హేమంత్, అదితి భట్, తన్వీ శర్మ, అన్‌మోల్ ఖరబ్, ఇషారాణి బారువా కూడా ప్రిక్వార్టర్ ఫైనల్లోకి అడుగు పెట్టారు.

రోహిత్ వెనకాలే కోహ్లి

- ఇద్దరి మధ్య 8 పాయింట్లే అంతరం
- ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్ టాప్-2లో భారత స్టార్లు

దుబాయ్: ఇటీవల దక్షిణాఫ్రికాతో వన్డే సిరీస్‌లో దంచికొట్టిన భారత స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లి... అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో రెండో స్థానానికి దూసుకెళ్లాడు. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో రెండు సెంచరీలు, ఒక హాఫ్‌సెంచరీతో 302 పరుగులు చేసిన 37 ఏళ్ల కోహ్లి... తాజా ర్యాంకింగ్స్‌లో 773 పాయింట్లతో రెండు స్థానాలు ఎగబాకి రెండో ర్యాంక్‌కు చేరాడు. 'హిట్‌మ్యాన్' రోహిత్ శర్మ 781 పాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. ఈ ఇద్దరి మధ్య 8 పాయింట్ల అంతరమే ఉంది. గాయం కారణంగా సఫారీలతో సిరీస్‌కు దూరమైన శుబ్‌మన్ గిల్ (723 పాయింట్లు) ఐదో ర్యాంక్‌లో ఉండగా... కేఎల్ రాహుల్ (649 పాయింట్లు) రెండు స్థానాలు మెరుగు పరుచుకొని 12వ ర్యాంక్‌లో నిలిచాడు. వన్డే బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో భారత స్పిన్నర్ కుల్దీప్ (655 పాయింట్లు) మూడు స్థానాలు ఎగబాకి మూడో ర్యాంక్‌లో నిలిచాడు. అఫ్గానిస్తాన్ స్పిన్నర్ రషీద్ ఖాన్ (710 పాయింట్లు) 'టాప్'లో కొనసాగుతున్నాడు. టి20 బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో అభిషేక్ శర్మ (913 పాయింట్లు), బౌలింగ్‌లో వరుణ్ చక్రవర్తి (782 పాయింట్లు) అగ్రస్థానాల్లో ఉన్నారు. టెస్టు బౌలర్ల ర్యాంకింగ్స్‌లో జస్‌ప్రీత్ బుమ్రా (879 పాయింట్లు) 'టాప్'లో ఉండగా... యాషెస్ సిరీస్‌లో విజృంభిస్తున్న మిచెల్ స్టార్క్ (852 పాయింట్లు) మూడో స్థానాలు మెరుగు పరుచుకొని మూడో ర్యాంక్‌కు చేరుకున్నాడు.

కమిన్స్ వచ్చేశాడు

'యాషెస్'తో మూడో టెస్టుకు ఆస్ట్రేలియా జట్టు ప్రకటన

అడిలైడ్: ఆరు నెలల విరామం తర్వాత ఆస్ట్రేలియా టెస్టు జట్టు రెగ్యులర్ కెప్టెన్ ప్యాట్ కమిన్స్ మైదానంలోకి దిగనున్నాడు. ఇంగ్లండ్‌తో యాషెస్ సిరీస్‌లో భాగంగా ఈనెల 17 నుంచి అడిలైడ్‌లో జరిగే మూడో టెస్టులో కమిన్స్ ఆడనున్నాడు. ఈ ఏడాది జూలైలో కమిన్స్ సారథ్యంలో ఆస్ట్రేలియా 3–0తో వెస్టిండీస్‌పై సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేసింది. ఈ సిరీస్ తర్వాత కమిన్స్ వెన్నునొప్పి గాయం తిరగబెట్టింది. పూర్తిస్థాయి ఫిట్‌నెస్ సాధించాకే బరిలోకి దిగాలనే ఉద్దేశంతో 'యాషెస్' తొలి రెండు టెస్టుల్లో కమిన్స్ ఆడలేదు. ఇప్పుడు వెన్నునొప్పి నుంచి కమిన్స్ పూర్తిగా కోలుకోవడంతో మూడో టెస్టు కోసం ప్రకటించిన ఆస్ట్రేలియా జట్టులో కమిన్స్‌కు చోటు లభించింది. తొలి రెండు టెస్టుల్లో తుది జట్టులో లేని ఆఫ్ స్పిన్నర్ నాథన్ లయన్‌ను అడిలైడ్ టెస్టులో ఆడించే అవకాశం ఉంది. కమిన్స్ గైర్హాజరీలో తాత్కాలిక కెప్టెన్ స్టీవ్ స్మిత్ ఆధ్వర్యంలో ఆడిన రెండు టెస్టుల్లోనూ ఆస్ట్రేలియా గెలిచి ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో 2–0తో ఆధిక్యంలోకి వెళ్లింది. అడిలైడ్ టెస్టులోనూ గెలిస్తే యాషెస్ సిరీస్ ఆస్ట్రేలియా వశమవుతుంది.

మూడో టెస్టుకు ఆస్ట్రేలియా జట్టు: కమిన్స్ (కెప్టెన్), స్టీవ్ స్మిత్, స్కాట్ బొలాండ్, అలెక్స్ కేరీ, డగెట్, కామెరాన్ గ్రీన్, ట్రావిస్ హెడ్, జోష్ ఇన్‌గ్లిస్, ఉస్మాన్ ఖ్వాజా, లబుషేన్, నాథన్ లయన్, మైకేల్ నెసెర్, మిచెల్ స్టార్క్, జేక్ వెదరాల్డ్, వెబ్‌స్టెర్.

ఫిబ్రవరిలో షూటింగ్ లీగ్



న్యూఢిల్లీ: త్వరలోనే క్రీడాభిమానులు మరో లీగ్‌ను ఆస్వాదించనున్నారు. ఇప్పటికే క్రికెట్, కబడ్డీ, టేబుల్ టెన్నిస్, టెన్నిస్, వాలీబాల్, ఫుట్‌బాల్, రెజ్లింగ్, బ్యాడ్మింటన్, ఆర్చరీ, హాకీ తదితర క్రీడాంశాల్లో భారత్ వేదికగా లీగ్‌లు జరిగాయి. రెజ్లింగ్, బ్యాడ్మింటన్ లీగ్‌లకు అంతరాయం ఏర్పడినా... మిగతా క్రీడా లీగ్‌లు సజావుగా సాగుతున్నాయి. ఈ నేపథ్యంలో అంతర్జాతీయస్థాయిలో భారత్‌కు నిలకడగా పతకాలు అందించే క్రీడాంశం షూటింగ్‌లో లీగ్‌కు రంగం సిద్ధమైంది. రైఫిల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఎన్ఆర్ఏఐ) ఆధ్వర్యంలో వచ్చే ఏడాది ఫిబ్రవరి 16 నుంచి 26వ తేదీ వరకు తొలి షూటింగ్ లీగ్ ఆఫ్ ఇండియా (ఎస్ఎల్ఐ) జరగనుంది. అంతర్జాతీయ షూటింగ్ క్రీడా సమాఖ్య (ఐఎస్ఎస్ఎఫ్) క్యాలెండర్‌ను దృష్టిలో పెట్టుకొని భారత షూటింగ్ లీగ్ తేదీలను ఖరారు చేశామని ఎన్ఆర్ఏఐ అధ్యక్షుడు కాలికేశ్ నారాయణ్ సింగ్ దేవ్ తెలిపారు. మిక్స్‌డ్ టీమ్ ఫార్మాట్‌లో పిస్టల్ (10 మీటర్లు, 25 మీటర్లు), రైఫిల్ (10 మీటర్లు, 50 మీటర్ల త్రీ పొజిషన్), షాట్‌గన్ (ట్రాప్, స్కీట్) క్రీడాంశాల్లో పోటీలు ఉంటాయని... ఈ లీగ్‌లో భారత్‌తోపాటు పలువురు అంతర్జాతీయ మేటి షూటర్లు బరిలోకి దిగుతారని కాలికేశ్ వివరించారు.

'షూటౌట్'లో భారత్‌దే పైచేయి

- వర్గీకరణ మ్యాచ్‌లో ఉరుగ్వేపై విజయం
- మూడు షాట్‌లను అడ్డుకున్న గోల్‌కీపర్ నిధి
- 9-10 స్థానాల కోసం స్పెయిన్‌తో పోరు

సాంటియాగో (చిలీ): మహిళల జూనియర్ ప్రపంచ కప్ హాకీ టోర్నమెంట్‌లో భారత జట్టు 9–10 స్థానాల కోసం పోటీపడనుంది. నాకౌట్ దశకు చేరుకోవడంలో విఫలమైన జ్యోతి సింగ్ బృందం వర్గీకరణ మ్యాచ్‌ల్లో రాణిస్తోంది. వేల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో 3–1 గోల్స్ తేడాతో నెగ్గిన టీమిండియా... ఉరుగ్వేతో జరిగిన మరో వర్గీకరణ మ్యాచ్‌లో మాత్రం 'షూటౌట్'లో విజయాన్ని అందుకుంది. నిర్ణీత సమయంలోనే గెలవాల్సిన భారత జట్టు మ్యాచ్ చివరి నిమిషంలో గోల్ సమర్పించుకొని ఆటను 'షూటౌట్' వరకు తీసుకెళ్లింది. మ్యాచ్ 19వ నిమిషంలో మనీషా చేసిన గోల్‌తో భారత్ 1–0తో ఆధిక్యంలోకి వెళ్లింది. 60వ నిమిషం వరకు ఆధిక్యంలో ఉన్న భారత్ చివరి సెకన్లలో ఉరుగ్వేకు గోల్ ఇచ్చింది. దాంతో స్కోరు 1–1తో సమమైంది. 'షూటౌట్'లో భారత్ తరఫున పూర్ణిమ యాదవ్, ఇషిక, కనిక సివాచ్ వరుసగా మూడు గోల్స్ చేశారు. మరోవైపు ఉరుగ్వే తరఫున తొలి షాట్‌ను అగస్టీనా గోల్‌గా మలచగా... జస్టినా రెండో షాట్‌ను.. సోల్ మార్టినెజ్ తీసుకున్న మూడో షాట్‌ను... సోల్ మిస్కా కొట్టిన నాలుగో షాట్‌ను భారత గోల్‌కీపర్ నిధి అడ్డుకుంది. దాంతో భారత్ నాలుగో షాట్‌ను తీసుకోకుండానే విజయాన్ని ఖరారు చేసుకుంది. 9–10వ స్థానాల కోసం స్పెయిన్ జట్టుతో భారత్ తలపడుతుంది. మరోవైపు క్వార్టర్ ఫైనల్స్‌లో నెదర్లాండ్స్ 8–2తో ఇంగ్లండ్‌పై, బెల్జియం 4–1తో అమెరికాపై, చైనా 5–3తో ఆస్ట్రేలియాపై, అర్జెంటీనా 2–1తో జర్మనీపై గెలుపొంది సెమీఫైనల్లోకి అడుగు పెట్టాయి. సెమీఫైనల్స్‌లో బెల్జియంతో నెదర్లాండ్స్; చైనాతో అర్జెంటీనా పోటీపడతాయి.

వెస్టిండీస్ 205 ఆలౌట్

న్యూజిలాండ్‌తో రెండో టెస్టు



షై హోప్



టిక్నర్

వెల్లింగ్టన్: అద్వితీయమైన పోరాటంతో న్యూజిలాండ్‌తో తొలి టెస్టును 'డ్రా' చేసుకున్న వెస్టిండీస్ జట్టు రెండో టెస్టులో అదే జోరు కొనసాగించలేకపోయింది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా బుధవారం ప్రారంభమైన రెండో మ్యాచ్‌లో టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన విండీస్ తొలి ఇన్నింగ్స్‌లో 75 ఓవర్లలో 205 పరుగులకు ఆలౌటైంది. షై హోప్ (80 బంతుల్లో 48; 8 ఫోర్లు), జాన్ క్యాంప్‌బెల్ (87 బంతుల్లో 44; 6 ఫోర్లు) ఫర్వాలేదనిపించగా... బ్రాండన్ కింగ్ (33; 5 ఫోర్లు, 1 సిక్స్), కెప్టెన్ రోస్టన్ చేజ్ (29; 2 ఫోర్లు) తలాకొన్ని పరుగులు చేశారు. తొలి మ్యాచ్ 'డబుల్ సెంచరీ హీరో' జస్టిన్ గ్రేవ్స్ (16) ఎక్కువసేపు నిలవలేకపోయాడు. ఒక దశలో 153/3తో పటిష్టంగా కనిపించిన విండీస్ ఆ తర్వాత కివీస్ బౌలర్ల ధాటికి వరుస విరామాల్లో వికెట్లు కోల్పోయింది. న్యూజిలాండ్ బౌలర్లలో బ్లెయిర్ టిక్నర్ 32 పరుగులిచ్చి 4 వికెట్లు పడగొట్టగా... అరంగేట్ర బౌలర్ మిచెల్ రే 3 వికెట్లు ఖాతాలో వేసుకున్నాడు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ఆరంభించిన న్యూజిలాండ్ తొలి రోజు ఆట ముగిసే సమయానికి 9 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 24 పరుగులు చేసింది. కెప్టెన్ టామ్ లాథమ్ (7 బ్యాటింగ్), డెవాన్ కాన్వే (16 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. చేతిలో 10 వికెట్లు ఉన్న ఆతిథ్య కివీస్ జట్టు ప్రత్యర్థి స్కోరుకు ఇంకా 181 పరుగులు వెనుకబడి ఉంది.

టిక్నర్‌కు గాయం

ఈ మ్యాచ్‌లో చక్కటి బౌలింగ్‌తో ఆకట్టుకున్న న్యూజిలాండ్ పేసర్ టిక్నర్ ఫైన్ లెగ్‌లో ఫీల్డింగ్ చేస్తూ గాయపడ్డాడు. విండీస్ కీపర్ ఇమ్లాచ్ కొట్టిన బంతిని బౌండరీ వద్ద ఆపేందుకు ప్రయత్నించే క్రమంలో టిక్నర్ భుజానికి గాయమైంది. నొప్పితో విలవిలలాడిన అతడిని వైద్య సిబ్బంది స్ట్రెచర్‌పై మైదానం నుంచి బయటకు తీసుకెళ్లాల్సి వచ్చింది. గాయం తీవ్రత నేపథ్యంలో అతడిని వెంటనే అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించారు. ఇప్పటికే గాయాల కారణంగా ప్రధాన పేసర్ల సేవలను కోల్పోయిన న్యూజిలాండ్‌కు టిక్నర్ దూరం అవడం ఎదురుదెబ్బే. గాయపడ్డ తీరు చూస్తే ఇప్పుడప్పుడే అతడు అంతర్జాతీయ క్రికెట్‌లోకి వచ్చే అవకాశాలు కనిపించడం లేదు.

హైదర్ అలీపై సస్పెన్షన్ ఎత్తివేత

కరాచీ: అత్యాచార ఆరోపణలతో సస్పెన్షన్‌కు గురైన పాకిస్తాన్ బ్యాటర్ హైదర్ అలీపై విధించిన నిషేధాన్ని పాకిస్తాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) ఎత్తేసింది. బంగ్లాదేశ్ ప్రీమియర్ లీగ్ (బీపీఎల్)లో ఆడేందుకు అతడికి నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ (ఎన్ఓసీ) ఇచ్చింది. హైదర్ అలీతో పాటు మొత్తం 9 మంది ఆటగాళ్లకు పీసీబీ బుధవారం ఎన్ఓసీలు ఇచ్చింది. పాకిస్తాన్ జాతీయ జట్టు తరఫున 35 టి20లు, మూడు వన్డేలు ఆడిన హైదర్ అలీ... పాకిస్తాన్ షాహీన్స్ జట్టు తరఫున ఇంగ్లండ్‌లో పర్యటించిన సమయంలో... ఇంగ్లండ్‌లో పుట్టిన పాకిస్తానీ మహిళ అతడిపై అత్యాచార ఆరోపణలు చేసింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న మాంచెస్టర్ పోలీసులు సరైన ఆధారాలు లేని కారణంగా సెప్టెంబర్ 25న ఈ కేసును మూసివేశారు. దీంతో అతడిపై మోపిన ఆరోపణలు అబద్ధం అని తేలిపోయింది. ఈ నేపథ్యంలో హైదర్ అలీ బీపీఎల్‌లో ఆడేందుకు అనుమతివ్వాలని పీసీబీని కోరగా... అందుకు బోర్డు అంగీకారం తెలిపింది. హైదర్ అలీతో పాటు మొహమ్మద్ నవాజ్, అబ్రార్ అహ్మద్, సాహబ్‌జాదా ఫర్హాన్, ఫహీమ్ అష్రఫ్, హుసేన్ తలత్, ఖ్వాజా నఫా, ఎహెసానుల్లాకు పీసీబీ నిరభ్యంతర పత్రాలు ఇచ్చింది. ఇక సీనియర్ ప్లేయర్ ఉమ్రాన్ అక్మల్ అభ్యర్థనను మాత్రం బోర్డు తిరస్కరించింది.

ఈ నెల 22న బీసీసీఐ ఏజీఎం

కోహ్లి, రోహిత్ కాంట్రాక్టలపై చర్చ

ముంబై: టి20, టెస్టు ఫార్మాట్‌లకు రిటైర్మెంట్ ప్రకటించి... కేవలం వన్డేల్లోనే కొనసాగుతున్న భారత స్టార్ క్రికెటర్లు విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ కాంట్రాక్టల విషయంలో బీసీసీఐ కీలక నిర్ణయం తీసుకోనుంది. ఈ నెల 22న జరగనున్న బోర్డు వార్షిక సర్వసభ్య సమావేశం (ఏజీఎం)లో ఆటగాళ్ల కాంట్రాక్టులతో పాటు... మహిళల దేశవాళీ క్రికెట్ చెల్లింపుల విషయంలో ప్రధానంగా చర్చ సాగనుంది. మిథున్ మన్హాస్ బీసీసీఐ అధ్యక్షుడిగా ఎన్నికైన తర్వాత జరుగుతున్న తొలి ఏజీఎం ఇదే. ఇప్పటి వరకు కోహ్లి, రోహిత్ 'ఏ ప్లస్' కేటగిరీలో ఉండగా... ఇప్పుడు కేవలం ఒక్క ఫార్మాట్‌లోనే ఆడుతున్న కారణంగా ఈ ఇద్దరినీ అందులో నుంచి తొలగించే అవకాశం ఉంది. కొత్త 'ఏ ప్లస్' కాంట్రాక్టు జాబితాలో ఏస్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా, స్పిన్ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజాతో పాటు... టెస్టు, వన్డే కెప్టెన్ శుబ్‌మన్ గిల్ చోటు దక్కించుకోనున్నాడు. ఆన్‌లైన్‌లో జరగనున్న ఈ ఏజీఎంలో మహిళల దేశవాళీలో టోర్నీల మ్యాచ్ ఫీజులు, అంపైర్లు, రిఫరీల జీతభత్యాలు తదితర అంశాలపై చర్చించనున్నారు. ఇక బోర్డు డిజిటల్ సొత్తుకు సంబంధించిన చర్చ కూడా జరగనుంది. ప్రస్తుతం మిథున్ మన్హాస్ బోర్డు అధ్యక్షుడిగా కొనసాగుతుండగా... రఘురామ్ భట్ కోశాధికారిగా వ్యవహరిస్తున్నాడు.

కామన్వెల్త్ ఖో-ఖో పోటీలకు భారత్ ఆతిథ్యం

న్యూఢిల్లీ: ఈ ఏడాది జనవరిలో తొలి ప్రపంచకప్ ఖో–ఖో టోర్నమెంట్‌ను దిగ్విజయంగా నిర్వహించిన భారత్ ఈ గ్రామీణ క్రీడలో మరో మెగా ఈవెంట్‌కు సిద్ధమైంది. వచ్చే ఏడాది తొలిసారి కామన్వెల్త్ ఖో–ఖో చాంపియన్‌షిప్ పోటీలకు భారత్ ఆతిథ్యమివ్వనుంది. మార్చి 9 నుంచి 14వ తేదీ వరకు జరిగే ఈ టోర్నీలో పురుషుల విభాగంలో 16 జట్లు... మహిళల విభాగంలో 16 జట్లు బరిలోకి దిగుతాయి. కామన్వెల్త్ ఖో–ఖో చాంపియన్‌షిప్ తుది వేదికను ఖరారు చేసేందుకు భారత ఖో–ఖో సమాఖ్య వివిధ రాష్ట్రాల క్రీడాధికారులతో చర్చిస్తోంది. 2030 కామన్వెల్త్ గేమ్స్ భారత్‌కు కేటాయించిన నేపథ్యంలో ఈ గ్రామీణ క్రీడకు కామన్వెల్త్ గేమ్స్‌లోనూ చోటు ఇవ్వాలనే లక్ష్యంతో ఖో–ఖో సమాఖ్య పావులు కదుపుతోంది. 'కామన్వెల్త్ ఖో–ఖో చాంపియన్‌షిప్ నిర్వహణ విషయమై వివిధ రాష్ట్రాల ప్రతినిధులతో చర్చిస్తున్నాం. ఈ టోర్నీని విజయవంతంగా నిర్వహించడమే మా లక్ష్యం. తద్వారా కామన్వెల్త్ గేమ్స్–2030, దోహా ఏషియన్ గేమ్స్–2030, బ్రిస్బేన్ ఒలింపిక్స్–2032లో ఖో–ఖోను భాగం చేసేందుకు మా వంతు కృషి చేస్తాం' అని భారత ఖో–ఖో సమాఖ్య జనరల్ సెక్రటరీ ఉప్‌కార్ సింగ్ విర్క్ తెలిపారు.

భారీ తారల... రుజువులు చిక్కాయి

భారీ తారలు. మన సూర్యుని కంటే ఏకంగా పది వేల రెట్లు పెద్దవి! పైగా నిన్నా మొన్నటికి కూడా కావవి! తొలి విస్ఫోటం (బిగ్ బ్యాంగ్) జరిగిన కొన్ని కోట్ల ఏళ్ల వ్యవధిలోనే పుట్టుకొచ్చాయి. అంటే అతి పురాతన నక్షత్రాలన్నమాట. ఇలాంటివి ఈ అనంత విశ్వంలో ఉన్నాయనింతకాలం సైంటిస్టులు అనడమే తప్పించి ఇదమిత్థంగా తేల్చిచెప్ దాఖలాలు మాత్రం లేవు. అలాంటి తొలినాళ్ల భారీ తారల ఉనికికి సంబంధించి పక్కా రుజువులను మానవాళి తాలూకు అతి పెద్ద అంతరిక్ష నేత్రం జేమ్స్ వెబ్ టెలిస్కోప్ తాజాగా ఒడిసిపట్టింది..!

దొరికాయిలా...

ఈ భారీ తారలను రాకాసి నక్షత్రాలుగా సైంటిస్టులు ముద్దు పిలుచుకుంటూ ఉంటారు. వాటి పరిమాణే అందుకు కారణం. సూర్యునితో పోలిస్తే అవి కనీసం 1,000 నుంచి 10,000 రెట్లు పెద్దవి మరి! జీఎస్ 3073 అనే అతి సుదూర నక్షత్ర మండలంలోని రసా యనిక అవశేషాలను జేమ్స్ వెబ్ తాజాగా పట్టించింది. వాటిని అనంతరం ఈ రాకాసి తారల ఉనికిని సైంటిస్టులు అసందిగ్ధంగా నిర్ధారించారు.

పురాతన క్రిష్ణ బిలాలకూ మూలమివే

సృష్టి ఆవిర్భావం జరిగిన కొన్ని కోట్ల ఏళ్లకే అతి భారీ కృష్ణ బిలాలు ఊపిరి పోసుకున్నాయి. ఇందుకు ఎన్నో రుజువు కూడా దొరికాయి. అదెలా సాధ్యపడింది అనే సందేహాలకు కూడా ఈ తొలినాళ్ల రాకాసి తారల ఉనికితో సమాధానం దొరికినట్టయింది.

ఇలా అధ్యయనం..

తొలి తరల ఉనికి కోసం సెంటర్ ఫర్ ఆస్ట్రో ఫిజిక్స్, హార్వర్డ్, స్మిత్సోనియన్, యూనివర్సిటీ ఆఫ్ పోర్ట్స్ మౌత్ సంయుక్తంగా పరిశోధన చేపట్టాయి. ఇందుకో సం తొలుత జీఎస్ 3073 నక్షత్ర మండలంలోని నైట్రోజన్ – ఆక్సిజన్ నిష్పత్తిని అవి లెక్కగట్టి 0.46గా తేల్చాయి. సాధారణ తారలతో కూడిన గెలాక్సీల్లో ఇంతటి నిష్పత్తి అక్షరాలా అసాధ్యం. జీఎస్ 3073లో వందలాది కోట్ల ఏళ్ల క్రితమే భారీ, అంటే రాకాసి తారలు మనుగడ సాగించాయని దీన్నిబట్టి వర్సిటీల బృందం తేల్చింది. 'తొలినాళ్ల రాకాసి తారలు నిజమేనా అని 20 ఏళ్లుగా నెలకొన్న సందిగ్ధానికి ఈ అధ్యయనం తెర దించింది. ఇందుకు సంబంధించిన తొలి పక్క రుజువులు జీఎస్ 3073లో చిక్కాయి' అని అధ్యయన బృంద సారథి డానియల్ వాలెన్ హర్షం వెలిబుచ్చారు. వీటిని తొలి తరం తారలుగా ఆయన అభివర్ణించారు. ఈ ఆసక్తికర అధ్యయన ఫలితాలను ఆస్ట్రో ఫిజికల్ జర్నల్ లెటర్స్ లో ప్రచురించారు.

కొసమెరుపు

జీఎస్ 3037 గెలాక్సీ కేంద్ర స్థానంలో ప్రస్తుతం సూపర్ నోవాలను కూడా తలదన్నే అతి భారీ కృష్ణబిలం ఉందట. అది బహుశా కచ్చితంగా తొలి తరం రాకాసి తారతాలూకు రూపాంతరమే అయి ఉంటుందని సైంటిస్టులు చెబుతున్నారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

రాకాసి తారలు (నాసా చిత్రం)

ఆస్ట్రేలియా టీనేజర్లకు స్క్రీన్ లాకౌట్

సోషల్ మీడియాపై నిషేధం ప్రారంభం

మెల్‌బోర్న్ (ఆస్ట్రేలియా): పదహారేళ్ల లోపు పిల్లలకు సోషల్ మీడియా నిషేధం విధించడాన్ని ఆస్ట్రేలియా ప్రధానమంత్రి ఆంథోనీ అల్బనీస్ స్వాగతించారు. ప్రపంచంలోనే మొట్టమొదటిదైన ఈ నిషేధం బుధవారం నుంచి అమల్లోకి వచ్చింది. అయితే నిషేధం అమలు కష్టంతో కూడుకున్నదని ఆయన హెచ్చరించారు. నిషేధం అమలుతో తమ ఖాతాలు మూతపడినట్లు తెలుసుకున్న పిల్లలు బాధపడ్డారని తల్లిదండ్రులు తెలిపారు. కొందరు చిన్న పిల్లలు తమ ముఖాలపై మీసాలు, గడ్డం చిత్రించుకుని, సోషల్ మీడియా ప్లాట్‌ఫాంల వయసు అంచనా సాంకేతికతను మోసం చేయగలిగారని వెల్లడించారు. తల్లిదండ్రులు, అన్నలు లేదా అక్కలు కూడా.. కొంతమంది పిల్లలకు ఈ ఆంక్షలను తప్పించుకోవడానికి సహాయం చేస్తారని భావిస్తున్నారు.

కన్నవారికి మనశ్శాంతి తథ్యం

'బిగ్ టెక్ కంపెనీల నుంచి ఆస్ట్రేలియా కుటుంబాలు అధికారాన్ని తిరిగి పొందే రోజు ఇది. పిల్లలు పిల్లల్లా ఉండటానికి, తల్లిదండ్రులకు మరింత ప్రశాంతత లభించడానికి నిషేధం ఉపకరిస్తుంది'.. అని అల్బనీస్.. ఆస్ట్రేలియన్ బ్రాడ్‌కాస్టింగ్ కార్ప్‌తో వ్యాఖ్యానించారు. ఆస్ట్రేలియా పిల్లలు.. వారి బాల్యాన్ని హాయిగా గడిపేందుకు వీలు కల్పిస్తుంది. ఆస్ట్రేలియా తల్లిదండ్రులకు మరింత మనశ్శాంతినిస్తుంది. ఆస్ట్రేలియా చేయగలిగితే, మనం ఎందుకు చేయలేం?' అని ప్రపంచ సమాజం ఆస్ట్రేలియా వైపు చూస్తుంది'.. అని అల్బనీస్ చెప్పారు. ఒక బిడ్డ ఆత్మహత్యకు సోషల్ మీడియా కారణమని ఆరోపించే తల్లిదండ్రులతో సహా, సోషల్ మీడియా సంస్కరణ మద్దతుదారుల సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

ఉల్లంఘిస్తే భారీ జరిమానా

బుధవారం నుంచి 16 ఏళ్లలోపు ఆస్ట్రేలియా పిల్లల ఖాతాలను తొలగించడానికి సహేతుకమైన చర్యలు తీసుకోకపోతే, ఫేస్‌బుక్, ఇన్‌స్ట్రాగామ్, కిక్, రెడ్డిట్, స్నాప్‌చాట్, థ్రెడ్స్, టిక్‌టాక్, ఎక్స్, యూట్యూబ్, ట్విచ్ వంటి ప్లాట్‌ఫాంలు గరిష్టంగా 49.5 మిలియన్ల ఆస్ట్రేలియన్ డాలర్లు అంటే.. సుమారు 32.9 మిలియన్ల అమెరికన్ డాలర్ల జరిమానా చెల్లించాల్సి ఉంటుంది.

క్రిస్మస్ నాటికి నివేదిక

ఈ నిషేధాన్ని ఆస్ట్రేలియాలోని ఈ–సేఫ్టీ కమిషనర్ జూలీ ఇన్మాన్ గ్రాంట్ అమలు చేస్తారు. వయస్సు పరిమితిని కచ్చితత్వంతో అమలు చేయడానికి ప్లాట్‌ఫాంల వద్ద ఇప్పటికే సాంకేతికత, వారి వినియోగదారుల వ్యక్తిగత డేటా అందుబాటులో ఉన్నాయని ఆమె స్పష్టం చేశారు. వయసు పరిమితిని ఎలా అమలు చేస్తున్నారు?, ఎన్ని ఖాతాలు మూతపడ్డాయి? అనే అంశంపై సమాచారం ఇవ్వాలని కోరుతూ లక్షిత పది ప్లాట్‌ఫాంలకు గురువారం నోటీసులు పంపుతానని వెల్లడించారు. 'ఈ వయస్సు పరిమితులు ఎలా అమలు అవుతున్నాయో, అవి ప్రాథమికంగా పనిచేస్తున్నాయో లేదో క్రిస్మస్ లోపు ప్రజలకు సమాచారం అందిస్తాం'.. అని ఇన్మాన్ గ్రాంట్ చెప్పారు. కమ్యూనికేషన్స్ మంత్రి అనికా వెల్స్ మాట్లాడుతూ, బుధవారానికి ఆస్ట్రేలియాలో 200,000 కంటే ఎక్కువ టిక్‌టాక్ ఖాతాలు నిలిపివేసినట్లు వివరించారు.

సావర్కర్ అవార్డు నాకొద్దు

ఆ వేడుకకూ వెళ్లను: శశి థరూర్

తిరువనంతపురం/న్యూఢిల్లీ: స్వాతంత్ర యోధుడు వినాయక దామోదర సావర్కర్ పేరిట తనకు ప్రకటించిన అవార్డును స్వీకరించబోనని తిరువనంతపురం కాంగ్రెస్ ఎంపీ శశీ థరూర్ ప్రకటించారు. అసలు ఆ అవార్డు ప్రధాన వేడుకకు కూడా తాను హాజరు కాబోనని స్పష్టం చేశారు. తనను సంప్రదించకుండా, అంగీకారం పొందకుండా ఇలా అవార్డు ప్రకటించడం నిర్వాహకుల లెక్కలేనితనమంటూ బుధవారం ఆయన మండిపడ్డారు. థరూర్ ఆ అవార్డును స్వీకరిస్తారని తాను అనుకోవడం లేదని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మురళీధరన్ అంతకుముందు అన్నారు. బ్రిటిష్ వారికి లొంగిపోయిన వ్యక్తి పేరిట ఉన్న అవార్డును థరూర్ తో పాటు ఏ కాంగ్రెస్ నేతా స్వీకరించరాదని అభిప్రాయపడ్డారు. థరూర్ కొంతకాలంగా బీజేపీకి దగ్గరవుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయనకు సావర్కర్ అవార్డు ప్రకటన కాంగ్రెస్ లో కలకలానికి దారితీసింది. మరోవైపు, తనకు చెప్పకుండా అవార్డు ప్రకటించామన్న థరూర్ వ్యాఖ్యలను హెచ్‌ఆర్‌డీఎస్ ఇండియా పేర్కొన్నట్టుగా హైరేంజ్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ ఖండించింది. అవార్డు అందజేస్తున్నట్టు ఆయనకు చాలా ముందుగానే సమాచారం ఇచ్చినట్టు సంస్థ కార్యదర్శి అజి కృష్ణన్ స్పష్టం చేశారు. ''వేడుకకు సంబంధించిన పూర్తి వివరాలతో కూడిన జాబితాను థరూర్ కుంమం అందించాం. అవార్డు తీసుకొని, వేడుకకు రానని ఆయన మాకు ఇప్పటిదా సమాచారమైతే ఇవ్వలేదు. బహుశా సొంత పార్టీ కాంగ్రెస్ నుంచి వస్తున్న వ్యతిరేకతతో థరూర్ పునరాలోచనలో పడి ఉంటారు'' అని అన్నారు.

యుద్ధం ఆపా!

ట్రంప్ నోట మళ్లీ అదే పాట

న్యూయార్క్, పెన్సిల్వేనియా: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మళ్లీ అదే పాట పాడారు. 'భారత్, పాక్ దాదాపుగా పూర్తిస్థాయి యుద్ధానికి దిగాయి. కల్పించుకుని దాన్ని నివారించా' అన్నారు. ఆయన ఇలా చెప్పుకోవడం ఇది దాదాపు 70వ సారి కావడం విశేషం! మంగళవారం పెన్సిల్వేనియాలోని మౌంట్ పోకోనో వద్ద తన మద్దతుదారులను ఉద్దేశించి ట్రంప్ పాలు గొప్పలకు పోయారు. 'గత 10నెలల్లోనే నేను ఏకంగా 8 యుద్ధాలను ఆపాను. కొసావో, సెర్బియా, ఇండో–పాక్, ఇజ్రాయెల్, ఇరాన్, ఈజిప్ట్, ఇథియోపియా, ఆర్మేనియా, అజర్ బైజాన్' అంటూ ఏకంగా జాబితానే ఏకరువు పెట్టారు. 'ఇప్పుడు కంబోడియా, థాయ్ లాండ్ తలపడుతున్నాయి. రేపు ఆ దేశాధినేతలకు కాల్ చేయబోతున్నా. ఇలాంటి ప్రకటనలు నేనుగాక ఇంకెవరు చేయగలరు?' అంటూ గొప్పలకు పోయారు. సోమాలియా, అఫ్గానిస్థాన్ వంటి మూడో ప్రపంచ దేశాల నుంచి వలసలకు శాశ్వతం ఫుల్ స్టాప్ పెట్టానని చెప్పుకొచ్చారు. నార్వే, స్వీడన్, డెన్మార్క్ లాంటి దేశాల నుంచి అమెరికాకు రారెందుకంటూ వాపోయారు. గత ఏప్రిల్ లో జమ్మూ కాశ్మీర్ లోని పహల్గాంలో 26 మంది అమాయక పర్యాటకులను పాక్ ప్రేరేపిత ఉగ్రవాదులు విచక్షణారహిత కాల్పులతో పొట్టన పెట్టుకోవడం, అందుకు ప్రతీకారంగా భారత్ ఆపరేషన్ సిందూర్ చేపట్టి దాయాది పీచమణచడం తెలిసిందే. చివరికి పాక్ కాళ్ల బేరానికి రావడంతో శాంతి కుదిరింది. అదంతా తన ఘనతేనని అప్పట్లోనే ట్రంప్ చెప్పుకున్నారు. అదేమీ లేదని భారత్ అప్పుడే కొట్టిపారేసింది. కేవలం ఇరు దేశాల చర్చలతోనే సాధారణ పరిస్థితులు నెలకొన్నాయని స్పష్టం చేసింది.

ఒక నోట్ల కట్ట.. డజను ఎంపీలు

పాక్ జాతీయ అసెంబ్లీ ఫ్లోర్‌పై నోట్ల కట్ట ● మాదంటే మాదని చేతులెత్తిన ఎంపీలు

నోట్ల కట్ట చూపిస్తున్న స్పీకర్ సాదిక్

పాకిస్తాన్ జాతీయ అసెంబ్లీలో సోమవారం జరిగిన ఒక సంఘటన, 'నవ్వుకు నోబెల్ బహుమతి' ఉంటే.. అది పాకిస్తాన్ పార్లమెంటుకే దక్కేదని నిరూపించింది. స్పీకర్ అయజ్ సాదిక్ గారు, పార్లమెంటు ఫ్లోర్‌పై పడి ఉన్న ఒక చిల్లర నోట్ల కట్టను చూశారు. అందులో ఏకంగా 10.. రూ.5,000 పాకిస్తాన్ కరెన్సీ నోట్లు ఉన్నాయి. అంటే, భారతీయ కరెన్సీలో దాదాపు రూ.16,500 విలువ అన్నమాట. ఈ మొత్తం పాక్ కరెన్సీలో మహా అయితే రెండు బిర్యానీ ప్యాకెట్లకు సరిపోతుంది.

నోట్లు పది.. చెయ్యెత్తింది డజను మంది

స్పీకర్ సాదిక్.. ఎంపీల నిజాయితీకి పరీక్ష పెడదామని గొప్పగా అనుకున్నారు. అయితే, అది ఎంత హాస్యాస్పదంగా మారుతుందో ఆయన ఊహించలేకపోయారు. 'ఎవరి డబ్బు ఇది? దయచేసి చేయి ఎత్తండి!'.. అని ఆ నోట్ల కట్టను గాల్లో ఊపుతూ అడిగారు. ఆయన నోటి మాట పూర్తి కాకముందే, అదో కబాబ్ దొరికినట్లు.. ఒక్క సెకన్‌లో 12 మంది ఎంపీలు హుటాహుటిన చేతులు పైకెత్తేశారు. ఎంపీల వేగం చూసి స్పీకర్ గారికి నోట మాట రాలేదు. 'నోట్లు ఉన్నది పదే. మరి యజమానులు ఏకంగా పన్నెండు మందా??'.. అంటూ కడుపు చెక్కలయ్యేలా నవ్వారు. పాకిస్తాన్‌కు చెందిన ఆజ్ టీవీ కథనం ప్రకారం, ఆ డబ్బు దాని నిజమైన యజమాని అయిన ఇమ్రాన్ ఖాన్ పార్టీ పాకిస్తాన్ తెహ్రీక్–ఇ–ఇన్సాఫ్ ఎంపీ ముహమ్మద్ ఇక్బాల్ అఫ్రిదికి చేరింది. ఆయన అసెంబ్లీ కార్యాలయం నుండి ఆ మొత్తాన్ని అందుకున్నారు.

తలంటిన పాకిస్తానీలు

సోషల్ మీడియాలో తెగ వైరలైన ఈ వీడియోపై చాలా మంది పాకిస్తానీలు తమ చట్ట సభ సభ్యుల వైఖరిని ఛీత్కరించుకున్నారు. ఆ నోట్లు తమవేనని చేతులెత్తిన 12 మంది ఎంపీలను పదవుల నుంచి తొలగించాలని కొందరు పాకిస్తానీలు కోరారు. 'స్పీకర్ షరీఫ్ సోదరుల నుండి వచ్చిన 25 మిస్డ్ కాల్స్ గమనించలేదు'.. అని మహ్నూర్ ఆసిఫ్ వెటకారంగా ట్వీట్ చేశాడు. మరొకరు 'ఎంపీలు లక్షల్లో జీతాలు, ప్రోత్సాహకాలు తీసుకుంటారు, అయినా వారి పరిస్థితి ఇదే'.. అని ట్వీట్ చేశారు. పార్లమెంటులో దొరికిన డబ్బులు కూడా అప్పుగా తీసుకొచ్చినవేమో అని పాకిస్తానీలు వెటకారంగా వ్యాఖ్యానించడం మరో హైలైట్. రజియా సుల్తాన్ అనే ఫేస్‌బుక్ యూజర్ నవాజ్ షరీఫ్ కుమార్తె మరియం నవాజ్ షరీఫ్‌ను ఇందులోకి లాగారు. 'పీఎంఎల్ఎన్ చాలా పేద పార్టీ. స్పీకర్ వారికి ఆ డబ్బు ఇవ్వాల్సింది.. అది మరియం నవాజ్ సన్నబడేందుకు సహాయపడుతుంది'.. అని పోస్టు చేశారు. మొత్తానికి, పాకిస్తాన్ ఆర్థిక వ్యవస్థ అప్పుల మీద నడుస్తుంటే, పార్లమెంటు సభ్యులు మాత్రం ఫ్లోర్‌పై పడి ఉన్న రూ.16 వేల చిల్లర నోట్ల కోసం ప్రపంచం ముందు పరువు మొత్తం పోగొట్టుకున్నారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

లూథ్రా సోదరులకు చుక్కెదురు

ముందస్తు బెయిల్‌కు ఢిల్లీ కోర్టు తిరస్కృతి

గోవా నైట్‌క్లబ్ భాగస్వామి అజయ్ గుప్తా అరెస్ట్

పనాజీ/న్యూఢిల్లీ: గోవాలో 25 మందిని బలి తీసుకున్న అగ్ని ప్రమాదానికి కారణమైన నైట్‌క్లబ్ యజమానులు, సౌరభ్, గౌరవ్ లూథ్రాలకు ఢిల్లీ కోర్టులో చుక్కెదురైంది. థాయ్‌లాండ్‌కు చెక్కేసిన ఈ సోదరులకు ముందస్తు బెయిల్ ఇచ్చేందుకు కోర్టు గట్టిగా నిరాకరించింది. మరోవైపు, ఈ కేసులో వారి వ్యాపార భాగస్వామి అజయ్ గుప్తాను అరెస్ట్ చేశారు. కోర్టులో లూథ్రా సోదరుల తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ... వారు పారిపోలేదని, ఒక వ్యాపార సమావేశం కోసమే విదేశాలకు వెళ్లారని తెలిపారు. ఆ క్లబ్‌కు వారు కేవలం లైసెన్స్ హోల్డర్లేనని, అసలు యజమానులు కారన్నారు. సౌరభ్ లూథ్రా ఏకంగా నాలుగు వారాల పాటు ట్రాన్సిట్ యాంటిసిపేటరీ బెయిల్ కావాలని కోరాడు. 'నేను తిరిగి గోవాకు వస్తే, కోపంతో ఉన్న జనం నన్ను చంపేస్తారు, నా ప్రాణానికి ముప్పు ఉంది'.. అంటూ వాదించాడు. 'నా మిగతా రెస్టారెంట్లు కూడా నేలమట్టం చేశారు. అధికారులు, చివరికి మీడియా కూడా నా రక్తం తాగడానికి కత్తులు పట్టుకుని తిరుగుతున్నారు'.. అన్నాడు. అయితే, అడిషనల్ సెషన్స్ జడ్జ్ వందన మాత్రం ఆ వాదనలు తోసిపుచ్చి.. గోవా పోలీసుల స్పందన కోరుతూ కేసును గురువారానికి వాయిదా వేశారు.

ఇంటర్‌పోల్ బ్లూ కార్నర్ నోటీసు

లూథ్రా సోదరులు వేగంగా తప్పించుకోవడానికి సంబంధించి తాజాగా కొత్త వివరాలు బయటపడ్డాయి. ఇంటర్‌పోల్ వారి కోసం 'బ్లూ కార్నర్ నోటీసు' కూడా జారీ చేసింది. డిసెంబర్ 7న తెల్లవారుజామున 1.17 గంటలకు, అగ్నిప్రమాదం గురించి తెలిసిన గంటలోనే.. లూథ్రా సోదరులు ట్రావెల్ పోర్టల్ ద్వారా థాయ్‌లాండ్‌లోని ఫుకెట్‌కు టికెట్లు బుక్ చేసుకున్నారు. ఆదివారం తెల్లవారుజామునే ఇండిగో విమానంలో దేశం దాటిపోయారు. అప్పటికి ఇంకా పోలీసులు మంటలు ఆర్పే పనిలోనే ఉండటం గమనార్హం.

ఊచల వెనుక సైలెంట్ పార్ట్‌నర్

'బిర్చ్ బై రోమియో లేన్'నైట్‌క్లబ్‌లో తాను సైలెంట్ పార్ట్‌నర్, పెట్టుబడిదారుడినని చెప్పుకొంటున్న అజయ్ గుప్తాను.. గోవా పోలీసులు ఢిల్లీ క్రైమ్ బ్రాంచ్ సహాయంతో అరెస్ట్ చేశారు. అతనిపై కూడా లుక్ అవుట్ సర్క్యులర్ జారీ అయ్యింది. జమ్మూ వాసి అయిన గుప్తాను అడిషనల్ చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ వినోద్ జోషి ముందు హాజరుపరచగా, అతన్ని గోవాకు తరలించడానికి 36 గంటల ట్రాన్సిట్ రిమాండ్‌ను మంజూరు చేశారు. ఇండిగో విమానాలు రద్దు కావడం వల్ల ఏర్పడిన ప్రస్తుత విమాన ప్రయాణ సంక్షోభాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ సుదీర్ఘ గడువు ఇచ్చారు. గుప్తా వెన్నెముక గాయంతో బాధపడుతున్నందున, తరలించేటప్పుడు.. అతనికి సరైన వైద్య సంరక్షణ అందించాలని కోర్టు ఆదేశించింది. ఈ ఘటనలో ఇప్పటికే ఐదుగురు మేనేజర్లు, సిబ్బందిని గోవా పోలీసులు అరెస్ట్ చేశారు. కాగా, పనాజీలో క్రిస్మస్, న్యూ ఇయర్ వేడుకలకు ముందుగా భారీగా భద్రతా చర్యలు, తనిఖీలు చేపట్టాలని గోవా ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్ ఆదేశించారు. 'డిసెంబర్ 6 సంఘటన నేపథ్యంలో, ఉన్నతాధికారులు, పోలీసు, టూరిజం వాటాదార్లతో సమావేశమయ్యాను. ప్రభుత్వం ఏర్పాటు చేసిన అగ్నిమాపక భద్రతా ఆడిట్ కమిటీ ఇప్పటికే పర్యాటక సంస్థలను తనిఖీ చేయడం మొదలుపెట్టింది. వారు నివేదిక ఇచ్చాక, భద్రతా నిబంధనలు పాటించని సంస్థల లైసెన్స్‌లు రద్దు చేసి, భవనాలను సీల్ చేస్తాం'.. అని సీఎం స్పష్టం చేశారు. పర్యాటక రంగంలో ఉన్నవారు, తమ సిబ్బంది పర్యాటకులతో అనవసరమైన గొడవలకు దిగకుండా చూసుకోవాలని కూడా సావంత్ ఆదేశించారు.

కర్నాల్‌లో పచ్చదనాన్ని పునరుద్ధరించండి

- బీజేపీ ఆఫీస్‌కు రోడ్డుకోసం చెట్ల నరికివేతపై సుప్రీం ఆగ్రహం
- మూడు నెలల్లో పూర్వపు స్థితికి తేవాలని ఆదేశం

న్యూఢిల్లీ: కర్నాల్‌లో కొత్తగా నిర్మించిన బీజేపీ కార్యాలయానికి రహదారికోసం 40 చెట్లను నరికివేయడంపై సుప్రీంకోర్టు బుధవారం ఆగ్రహం వ్యక్తం చేసింది. ప్రాంతాన్ని దాని పూర్వపు స్థితికి పునరుద్ధరించాలని హర్యానా పట్టణాభివృద్ధి సంస్థను ఈ కేసును విచారించిన న్యాయమూర్తులు జేబీ పార్థీవాలా, కేవీ విశ్వనాథన్‌లతో కూడిన ధర్మాసనం ఆదేశించింది. అందుకోసం హర్యానా షహ్రీ వికాస్ ప్రాధికార న్, కర్నాల్ మున్సిపల్ కార్పొరేషన్‌కు ధర్మాసనం మూడు నెలల సమయం ఇచ్చింది. నివాస కాలనీలో భూ కేటాయింపు చట్టబద్ధతను చర్చించడానికి సుప్రీంకోర్టు అభ్యంతరం వ్యక్తం చేసింది. కర్నాల్‌లోని నివాస ప్రాంతంలో బీజేపీ కార్యాలయానికి స్థలాన్ని కేటాయించడాన్ని, ఆ భవనానికి రహదారి కోసం 40 చెట్లను కూల్చివేయడాన్ని 1971 యుద్ధ సైనికుడు కోర్టులో సవాల్ చేశారు. హర్యానా హైకోర్టు మే 3న ఈ పిటిషన్‌ను కొట్టేసింది. దీంతో.. ఆయన సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఆయన తరపు న్యాయవాది భూపేంద్ర ప్రతాప్‌సింగ్ వాదనలతో సుప్రీం ధర్మాసనం ఏకీభవించింది. కేటాయింపుకోసం అవసరమైన అన్ని అనుమతులు తీసుకున్నామని, గ్రీనరీ కోసం అన్ని నబంధనలను పాటించామని ప్రభుత్వం తరపు అదనపు సొలిసిటర్ జనరల్ (ఏఎస్‌జీ)విక్రమ్‌జిత్ భెనర్జీ వాదనలను కొట్టేసింది. దీంతో.. కొట్టేసిన చెట్లకు సమానంగా చెట్లను నాటుతామని ఏఎస్‌జీ ధర్మాసనానికి హామీ ఇచ్చారు.

ప్రధానిపై లేని చర్చ ప్రతిపక్ష నేతపై ఎందుకు?

ప్రియాంకా గాంధీ సూటి ప్రశ్న

న్యూఢిల్లీ: రాహుల్‌గాంధీ వచ్చేవారం చేయనున్న జర్మనీ పర్యటనపై బీజేపీ విమర్శలపట్ల కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకా గాంధీ వాద్రా తీవ్రంగా స్పందించారు. ప్రధానిపై లేని చర్చ లోక్‌సభ ప్రతిపక్ష నాయకునిపై ఎందుకని ప్రశ్నించారు. ప్రధాని నరేంద్ర మోదీ ఏడాదిలో సగం విదేశాల్లోనే గడుపుతుంటే.. ప్రతిపక్ష నాయకుడి పర్యటనపై చర్చిందుకని ఆమె ప్రశ్నించారు. రాహుల్‌గాంధీ డిసెంబర్ 15 నుంచి 20 వరకు జర్మనీలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా భారతీయ ప్రవాసులతోపాటు జర్మన్ మంత్రులను కూడా కలుస్తారని ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ తెలిపింది. ఆయనతో పాటు ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ చైర్‌పర్సన్ సామ్ పిట్రోడా కూడా ఉంటారని జర్మనీలోని ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ అధ్యక్షుడు బల్విందర్ సింగ్ ప్రకటించారు. రాహుల్ గాంధీ పర్యటనపై బీజేపీ విమర్శలు చేసింది. 'లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ పర్యటన నాయకుడు. ఆయన మరోసారి విదేశీ పర్యటన చేస్తున్నారు. పార్లమెంటు సమావేశాలు 19వ తేదీ వరకు ఉండగా.. ప్రతిపక్ష నాయకుడు 15 నుంచి 20వ తేదీ వరకు విదేశాల్లోనే ఉంటారు'అని బీజేపీ అధికార ప్రతినిధి షెహజాద్ పూనావాలా ఎక్స్ వేదికగా విమర్శించారు. బీహార్ ఎన్నికల సమయంలో కూడా ఆయన విదేశాల్లో ఉన్నారు, జంగిల్ సఫారీ కూడా చేశారని ఎద్దేవా చేశారు.

ఉమర్, షార్జీల్ బెయిల్ పిటిషన్లపై తీర్పు రిజర్వ్

న్యూఢిల్లీ: ఢిల్లీ అల్లర్ల కేసులో ఉమర్ ఖలీద్, షార్జీల్ ఇమామ్ బెయిల్ పిటిషన్లపై తీర్పును సుప్రీంకోర్టు రిజర్వ్ చేసింది. న్యాయమూర్తులు అరవింద్‌కుమార్, ఎన్వీ అంజ రియాలతో కూడిన ధర్మాసనం బుధవారం విచారించింది. బెయిల్ పిటిషన్లను సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్వీ రాజులు తీవ్రంగా వ్యతిరేకించారు. 2020లో ఢిల్లీ అలర్లు ఆకస్మికంగా జరిగినవి కావన్నారు. భారత సార్వభౌమాధికారంపై ముందస్తు ప్రణాళికతో చేసిన దాడిగా అభివర్ణించారు. సీనియర్ న్యాయవాదులు కపిల్ సిబల్, అభిషేక్ సింఘ్వీ, సిద్ధార్థ దవే, సల్మాన్ ఖుర్షీద్, సిద్ధార్థ్ లూథ్రా ప్రతివాదనలను విన్న ధర్మాసనం తన తీర్పును రిజర్వ్ చేసింది. 2020లో సీఏఏ, ఎన్నార్సీలకు వ్యతిరేకంగా ఢిల్లీలో నిరసనల సందర్భంగా హింస చెలరేగింది. 53 మంది మృతి చెందగా, 700 మందికి పైగా గాయపడ్డారు. ఈ అల్లర్లకు ఉమర్, షార్జీల్‌లను సూత్రదారుల ఆరోపిస్తూ ఉపా కేసు నమోదైంది. ఢిల్లీ హైకోర్టు సెప్టెంబర్ 2న బెయిల్ నిరాకరించగా.. నిందితులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

2 భవనాలు కూలి 19 మంది మృతి

ఫెస్: మొరాకోలోని రెండో అతి పెద్ద నగరమైన ఫెస్‌లో రెండు నాలుగంతస్తుల భవనాలు కుప్పకూలాయి. మంగళవారం రాత్రి జరిగిన ఈ ఘోర ప్రమాదంలో 19 మంది మృతి చెందారు. 16 మందికి గాయాలయ్యాయి. ఈ రెండు భవనాల్లో ఎనిమిది కుటుంబాలు నివసిస్తున్నాయి. ప్రభుత్వం సహాయక చర్యలు చేపట్టాయి. ఫెస్ దేశంలోని అత్యంత పేద నగరాల్లో కూడా ఒకటి. ఈ నెలలో జరగనున్న ఆఫ్రికా కప్ ఆఫ్ నేషన్స్, 2030 ఫిఫా ప్రపంచ కప్‌కు ఆతిథ్యమిచ్చే నగరాల్లో ఒకటి. ఇది మధ్యయుగంనాటి సౌక్‌లు, టానరీలతో నిండిన గోడలకు ప్రసిద్ధి చెందింది. ఇది ఈ ఏడాది రెండో అతిపెద్ద ప్రమాదం. మే నెలలో మరో భవనం కూలిపోవడంతో 10 మంది మరణించారు. ఏడుగురు గాయపడ్డారు. అత్యంత పురాతన నగరమైన ఇక్కడ భవన నిభనందనల అతిక్రమణలు సర్వసాదారణం. ఆరోగ్యం, విద్య వంటి ప్రజా సేవా రంగాల్లోని అసమానతలపై దృష్టి పెట్టకుండా ప్రభుత్వం కొత్త స్టేడియాలు కట్టడంపై ఈ ఏడాది ప్రారంభంలో నిరసనలు జరిగాయి.

భారత సంతతి వ్యక్తికి 25 ఏళ్ల జైలు శిక్ష

కాన్‌బెర్రా: ఆస్ట్రేలియాకు చెందిన మహిళ హత్య కేసులో భారత సంతతి వ్యక్తికి 25 ఏళ్ల జైలు శిక్ష పడింది. గతంలో నర్సుగా పనిచేసిన 41 ఏళ్ల రాజ్‌విందర్ సింగ్ హత్య కేసులో దోషిగా కౌర్న్స్‌లోని సుప్రీంకోర్టు సోమవారం నిర్ధారించింది. మంగళవారం శిక్ష విధించింది. హత్యకు గల కారణాలు మాత్రం తెలియలేదు. క్వీన్స్‌లాండ్‌లోని బీచ్‌లో 25 ఏళ్ల టోయా కార్డింగ్లీ అనే మహిళ 2018 అక్టోబర్ 21న హత్యకు గురైంది. వాంగెట్టి బీచ్‌లో తన కుక్కతో నడుచుకుంటూ వెళ్తుండగా ఆమెను దారుణంగా హత్య చేశారు. హత్య తర్వాత సింగ్ తన కుటుంబాన్ని ఆస్ట్రేలియాలోనే వదిలి భారత్‌కు వచ్చేశారు. ఆయన సమాచారమిచ్చినవారికి దాదాపు ఆరుకోట్ల రూపాయల రివార్డును పోలీసులు ప్రకటించారు. రెండేళ్ల కిందట అతన్ని భారత్ నుంచి ఆస్ట్రేలియాకు తీసుకెళ్లారు.

చిరుతదాడిలో ఏడుగురికి గాయాలు

నాగ్‌పూర్: మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో చిరుతపులి కలకలం రేపింది. పార్డి ప్రాంతంలోని శివ్‌నగర్ గ్రామంలోకి బుధవారం ఉదయం చిరుత ప్రవేశించింది. చిరుతను చూసిన గ్రామస్తులు భయాందోళనకు గురై.. తరిమేందుకు ప్రయత్నించారు. దీంతో చిరుత ప్రజలపై తిరగబడి దాడి చేసింది. ఈ ఘటనలో ఏడుగురికి గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న అటవీశాఖ, వన్యప్రాణుల సంరక్షణ కేంద్రం సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని, చిరుతను పట్టుకున్నారు. గాయపడినవారిని స్థానిక ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రాంతంలో గతంలోనూ చిరుత సంచారం వార్తలొచ్చాయి. నవంబర్ 19న ఇదే ప్రాంతంలో ఒక చిరుతపులిని అధికారులు పట్టుకున్నారు.

సందేశ్ కలీ హింస.. ప్రధాన సాక్షికి ప్రమాదం

కారును ఢీకొన్న ట్రక్కు ● గాయపడ్డ బోలానాథ్ ఘోష్ కొడుకు, డ్రైవర్ దుర్మరణం ● తృణమూల్ కాంగ్రెస్ పనే: బీజేపీ

బరాసత్: పశ్చిమ బెంగాల్ లోని సందేశ్ కలీలో ఈడీ అధికారులపై దాడి కేసులో ప్రధాన సాక్షి బోలానాథ్ ఘోష్ బుధవారం రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. ఆయన కారును ఒక ట్రక్కు ఢీకొంది. అదే ఊపులో కారును తోసుకుంటూ సమీపంలోని చెరువులో పడేసింది. నార్త్ 24 పరగణా జిల్లాలో బసీర్హాట్ సమీపంలో జరిగిన ఈ ప్రమాదంలో ఘోష్ గాయపడగా ఆయన చిన్న కుమారుడు సత్యజిత్ తో పాటు కారు డ్రైవర్ మరణించారు. రేప్ కేసులో కోర్టుకు హాజరయ్యేందుకు వెళ్తుండగా ఈ ఘోరం జరిగింది. ఇది అధికార తృణమూల్ కాంగ్రెస్ పార్టీ పనేనంటూ విమర్శలు చెలరేగుతున్నాయి. టీ తండ్రిని బలి తీసుకోవడమే ఈ కుట్ర లక్ష్యమని ఘోష్ పెద్ద కుమారుడు ఆరోపించారు. ట్రక్కు కావాలనే లేన్ మారి మరీ మితిమీరిన వేగంతో కారును ఢీకొట్టిందని ప్రత్యక్ష సాక్షులు కూడా చెప్పారు. సందేశ్ కలీ కేసులో జైల్లో ఉన్న ప్రధాన నిందితుడు షాజహాన్ షేక్ కు అతి సన్నిహితుడైన వ్యక్తే నడిపాడని కేంద్ర మంత్రి, బెంగాల్ బీజేపీ నేత సుకాంతో మజుందార్ ఆరోపించారు. కేసు సాక్షులను ఒక్కొక్కరుగా షాజహాన్ అడ్డు తొలగించుకుంటూ వస్తున్నాడని బీజేపీ ఐటీ విభాగం చీఫ్ అమిత్ మాలవీయ ఆరోపించారు. సందేశ్ కలీ కేసు విచారణను ఇకనైనా బెంగాల్ నుంచి బయటికి తరలించాలని డిమాండ్ చేశారు. ప్రమాదంపై ఘోష్ కుటుంబం స్థానిక పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసింది.

భారతదేశంలో అత్యున్నత న్యాయాధికారి?

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ పాలిటీ

రాజ్యాంగబద్ధ సంస్థలు

అటార్నీ జనరల్

భారత రాజ్యాంగంలోని ఐదో భాగం, ఒకటో అధ్యాయంలో అటార్నీ జనరల్ పదవి గురించి వివరించారు. ఆర్టికల్ 76 ప్రకారం ప్రధానమంత్రి సూచన మేరకు రాష్ట్రపతి అటార్నీ జనరల్‌ను నియమిస్తారు. ఆర్టికల్ 76(1) ప్రకారం సుప్రీంకోర్టు న్యాయమూర్తి నియామకానికి ఉండాల్సిన అర్హతలన్నీ అటార్నీ జనరల్ నియామకానికి అవసరం. 'అటార్నీ జనరల్ ఆఫ్ ఇండియా' పదవిని బ్రిటన్ నుంచి గ్రహించారు. అటార్నీ జనరల్ కేంద్ర ప్రభుత్వానికి మొదటి న్యాయాధికారి, భారతదేశంలోనూ తొలి న్యాయాధికారి. సుప్రీం కోర్టులో, దేశంలోని అన్ని హైకోర్టుల్లో వాదించే అధికారం ఉన్న ఏకైక వ్యక్తి అటార్నీ జనరల్. కేంద్రానికి సంబంధించిన అన్ని రకాల వివాదాంశాలపై న్యాయస్థానాల్లో వాదించే అధికారం ఉన్న ప్రధాన న్యాయాధికారి ఇతడే. విధి నిర్వహణలో అటార్నీ జనరల్‌కు ఇద్దరు సోలిసిటర్ జనరల్స్, నలుగురు అడిషనల్ సోలిసిటర్ జనరల్స్ సహాయం చేస్తారు.

అటార్నీ జనరల్ పదవిలో ఉన్న వ్యక్తి ఏ కంపెనీలోనూ డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వహించరాదు. ఆర్టికల్ 88 ప్రకారం అటార్నీ జనరల్ పార్లమెంట్‌లో సభ్యుడు కాకపోయినా ఉభయ సభల చర్చల్లో పాల్గొనే అధికారం ఉంది. కానీ ఓటు వేసే అధికారం లేదు. కేంద్రం అనుమతి లేకుండా అటార్నీ జనరల్ ఎవరి కేసుల్లోనూ వాదనలు వినిపించకూడదు. ఆర్టికల్ 76(4) ప్రకారం రాష్ట్రపతి విశ్వాసం చూరగొన్నంత వరకు అటార్నీ జనరల్ అధికారంలో ఉంటాడు. రాష్ట్రపతి నిర్ణయించిన జీతభత్యాలను పొందుతాడు. వేతనంతోపాటు ఇతర సౌకర్యాలను పొందుతాడు. అటార్నీ జనరల్ రాజీనామా లేఖను రాష్ట్రపతికి సమర్పించాలి. భారత రాష్ట్రపతి న్యాయపరమైన అంశాలపై సూచనలు, సలహాలు కోరితే వివరణాత్మకమైన సూచనలు, సలహాలు ఇచ్చే అధికారం అటార్నీ జనరల్‌కు ఉంది.

అడ్వకేట్ జనరల్ (ఎ.జి.)

రాజ్యాంగంలోని ఆర్టికల్ 165 ప్రకారం సంబంధిత రాష్ట్ర ముఖ్యమంత్రి సూచన మేరకు అడ్వకేట్ జనరల్‌ను గవర్నర్ నియమిస్తారు.

రాష్ట్రంలో మొదటి న్యాయాధికారి అడ్వకేట్ జనరల్. గవర్నర్ విశ్వాసం చూరగొన్నంత వరకు ఎ.జి. పదవిలో కొనసాగుతాడు. రాష్ట్ర శాసనసభ చర్చల్లో అడ్వకేట్ జనరల్ పాల్గొంటాడు, కానీ ఓటువేసే అధికారం లేదు. అడ్వకేట్ జనరల్‌గా నియమితుడయ్యే వ్యక్తికి హైకోర్టు న్యాయమూర్తికి ఉండాల్సిన అర్హతలుండాలి. ఆర్టికల్ 165(1), 165(3)లో అడ్వకేట్ జనరల్ అర్హతలు, జీతభత్యాలను స్పష్టంగా ప్రస్తావించారు. గవర్నర్ నిర్ణయం మేరకు రాష్ట్ర సంఘటిత నిధి నుంచి అడ్వకేట్ జనరల్ వేతనాన్ని చెల్లిస్తారు. ఆర్టికల్ 194(4) ప్రకారం ఎమ్మెల్యేలకు వర్తించే హక్కులు, రక్షణలన్నీ అడ్వకేట్ జనరల్‌కు వర్తిస్తాయి. ఆయన రాష్ట్ర కార్య నిర్వాహక వర్గంలో అంతర్భాగం. కానీ రాష్ట్ర మంత్రి మండలిలో అంతర్భాగం కాదు.

కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్)

రాజ్యాంగంలోని ఐదో భాగం, ఐదో అధ్యాయంలో 148 నుంచి 151 వరకు ఉన్న అధికరణలు కాగ్ గురించి తెలుపుతున్నాయి. ఆర్టికల్ 148 ప్రకారం కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్‌ను రాష్ట్రపతి నియమిస్తారు. ఆర్టికల్ 149 ప్రకారం కేంద్రం, రాష్ట్రాల ఖాతాలను కాగ్ నిర్వహిస్తాడు. ఆర్టికల్ 150 ప్రకారం కేంద్ర, రాష్ట్రాల ఖాతాలను కాగ్ తనిఖీ చేస్తాడు. ఆర్టికల్ 151 ప్రకారం కేంద్ర ప్రభుత్వ ఆడిట్ వార్షిక నివేదికను కాగ్ రాష్ట్రపతికి సమర్పిస్తాడు. రాష్ట్రపతి పార్లమెంట్‌కు పంపిస్తారు.

రాష్ట్రాలకు సంబంధించిన ఖాతాలను కాగ్ తనిఖీ చేసి, వార్షిక నివేదికను గవర్నర్‌కు సమర్పిస్తాడు. గవర్నర్ రాష్ట్ర శాసనసభకు సమర్పిస్తారు. కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ పదవీ కాలం ఆరేళ్లు లేదా ఆ పదవిని చేపట్టిన వ్యక్తికి 65 ఏళ్లు వచ్చే వరకు. కాగ్ అధికార దుర్వినియోగానికి పాల్పడితే పార్లమెంట్ అభిశంసన ద్వారా రాష్ట్రపతి అతణ్ని పదవి నుంచి తొలగిస్తారు. ప్రభుత్వ ఖాతాల సంఘానికి కాగ్ కళ్లు, చెవుల్లాంటివాడు. భారత సంఘటిత నిధి నుంచి కేంద్రం ఖర్చు చేసిన ధనం చట్ట ప్రకారం ఉందా? లేదా అని కాగ్ తనిఖీ చేస్తాడు.

1976లో 42వ రాజ్యాంగ సవరణ ద్వారా కాగ్ పరిధి నుంచి అకౌంటింగ్ బాధ్యతలను వేరు చేశారు. కాగ్ ప్రభుత్వ కంపెనీల ఖాతాలను వ్యాపార పద్ధతిలో ఆడిట్ చేస్తాడు. భారత ప్రభుత్వంలో రాజ్యాంగం సృష్టించిన ముఖ్య అధికారి కాగ్ అని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ తెలిపారు. కాగ్ వేతనం, ఇతర సౌకర్యాలను భారత సంఘటిత నిధి నుంచి చెల్లిస్తారు. కాగ్ వేతనాన్ని పార్లమెంట్ చట్ట ప్రకారం నిర్ణయిస్తారు. పదవిని స్వీకరించేటప్పుడు రాజ్యాంగ ఔన్నత్యాన్ని కాపాడతానని కాగ్ ప్రమాణం చేయాలి. కాగ్‌గా పనిచేసి పదవీ విరమణ చేసిన వ్యక్తి ఏ ఇతర ప్రభుత్వ నియామకాలకు అర్హుడు కాదు.

కేంద్ర సంఘటిత నిధి, రాష్ట్ర సంఘటిత నిధి, కేంద్ర ఆగంతుక నిధి, కేంద్ర పబ్లిక్ నిధి, రాష్ట్ర పబ్లిక్ నిధి, శాసనసభ ఉన్న కేంద్రపాలిత ప్రాంతాల ఖాతాలను కాగ్ పరిశీలించి నివేదిక ఇస్తాడు. కాగ్ పదవిని బ్రిటిష్ వ్యవస్థ నుంచి తీసుకున్నారు. బ్రిటన్‌లో ఈ పదవిని కాంప్ట్ అని పిలుస్తారు. ఆర్‌బీఐ, ఎస్‌బీఐ, ఎల్ఐసీ, ఎఫ్‌సీఐ లాంటి సంస్థలు, కార్పొరేషన్లు పూర్తిగా ప్రైవేట్ ఆడిటర్లతో తమ ఖాతాలను ఆడిట్ చేయిస్తాయి. ఈ అంశంలో కాగ్‌కు సంబంధం ఉండదు. ఈ సంస్థలు తమ వార్షిక ఖాతాల నివేదికలను పార్లమెంట్‌కే సమర్పిస్తాయి.

కాగ్ వెలికితీసిన కుంభకోణాలు

- టెలికాం 2జీ (రెండోతరం) స్పెక్ట్రం వేలం.
- ముంబై ఆదర్శ్ హౌసింగ్ సొసైటీ కుంభకోణం, కామన్‌వెల్త్ క్రీడల్లో అవినీతి, బొగ్గు గనుల కేటాయింపులో అవకతవకలు.
- ఓఎన్‌జీసీ(ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్) నుంచి వేలం ప్రక్రియ నిర్వహించకుండానే గ్యాస్ నిక్షేపాలను వెలికి తీసేందుకు రిలయన్స్ సంస్థకు అనుమతి ఇవ్వడం. దేవాస్ అనే ప్రైవేట్ కంపెనీకి లాభం చేకూర్చేలా అత్యంత విలువైన ఎస్-బ్యాండ్ ప్రసారాలకు రహస్యంగా అనుమతి మంజూరు చేయడం.
- మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో లోపాలు.
- అగస్టా వెస్ట్‌ల్యాండ్ కంపెనీ హెలికాప్టర్ కొనుగోలు ఒప్పందం.

గతంలో అడిగిన ప్రశ్నలు

1. కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ పదవీకాలం?
   ఎ) ఐదేళ్లు బి) ఆరేళ్లు
   సి) ఏడేళ్లు డి) నాలుగేళ్లు
2. అటార్నీ జనరల్ ఆ పదవిలో ఎంత కాలం పాటు కొనసాగుతారు?
   ఎ) నాలుగేళ్లు బి) ఆరేళ్లు
   సి) ఏడేళ్లు
   డి) రాష్ట్రపతి విశ్వాసం ఉన్నంత వరకు
3. కింద పేర్కొన్న ఏ బాధ్యతను భారత కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ నిర్వర్తించరు?
   ఎ) భారత సంఘటిత నిధికి చెందిన వ్యయానికి సంబంధించి తనిఖీ, నివేదిక
   బి) ఆగంతుక నిధి, పబ్లిక్ అకౌంట్ల తనిఖీ, నివేదిక
   సి) అన్ని రకాల వాణిజ్యం, ఉత్పత్తి, లాభం, నష్టాలకు సంబంధించిన తనిఖీ, నివేదిక
   డి) ప్రజా ధనానికి సంబంధించిన వసూళ్లు, విడుదల నియంత్రణ; కోశాధికారి వద్ద ప్రభుత్వ ఆదాయాన్ని నిల్వ చేసేలా చూడటం
4. ఏ నివేదికలను పార్లమెంట్‌కు సమర్పించేలా రాష్ట్రపతి చర్యలు తీసుకుంటారు?
   ఎ) కేంద్ర ఆర్థిక సంఘం
   బి) కంప్ట్రోలర్ ఆడిటర్ జనరల్
   సి) జాతీయ షెడ్యూల్డ్ కులాల కమిషన్
   డి) పైవన్నీ
5. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఉమ్మడిగా వర్తించే రాజ్యాంగ సంస్థలు?
   ఎ) కంప్ట్రోలర్ ఆడిటర్ జనరల్
   బి) అటార్నీ జనరల్
   సి) సోలిసిటర్ జనరల్
   డి) పైవన్నీ సరైనవే
6. అటార్నీ జనరల్‌కు సంబంధించి సరైంది?
   ఎ) సుప్రీంకోర్టు న్యాయమూర్తికి ఉండాల్సిన అర్హతలు ఉండాలి
   బి) పార్లమెంట్ సమావేశాల్లో పాల్గొనవచ్చు
   సి) పార్లమెంట్ సభ్యులకు ఉన్న అధికారాలు ఉంటాయి
   డి) పైవన్నీ సరైనవే
7. ఏ రాజ్యాంగ బద్ధమైన పదవిని చేపట్టిన వారు పదవీ విరమణ తర్వాత ప్రభుత్వ నియామకాలకు అర్హులు కారు?
   ఎ) కంప్ట్రోలర్ ఆడిటర్ జనరల్
   బి) యూపీఎస్సీ చైర్మన్
   సి) అటార్నీ జనరల్
   డి) ఎ, బి
8. అటార్నీ జనరల్‌గా నియమితుడయ్యే వ్యక్తికి కింద పేర్కొన వారిలో ఎవరితో సమానమైన అర్హతలు ఉండాలి?
   ఎ) హైకోర్టు న్యాయమూర్తి
   బి) సుప్రీంకోర్టు న్యాయమూర్తి
   సి) హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి
   డి) సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి
9. భారతదేశంలో అత్యున్నత న్యాయాధికారి ఎవరు?
   ఎ) సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి
   బి) అటార్నీ జనరల్
   సి) అడ్వకేట్ జనరల్
   డి) సోలిసిటర్ జనరల్

సమాధానాలు

1) బి; 2) డి; 3) డి; 4) డి; 5) ఎ; 6) డి; 7) డి; 8) బి; 9) బి.

మాదిరి ప్రశ్నలు

1. ఫ్యాక్టరీలు, కర్మాగారాల్లో బాలకార్మికులు పనిచేయడాన్ని నిషేధించే ఆర్టికల్?
   ఎ) ఆర్టికల్ 24 బి) ఆర్టికల్ 25
   సి) ఆర్టికల్ 26 డి) ఆర్టికల్ 22
2. ఏ ఆర్టికల్ ప్రకారం రాష్ట్రపతి సుప్రీంకోర్టు న్యాయ సలహా కోరవచ్చు?
   ఎ) 142 బి) 144 సి) 143 డి) 145
3. రాష్ట్రపతిగా ఎన్నికయ్యేందుకు గరిష్ట వయసు?
   ఎ) 75 బి) 70
   సి) 80 డి) పరిమితి లేదు
4. భారత రాజ్యాంగంలో ప్రాథమిక హక్కుల గురించి తెలుపుతున్న ఆర్టికల్స్?
   ఎ) 12–32 బి) 13–32
   సి) 13–25 డి) 12–35
5. రాజ్యాంగ సవరణ గురించి తెలిపే ఆర్టికల్ ఏది?
   ఎ) ఆర్టికల్ 367 బి) ఆర్టికల్ 368
   సి) ఆర్టికల్ 369 డి) ఆర్టికల్ 370
6. అత్యవసర పరిస్థితుల్లో ప్రాథమిక హక్కులను తాత్కాలికంగా రద్దు చేయడానికి రాష్ట్రపతికి అధికారం కల్పించే అంశాన్ని ఏ దేశ రాజ్యాంగం నుంచి గ్రహించారు?
   ఎ) ఫ్రాన్స్ బి) ఐర్లాండ్
   సి) కెనడా డి) జర్మనీ
7. ప్రధానమంత్రి సమానుల్లో ప్రథముడు అని అభిప్రాయపడింది?
   ఎ) లాస్కీ బి) లార్డ్‌మార్లీ
   సి) ఐవర్ జెన్నీ డి) రామ్‌సే మ్యూర్
8. పార్లమెంట్‌కు ఏజెంట్‌గా వ్యవహరించేది?
   ఎ) స్పీకర్ బి) అటార్నీ జనరల్
   సి) కాగ్ డి) సొలిసిటర్ జనరల్
9. జాతీయ మహిళా కమిషన్ తొలి అధ్యక్షురాలు?
   ఎ) మోహినిగిరి బి) పూర్ణిమా అద్వానీ
   సి) విభా పార్థసారథి
   డి) జయంతీ పట్నాయక్
10. పౌరహక్కుల రక్షణ చట్టాన్ని ఎప్పుడు చేశారు?
    ఎ) 1951 బి) 1952
    సి) 1953 డి) 1955
11. కనీస వేతనాల చట్టాన్ని ఎప్పుడు చేశారు?
    ఎ) 1996 బి) 1980
    సి) 1982 డి) 1948

సమాధానాలు

1) ఎ; 2) సి; 3) డి; 4) డి; 5) బి; 6) డి; 7) బి; 8) సి; 9) డి; 10) డి; 11) డి.

గోల్డెన్‌రైస్‌లో ఉండే విటమిన్ ఏది?

టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

బయాలజీ

మాదిరి ప్రశ్నలు

1. 'ఫ్లేమ్ ఆఫ్ ది ఫారెస్ట్' అని దేన్ని పిలుస్తారు?
   ఎ) మామిడి బి) వేప
   సి) మోదుగ డి) తుమ్మ
2. లెగ్యూమ్ మొక్కల్లో నత్రజని స్థాపన చేసే బ్యాక్టీరియా ఏది?
   ఎ) రైజోబియం బి) అజటోబాక్టర్
   సి) అజోస్పైరిల్లం డి) రోడోస్పైరిల్లం
3. వరి పొలాల్లో నత్రజని కోసం ఏ జీవ ఎరువును వాడతారు?
   ఎ) రైజోబియం బి) గ్రీన్‌మాన్యూర్
   సి) అజొల్లా డి) క్లాస్ట్రీడియం
4. శంకువు రూపంలో ఉండే పుష్పాలు వేటిలో ఉంటాయి?
   ఎ) వివృత బీజాలు బి) ఆవృత బీజాలు
   సి) టెరిడోఫైటా డి) బ్రయోఫైటా
5. కిందివాటిలో వేగంగా పెరిగే మొక్క ఏది?
   ఎ) చిక్కుడు బి) మల్లె
   సి) వెదురు డి) నందివర్ధనం
6. నత్తల ద్వారా జరిగే పరాగ సంపర్కం?
   ఎ) కీరిస్టిరోఫిలి బి) మెలకోఫిలి
   సి) సర్పెంటోఫిలి డి) ఎంటమోఫిలి
7. ఆధునిక జన్యు శాస్త్ర పితామహుడెవరు?
   ఎ) మెండల్ బి) వాట్సన్
   సి) హెచ్.జి. ఖొరానా
   డి) టి.హెచ్. మోర్గాన్
8. వరిలో క్రోమోజోముల సంఖ్య?
   ఎ) 12 బి) 24
   సి) 36 డి) 46
9. చెరకులో ఎర్రకుళ్లు తెగులు దేని వల్ల సోకుతుంది?
   ఎ) పైరిక్యులేరియా బి) ఫైటాఫ్‌థోరా
   సి) కొలిటోట్రైఖం డి) పక్సీనియా
10. వైరస్ అంటే అర్థమేమిటి?
    ఎ) స్పాంజ్ బి) విషం
    సి) ఆమ్లం డి) ఏదీకాదు
11. ఫించ్ పక్షులపై పరిశోధనలు చేసినవారు?
    ఎ) డార్విన్ బి) మెండెల్
    సి) మోర్గాన్ డి) రాబర్ట్‌హుక్
12. రిసర్పిన్ దేని నుంచి లభిస్తుంది?
    ఎ) రావుల్ఫియా బి) కేసియా
    సి) ఆసిమం డి) కాల్షియా
13. మొదటి నిజమైన నేల మొక్కలేవి?
    ఎ) బ్రయోఫైటా బి) టెరిడోఫైటా
    సి) జిమ్నోస్పెర్మ్స్ డి) ఆంజియోస్పెర్మ్స్
14. C_3 పథంలో ఏర్పడే మొదటి పదార్థం ఏది?
    ఎ) OAA బి) PGA
    సి) PHB డి) RUBP
15. మొక్కలు వాతావరణంలోకి విడుదల చేసే O_2 దేని నుంచి లభిస్తుంది?
    ఎ) CO_2 బి) సూర్యరశ్మి
    సి) పత్రహరితం డి) H_2O
16. నీటి బిందువుల రూపంలో పత్రం శీర్షం నుంచి విడుదలవడాన్ని ఏమంటారు?
    ఎ) ట్రాన్స్పిరేషన్ బి) ఎవాపరేషన్
    సి) గటేషన్ (Guttation) డి) ట్రాన్స్‌క్రిప్షన్
17. ఫలాలు త్వరగా పక్వం చెందడానికి ఉపయోగపడే హార్మోన్ ఏది?
    ఎ) ఆక్సిన్లు బి) జిబ్బరిలిన్లు
    సి) సైటోకైనిన్లు డి) ఇథిలిన్
18. ఏ కాంతిలో కిరణజన్య సంయోగక్రియ ఎక్కువగా జరుగుతుంది?
    ఎ) నీలం బి) ఎరుపు
    సి) ఆకుపచ్చ డి) ఇండిగో
19. 'కణ భాండాగారం' అని దేన్ని పిలుస్తారు?
    ఎ) మైటోకాండ్రియా బి) రైబోజోమ్స్
    సి) రిక్తిక డి) హరిత రేణువు
20. ఏ మూలక లోపం వల్ల 'చిన్న ఆకుతెగులు' సంభవిస్తుంది?
    ఎ) Mn బి) Zn సి) Fe డి) K
21. 'ప్రకృతి పారిశుధ్య కార్మికులు'గా వేటిని పేర్కొంటారు?
    ఎ) వైరస్ బి) బ్యాక్టీరియా
    సి) ప్రోటోజోవా డి) ఫంగస్
22. కిందివాటిలో ఉప ఉత్పన్నం ఏది?
    ఎ) జిగురు బి) లేటెక్స్
    సి) రెజిన్లు డి) పైవన్నీ
23. గోల్డెన్‌రైస్‌లో ఉండే విటమిన్ ఏది?
    ఎ) విటమిన్ –ఎ బి) విటమిన్ – సి
    సి) విటమిన్ – డి డి) విటమిన్ –ఇ
24. కణజాలవర్ధనంలో పూర్తి మొక్కను/ మొక్కలను ఏర్పరచగలిగే కణ సామర్థ్యాన్ని ఏమంటారు?
    ఎ) టోటిపొటెన్సీ బి) ఎఫిషియెన్సీ
    సి) పార్థినోకార్పి డి) ఎఫినిటీ
25. సాధారణంగా శిలీంధ్రాలు అనేవి?
    ఎ) స్వయం పోషకాలు
    బి) పరాన్నజీవులు సి) పూతికాహారులు
    డి) సహజీవన జీవులు
26. ట్రైకోడెర్మా అనేది ఒక..?
    ఎ) శిలీంధ్రం బి) శైవలం
    సి) బ్యాక్టీరియా డి) ప్రోటోజోవా
27. అలెగ్జాండర్ ఫ్లెమింగ్‌కు నోబెల్ బహుమతి ఎప్పుడు లభించింది?
    ఎ) 1928 బి) 1930
    సి) 1919 డి) 1945
28. జంతు రాజ్యంలో అతి పెద్ద వర్గం ఏది?
    ఎ) ప్రోటోజోవా బి) ఆర్థ్రోపొడ
    సి) మొలస్కా డి) క్షీరదాలు
29. జీవితాంతం నీటిని తీసుకోని జీవి ఏది?
    ఎ) డెవిల్ ఫిష్ బి) కటిల్ ఫిష్
    సి) సిల్వర్ ఫిష్ డి) స్టార్ ఫిష్
30. 'గైనకోమాస్టిజం' దేనిలో కనిపిస్తుంది?
    ఎ) ప్లాటిపస్ బి) ఎఖిడ్నా
    సి) కంగారు డి) వానపాము
31. కుక్కలో క్రోమోజోముల సంఖ్య?
    ఎ) 72 బి) 36
    సి) 78 డి) 46
32. డయాఫ్రాం ఏ వర్గానికి చెందిన జీవుల్లో ఉంటుంది?
    ఎ) క్షీరదాలు బి) సరీసృపాలు
    సి) పక్షులు డి) ఉభయచరాలు
33. వానపాములో చలనాంగాలేవి?
    ఎ) వాజాలు బి) పిచ్చాలు
    సి) సీటాలు డి) ఈకలు
34. కీటకాల రక్తంలో ఉండేది?
    ఎ) హీమోగ్లోబిన్
    బి) హీమోసయనిన్
    సి) హీమోక్లోరిబియం
    డి) పైవన్నీ
35. ఉద్దయ కందరాలు వేటిలో ఉంటాయి?
    ఎ) పక్షులు బి) కీటకాలు
    సి) సరీసృపాలు డి) క్షీరదాలు
36. ఏనుగు గర్భావధి కాలం ఎంత?
    ఎ) 330–350 రోజులు
    బి) 630–660 రోజులు
    సి) 270–280 రోజులు
    డి) 150–160 రోజులు
37. చేపల ద్వారా లభించే విటమిన్లేవి?
    ఎ) బి, సి బి) ఎ, ఇ
    సి) ఎ, డి డి) బి, డి
38. రక్తవర్గం Bలో ఉండే యాంటీబాడీస్?
    ఎ) A బి) B సి) AB డి) O
39. జీర్ణాశయంలో హైడ్రోక్లోరిక్ ఆమ్లం PH విలువ ఎంత?
    ఎ) 3.0 బి) 2.0
    సి) 4.5 డి) 7.4
40. గాంబియా జ్వరం దేనివల్ల సంభవిస్తుంది?
    ఎ) ట్రిపానోసోమా బి) ప్లాస్మోడియం
    సి) లీష్మానియా డి) ఫైలేరియా
41. పాలలో ఉండే చక్కెర ఏది?
    ఎ) లాక్టోస్ బి) కేసిన్
    సి) సుక్రోస్ డి) ఫ్రక్టోస్
42. నాడీ వ్యవస్థలో ముఖ్యంగా ఉపయోగపడే మూలకం ఏది?
    ఎ) Na బి) Ca
    సి) P డి) I
43. తెలంగాణ రాష్ట్ర పక్షి ఏది?
    ఎ) పావురం బి) పాలపిట్ట
    సి) కోకిల డి) నెమలి
44. ఎముకల గురించి అధ్యయనం చేసే శాస్త్రాన్ని ఏమంటారు?
    ఎ) కాంకాలజీ బి) ఆంకాలజీ
    సి) ఆస్టియాలజీ డి) ఆప్తమాలజీ
45. ప్లనేరియాలో విసర్జకావయవాలు ఏవి?
    ఎ) మాల్ఫీజియన్ నాళాలు
    బి) ఫ్లేమ్ సెల్స్ సి) వృక్కాలు
    డి) ట్రాఖియా
46. 'S' ఆకారంలో కేంద్రకం వేటిలో ఉంటుంది?
    ఎ) అసిడోఫిల్స్ బి) న్యూట్రోఫిల్స్
    సి) బేసోఫిల్స్ డి) లింఫోసైట్స్
47. పెరుగుదల హార్మోన్ లోపం వల్ల చిన్న పిల్లల్లో సంభవించే వ్యాధి?
    ఎ) క్రిటినిజం బి) జిగాంటిజం
    సి) ఆస్టియోమలేషియా
    డి) ఆర్థ్రైటిస్
48. స్త్రీలలో ఉండే క్రోమోజోములు?
    ఎ) XX బి) XY
    సి) XXY డి) XYX
49. యూరికోటెలిక్ జీవులు ఏవి?
    ఎ) సరీసృపాలు బి) పక్షులు
    సి) ఆర్థ్రోపొడ డి) పైవన్నీ
50. మొదటగా కనుగొన్న క్లోన్ ఏది?
    ఎ) జియోజియో బి) స్పాటి
    సి) డాలి డి) విజి–బి

సమాధానాలు

1) సి; 2) ఎ; 3) సి; 4) ఎ; 5) సి; 6) బి; 7) డి; 8) బి; 9) సి; 10) బి; 11) ఎ; 12) ఎ; 13) బి; 14) బి; 15) డి; 16) సి; 17) డి; 18) బి; 19) ఎ; 20) బి; 21) బి; 22) డి; 23) ఎ; 24) ఎ; 25) సి; 26) ఎ; 27) డి; 28) బి; 29) సి; 30) ఎ; 31) సి; 32) ఎ; 33) సి; 34) బి; 35) ఎ; 36) బి; 37) సి; 38) ఎ; 39) బి; 40) ఎ; 41) ఎ; 42) ఎ; 43) బి; 44) సి; 45) బి; 46) సి; 47) ఎ; 48) ఎ; 49) డి; 50) సి.

విద్య, ఉద్యోగ సమాచారం

ఐఐటీ రోపర్‌లో పోస్ట్ డాక్టోరల్ రీసెర్చ్ ఫెలోలు

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ) రోపర్ ఒప్పంద ప్రాతిపదికన పోస్ట్ డాక్టోరల్ రీసెర్చ్ ఫెలోల ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం ఖాళీల సంఖ్య:** 01.
- **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో పీహెచ్‌డీ(ఇన్విరాన్‌మెంటల్/సాయిల్/వాటర్/అగ్రికల్చర్ ఇంజనీరింగ్)లో ఉత్తీర్ణులవ్వాలి. దీనితో పాటు పని అనుభవం ఉండాలి.
- **వయసు:** 38 ఏళ్లు ఉండాలి.
- **వేతనం:** నెలకు రూ.57,000.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**23.12.2025
- **వెబ్‌సైట్:** https://www.iitrpr.ac.in

ఐఐటీ జమ్మూలో ప్రాజెక్ట్ స్టాఫ్ పోస్టులు

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ) జమ్మూ ఒప్పంద ప్రాతిపదికన రీసెర్చ్ అసోసియేట్-3, ప్రాజెక్ట్ అసోసియేట్-1 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 02.
- **పోస్టుల వివరాలు:** రీసెర్చ్ అసోసియేట్3–01, ప్రాజెక్ట్ అసోసియేట్1–01.
- **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో కనీసం 75 శాతం మార్కులతో బీఈ/బీటెక్(ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ టెలికమ్యూనికేషన్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్)లో ఉత్తీర్ణులవ్వాలి.దీనితో పాటు గేట్‌లో అర్హత సాధించి ఉండాలి.
- **వయసు:** 35 ఏళ్లు మించకూడదు.
- **వేతనం:** నెలకు రీసెర్చ్ అసోసియేట్–3కు రూ.67,000, ప్రాజెక్ట్ అసోసియేట్–1కు రూ.37,000.
- **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 15.12.2025.
- **వెబ్‌సైట్:** https://iitjammu.ac.in

ఎయిమ్స్ ఢిల్లీలో జేఆర్ఎఫ్‌లు

ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్) ఢిల్లీ ఒప్పంద ప్రాతిపదికన జూనియర్ రీసెర్చ్ ఫెలోలు(జేఆర్ఎఫ్) ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం ఖాళీల సంఖ్య:** 01.
- **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి కనీసం 55 శాతం మార్కులతో బీఫార్మసీ/బీఈ/బీటెక్/బీఎస్/ఎంఎస్/ఎమ్మెస్సీ/ఎంబీబీఎస్‌లో ఉత్తీర్ణులవ్వాలి. దీనితో పాటు నెట్/గేట్‌లో అర్హత సాధించి ఉండాలి.
- **వయసు:** 28 ఏళ్లు మించకూడదు.
- **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఈమెయిల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **ఈమెయిల్:** umasharma69@gmail.com.
- **దరఖాస్తులకు చివరితేది:** 18.12.2025.
- **వెబ్‌సైట్:** https://www.aiims.edu

నైసర్ భువనేశ్వర్‌లో వివిధ ఉద్యోగాలు

భువనేశ్వర్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్(నైసర్) డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా శాశ్వత ప్రాతిపదికన వివిధ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 03.
- **పోస్టుల వివరాలు:** సైంటిఫిక్ అసిస్టెంట్–బి(మెడికల్ ల్యాబొరేటరీ టెక్నీషియన్)–01, సైంటిఫిక్ అసిస్టెంట్–బి(క్లినికల్ సైకాలజిస్ట్)–01, జూనియర్ హిందీ ట్రాన్స్‌లేటర్–01.
- **అర్హత:** సంబంధిత విభాగంలో బీఎస్సీ, పీజీ ఉత్తీర్ణులవ్వాలి. దీనితో పాటు పని అనుభవం ఉండాలి.
- **వేతనం:** నెలకు రూ.35,400 నుంచి రూ.1.12,400.
- **వయసు:** 18 నుంచి 40 ఏళ్ల మధ్య ఉండాలి
- **ఎంపిక విధానం:** ట్రేడ్ టెస్ట్/రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 17.12.2025
- **వెబ్‌సైట్:** https://www.niser.ac.in

ఐఐటీ జమ్మూలో జేఆర్ఎఫ్‌లు

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ) జమ్మూలో ఒప్పంద ప్రాతిపదికన జూనియర్ రీసెర్చ్ ఫెలో(జేఆర్ఎఫ్)ల ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం ఖాళీల సంఖ్య:** 02.
- **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో కనీసం 60 శాతం మార్కులతో ఎంఈ/ఎంటెక్‌లో ఉత్తీర్ణులై ఉండాలి. గేట్‌లో అర్హత సాధించి ఉండాలి.
- **వేతనం:** నెలకు రూ.37,000.
- **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 25.12.2025.
- **వెబ్‌సైట్:** www.iitjammu.ac.in

ఆధునికీకరణతోనే అదనపు నిల్వ సామర్థ్యం

భారత్‌లో వ్యవసాయ ఉత్పత్తులను కొంత కాలం నిల్వ చేసేందుకు వీలు కల్పించే గిడ్డంగి సౌకర్యాల కొరత తీవ్రంగా ఉంది. లభ్యమవుతున్న వసతులు అశాస్త్రీయంగా ఉండటంతో రైతులు పంట చేతికి వచ్చిన వెంటనే తమ ఉత్పత్తులను విక్రయించడానికి మొగ్గు చూపుతున్నారు. అందువల్ల వారికి గిట్టుబాటు ధర లభించడం లేదు. దీంతో గ్రామీణ రుణగ్రస్థత పెరుగుతోంది. ఉత్పత్తిలో పెరుగుదల నేపథ్యంలో ఆహార ఉత్పత్తుల నిల్వసామర్థ్యం పెంపునకు ప్రాధాన్యం ఏర్పడింది.

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ ఎకానమీ

నిల్వ సామర్థ్యం (Storage Capacity)

వ్యవసాయమే ప్రధాన జీవనోపాధిగా ఉన్న గ్రామీణ ప్రాంతాల్లో 'సమ్మిళిత వృద్ధి' సాధ్యపడాలంటే వ్యవసాయ రంగంలో సమూల ప్రగతి అవసరం. ప్రపంచ బ్యాంకు నివేదిక ప్రకారం భారత్‌లో ఆహార ఉత్పత్తుల నిల్వ సామర్థ్యం సరిపోయినంతగా లేదు. ఈ కారణంగా ఏటా మొత్తం ఉత్పత్తిలో 12 నుంచి 16 మిలియన్ మెట్రిక్ టన్నుల ఉత్పత్తులు వృథా అవుతున్నాయి. వీటి విలువ రూ. 50,000 కోట్ల వరకు ఉన్నట్లు అంచనా.

1994–95 తర్వాతి కాలంలో ఆహార ధాన్యాల ఉత్పత్తి సగటు వార్షిక వృద్ధి 1.20 శాతంగా నమోదైంది. 1990–91లో మొత్తం ఆహార ధాన్యాల ఉత్పత్తి 176.4 మిలియన్ టన్నులు కాగా, 2013–14 నాటికి 264.4 మిలియన్ టన్నులకు పెరిగింది. ఇటీవల రబీలో గోధుమ, బియ్యం, Cereals, పప్పు ధాన్యాల ఉత్పత్తిలో పెరుగుదల కారణంగా ఖరీఫ్, రబీ కాలంలో ఆహార ధాన్యాల ఉత్పత్తి సమానంగా ఉండటాన్ని గమనించవచ్చు. ఉత్పత్తిలో పెరుగుదలకు అనుగుణంగా నిల్వ సామర్థ్యాలను పటిష్టపరిస్తేనే సత్ఫలితాలుంటాయి.

నిల్వ సౌకర్యాలు – గిడ్డంగులు

వ్యవసాయ ఉత్పత్తుల నిల్వకు సంబంధించి భారత్‌లో గిడ్డంగులు (గోడౌన్లు) ప్రధాన పాత్ర పోషిస్తున్నాయి. గిడ్డంగుల నిర్మాణం శాస్త్రీయంగా ఉన్నప్పుడే వ్యవసాయ ఉత్పత్తుల నాణ్యత, పరిమాణాలను పరిరక్షించవచ్చు. భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ), సెంట్రల్ వేర్‌హౌసింగ్ కార్పొరేషన్, స్టేట్ వేర్‌హౌసింగ్ కార్పొరేషన్లు గిడ్డంగులను నిర్వహిస్తున్నాయి. భారత్‌లో సెంట్రల్ వేర్‌హౌసింగ్ కార్పొరేషన్‌ను అతిపెద్ద ప్రభుత్వ రంగ గిడ్డంగి నిర్వహణదారుగా పేర్కొనవచ్చు. ఇది సుమారుగా 120 వ్యవసాయ, పారిశ్రామిక ఉత్పత్తులకు భద్రతతో కూడిన నిల్వ సౌకర్యాలను కల్పిస్తోంది. వ్యవసాయ ఉత్పత్తుల సేకరణ, శ్రేణీకరణ, పంపిణీ లాంటి సేవలను కూడా నిర్వహిస్తోంది. దేశంలో అనేక రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ప్రత్యేక గిడ్డంగి కార్పొరేషన్లను ఏర్పాటు చేశాయి. రాష్ట్ర గిడ్డంగి కార్పొరేషన్లు ఆయా రాష్ట్రాలకు సంబంధించి జిల్లా స్థాయిలో కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. రాష్ట్ర గిడ్డంగి కార్పొరేషన్ ఏర్పాటుకు అవసరమైన వాటా మూలధనాన్ని సంబంధిత రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర గిడ్డంగి కార్పొరేషన్ సమానంగా సమకూరుస్తాయి. కేంద్ర, రాష్ట్ర గిడ్డంగి కార్పొరేషన్లతో పాటు భారత ఆహార సంస్థ కూడా వ్యవసాయ ఉత్పత్తుల నిల్వ సౌకర్యాలను కల్పిస్తోంది.

2010 చివరి నాటికి కేంద్ర గిడ్డంగి కార్పొరేషన్ (సీడబ్ల్యూసీ), రాష్ట్ర గిడ్డంగి కార్పొరేషన్లు, భారత ఆహార సంస్థల మొత్తం నిల్వ సామర్థ్యం 75 మిలియన్ టన్నులకు చేరింది. రైతులు వారి ఉత్పత్తులను తక్కువ ధరకే విక్రయించకుండా నిరోధించే క్రమంలో గ్రామీణ గోడౌన్ల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వ స్పాన్సర్డ్ పథకాన్ని ప్రారంభించారు. కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని 2001 మార్చి నుంచి అమలు పరుస్తోంది. ఇప్పటివరకు 67 మిలియన్ టన్నుల సామర్థ్యం ఉన్న గ్రామీణ గోడౌన్లను ఏర్పాటు చేసినట్లు అంచనా. ఉత్పత్తి ధోరణి, విక్రయమైన మిగులు పరిశీలించినప్పుడు భారత్‌లో వ్యవసాయ ఉత్పత్తుల నిల్వ సామర్థ్యం తక్కువగా ఉన్నట్లు భావించవచ్చు. 2012 ఫిబ్రవరి 1 నాటికి భారత ఆహార సంస్థ 300.83 లక్షల టన్నుల నిల్వ సామర్థ్యం (సొంత, అద్దె గోడౌన్లు కలిపి) కలిగి ఉండగా రాష్ట్ర ఏజెన్సీలు 153.54 లక్షల టన్నుల నిల్వ సామర్థ్యాన్ని కలిగి ఉన్నాయి. మొత్తంగా భారత్‌లో వ్యవసాయ ఉత్పత్తుల నిల్వ సామర్థ్యం 91 మిలియన్ టన్నులకు పైగా పెరిగింది. ప్రభుత్వ ఏజెన్సీలకు సంబంధించి నిల్వ సామర్థ్యాన్ని ప్రజాపంపిణీ వ్యవస్థ, ఇతర ప్రభుత్వ పథకాల అమల్లో భాగంగా ఆహార ధాన్యాల నిల్వకే ఎక్కువగా ఉపయోగిస్తున్నారు. ఆహార భద్రత కల్పించే క్రమంలో ప్రభుత్వ ఏజెన్సీల ఆహార ధాన్యాల సేకరణ పెరుగుతున్న క్రమంలో లభ్యమయ్యే నిల్వ సామర్థ్యంపై అధిక ఒత్తిడి ఉంది. అధిక మద్దతు ధరల కారణంగా ఆహార ధాన్యాల సేకరణలో నిమగ్నమవుతున్న రాష్ట్ర ఏజెన్సీల నిల్వ సామర్థ్యంపై కూడా ఒత్తిడి పెరుగుతోంది. నాబార్డ్ మంజూరు చేసిన గోడౌన్ల సగటు నిల్వ సామర్థ్యం 1261 మెట్రిక్ టన్నులు కాగా, మొత్తం గోడౌన్లలో 75 శాతం నిల్వ సామర్థ్యం వెయ్యి మెట్రిక్ టన్నుల కంటే తక్కువగా ఉంది. నాబార్డ్ సహకారంతో రైతులు ఏర్పాటు చేసుకున్న చిన్న, మధ్య తరహా గోడౌన్ల వల్ల వారి ఉత్పత్తులను తక్కువ ధర వద్ద విక్రయించే పరిస్థితి తగ్గి, గిట్టుబాటు ధర పొందగలుగుతున్నారని అనేక అనుభవ పూర్వక ఆధారాలు తెలియజేస్తున్నాయి.

నిల్వ సామర్థ్యం – ప్రాంతీయ అసమానతలు

ఉత్పత్తి కేంద్రాలుగా భారత్‌లో నిల్వ సామర్థ్యం కొన్ని ప్రాంతాల్లో అధికంగా కేంద్రీకృతమై ఉంది. వ్యవసాయ ఉత్పత్తుల వినియోగం అధికంగా ఉన్న ముఖ్య రాష్ట్రాల్లో 22 శాతం నిల్వ సామర్థ్యం లభ్యమవుతోంది. అవసరాలకు అనుగుణంగా కొన్ని రాష్ట్రాలు నెల లోపు నిల్వ సామర్థ్యాన్ని కూడా కలిగి ఉన్నాయి. రాష్ట్రాల మధ్య ఆహార, పప్పు ధాన్యాల ఉత్పత్తిలో తేడా; వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్ నిమిత్తం మండీల ఏర్పాటులో వ్యత్యాసాలు నిల్వ సామర్థ్యానికి సంబంధించి ప్రాంతీయ అసమానతలు పెరగడానికి ప్రధాన కారణాలుగా ఉన్నాయి. స్థానిక ఉత్పత్తిదారులకు గ్రామీణ గిడ్డంగుల ఏర్పాటులో ప్రభుత్వ ప్రోత్సాహకాలకు సంబంధించి వారిలో అవగాహన, బ్యాంక్ అధికారుల వైఖరి లాంటివి కూడా వ్యవసాయ ఉత్పత్తుల నిల్వ సామర్థ్యాన్ని పెంపొందించుకోవడంలో ప్రాంతాల మధ్య అసమానతలకు కారణంగా ఉన్నాయి. మొత్తం గోడౌన్లు, నిల్వ సామర్థ్యంలో ఆహార ధాన్యాలు, సంబంధిత వ్యవసాయ ఉత్పత్తులను అధికంగా పండించే కొద్దిమంది రైతులే ఎక్కువగా కలిగి ఉన్నారు. అందువల్ల ధనిక రైతులే గిట్టుబాటు ధరలు పొందుతున్నారు. దీంతో గ్రామీణ ప్రాంతాల్లో ఆదాయ అసమానతలతో పాటు ప్రాంతీయ అసమానతలు పెరిగాయి. భారత్‌లో మొత్తం వ్యవసాయ ఉత్పత్తుల నిల్వ సామర్థ్యాన్ని ప్రాంతాల వారీగా పరిశీలిస్తే.. ఉత్తర భారతదేశం వాటా 48 శాతం ఉండగా, దక్షిణ భారతదేశం 22%, పశ్చిమ ప్రాంతం 13%, మధ్య భారత దేశం 9%, తూర్పు ప్రాంతం 7% వాటా కలిగి ఉన్నాయి. ఈశాన్య రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల వాటా దేశంలోని మొత్తం వ్యవసాయ ఉత్పత్తుల నిల్వ సామర్థ్యంలో 1% మాత్రమే. నిల్వ సామర్థ్యంలో ప్రాంతాల మధ్య అసమానతల కారణంగా వ్యవసాయ ఉత్పత్తుల సేకరణకు సంబంధించి ప్రభుత్వ సామర్థ్యం పరిమితంగా ఉంది. గోడౌన్లలో నిల్వ చేస్తున్న వ్యవసాయ ఉత్పత్తుల్లో ఆహార ధాన్యాలపై గోధుమ, బియ్యం వాటా అధికంగా ఉంది. తర్వాతి స్థానాల్లో నూనె గింజలు, సుగంధ ద్రవ్యాలు, పత్తి నిలిచాయి. నిల్వ సామర్థ్యాన్ని పెంచడానికి ప్రభుత్వం అనేక పథకాల ద్వారా ప్రోత్సాహకం అందిస్తున్నప్పటికీ గోధుమ, బియ్యం నిల్వల్లోనే పెరుగుదల కనిపిస్తోంది.

గిడ్డంగుల నియంత్రణ విధానం: గిడ్డంగుల ఏర్పాటులో ప్రైవేటు భాగస్వామ్యాన్ని పెంపొందించడం, వేర్‌హౌసింగ్ పరిశ్రమ అభివృద్ధి, నియంత్రణకు సంబంధించి భారత ప్రభుత్వం సెప్టెంబర్ 2007లో 'ది వేర్‌హౌసింగ్ (డెవలప్‌మెంట్ అండ్ రెగ్యులేషన్)' చట్టాన్ని తీసుకువచ్చింది. దీని ప్రకారం 2010 అక్టోబర్‌లో వేర్‌హౌసింగ్ డెవలప్‌మెంట్ అండ్ రెగ్యులేటరీ అథారిటీని ఏర్పాటు చేశారు. వేర్‌హౌసింగ్ అభివృద్ధి, నియంత్రణ చట్టం ముఖ్య ఉద్దేశం నెగోషియబుల్ వేర్‌హౌస్ రిసిప్ట్ (NWR) మంజూరులో నియంత్రణ వాతావరణాన్ని కల్పించడం. NWR మంజూరు చేసే గిడ్డంగులకు వేర్‌హౌసింగ్ డెవలప్‌మెంట్ అండ్ రెగ్యులేటరీ అథారిటీ (WDRA) గుర్తింపునిస్తుంది. ఇది 2011 మార్చి 31 నాటికి పరిశీలనకు వచ్చిన 300 దరఖాస్తుల్లో 51 అప్లికేషన్లకు అనుమతినిచ్చింది.

కోల్డ్ స్టోరేజీలు

భారత్‌లో పండ్లు, కూరగాయల సాంవత్సరిక ఉత్పత్తి 130 మిలియన్ టన్నులుగా అంచనా. వైవిధ్య వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో వీటి ఉత్పత్తిలో గణనీయమైన పెరుగుదల ఏర్పడింది. వీటి ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచడానికి అనేక అవకాశాలున్నప్పటికీ ఆయా ఉత్పత్తులను నిల్వ చేయడానికి అవసరమైన శీతల గిడ్డంగులు (Cold Storages) తగినంతగా లేవు. శీతల గిడ్డంగుల సౌకర్యం అధికంగా సింగిల్ కమోడిటీస్ అయిన బంగాళాదుంప, ఆరెంజ్, ఆపిల్, ద్రాక్ష, దానిమ్మ, పూలు లాంటి వాటికి మాత్రమే అందుబాటులో ఉంది. అంటే శీతల గిడ్డంగుల సామర్థ్యాన్ని పూర్తిగా వినియోగించుకోవడం లేదు. బహుళ ఉత్పత్తులను నిల్వ చేసే విధంగా శీతల గిడ్డంగులను ఏర్పాటు చేయాలి. ఇది ఉత్పత్తిదారుల ఆర్థిక స్థోమతపై ఆధారపడి ఉంటుంది. రిఫ్రిజిరేషన్ వ్యవస్థను శీతల గిడ్డంగులు నిర్వహిస్తాయి.

వస్తువులు నిల్వ చేయడానికి వీలుగా గది వాతావరణాన్ని రిఫ్రిజిరేషన్ వ్యవస్థ నియంత్రిస్తుంది. దేశంలోని 5274 శీతల గిడ్డంగుల నిల్వ సామర్థ్యం 24.31 మిలియన్ టన్నులుగా అంచనా. శీతల గిడ్డంగులు ఎక్కువగా ప్రైవేటు రంగంలో ఏర్పాటయ్యాయి. ప్రభుత్వ, సహకార రంగంలో ఏర్పాటైన శీతల గిడ్డంగుల వాటా చాలా తక్కువ. ప్రస్తుతం దేశంలోని శీతల గిడ్డంగుల్లో పండ్లు, కూరగాయలు, పత్తి, మిరపకాయల నిల్వలు కొనసాగుతున్నాయి. అసోం, హిమాచల్ ప్రదేశ్, జమ్ముకశ్మీర్, కేరళ, సిక్కిం, తమిళనాడు రాష్ట్రాల్లోని పండ్లు, కూరగాయల ఉత్పత్తిలో 1% మాత్రమే శీతల గిడ్డంగుల్లో నిల్వ చేస్తున్నారు. పంజాబ్, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్, రాజస్థాన్ రాష్ట్రాల్లో భారత్‌లోని మొత్తం శీతల గిడ్డంగుల సగటు నిల్వ సామర్థ్యం కంటే అధిక నిల్వ సామర్థ్యం ఉంది. మొత్తం మీద వీటి డిమాండ్ వ్యవసాయ ఉత్పత్తులకే అధికంగా ఉంది.

నిల్వ సామర్థ్యం పెంపునకు చర్యలు

- గత దశాబ్ద కాలంలో నిల్వ సామర్థ్యం సగటు సాంవత్సరిక వృద్ధి 6.7%గా నమోదైంది. నిల్వ సామర్థ్యం సరిపోయినంతగా లేనందువల్ల ఏటా మొత్తం ఆహార ధాన్యాల ఉత్పత్తిలో 20 నుంచి 30 శాతం వృథా అవుతున్నాయి. ఈ నేపథ్యంలో అదనపు నిల్వ సామర్థ్యాన్ని పెంచడంతో పాటు ప్రస్తుతం అందుబాటులో ఉన్న రాష్ట్ర గిడ్డంగులను ఆధునికీకరించడంపై ప్రభుత్వాలు దృష్టి సారించాలి. రాష్ట్ర ఏజెన్సీలు నిర్వహిస్తున్న గిడ్డంగులు 20 ఏళ్ల పైబడి ఉన్నాయి. అందువల్ల ఆయా గిడ్డంగుల ఆధునికీకరణ ప్రాధాన్యం సంతరించుకుంది. వీటి ఆధునికీకరణకు 37 నుంచి 40 బిలియన్ రూపాయల వ్యయం అవుతుందని అంచనా.
- ఖరీఫ్, రబీ కాలాల్లో వినియోగాన్ని దృష్టిలో పెట్టుకొని ఆహార ధాన్యాల ఉత్పత్తిలో సమతౌల్యం సాధించాలి. వినియోగ అవసరాల దృష్ట్యా సాంవత్సరిక ఉత్పత్తిలో 70% నిల్వ చేసే విధంగా నిల్వ సామర్థ్యాన్ని పెంచాల్సిన అవసరం ఉంది. దీని కోసం గ్రామీణ గోడౌన్ల ఏర్పాటు పథకాన్ని ప్రభుత్వం తిరిగి ప్రారంభించాలి. ప్రస్తుతం సగటు ఆహార ధాన్యాల ఉత్పత్తిలో సుమారుగా 30% ఉత్పత్తి అవుతున్నట్లుగా భావించి, మొత్తం 70 మిలియన్ టన్నుల ఆహార ధాన్యాల నిల్వ నిమిత్తం నిల్వ సామర్థ్యాన్ని పెంచాలి. వృథా అవుతున్న ఆహార ధాన్యాల ఉత్పత్తిని 70 మిలియన్ టన్నులుగా భావిస్తే వాటి మొత్తం విలువ 70 నుంచి 100 బిలియన్ రూపాయల వరకు ఉంటుంది.
- ప్రభుత్వ ఏజెన్సీల నిల్వ సామర్థ్యానికి సంబంధించి గోధుమ, బియ్యం అధిక మొత్తంలో ఆక్రమించినందువల్ల ఇతర ఆహార ధాన్యాలు, వ్యవసాయ వస్తువుల నిల్వకు అవరోధం ఏర్పడుతోంది. జొన్నలు, సజ్జలు, కార్న్, పప్పుధాన్యాలు, నూనె గింజలు, పత్తి, సుగర్ కేన్ లాంటి వ్యవసాయ ఉత్పత్తుల నిల్వ కోసం ప్రభుత్వ ఏజెన్సీల నిల్వ సామర్థ్యాన్ని పెంచాలి. నిర్వహణలో ఉన్న గిడ్డంగుల సామర్థ్యాన్ని పరీక్షించడానికి వేర్‌హౌస్ పర్ఫార్మెన్స్ ఇండికేటర్లను ప్రవేశపెట్టాలి.
- ప్రైవేటు రంగంలో నిల్వ సామర్థ్యం పెంపునకు ప్రోత్సాహకాలు అవసరం. నాబార్డ్, నేషనల్ కో–ఆపరేటివ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ల ద్వారా గిడ్డంగి పరిశ్రమ అభివృద్ధిలో ప్రైవేటు రంగాన్ని ప్రోత్సహించాలి. 2010 మార్చి నాటికి మొత్తం నిల్వ సామర్థ్యం 91 మిలియన్ మెట్రిక్ టన్నుల్లో నాబార్డ్ పథకం కింద లబ్ధి పొందిన గిడ్డంగుల సామర్థ్యం 24 శాతం కాగా, నేషనల్ కో–ఆపరేటివ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కింద లబ్ధి పొందిన గిడ్డంగుల నిల్వ సామర్థ్యం 17 శాతం. గిడ్డంగుల ఏర్పాటులో ప్రభుత్వ – ప్రైవేటు భాగస్వామ్యాన్ని ప్రోత్సహించాలి.
- పంట చేతికి వచ్చే సమయంలో వ్యవసాయ ఉత్పత్తుల ధరలు తక్కువగా ఉంటున్నాయి. రుణగ్రస్థత కారణంగా చిన్న, సన్నకారు రైతులు గిట్టుబాటు ధర లభించే వరకు వేచి చూడకుండా ఉత్పత్తులు విక్రయిస్తున్నారు. అందువల్ల వ్యవసాయ ఆదాయాలు తగ్గి వ్యవసాయ రంగంపై పెట్టుబడులు తగ్గుతున్నాయి. ఈ పరిస్థితిని నివారించడానికి రైతులు తమ ఉత్పత్తులను గిడ్డంగుల్లో నిల్వ చేసుకునేవిధంగా ప్రోత్సహించాలి. గుర్తింపు ఉన్న గిడ్డంగుల్లో నిల్వ చేసిన వ్యవసాయ ఉత్పత్తులకు నెగోషియబుల్ వేర్‌హౌస్ రిసిప్ట్‌ను అందిస్తే బ్యాంకుల నుంచి రైతులు స్వల్పకాల రుణాన్ని పొందగలుగుతారు. తద్వారా గిట్టుబాటు ధర లభించే వరకు వారి ఉత్పత్తులను విక్రయించకుండా వేచి చూస్తారు. ఈ స్థితి వ్యవసాయ ఆదాయాలు, వ్యవసాయ రంగంలో పెట్టుబడుల పెంపునకు దారితీస్తుంది. NWR మంజూరు గ్రామీణ ప్రాంతాల్లో పరపతి ప్రవాహం పెంపునకు, కాస్ట్ ఆఫ్ క్రెడిట్ (పరపతి వ్యయం) తగ్గింపునకు తోడ్పడుతుంది. ప్రామాణీకరణ, శ్రేణీకరణ, ప్యాకేజింగ్, బీమా సేవలు లాంటి ఇతర కార్యకలాపాలు గ్రామీణ ప్రాంతాల్లో మెరుగవుతాయి. గ్రామీణ ప్రాంతాల్లో అగ్రి – బిజినెస్‌లోని లాజిస్టిక్ చైన్‌లో ఉన్న తారతమ్యాన్ని ఇది పూరిస్తుంది.
- గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సౌకర్యాల పెంపుతో పాటు మూలధన సబ్సిడీ లాంటివి కల్పించడం ద్వారా రైతులను సహకార సంఘాల ఏర్పాటు దిశగా ప్రోత్సహించాలి. సహకార సంఘాల ద్వారా అదనపు నిల్వ సామర్థ్యాన్ని పెంచుకోవచ్చు.

Understand the Author's Tone..

Competitive exams have provided many aspiring candidates to get jobs in various public and private sectors. Candidates appearing for these exams are from various backgrounds and vernacular mediums. English remained a thing of concern for many as they find it as a stumbling block in getting through the exam. In many competitive exams it is mandatory to go through the English language paper and thus it comes out as a challenge for such candidates who lack in English language skills. Hence, it is essential for these candidates to put extra effort on their preparation to score well and be victorious. The English language part consists of questions pertaining to various sections like, grammatical skills, vocabulary knowledge and comprehension.

COMPREHENSION

The comprehension section demands a good reading and understanding capacity of the candidate. You are expected to go through the paragraph given, understand, analyze and derive meaning out of it. Before attempting any passage, skim it as it's very important to understand the tone of the author. It may be optimistic, pessimist, sarcastic, angry or contemplative. If you are able to understand what author is trying to say then there is high probability that you will mark right answers. The passage usually contains 10 questions related to the passage which include synonyms and antonyms of particular words from the paragraph that needs to be answered. If you find that questions are beyond the understanding you found from the passage, simply skip that question, never try to mark nearest answer. Mark the answer only if you are sure about it. Here are a few tips while attempting this section:

- Skim the passage that is given.
- Read the questions first which helps to have an idea as you will be focused.
- Casual reading is not advisable, stay focused and don't miss any detail while reading.
- Make a note of what you read which might help you while you come back in search of answers.
- If doubt persists re-read the passage to make sure you understand it well before answering.
- Understand the author's tone and answer the questions based on author's opinion rather than your opinion.

A methodical and well planned preparation always gives fruitful results. It is essential to have a basic foundation in English which can be acquired by regular reading habits. Time management is crucial during the test. Use time saving techniques. In order to accomplish this you must become familiarize with the directions prior to taking the exam, and practice all the given exercises from this section.

- Keep in mind that you need not dwell too long on any one question or become concerned that you have answered a previous question incorrectly.
- Answer all questions by applying the techniques; keep track of any question that you may want to return to if you have enough time.
- The most important thing is be confident and remember that you have prepared well. Relax and do the best you can.

BANK EXAMS

GENERAL ENGLISH

Model Questions

Directions (Q. 1-15): Read the following passages carefully and answer the questions given below it. Certain words have been printed in bold to help you locate them while answering some of the questions.

PASSAGE 1

"Let us laugh" says, W. Mathews, "it is the cheapest luxury man enjoys. It stirs up the blood, expands the chest, clears away the cobwebs from the brain and gives the whole system a healthy treatment," So is it not nice to laugh a lot? It is said, "Laughter is the best medicine." For those who dislike medicine, sweet or bitter. A good joke that provokes laughter is prescribed. It is nice to have a good laugh but a "guffaw" may sometime lock one's jaws and so it is suggested that those who enjoy a loud guffaw go slow and subside into a gurgle but the best thing is, as done in Hon'ble courts before a Hon'ble Judges, just titter. And be able to enjoy all jokes including ones directed at myself, but never making a laughing stock of myself in the process. Let us remember the wise saying, "He is not laughed at that laughs at himself."

1. It is said that laughter is the best medicine because
1) It is the cheapest luxury man enjoys
2) It is available free of cost
3) It is cheaper whereas medicines in the shops are costly
4) It is not mentioned
5) It provides better treatment than costly medicines.

2. The writer says he would never make a laughing stock of himself. It means he should not
1) let others ridicule him
2) show disrespect to Judges
3) laugh, but simply smile at others
4) let others laugh
5) laugh at others

3. The writer feels laughter is to be prescribed to those who
1) are seriously ill
2) dislike medicines
3) cannot buy medicines
4) who are happy
5) do not need medicines

4. What may sometime lock one's jaws?
1) Laughter 2) Mirth
3) Guffaw 4) Gurgle
5) Titter

5. By quoting a wise saying in the last line the writer
1) Reiterates the point that laughter is the best medicine for us
2) Pity on those who laugh
3) Guides us about what we should do from being laughed at
4) Cautions us as to how we should conduct ourselves in the Hon'ble Courts
5) Censures those who cannot laugh at themselves

PASSAGE 2

I once saw a tigress stalking a month old kid. The ground was very open and the kid saw the tigress while she was still some distance away and started bleating, where on the tigress gave up her stalk and walked straight up to it. When the tigress has approached to within a few yards, the kid went **forward** to meet her, and on reaching the tigress **stretched** out its neck and put up its head to smell her. For the duration of a few heart beats the month-old kid and the queen of the forest stood nose to nose, and then the queen turned and walked off in the direction from which she came.

6. 'Stalking' in this context means
1) Running threateningly
2) Moving about in circles
3) Attacking
4) Targeting a victim
5) Moving quietly without being seen or heard

7. The tigress walked straight up to the kid because
1) It makes the kid joyous
2) Running would frighten the kid
3) Stalking was useless now
4) The tigress was patient
5) She was sure of her victim

8. The kid's behavior indicates that
1) It was familiar with the sight of tigress
2) It was attracted by the tigress's smell
3) It was attracted to the tiger's food
4) It took the tigress for a playmate
5) It was not aware of the danger involved

9. The expression 'for the duration of a few heart beats' suggests
1) The few seconds the tigress and the kid spent smelling each other
2) The fear of the kid
3) The excitement of the tigress
4) The anxiety of the watcher
5) The anxiety of the author

10. 'Queen' in the passage refers to
1) The queen who came to see
2) The lady 3) The kid
4) The tigress 5) The author

11. The synonym of **forward** is
1) Rearward
2) Onward
3) Inward
4) Review
5) Rejoice

12. The antonym of **'stretched'** is
1) Expand 2) Prolong
3) Lengthen
4) Elongate
5) Contract

PASSAGE 3

India is not a backward country. It is the version of the outside world which is outdated. India is growing every day. It has a population of more than 100 million in the middle class, out of which a segment of 70 million is earning monthly wages more than that the average weekly pay of an Australian worker, which makes India an economic power as great as France.

13. What is meant by segment in the above paragraph
1) The total population
2) A large part of the population
3) Some part of the population
4) Half of the population
5) Less than half of the population

14. What is the underlying theme of the paragraph?
1) India is a great military power
2) India is a backward country
3) India is fast developing into a big power
4) India has poor economy
5) India can never develop

15. What is the meaning of the line "India is as great as France"?
1) India is small as compared to France
2) India is greater than France
3) India is on the same level as France
4) India cannot be compared with France
5) No other country can be compared with India

ANSWERS:

1) 1	2) 1	3) 2	4) 3	
5) 3	6) 5	7) 5	8) 5	
9) 4	10) 4	11) 1	12) 5	
13) 3	14) 3	15) 3		